భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) స్థాపన పదవ వార్షికోత్సవ సంకలనం

# అమరవీరుల వారోత్సవాల సందర్భంగా కేంద్రకమిటీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) విడుదల చేసిన సందేశాలు (2005-2014)



కేంద్రకమిటీ
భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# ముందుమాట

సిపిఐ (మావోయిస్టు) పదేళ్ల స్థాపనా వార్షికోత్సవాల సందర్భంగా అనేక విలువైన పార్టీ డాక్యుమెంట్లను సంకలితం చేసి తిరిగి ప్రచురించే ఒక కృషిని చేపట్టాం. ఆ కృషిలో భాగంగా, ఇక్కడ సిపిఐ (మావోయిస్టు) ఏర్పడినప్పటి నుండి 2014 వరకూ 'అమరవీరుల సంస్మరణ వారం' సందర్భంగా కేంద్రకమిటీ విడుదల చేసిన సందేశాల్ని సంకలనంగా అందిస్తున్నాం.

భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా, అలాగే ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా అమరత్వమందిన అసంఖ్యాక అమరవీరులను స్మరించుకోవడానికి ఈ అమరవీరుల సంస్మరణ వారాన్ని జులై 28 నుండి ఆగస్టు 3 వరకూ పాటించడం జరుగుతోంది. 1972 జులై 28న పార్టీ సంస్థాపక నాయకుల్లో ఒకరైన కామ్రేడ్ చారు మజుందార్ పోలీసు కస్టడీలో చివరి శ్వాస విడిచారు. అమానవీయమైన, చట్టవిరుద్ధమైన పోలీసు కస్టడీలో అధికారులు ఆయన పట్ల వ్యవహరించిన దారుణమైన తీరు వల్లా, ఆయన అనారోగ్యాన్ని వారు తీవ్రంగా నిర్లక్ష్యం చేయడం వల్లా ఆయన అమరుడైనాడు. పార్టీ మరొక సంస్థాపక నాయకుడు కామ్రేడ్ కన్హయ్ చటర్జీ 1982 జులై 18న అనారోగ్యంతో అమరుడైనాడు. 1967 మే 25న ఆరుగురు మహిళలు, ఇద్దరు పిల్లలు, ఒక రైతు నక్సల్బరీ గ్రామంలో తమ ప్రాణాలను కోల్పోయిన నాటి నుండి నేటి వరకూ వేలాది మంది కామ్రేడ్లు, ప్రజలూ మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై జరుగుతున్న దీర్ఘకాలిక ప్రజాయుద్ధ క్రమంలో అసువులు బాసారు.

విప్లవోద్యమం అమరుల స్మృతులను వివిధ రూపాల్లో అంటే సభలు, సమావేశాల నిర్వహణ, స్థూపాల నిర్మాణం, కరపత్రాలు, పుస్తకాలు, ఫోటోలు, చిత్రాలు వంటి వాటి ప్రచురణ, విప్లవ సాహిత్యం, పాటలు, సాంస్కృతిక రూపాల తయారీ వంటి అనేక రూపాల్లో సజీవంగా ఉంచడానికి కృషి చేస్తుంది. వారి జీవితాలను, సేవలనూ, త్యాగాలనూ వీటి ద్వారా నమోదు చేసి, ప్రచారం చేస్తుంది. ప్రజాయుద్ధం తీవ్రతరం అవుతున్నకొలదీ త్యాగాల సంఖ్య కూడా పెరిగింది. అందువల్ల పార్టీ అందరు అమరవీరులనూ సంస్మరించుకోవడానికి, ప్రత్యేకించి గత సంస్మరణ వారం నుండి మొదలుకొని ఆ ఏడాది కాలంలో అమరులైనవారిని సంస్మరించుకోవడానికి అమరవీరుల సంస్మరణ వారాన్ని జరపాలని నిర్ణయించింది. కామ్రేడ్ చారు మజుందార్ అమరుడైన జులై 28 తారీకు నుండి మొదలుపెట్టి వారంపాటు దీన్ని పాటించాలని 2004 సెప్టెంబరులో మన పార్టీ నిర్ణయించింది.

సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ ప్రతి సంవత్సరం ఈ సందర్భంగా అమరవీరులకు వినమ్రంగా జోహార్లు అర్పించి వారి ఆశయాలకు పునరంకితం కావడానికి ఒక సందేశాన్ని విడుదల చేస్తూ వస్తోంది. ఈ సందేశాల్లో అది పార్టీ కార్యకర్తలకూ, పిఎల్‌జిఎలోని, ఐక్యసంఘటనలోని కామ్రేడ్స్‌కూ నిస్వార్థపూరితమైన అమరుల జీవితాల నుండి నేర్చుకోమని, వారి ఆదర్శాలను అనుసరించమనీ పిలుపునిస్తుంది. అందులోనే ఈ అమరత్వాలు ఏ దేశీయ, అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో జరిగాయో వివరిస్తూ, అమరుల ఆశయాలను ముందుకు కొనిపోవడానికి నేరవేర్చాల్సిన కొన్ని కర్తవ్యాలను కూడా పేర్కొంటున్నది.

అందుకని విప్లవోద్యమంలో ఈ జులై 28 సందేశాలకు గొప్ప రాజకీయ, చారిత్రక ప్రాముఖ్యత ఉండడమే కాక, కార్యకర్తలకూ, ప్రజలకూ ఇవి భావోద్వేగపూరితమైనవిగా కూడా ఉంటున్నాయి. సంస్మరణ వారం సందర్భంగా ఈ సందేశాలు పార్టీ కార్యకర్తల్లో, పిఎల్‌జిఎ, ప్రజాసంఘాల, ప్రజాప్రభుత్వాల కార్యకర్తల్లో, విప్లవ ప్రజానీకంలో విస్తృతమైన ప్రాచుర్యాన్ని పొందుతున్నాయి. ఈ సంస్మరణ వారాన్ని ప్రతి ఒక్క గెరిల్లా జోన్‌లో, ఉద్యమ ప్రాంతంలో, రాజకీయ ఖైదీల నాయకత్వంలో కారాగారాల్లో, మన పార్టీ యూనిట్లు ఉన్న ప్రతి పట్టణ ప్రాంతంలో, పట్టణ ప్రాంతాల్లో రహస్యంగా పని చేస్తున్న వివిధ డిపార్టమెంట్లలో ప్రతి ఒక్కరూ పాటిస్తారు. తీవ్రమైన నిర్బంధ పరిస్థితుల మధ్యనే శత్రువు కళ్లుగప్పి విప్లవ క్యాంపు మొత్తంగా ఈ గురుతరమైన సందర్భాన్ని పాటిస్తుంది. ఉద్యమ ప్రాంతాల్లో ఈ సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో అమరుల తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు కూడా పెద్దెత్తున పాల్గొంటారు, ఎర్రజెండాలనెగురవేస్తారు, స్థూపావిష్కరణలు చేస్తారు, ప్రజల విముక్తి కోసం నిస్వార్థంగా ప్రాణాలను అర్పించిన తమ ప్రియతమ కుటుంబ సభ్యుల గురించి, బిడ్డల గురించి తలచుకుంటారు, వారి ఊసుల్ని పంచుకుంటారు. ఉద్యమప్రాంతాల్లో ఈ వారాన్ని పాటించడం అంటే శత్రువుతో ఒక యుద్ధం చేసినట్టే ఉంటుంది. ఎందుకంటే ప్రజావీరుల్ని సంస్మరించుకోకుండా చేయడానికి కిరాయి మూకలు తాము చేయగల్గినదంతా చేస్తుంటాయి. కానీ ఎంత తీవ్ర నిర్బంధం మధ్యనైనా ఇన్నేండ్లుగా క్రమం తప్పకుండా జరుగుతూ వస్తున్నదంటూ ఏదైనా వుందంటే, అన్నిటికంటే మొట్టమొదటగా అది జులై 28 సంస్మరణ వారమే. ఈ యుద్ధంలో ప్రజలే ప్రతిసారీ విజయులవుతూ వస్తున్నారు, అమరుల ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిన పూనుతూ వారు ప్రతి ఏడూ దీనిని పాటిస్తున్నారు.

ఈ సందేశాలను చదవమనీ, వీటి ద్వారా ఆ అమరుల త్యాగాల ప్రాధాన్యతను గ్రహించమనీ పాఠకులను కోరుతున్నాం. అంతేకాక, ఏ నేపథ్యంలో ఇటువంటి త్యాగాలు అనివార్యమౌతున్నాయో కూడా గ్రహించమని కోరుతున్నాం. ఇది విప్లవాల యుగం. మన విప్లవం ప్రతీఘాతుక విప్లవంతో భీషణంగా తలపడుతూ పురోగమిస్తున్నది. ఇటువంటి యుగంలో ప్రజలు త్యాగాల అనివార్యతను గుర్తించి, త్యాగాలు చేయడానికి నిస్వార్థంగా ముందుకొస్తారు. భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా ప్రాణత్యాగాలు సహా ప్రజలు చేస్తున్న అసంఖ్యాక త్యాగాలు ఎలా సాధ్యం అయ్యాయనేదాన్ని ఇది వివరిస్తుంది. అదే విషయాన్ని ఈ సందేశాలూ నమోదు చేశాయి.

దోపిడీ, అణచివేతలు లేని సమాజాన్ని నిర్మించడం కోసం ఈ ఉజ్వలమైన భారత విప్లవ అమరవీరులు మనకు అందించిన దేదీప్యమానమైన బాటలో పయనించడానికి సన్నద్ధం కావాలని పాఠకులను కోరుతున్నాం. ఆ సమాజంలో దోపిడీదారులు కూలదోయబడి పాలితులే పాలకులవుతారు. అటువంటి సమాజ నిర్మాణమే ఈ నిస్వార్థమైన అమరుల స్మృతికి మనం అందించగలిగే నిజమైన నివాళి అవుతుంది.

***విప్లవాభినందనలతో,***

***కేంద్రకమిటీ,***

***సిపిఐ (మావోయిస్టు)***

*సెప్టెంబర్ 1, 2014*

# విషయసూచిక


| సంవత్సరం | | పేజీ నెం. |
|---|---|---|
| **2005** | ....... | **9** |
| **2006** | ....... | **18** |
| **2007** | ....... | **21** |
| **2008** | ....... | **28** |
| **2009** | ....... | **32** |
| **2010** | ....... | **38** |
| **2011** | ....... | **43** |
| **2012** | ....... | **53** |
| **2013** | ....... | **69** |
| **2014** | ....... | **84** |

# జులై 28 నుంచీ ఆగస్టు 3 వరకూ అమరుల వారాన్ని పాటించండి!

# ప్రియతమ అమరవీరుల గొప్ప ఆశయాన్ని ఎత్తిపట్టండి, పరిరక్షించండి, పురోగమింపజేయండి!!

**ప్రియమైన కామ్రేడ్స్!**

నూతనంగా ఐక్యమైన పార్టీ ప్రతి సంవత్సరం జులై 28వ తేదీన అమరవీరుల దినంగానూ జులై 28 నుంచీ ఆగస్టు 3 వరకూ అమరుల వారాన్నీ పాటించాలని నిర్ణయించిన విషయం మనందరకూ తెలిసినదే. దేశంలో ప్రజాయుద్ధాన్ని నిర్వహిస్తున్న రెండు మావోయిస్టు విప్లవ పార్టీల విలీనం తరువాత, రానున్న జులై 28 మొదటి అమరుల దినం అవుతుంది. అందుకని ఈ అమరుల దినానికి గొప్ప ప్రాధాన్యత ఉంది. మన యావత్తు పార్టీ, పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా సంఘాలూ దేశవ్యాప్తంగా విప్లవ ప్రజానీకం మీద దీని ప్రభావం గొప్పగా ఉంటుంది. నూతనంగా ఐక్యమైన మన పార్టీ జులై 28న ప్రారంభించి, రెట్టింపు స్ఫూర్తితో, బలంతో అమరుల వారం జరుపుకోవాలి. వేలాది అమరుల త్యాగాల గురించీ వారి లక్ష్యాల గురించీ స్వప్నాల గురించీ వాటికి ఉన్న ప్రాధాన్యత గురించీ ప్రపంచానికి చాటి చెప్పాలి.

సీపీఐ(మావోయిస్టు) ఏర్పడిన సెప్టెంబరు 2004 తరువాత దేశం మొత్తం మీద 60 మంది అమరులయ్యారు. వీరిలో 44 మంది ఆంధ్రప్రదేశ్‌లో అమరత్వం పొందారు. 12 మంది బీహార్-జార్ఖండ్‌లో ఇద్దరు కర్నాటకలో ఇద్దరు దండకారణ్యంలో అమరులయ్యారు. నూతన పార్టీ ఏర్పడిన తరువాత  అమరులయిన వారి మీద మనం మరింత కేంద్రీకరించాలి.

కర్నాటకలో రాష్ట్ర కార్యదర్శి, మునుపటి సీపీఐ(ఎంఎల్)(పీడబ్ల్యూ) కేంద్ర కమిటీ ప్రత్యామ్నాయ సభ్యుడు కామ్రేడ్ సాకేత్ రాజన్ అమరత్వంతో పెద్ద నష్టం పొందాం. పశ్చిమ కనుమలలో సాయుధ పోరాటాన్ని ప్రారంభించడంలో కామ్రేడ్ సాకేత్ రాజన్ ప్రధాన స్ఫూర్తిగా ఉన్నాడు. కర్నాటకలో పేరు పొందిన విప్లవ మేధావులలో ఆయన ఒకడు. ఆయన కర్నాటక

రాష్ట్ర చరిత్రను మార్క్సిస్టు అన్వయంతో రాసిన 'మేకింగ్ హిస్టరీ' పుస్తకం ఆ రాష్ట్రంలో బహుళ ప్రచారం పొందిన చరిత్ర పాఠ్య గ్రంథమయ్యింది. కామ్రేడ్ సాకేత్ రాజన్ అమరత్వం కర్నాటకకే కాక యావత్తు పార్టీకీ భారత విప్లవానికీ ఎంతో నష్టం.

సీపీఐ(మావోయిస్టు) ఏర్పడడంతో ప్రతీఘాతక పాలక వర్గాలు విపరీతంగా వణికిపోయాయి. జనవరి మొదటి వారం నుంచీ ఆంధ్రప్రదేశ్‌లో శాంతి చర్చల నుంచీ వైదొలగి, ఫాసిస్టు అణిచివేతను అమలు చెయ్యసాగారు. ఉత్తర తెలంగాణా జోన్‌లో నిజామాబాద్ జిల్లా మానాలలో మార్చి 11వ తేదీన శత్రువు పది మంది కామ్రేడ్స్‌ను చంపిన వైనం మన ఉద్యమ చరిత్రలో ఇంత వరకూ ఎరగనిది. ఒక కోవర్టు ఏజెంటు ద్వారా వారికి విషం ఇచ్చారు. స్పృహ తప్పిన తరువాత పట్టుకుని రాత్రంతా చిత్రహింసలు పెట్టి చంపారు. ఈ సంఘటనలో మనం జిల్లా కమిటీ కార్యదర్శి కామ్రేడ్ రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు కా.బాబన్న, ముగ్గురు ఎల్‌జీఎస్ కమాండర్లు, పీఎల్‌జీఏ దళ సభ్యులు ఐదుగురినీ కోల్పోయాం.

వరంగల్ జిల్లా కమిటీ కార్యదర్శి, ఎన్‌టీ జోనల్ కమిటీ సభ్యుడు, కామ్రేడ్ యాదన్నను కోల్పోయాం. మరో ముగ్గురు డీసీఎంలైన కామ్రేడ్ రంజిత్, ఆదిలాబాద్‌లోనూ, కరీంనగర్‌లో కా. శీను, మహబూబ్‌నగర్‌లో కా.సంతోష్‌లను పట్టుకుని చంపేసారు. ఆంధ్రప్రదేశ్ చైతన్య మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యురాలు కా.లక్ష్మిని పట్టుకుని హత్య చేసారు. అమరులైన వారిలో మొత్తం పది మంది మహిళా కామ్రేడ్స్ ఉన్నారు. వీరంతా శత్రువుకు ఏమీ చెప్పకుండా క్రూర చిత్రహింసలను గొప్ప ధైర్యంతో ఎదుర్కొన్నారు. అందుకనే బూటకపు ఎదురుకాల్పులలో చనిపోయారు. జార్ఖండ్‌లో రాంచీ జిల్లాలో డిసెంబరు 2004లో తమర్ పోలీసు స్టేషన్ పరిధిలో సీఆర్‌పీఎఫ్‌తో ధైర్యంగా పోరాడుతూన్న క్రమంలో ప్లాటూన్ కమాండర్ కా.చందన్‌ను కోల్పోయాం. 2005 మార్చిలో, బీహార్ రాష్ట్రం గయ జిల్లాలో బారాచెట్టీ పోలీసు స్టేషన్ పరిధిలో మరో ప్లాటూన్ కమాండర్, ముగ్గురు ప్లాటూన్ సభ్యులూ అమరులయ్యారు. సీపీఐ(మావోయిస్టు) పార్టీకి చెందిన ఈ కామ్రేడ్‌లందరూ మన పార్టీ చరిత్రలో సజీవంగా నిలిచిపోతారు.

కామ్రేడ్ బాబూలాల్ బిశ్వకర్మాకర్ నుంచీ మొదలుకుని, చరిత్రాత్మక నక్సల్బరీ సాయుధ వ్యవసాయ విప్లవం నాటి నుంచీ అమరులైన వేలాది మంది మన పార్టీ, సాయుధ గెరిల్లా దళాల, పీఎల్‌జీఏ, దేశవ్యాప్తంగా భారత విప్లవ ప్రజా సంఘాల సభ్యుల త్యాగాలను

ఎత్తిపట్టాలి. ఆదర్శవంతమైన వారి స్ఫూర్తినీ, స్థిరత్వాన్నీ, నిశ్చయాన్నీ, దృఢమైన సైద్ధాంతిక రాజకీయ అంకితత్వాన్నీ పార్టీ పట్ల, విప్లవం పట్లా, పీడిత ప్రజల పట్లా, వారి విధేయతనూ వివరించాలి. ఆ అమరుల వారంలో మన పార్టీ ఇద్దరు గొప్ప వ్యవస్థాపక నాయకులు, ఉపాధ్యాయులు - కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ కనయ్ ఛటర్జీల మీద ప్రత్యేకంగా కేంద్రీకరించాలి.

కామ్రేడ్ సీఎం నక్సల్బరీ సాయుధ తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. సీపీఐ(ఎంఎల్)ను స్థాపించాడు. 1972 జులై 16వ తేదీన కొల్‌కతా పోలీసులు ఆయనను అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టి, జులై 28వ తేదీన చంపేసారు. కామ్రేడ్ కేసీ మునుపటి ఎంసీసీఐ వ్యవస్థాపక నాయకుడు. తీవ్ర అనారోగ్యంతో 1982 జులై 18వ తేదీన చనిపోయాడు. ఈ ఇద్దరు గొప్ప మావోయిస్టు నాయకులూ తరాల నాటి రివిజనిజాన్ని బద్దలు కొట్టడంలో చరిత్రాత్మక పాత్ర వహించారు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సరైన విప్లవ పంథాను నెలకొల్పారు. తద్వారా, గడచిన కొద్ది సంవత్సరాలుగా బలం పుంజుకుంటూ వస్తున్న సాయుధ వ్యవసాయ విప్లవాన్ని ప్రారంభించారు.

మన పార్టీ నాయకులైన వీరు చేసిన కృషి గురించి భారత ప్రజలకు వివరంగా చెప్పాలి. మన ప్రచారంలో వారి ఆదర్శవంతమైన జీవితాలను ఎత్తిపట్టాలి.

నూతనంగా ఐక్యమైన పార్టీ మొదటి అమరుల దినం సందర్భంగా మనం భారత విప్లవంలో గొప్ప అమరులైన కామ్రేడ్స్ అమూల్యా సేన్, సరోజ్ దత్తా, సుసీతల్ రాయ్ చౌదరి, చంద్రశేఖర్ దాస్, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పంచాది కృష్ణమూర్తి, భూజా సింగ్, సుబ్బారావు పాణిగ్రహి, సుదీప్తా బెనర్జీ, అప్పు మొదలయిన వాళ్లందరినీ తప్పనిసరిగా జ్ఞాపకం చేసుకోవాలి.

మన పార్టీ చరిత్రలో అద్వితీయ కమ్యూనిస్టు లక్షణాలు, విప్లవాశయానికి పూర్తి అంకితత్వం, నిస్వార్థం, కమ్యూనిస్టు విలువలు, నైతికతలకు కట్టుబడి ఉండడం, చెదరని పట్టుదల, నిశ్చయం, ఆదర్శవంతమైన ధైర్యం, కార్మికవర్గ క్రమశిక్షణ, అలవాటులు, జీవన విధానాలలో నిరాడంబరత, గాఢమైన ప్రేమ, అభిమానం, గౌరవం, పునాది వర్గాలకూ పీడిత ప్రజలకూ సేవ చేసే వైఖరీ, కష్టం ఎదుర్కొనే నిశ్చయం, 'ఏటికి ఎదురీదడం' మొదలయిన విప్లవ సంప్రదాయాలు కలిగి ఉన్న ధైర్యవంతులైన అమరులతో మన పార్టీ చరిత్ర నిండిపోయింది.

కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళి, పులి అంజన్న, భాగ్య, కౌముది, సుగుణ, పార్టీ, పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా సంఘాలలో వివిధ స్థాయిలలో పని చేస్తున్న అనేక మంది కామ్రేడ్స్ క్రూర చిత్రహింసలు పెట్టినా కానీ  పార్టీ రహస్యం ఒక్కటి కూడా వెల్లడించలేదు. పార్టీయేతర ప్రజలలో అనేకమంది కామ్రేడ్‌లు నిరంతర చిత్రహింసలు, వేధింపులు, ఆస్తి విధ్వంసం, అంతిమంగా మరణాలను కూడా లెక్క చెయ్యకుండా పార్టీ రహస్యాలను స్థిరంగా పరిరక్షించి, పార్టీ, పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా సంఘాల కేడర్‌ను, నాయకత్వాన్నీ రక్షించారు.

కామ్రేడ్‌లు భక్తిదా, దారా, బచ్చన్, సునీల్, గోపాల్, దదీచీరాయ్, సాగర్, జైషియా, రాంచందర్, జకారియా మొదలయిన ఎందరో కామ్రేడ్‌లు బీహార్ జార్ఖండ్‌లో జరుగుతున్న ప్రజాయుద్ధ చరిత్రలో అద్వితీయ ఉదాహరణలుగా నిలుస్తారు.

భారతదేశంలో అమరులనే కాక, నేపాల్, ఫిలిప్పైన్స్, పెరూ, టర్కీ మొదలయిన దేశాలలో ప్రపంచ విప్లవాశయం కోసం జరుగుతున్న ప్రజాయుద్ధాలను పురోగమింపజేసే క్రమంలో అమరులైన వారిని కూడా మనం ఎత్తిపట్టాలి. భారతదేశంలో కానీ ఇతర దేశాలలో కానీ ఈ అమరులందరూ పైన చెప్పిన కమ్యూనిస్టు సంప్రదాయాలను ఎలా నిలబెట్టారో ఎప్పటికీ వెలిగే చుక్కలుగా ఎలా మిగిలిపోతారో మనం వివరించాలి.

ఈ కామ్రేడ్‌లందరూ పార్టీ కోసం ప్రజల కోసం, విప్లవం కోసం ఎటువంటి జంకూ లేకుండా తమ ప్రాణాలు అర్పించారు. మహత్తర ఆదర్శప్రాయులయ్యారు. పార్టీ సభ్యులు, పీఎల్‌జీఏ యోధులూ, విప్లవ ప్రజానీకం అందరూ వీరిని గర్వంగా అనుసరించాలి. గ్రామ స్థాయి నుంచీ సీసీ వరకూ ఉన్న ఈ అమర కామ్రేడ్‌ల జీవితాలను వివిధ రకాల ప్రచార సాధనాల ద్వారా ప్రజలలో ప్రచారం చెయ్యాలి. సాధ్యమయిన చోటనల్లా రహస్యంగానూ బహిరంగంగానూ అమరుల స్థూపాలు నిర్మించాలి. జిల్లా స్థాయి నుంచీ అఖిల భారత స్థాయి వరకూ పుస్తకాలు ప్రచురించాలి.

అమరుల వారానికి నిర్దిష్ట కార్యక్రమం

1. అమరులు ఆశించిన ఆశయాలు, లక్ష్యాలు, వారి అమూల్యమైన త్యాగాలను, వారి ఆదర్శవంతమైన జీవితాలనూ గొప్ప కమ్యూనిస్టు విలువలనూ ఎత్తిపడుతూ విస్తార ప్రచార క్యాంపెయిన్ చేపట్టాలి. అందుబాటులో ఉన్న అన్ని సాధానాలను ఉపయోగించుకోవాలి. అమరుల వారం గురించీ అమరుల గురించీ ప్రతీ రాష్ట్రంలోనూ

స్థానిక స్థాయిలో పత్రికా ప్రకటనలు ఇవ్వాలి. ఎస్‌సీ/ఎస్ఏసీ/ఎస్‌జెడ్‌సీ నిర్ణయించిన విధంగా ఇంటర్వ్యూలు ఇవ్వవచ్చు. కరపత్రాలు, పోస్టర్లు, గోడల మీద రాతలూ విస్తృతంగా చేపట్టాలి. మనకు బలమైన ప్రాంతాలలో బానర్లు పెట్టాలి. ఇతర ప్రాంతాలలో కూడా వీటిని పెట్టాలి. అయితే కచ్చితంగా రహస్య పద్ధతులు పాటించాలి. అవకాశం ఉన్నచోట బెలూన్లు పెట్టాలి. సాధ్యమయిన చోటనల్లా అమరుల ఫోటోలు, ఆయా జిల్లాలకూ ప్రాంతానికీ రంగానికీ చెందిన అమరులు, మహిళా కామ్రేడ్‌లు మొదలయిన వాళ్ల ఫోటోలతో కాలెండర్లూ తయారు చేసి ప్రజలలో అమ్మవచ్చు.

2. మన ప్రకటనలూ, కరపత్రాలు, పోస్టర్లు, ఇంచర్వ్యూలు, సభలూ మొదలయిన వాటిల్లో మన పార్టీ ఇరువురు వ్యవస్థాపక నాయకుల మీద ప్రత్యేకంగా కేంద్రీకరించాలి. వారి జీవితాల గురించీ, వారి కృషి గురించీ క్లుప్తంగా చెప్పాలి. ప్రచారమంతటిలోనూ ఈ ఇరువురు నాయకుల ఫోటోలు ఉంచాలి. ఈ నాయకులు వెలిగించిన బాటలో సాగమని ప్రజలకు పిలుపు ఇవ్వాలి.

3. స్థానిక స్థాయిలో కొంత బలం ఉన్న ప్రతీ చోటా అమరుల స్థూపాలు నిర్మించాలి. నిజానికి మన కామ్రేడ్‌లూ, ప్రజలూ స్థూపాలు నిర్మించడంలోనూ వాటిని కాపాడుకోవడానికి ప్రతీఘాత బలగాలతోనూ రాజ్యంతోనూ పోరాడడంతోనూ సుదీర్ఘ అనుభవం ఉన్నవాళ్లు. గత సంవత్సరం విస్తృతంగా క్యాంపెయిన్ చేసి వందలాది అమరుల స్థూపాలు నిర్మించారు. ఈ స్థూపాల నిర్మాణానికి స్థానిక ప్రజలూ ఇరుగుపొరుగు గ్రామాల నుంచీ ప్రజలను ప్రధానంగా సమీకరించారు. కొన్ని చాలా పెద్దగా ఉండి నిర్మాణానికి చాలా సమయం తీసుకున్నాయి. సాధారణంగా మనం ఎక్కువ సమయం, డబ్బు, అనేక సమస్యలూ ఉన్న భారీ నిర్మాణాలకు పూనుకోకూడదు. సాధ్యమయినన్ని గ్రామాలలో చిన్న స్థూపాలు నిర్మించడానికి ప్రయత్నించాలి. యుద్ధం నడుమ ఉన్నామన్న సంగతి గుర్తుంచుకుని, సాధ్యమయినంత తక్కువ సమయంలో నిర్మాణాన్ని పూర్తి చెయ్యడానికి ప్రయత్నించాలి. ప్రజల రాజకీయ సమీకరణకు సహాయపడుతుందని భావిస్తే, నిర్దిష్ట పరిస్థితుల మీద ఆధారపడి రాష్ట్రంలో ఒకటి, రెండు భారీ నిర్మాణాలు నిర్మించడానికి ప్రయత్నించాలి.

4. కొన్ని రాష్ట్రాలలో ఇప్పటికే చేసినట్టుగా అమరుల కుటుంబ సభ్యులు, స్నేహితులతో బహిరంగ కమిటీలు ఏర్పరచవచ్చు. ప్రస్తుతానికి ఈ కమిటీలను జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఏర్పాటు చెయ్యవచ్చు. కొన్ని ప్రదేశాలలో ఈ కమిటీల బానర్ కింద అమరుల స్థూపాలు

నిర్మించవచ్చు. సాధ్యమయిన చోట బహిరంగ సభలు పెట్టవచ్చు. ఆ పేరుతో విస్తార ప్రచారం నిర్వహించవచ్చు. అమరులు ప్రజల ప్రియతమ నాయకులనీ తమ ప్రియతమ నాయకుల అమరత్వాన్ని జ్ఞాపకం చేసుకునే హక్కు ప్రజలకు ఉన్నదనీ ఈ కుటుంబాల, శ్రేయోభిలాషుల వేదికలు ధైర్యంగా ప్రచారం చెయ్యాలి. స్థూపాల నిర్మాణాన్ని కానీ సంస్మరణ సభలను కానీ జరగనివ్వకుండా గొడవలు సృష్టించే రాజ్యాన్నీ లంపెన్ ముఠాలను ఎదుర్కోవడానికి ప్రజలను సిద్ధం చెయ్యాలి. ఈ వేదికలలో కొందరు ప్రముఖ ప్రగతిశీల వ్యక్తులను కలుపుకు రావడానికి ప్రయత్నించాలి. తద్వారా అవి మరింత సమర్థవంతంగానూ అభినందనీయంగానూ రూపొందుతాయి.

5. ఈ సభలు రహస్యంగానూ బహిరంగంగానూ కూడా ఉండవచ్చు. సాధారణంగా సాయుధ పోరాటం జరుగుతున్న మన ప్రాంతాలన్నింటా ఇవి రహస్యంగా నిర్వహిస్తాం. మన సాయుధ పోరాటం ఇంకా ప్రారంభ దశలో ఉన్న పట్టణ ఇతర ప్రాంతాలలో మనం సాధ్యమయినంత వరకూ బహిరంగ సభలు నిర్వహించవచ్చు. అది బహిరంగమైనా రహస్యమైనా స్థూపాల నిర్మాణాన్ని పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తేనూ స్థూపాలను ధ్వంసం చెయ్యాలని చూస్తేనూ లేక సభలను జరగనివ్వకుండా ఇబ్బందులు పెడితేనూ వీటిని పరిరక్షించుకోవడానికి మనం సాయుధ మిలీషియానూ పీఎల్‌జీఏ బలగాలనూ సంసిద్ధులను చెయ్యాలి. మన కార్యక్రమాలను విచ్ఛిన్నం చేసి ప్రజలలో భయం సృష్టించడానికీ ప్రజలను మన సభలకు రానివ్వకుండా చెయ్యడానికీ పోలీసులు, ప్రత్యేక బలగాలూ సాధారణంగా అమరుల వారంలో కూంబింగు ఆపరేషన్‌లు నిర్వహిస్తారు. శత్రు బలగాలను రానివ్వకుండానూ ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తే వాళ్లను ఆపడానికీనూ మనం మన పీఎల్‌జీఏ బలగాలలో ఒక భాగాన్ని కేటాయించాలి. శత్రు అణిచివేతను ప్రతిఘటించడానికి ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించాలి. రాజ్యానికి వ్యతిరేకంగా చేసే ప్రదర్శనలలో మహిళలనూ పిల్లలనూ ముసలివాళ్లనూ ముందు వరుసలో ఉంచాలి.

7. జిల్లా, పై స్థాయిలలో పుస్తకాలు ప్రచురించాలి. మునుపటి సీపీఐ(ఎంఎల్(పీడబ్ల్యూ), ఎంసీసీఐల పత్రికలలోనూ పుస్తకాలలోనూ వ్యాసాలలోనూ వివిధ భాషలలో అమరవీరుల మీద అపారమైన సాహిత్యం ఉన్నది. వీటిలో కొన్ని నూతన పార్టీ పేరు మీద తిరిగి ప్రచురించవచ్చు. అలాగే కొత్తగా పుస్తకాలు రాయవచ్చు.

8. పార్టీ, పిఎల్‌జీఏ, విప్లవాధికార అంగాలు, ప్రజా సంఘాలలో మన కామ్రేడ్‌లను

తమ యూనిట్లలో మూకుమ్మడిగానూ వ్యక్తిగతంగానూ తమ తుది ఊపిరి పీల్చే వరకూ ప్రియతమ అమరులు ప్రాణాలు అర్పించిన ఆశయాన్ని ఎత్తిపడతామని ప్రతిజ్ఞలు చేయించాలి. ఈ అమర కామ్రేడ్ల లక్షణాలను అలవరచుకుంటామనీ వారి ఆదర్శవంతమైన జీవితాల నుంచీ నేర్చుకుంటామనీ ప్రతిజ్ఞ చెయ్యాలి. ప్రతిజ్ఞ చెయ్యడం ద్వారా వారిలో కొత్త స్ఫూర్తి నిండుతుంది. శత్రు దాడిని మరింత ధైర్యంతో ఎదుర్కోవడానికి మన నిశ్చయం బలపడుతుంది. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపజెయ్యడానికీ పూర్తి చెయ్యడానికీ ఆ తరువాత సోషలిజం, కమ్యూనిజం నిర్మించడానికీ ముందుకు వెళ్లడానికి గొప్ప ధైర్యం నింపుతుంది.

9. అమరులందరి కుటుంబ సభ్యులనూ కలిసే కర్తవ్యం చేపట్టాలి. వారి వేదననూ బాధనూ పంచుకోవాలి. వారిని ఓదార్చాలి. విప్లవం కోసం సాధ్యమయిన పాత్ర నిర్వహించేందుకు వారిని ప్రోత్సహించాలి. మనం అమరులందరి కుటుంబాలనూ కలుసుకుని వాళ్లను ఏదో ఒక కార్యక్రమంలో పాలు పంచుకునేట్టు చెయ్యలేకపోవడం చాలా దురదృష్టకరం. పార్టీ కేడర్, ప్రజా సంఘాలే కాకుండా అమరుల చురుకైన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులతో ఏర్పరచిన వేదికలు కూడా అమరత్వం గురించి తెలియగానే ప్రతీ అమరుల కుటుంబాన్నీ కలుసుకోవాలి. ఇది నిత్యకృత్యం కావాలి. అలాగే వాళ్లు అమరుల సంస్మరణ వారంలో ముందు పీఠీన ఉండే విధంగా చూడాలి. అమరులను సంస్మరించుకోవడానికి ఏర్పాటు చేసే నిర్మాణాలలో భాగం అయ్యేట్టు చూడాలి.

**కామ్రేడ్స్!**

శత్రు దాడి ఇంకా ఇంకా పెరుగుతున్నది. మరింత క్రూరంగా ఉంటున్నది. సీపీఐ(మావోయిస్టు) ఏర్పాటు తరువాత, భారత దళారీ నిరంకుశ బూర్జువా వర్గం, బడా భూస్వామ్య పార్టీల పరమ ప్రతీఘాత కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో ఉండే యూపీఏ ప్రభుత్వం పూర్తి స్థాయి యుద్ధం ప్రకటించింది. దేశవ్యాప్తంగా తీవ్రతరం చేసింది. శత్రు బలగాలను ఎదుర్కోవడంలో మనం అన్ని కార్యక్రమాలనూ అమలు చెయ్యాలి. ప్రజలను రాజకీయంగా సమీకరించాలి. మన యావత్తు కార్యక్రమంలోనూ గెరిల్లా యుద్ధ సూత్రాలనూ పద్ధతులనూ సృజనాత్మకంగా అనుసరించాలి. శత్రు బలగాల విధ్వంసం చేసేటప్పుడు కానీ ఇతర అన్ని రకాల కార్యక్రమాలను నిర్వహించేటప్పుడు కానీ మన బలగాల పరిరక్షణను చేపట్టడం చాలా ముఖ్యం.

అందుకని అమరుల వారం క్యాంపెయిన్‌ను చేపట్టేటప్పుడు మన పనికి ఉన్న దీర్ఘకాలిక దృక్పథాన్నీ, శత్రు దాడికి ఉన్న తీవ్రతనూ నిర్దిష్ట స్థానిక పరిస్థితులనూ దృష్టిలోకి తీసుకోవాలి.

అమరుల వారాన్ని గొప్ప విప్లవ స్ఫూర్తితోనూ విశ్వాసంతోనూ జరుపుకుందాం!

ప్రజా యుద్ధాన్ని మరింత తీవ్రతరం చెయ్యడం ద్వారానూ విస్తరించడం ద్వారానూ శత్రు బలగాలను గెరిల్లా యుద్ధం ద్వారా కొంచెం కొంచెంగా ధ్వంసం చెయ్యడం ద్వారానూ, పీఎల్‌జీఏను పీఎల్‌ఏగా మార్చడం ద్వారానూ బేస్ ఏరియాలను నెలకొల్పడం ద్వారానూ అమరుల మరణానికి ప్రతీకారం తీర్చుకుందాం!

సామ్రాజ్యవాదాన్నీ భూస్వామ్య విధానాన్నీ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్నీ దేశం నుంచీ తరిమికొట్టాలి. ప్రపంచవ్యాప్తంగా ప్రతీఘాతకులనూ తరిమికొట్టాలి. నిజమైన జనతా ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలి. తద్వారా సోషలిజాన్నీ కమ్యూనిజాన్నీ నెలకొల్పాలన్న అమరుల స్వప్నాలను నెరవేర్చాలి. ఇందుకోసం తుది వరకూ పోరాడతామని మన ప్రియతమ అమర కామ్రేడ్‌ల పేరు మీద విప్లవ ప్రతిజ్ఞ చేపడదాం!

శత్రు దాడిని సాహసోపేతంగా ఎదుర్కోవడానికీ శత్రువుకు వ్యతిరేకంగా చేసే ఈ పూర్తి స్థాయి, నెత్తుటి వర్గ యుద్ధంలో అన్ని కష్టాలనూ ఎదుర్కోవడానికీ మన యావత్తు పార్టీనీ పీఎల్‌జీఏలో ధైర్యవంతులైన యోధులనూ  కమాండర్లనూ విశాల ప్రజలనూ అమరుల నమూనాలో మలచడానికి సైద్ధాంతిక, రాజకీయ బోధనా శిక్షణా క్యాంపెయిన్‌గా అమరుల వారాన్ని పాటిద్దాం!

**మన గొప్ప మహోపాధ్యాయులు, ప్రియతమ నాయకులూ - కామ్రేడ్‌లు సీఎం, కేసీలు అమర్ రహే!**

**మన ప్రియతమ నాయకులు - కామ్రేడ్‌లు అమూల్యా సేన్, సరోజ్ దత్తా, సుసీతల్ రాయ్ చౌదరి, చంద్రశేఖర్ దాస్, పంచాది కృష్ణమూర్తి, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, సుబ్బారావు పాణిగ్రాహి, బాబా భుజ సింగ్, అప్పు, సుదీప్తొ బెనర్జీ మొదలయినవాళ్ల అమరత్వాన్ని ఎత్తిపడదాం!**

**మన ప్రియతమ నాయకులు కామ్రేడ్‌లు ప్రకాష్ మాస్టర్, శ్యాం, మహేష్, మురళీలు అమర్‌రహే!**

**అమర మహిళా కామ్రేడ్‌లు పంచాది నిర్మల, స్నేహలత, పద్మ, లలిత, సుగుణ,**

చిట్టక్క, భాగ్య, పార్వతి, కవిత, బడ్కీ దేవీ, ఊర్మిళ మొదలయిన వాళ్ల అమరత్వాన్ని ఎత్తిపడదాం!

ఆంధ్రప్రదేశ్, బీహార్, జార్ఖండ్, దండకారణ్యం, చత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, పంజాబ్, అస్సాం, త్రిపుర, అలాగే దేశంలో వివిధ ప్రాంతాలలో వేలాది మన ప్రియతమ వీరోచిత అమరుల అమరత్వాన్ని చాటి చెప్పుదాం!

ప్రజా యుద్ధాన్ని తీవ్రతరం చెయ్యడం, విస్తరించడం ద్వారా అమరుల ఆశయాలను నెరవేర్చడానికి ధైర్యంగా ముందడుగు వెయ్యండి. వాటిని ఎత్తిపట్టండి. పరిరక్షించండి!

బేస్ ఏరియాలు నెలకొల్పడం, పీఎల్‌జీఏను పీఎల్‌ఏగా మార్చడం దేశవ్యాప్తంగా ప్రజాయుద్ధాన్ని విస్తరింప జేయడమే ప్రియతమ అమరులకు నిజమైన నివాళి!

పొలిట్‌బ్యూరో

22 ఏప్రిల్, 2005 సీపీఐ(మావోయిస్టు)

# దేశవ్యాప్తంగా అమరవీరుల వారోత్సవాల్ని జరపండి!

కామ్రేడ్ చారు మజుందార్ జులై 28న అమరత్వం చెందారు. ఆ వారాన్ని అమరవీరుల వారోత్సవాలుగా దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నాం. అదే నెలలో రెండు వారాల ముందు కా. కన్హయ్ ఛటర్జీ కూడా అమరత్వం చెందారు. భారత విప్లవ మార్గదర్శకులైన ఈ ఇరువురు నాయకుల అమరత్వానికి గుర్తుగా జులై 28ని అమరవీరుల వారోత్సవంగా గుర్తిస్తున్నాం. ఈ ఇద్దరు నాయకులు సాయుధ పోరాటాన్నీ, ప్రజాయుద్ధాన్నీ మన దేశ రాజకీయ ఎజెండా మీదికి తెచ్చారు. సాయుధ పోరాటం మనదేశంలో ఎజెండా మీదికి వచ్చినప్పటి నుండీ దేశ రాజకీయ రంగం మునుపటిలా లేదు. నక్సల్బరీ పోరాటం నుండి నేటి వరకూ భారత విప్లవం కోసం పదివేల మంది కామ్రేడ్స్ తమ ప్రాణాల్ని అర్పించారు. దేశంలో రెండు మావోయిస్టు ప్రవంతులు కలిసి సి.పి.ఐ.(మావోయిస్టు) ఏర్పడిన గత 20 నెలల కాలంలో 600 మంది కామ్రేడ్స్ తమ అమూల్యమైన ప్రాణాల్ని అర్పించారు. వారు ఈ దేశపు అత్యంత ఉత్తమ పుత్రికలు, పుత్రులు. ఈ దేశ ప్రజల కోసం నిస్వార్థంగా అంకితమైనవారుగా వారు నిలుస్తారు.

ఈరోజు ఈ దేశ పీడిత ప్రజల కోసం బోల్షివిక్ స్పిరిట్‌తో నిస్వార్థంగా అంకితమై వారు చేసిన త్యాగాలను మనం ఈరోజు గుర్తుచేసుకోకుండా ఉండలేం. అమరులైన నాయకులు, కార్యకర్తలు, మహిళా కామ్రేడ్స్, సానుభూతిపరులు, సాధారణ ప్రజలు అన్యాయమైన అసమానతలతో కూడిన ఈ సమాజాన్ని విముక్తి చేసి, ఉజ్వలమైన దేశ భవిష్యత్తు కోసం కలలు గన్నారు. సామ్రాజ్యవాదులకు ఈ దేశ సంపదను లూటీ చేసేందుకు మార్గాన్ని సుగమం చేసే, వారికి సేవజేస్తూ దాని నుండి లబ్దిపొంది నేటి పాలకవర్గ మాఫియా ప్రభుత్వాల్ని వీరు ద్వేషించారు. అటువంటి వీరోచితమైన గొప్ప త్యాగాల్ని మనం మరువగలమా? నరభక్షక క్రూర రాక్షసుల్లాంటి ప్రభుత్వ బలగాలు, సల్వాజుడుం, సేంద్ర, కోబ్రా మొదలగు రూపాల్లో వందలాది విప్లవకారుల్ని ఊచకోత కోశాయి. దండకారణ్యంలో 12-14 సంవత్సరాల పిల్లల్ని తలలు నరికి ఆ తలకాయల్ని వారి ఇళ్ల మీదనే ఉంచారు. గర్భవతులైన ఆదివాసీ మహిళలపై సామూహిక అత్యాచారాలు చేసి పొట్టలను కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఇళ్లను తగులబెట్టారు, పంటల్ని నాశనం చేశారు. ఆదివాసీలకుండే కొద్దిపాటి సొమ్మును కూడా లూటీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కోబ్రాల పేరుతో ప్రజాసంఘాల నాయకుల్ని చట్టవ్యతిరేకమైన పద్ధతుల్లో తలలు నరకటం, శరీరాల్ని ముక్కలు చేయటం లాంటి క్రూరమైన పద్ధతుల్ని అనుసరించారు. గ్రేహౌండ్ పోలీసులు విప్లవకారుల్ని పట్టుకొని చిత్రహింసలు పెట్టి చంపివేయటం సర్వసాధారణమైంది. విప్లవోద్యమం కొనసాగుతున్న ఝార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్‌లో కూడా దాదాపు ఇదే పద్ధతుల్ని అనుసరిస్తున్నారు. మరోవైపు వేలాది మందిపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో పెట్టి ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా శిక్షలు వేస్తున్నారు. సీనియర్ నాయకులైన పోలిట్‌బ్యూరో సభ్యులు కా. సుశీల్ రాయ్(బరుణ్‌దా) మరియు నారాయణ సన్యాల్‌లకు యావజ్జీవ శిక్షలు విధించారు. కశ్మీరు, ఈశాన్య రాష్ట్రాల్లో జరుగుతున్న జాతి విముక్తి పోరాటాల్ని కూడా ఇదే పద్ధతిలో అణచివేస్తున్నారు.

ఈ విధమైన టెర్రరిస్టు పద్ధతులు కొనసాగుతున్న నేటి స్థితిలో ఎవరైనా మౌనంగా ఉండగలరా? ఈ ఘోరకృత్యాలను చూసి మౌనంగా ఉండటమంటే వాటికి పూర్తిగా

ఆమోదం తెలిపినట్లే అవుతుంది. అందుకనే ఈ మౌనం వెనుకాల గల కుట్రను వమ్ము చేస్తూ ఈ దేశ పీడిత ప్రజల కోసం వీరోచితంగా పోరాడి అమరులైన 'అమరవీరుల వారోత్సవాన్ని' జరుపుకుందాం. ప్రజాస్వామ్యం పేరుతో ఆడుతున్న నాటకాన్ని మన మౌనాన్ని బద్దలు చేయడం ద్వారా బహిర్గతం చేద్దాం. లక్షలాది మంది వీధుల్లోకి వచ్చి ఈ అమరవీరుల వారోత్సవాల్లో పాల్గొని జరిగిన ఘోరకృత్యాలను ముక్తకంఠంతో ఖండించి అమరులైన పోరాటయోధులకు రెడ్‌శాల్యూట్స్ చెబుదాం.

గడిచిన సంవత్సర కాలంలో అమరులైన మన కామ్రేడ్లను 2006 జులై 28న గుర్తు చేసుకుందాం. వారిలో పంజాబ్‌కు చెందిన మన పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కా. కరమ్‌సింగ్ అనారోగ్యంతో కన్నుమూశారు. కష్టభూయిష్టమైన అజ్ఞాతవాసం గడుపుతూ సకాలంలో వైద్యం అందని కారణంగానే ఆయన అమరులయ్యారు. ఇది ఒక రకంగా పాలకవర్గాలు చేసిన హత్యనే. ఆయన నాలుగు దశాబ్దాలుగా అనగా తన జీవితం మొత్తం భారత విప్లవోద్యమానికి అంకితం చేశారు. పంజాబ్‌లో మావోయిస్టు ఉద్యమ నిర్మాతలలో ఆయన ఒకరు. ఆయన తన జీవితాంతం పీడిత ప్రజలకు సేవ చేశారు, త్యాగాలు చేసేందుకు ఏనాడూ వెనుకాడలేదు. భవిష్యత్ తరాల విప్లవ శ్రేణులకు విప్లవ దీక్షకు, ధైర్యానికీ, త్యాగానికీ గుర్తుగా కా. కరమ్‌సింగ్ నిలుస్తారు.

2005 డిసెంబర్ 28న త్రీయు (యు.పి., ఉత్తరాఖండ్, ఉత్తర బీహార్) కార్యదర్శి కా. రవి (మైముద్దీన్)ని పోలీసులు పట్టుకొని క్రూరంగా హత్య చేశారు. ఆయన అమరత్వం ఆ ఉద్యమానికి పెద్ద దెబ్బ. ఆయన కూడా చిన్న వయస్సులోనే విప్లవోద్యమంలోకి వచ్చి పెద్ద బాధ్యతలను మోసి విప్లవోద్యమానికి సేవ చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో 2006 జూన్ 16న ఏ.పి. స్టేట్‌కమిటీ సభ్యులైన కా. మట్టా రవికుమార్ అమరత్వం ఏ.పి. ఉద్యమానికి తీవ్రమైన నష్టాన్ని చేకూర్చింది. గత సంవత్సర కాలంలో ఆంధ్రప్రదేశ్‌కూ, ఉత్తర తెలంగాణాకు చెందిన అనేక సీనియర్ కామ్రేడ్స్ అమరత్వం చెందారు. వారిలో ఎక్కువ మంది జిల్లా కమిటీ సభ్యులు. కా. జగదీష్ ఖమ్మం జిల్లాకు చెందిన డి.సి.ఎం. 2006 జూన్ 10న ఛత్తీస్‌గఢ్-ఆంధ్రాపోలీసుల జాయింట్ ఆపరేషన్‌లో యువకుడైన గెరిల్లా పోరాట యోధుడైన కా. కమలాకర్ అమరత్వం చెందారు. ఆయన ఉత్తర తెలంగాణాలోని కరీంనగర్ జిల్లా రాణాపూర్ గ్రామానికి చెందినవారు. 1990లో 16 ఏళ్ల వయస్సులో ఆయన ఉద్యమంలో చేరారు. అమరత్వం చెందేనాటికి 30 ఏళ్ల యువ గెరిల్లా పోరాటయోధునిగా ఉన్నారు. 1980లలో పెద్దపల్లి రైతాంగ పోరాటాలతో ప్రభావితమై చిన్న వయస్సులోనే రాణాపూర్ గ్రామం నుండి ఎంతోమంది యువకులు కార్యకర్తలుగా పార్టీలో చేరారు. అలా చేరిన వారిలో కా. కమలాకర్ ఒకరు. 1992లో ఆయనను పి.ఎల్.జి.ఏ. యోధునిగా డి.కె.కు పంపించారు. 1999లో ఆయన ప్లాటూన్ సెక్షన్ కమాండరయ్యారు. ఆ తర్వాత క్రమక్రమంగా 2005 నాటికి డివిజనల్ కమిటీ సభ్యునిగా ప్రమోట్ అయ్యారు. ఆయన అనేక గెరిల్లా దాడుల్లో ధైర్యమైన కమాండర్‌గా పాల్గొని విజయవంతం చేశారు. ఆయన ఒక ఆదర్శ కమ్యూనిస్టు గెరిల్లా పోరాట యోధునిగా నిలుస్తారు.

బీహార్, ఝార్ఖండ్‌లలో కూడా అనేక మంది కామ్రేడ్స్ తమ విలువైన ప్రాణాల్ని అర్పించారు. వారిలో మహిళలు గణనీయమైన సంఖ్యలోనే అమరత్వం చెందారు. విప్లవోద్యమంలో

అన్ని పనులలో పురుషులతోపాటు సమానంగా వారు అనన్యమైన త్యాగాలు చేశారు. వాస్తవానికి అనేక దాడుల్లోనూ, ఆంబుష్‌ల్లోనూ, రెయిడ్లలోనూ మహిళలు వీరోచిత పాత్ర నిర్వహించి అమరులయ్యారు. సి.పి.ఐ.(మావోయిస్టు) కేంద్రకమిటీ ఈ మహత్తరమైన సందర్భంలో ఈ క్రింది విధంగా పత్రికా విజ్ఞప్తి ద్వారా ప్రజలకు పిలుపునిస్తున్నది:

మొత్తం పార్టీ, పి.ఎల్.జి.ఏ., ప్రజాసంఘాలు, విప్లవాధికార అంగాలు మరియు దేశ ప్రజలు ఈ జులై 28ని అమరవీరుల వారోత్సవంగా జరపాలనీ, వేలాది అమరులు చిందించిన త్యాగపూరిత మార్గాన్ని మరింత ఎరుపెక్కిస్తూ, వారి ఆశయాల్ని ముందుకు తీసుకుపోతామనీ, వారు కలలు గన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు అదే మార్గాన ప్రయాణిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాం. అదే విధంగా అమరులైన కామ్రేడ్ల ఆదర్శాలను, వారి గొప్ప త్యాగపూరితమైన పోరాట జీవితాలను, వారి దృఢదీక్షను, బోల్షివిక్ స్పిరిట్‌ను, తీవ్రమైన ప్రతికూల పరిస్థితుల్లోనూ లక్ష్యానికి కట్టుబడి ఉండేతత్వాన్నీ, వారి సాహసాన్నీ మరియు అన్నిటికంటే ముఖ్యంగా వారి త్యాగాన్నీ సాధ్యమైన అన్ని పద్ధతుల ద్వారా ప్రచారం చేయాలని మేం పిలుపునిస్తున్నాం.

గత సంవత్సర కాలంలో 500 మందికి పైగా ప్రియతమ నాయకులు, పార్టీ కార్యకర్తలు, పోరాట యోధులు, పి.ఎల్.జి.ఏ. కమాండర్లు, నూతనంగా ఎదిగి వస్తున్న విప్లవాధికార అంగాల నాయకత్వం, విప్లవ ప్రజాసంఘాల్లోని నాయకులు, కార్యకర్తలను ఈ మహోద్యమంలో కోల్పోయాము. దండకారణ్య ప్రాంతంలో గత సంవత్సర కాలంలో సుమారు 250 మంది కామ్రేడ్స్ అమరత్వం చెందారు. వారిలో ఎక్కువ మంది విప్లవ ప్రజాసంఘాల, మిలీషియా మరియు జనతన సర్కార్ల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 200 మంది అమూల్యమైన కామ్రేడ్స్ అమరత్వం చెందారు. బీహార్-ఝార్ఖండ్ ఏరియాలో 34 మంది విలువైన కామ్రేడ్స్ అమరత్వం చెందారు. 3యు ఏరియాలో 7గురు కామ్రేడ్స్ అమరత్వం చెందారు. ఉత్తర ప్రదేశ్‌లో ఇద్దరు కామ్రేడ్స్ అమరులయ్యారు. కర్నాటకలో ఇద్దరు కామ్రేడ్స్ అమరులయ్యారు. మహారాష్ట్రలో ఒకరు, పశ్చిమ బెంగాల్‌లో ఒక కామ్రేడ్ అమరులయ్యారు. ముఖ్యంగా ఈ సంవత్సర కాలంలో పంజాబ్‌లో మావోయిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన మన పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులైన కా. కరమ్‌సింగ్ అమరత్వం మన ఉద్యమాన్ని పెద్ద నష్టానికి గురిచేసింది. మిగిలిన నష్టాల్లో 3యు కార్యదర్శి రవి (మైముద్దీన్), ఏ.పి. స్టేట్‌కమిటీ సెక్రటేరియట్ సభ్యుడు కా. రవి (శ్రీధర్)లు అమరులయ్యారు. మహిళా కామ్రేడ్ల అమరత్వం విషయంలో ముఖ్యంగా ప్రచారం చేయాల్సింది ఏ.పి.కి చెందిన కా. ఈశ్వరమ్మ, దండకారణ్యానికి చెందిన కామ్రేడ్స్ కోరసా సంతు, మొడియం సుక్కి, కుర్సం లక్కిల త్యాగాల్ని ప్రత్యేకంగా కొనియాడాలని పిలుపునిస్తున్నాం.

అమరులైన ఈ కామ్రేడ్ల జీవితాల్ని ఎత్తిపట్టాల్సిందిగా, వారి త్యాగాల్ని గౌరవించాల్సిందిగా, ఈ దేశ భవిష్యత్తు కోసం తమ ప్రాణాల్ని అర్పించిన విధానాన్ని కొనియాడవలసిందిగా, వారి మార్గాన ప్రయాణించవలసిందిగా ఈ దేశ పీడిత ప్రజలకూ, ప్రజాస్వామిక శక్తులకూ మా కేంద్రకమిటీ ఈ పత్రికా ప్రకటన ద్వారా పిలుపునిస్తోంది.

పోలిట్‌బ్యూరో

**2006** సి.పి.ఐ.(మావోయిస్టు)

# అమరుల రక్తంతో తడిసి ఎరుపెక్కిన అరుణ పతాకను సమున్నతంగా ఎత్తిపట్టండి!

*(జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు జరిగే అమరుల సంస్మరణ వారోత్సవం సందర్భంగా సి.పి.ఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ పిలుపు)*

**ప్రియమైన కామ్రేడ్స్!**

2004 సెప్టెంబర్‌లో సి.పి.ఐ (మావోయిస్టు) ఆవిర్భవించినపుడు జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల వారోత్సవాన్ని పాటించాలని నిర్ణయమైంది. ఈ నిర్ణయంమేరకు ప్రతి సంవత్సరం అమరుల వారాన్ని పాటిస్తూ, ప్రజలకొరకు ప్రాణాలర్పించిన మన ప్రియతమ అమరుల మహోన్నత త్యాగాలను స్మరిస్తూ, వారికి వినమ్రంగా హృదయపూర్వక శ్రద్ధాంజలి ఘటించి, వారి ఆశయ సాధనకై పిడికిలి బిగించి ప్రతిజ్ఞ చేస్తున్నాం.

“గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా పురోగమింపజేయాలి, పి.ఎల్.జి.ఎను పి.ఎల్.ఎగా, గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా మార్చాలనీ” పిలుపునిస్తూ చారిత్రత్మక ఐక్య కాంగ్రెస్ (9వ కాంగ్రెస్) విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో, ఈ సంవత్సరం అమరుల వారోత్సవాన్ని పాటించడానికి సన్నద్ధమవుతున్నాం.

భారత విప్లవ పంథాను రూపొందించి, మార్గ నిర్దేశం చేయటంలో రివిజనిజానికి వ్యతిరేకంగా అలుపెరుగని పోరు సాగించిన మన పార్టీ నిర్మాతలూ, పంథా రూపశిల్పులు, మహోపాధ్యాయులూ (బోధకులూ లేదా ఉపాధ్యాయులూ) కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హాయ్ ఛటర్జీల చారిత్రాత్మక పాత్రను స్మరించుకుంటూ, ఐక్య కాంగ్రెస్ (9వ కాంగ్రెస్) వారికి హృదయపూర్వక నివాళులర్పిస్తూ, వారు రూపొందించిన పంథాలో సాహసంతో పురోగమించడానికి దృఢంగా ప్రతినబూనింది. అమరులు కామ్రేడ్స్ అమూల్యసేన్, సుశీతల్‌రాయ్ చౌదరి, చంద్రశేఖర్‌దాస్, సరోజ్‌దత్తా, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పంచాది కృష్ణమూర్తి, భుజాసింగ్, సుబ్బారావు పాణిగ్రాహి, సుదీప్తో బెనర్జీ ఇంకా అనేక మంది అమరులకు కూడా కాంగ్రెస్ శ్రద్ధాంజలి ఘటించింది. చారిత్రాత్మక నక్సల్బరీ తిరుగుబాటు కాలం నుంచి నేటి వరకు శత్రువు అమలు చేస్తున్న పాశవిక నిర్బంధమూ, క్రూరమైన దాడుల్లో అమరులైన పదకొండు వేల మంది కామ్రేడ్స్‌కూ, 2004 సెప్టెంబర్‌లో సి.పి.ఐ (మావోయిస్టు) ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకూ ప్రాణాలర్పించిన ఏడు వందల మంది కామ్రేడ్స్‌కూ, పి.బి సభ్యుడు కామ్రేడ్ కరంసింగ్‌కూ, సి.ఎం.సి సభ్యుడు కామ్రేడ్ చంద్రమౌళికీ కాంగ్రెస్ శ్రద్ధాంజలి ఘటించింది.

అలాగే ఎ.పి, ఎన్.టి, ఎ.ఒ.బి, డి.కె, ఛత్తీస్‌గఢ్, కర్నాటక, 3యుల నుండి అమరులైన రాష్ట్రస్థాయి కామ్రేడ్స్ సాకేత్ రాజన్, మాధవ్, మైముద్దీన్, శ్రీధర్, యాదన్న, మంగ్తు, ప్రాణ్, సత్యం, వికాస్, రాఘవులు, గౌతం, శ్రావణ్‌లకూ, వివిధ స్థాయి పార్టీ కమిటీలకు చెందిన కామ్రేడ్స్‌కూ, పి.ఎల్.జి.ఎ కామ్రేడ్స్‌కూ, వివిధ స్థాయి పార్టీ, ఆర్.పి.సిల కామ్రేడ్స్‌కూ, ప్రజా మిలీషియా, విప్లవ ప్రజా సంఘాలకు చెందిన అమర కామ్రేడ్స్‌కూ, ఇంకా వీరిలోఅమరులైన వందలాది మహిళా కామ్రేడ్స్‌కూ కాంగ్రెస్ శ్రద్ధాంజలి ఘటించింది. మన దేశంలో, అలాగే ప్రపంచ వ్యాప్తంగానూ అన్ని రకాల దోపిడీ పీడనల నుంచి విముక్తిని సాధించి, వర్గరహిత సమాజాన్ని నిర్మించేందుకు గొప్ప పాత్రను పోషించి అమరులైన కామ్రేడ్స్ కృషినీ, అనన్య త్యాగాలనూ స్మరిస్తూ కాంగ్రెస్ వారికి హృదయపూర్వక శ్రద్ధాంజలి ఘటించింది.

కామ్రేడ్స్!

మన కాంగ్రెస్ విజయవంతంగా ముగిసిన తర్వాత, మరింతగా పెరిగిన శత్రు బహుముఖ దాడి, క్రూర నిర్బంధం, బూటకపు ఎన్‌కౌంటర్లలో అనేక మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఎ.పిలో ఆరుగురు ఎ.సి సభ్యులతో సహా 8 మంది కామ్రేడ్స్, ఎన్.టిలో ఆరుగురు కామ్రేడ్స్, డి.కెలో 24 మంది కామ్రేడ్స్, బి–జెలో 25 మంది కామ్రేడ్స్, ఛత్తీస్‌గఢ్‌లో ఏడుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. కాంగ్రెస్ తర్వాత అమరులైన వారిలో బి–జె ఎస్.ఎ.సి పరిధిలోని బధ్–షేక్‌పుర–నవడా జోనల్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ నాథున్‌జీ, ఉత్తర ఛత్తీస్‌గఢ్ జోనల్ కమిటీ కామ్రేడ్ మానస్, ఎన్.టిలోని ఆదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ నరేష్, ఎ.పి, ఎన్.టి నుండి మహిళా కామ్రేడ్స్ భవాని, స్వర్ణ, అరుణ, లలితలు, హర్యానా నుంచి మలేరియా జ్వరంతో అమరుడైన కామ్రేడ్ రామ్ మోహర్, పంజాబ్‌లో పేరు పొందిన మేధావి కామ్రేడ్ హరిసింగ్ తార్కలు వున్నారు. మార్చి 13న డి.కెలో బీజాపూర్ పోలీసు జిల్లాలోని రాణిబోదిలి పోలీసు – ఎస్.పి.ఒ క్యాంపుపై దాడి చేసి 68 మంది శత్రు బలగాలను నిర్మూలించిన దాడిలో పశ్చిమ బస్తర్ కమాండ్ ఇన్‌ఛార్జి, డివిజనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ మోహన్‌తో పాటు ఆరుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ దాడి మన విప్లవోద్యమ చరిత్రలోనే చాలా పెద్దది. జార్ఖండ్‌లో బొకారో జిల్లాలోని ఖన్‌మహల్‌లో సి.ఐ.ఎస్.ఎఫ్ బ్యారక్ (క్యాంపు)పై చేసిన విజయవంతమైన దాడిలో ఎస్.ఎ.సి స్థాయి మిలటరీ ఇన్‌స్ట్రక్టర్ కామ్రేడ్ ప్రదీప్, పి.ఎల్.జి.ఎ పోరాటయోధుడు కామ్రేడ్ నిర్మల్‌లు అమరులయ్యారు.

గడచిన సంవత్సర కాలంలో దేశ వ్యాప్తంగా 202 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలో కొంత మంది కామ్రేడ్స్ శత్రు బలగాలపై మన పి.ఎల్.జి.ఎ చేసిన వీరోచితమైన రెయిడ్‌లూ, ఆంబుష్‌లూ, దాడుల్లో అమరులయ్యారు. కొంత మంది కామ్రేడ్స్ పోలీసు, పారామిలటరీ బలగాలకు వ్యతిరేకంగా జరిపిన తీవ్రమైన ప్రతిఘటనలో అమరులయ్యారు. కానీ, అనేక మందిని పట్టుకుని, క్రూరంగా చిత్రహింసలు పెట్టి, బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేశారు. బూబీట్రాప్‌లూ, మందుపాతరలూ పెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కొంతమంది కామ్రేడ్స్ అమరులయ్యారు. గడచిన సంవత్సర కాలంలో

డి.కెలోని ఆర్.పి.సిలూ, ప్రజామిలీషియా యూనిట్లూ, విప్లవ ప్రజాసంఘాలకూ చెందిన వందమంది కామ్రేడ్స్‌ను పోలీసులూ, సల్వాజుడూం సాయుధ అరాచక మూకలూ క్రూరంగా హత్య గావించారు. బి–జెలో ప్రభుత్వ ప్రోత్సాహక టి.పి.సి (తృతీయ ప్రస్తుతి కమిటీ)కి చెందిన హంతక, అరాచక మూకల చేతిలో కొంతమంది కామ్రేడ్స్ చనిపోయారు. అమరుల వారోత్సవం సందర్భంగా మన ప్రియతమ కామ్రేడ్స్ అందరికీ హృదయపూర్వక శ్రద్ధాంజలి ఘటించుదాం.

భారతదేశంలో మొత్తం సమాజాన్ని పరివర్తన చేసే లక్ష్యంతో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో, దోపిడీ వర్గాన్ని అధికారం నుంచి కూల్చేందుకు పీడిత వర్గం కఠినమైన పోరాటం జరుపుతున్నచోట, సాయుధ విప్లవం ప్రతిఘాతుక విప్లవాన్ని ఎదుర్కొంటున్న చోట, దోపిడీ పీడనలకు గురవుతున్న కార్మిక, రైతాంగ, శ్రామిక వర్గాలు చేస్తున్న విముక్తి పోరాటాలను దోపిడీ పాలకవర్గం తన రాజ్య యంత్రాంగం ద్వారా అణచివేయడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. ఆవిధంగా, ఈ రోజు దేశమంతా యుద్ధ రంగంగా మారి, కొనసాగుతున్న విప్లవ యుద్ధంలో ఇచ్చిపుచ్చుకునే జీవితం రోజువారీ చిత్రమైంది. బలమైన శత్రువుకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో “మనల్ని మనం రక్షించుకోవడానికి శత్రువును నాశనం చేయటం” అనే సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నందువల్ల త్యాగాలు అనివార్యం. శత్రువు బలగాలను నాశనం చేయటం, నష్టం కలిగించటమనే క్రమంలో స్వతసిద్ధమైన త్యాగాలు కొన్ని అనివార్యం. అయినప్పటికీ మనం అనవసర త్యాగాలను నివారించాలి.

అమరత్వం అనేది మన పార్టీలో మహోన్నత విప్లవ సాంప్రదాయం. ఏ ఒక్కరి స్వప్రయోజనాల కోసంగాక, విశాల పీడిత ప్రజల ప్రయోజనాలకోసం, సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా దోపిడీ పీడనల కబంధ హస్తాల నుండి మాతృభూమి విముక్తి కోసం చేసే త్యాగం అన్నిటికంటే గొప్పది. మన ప్రియతమ అమరలు మన దేశమాత ముద్దు బిడ్డలు. వారి అమరత్వం హిమాలయాలకంటే ఉన్నతమైనది.

జూలై 28 నుండి ఆగస్టు 3 వరకూ అమరుల వారోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహాలన్నీ చేయవలసిందిగా అన్ని పార్టీ కమిటీలకూ, పి.ఎల్.జి.ఎ బలగాలకూ, ఆర్.పి.సిలూ, కె.కె.సి కామ్రేడ్స్‌కూ, విప్లవ ప్రజా సంఘాల కామ్రేడ్స్‌కూ మన కేంద్ర కమిటీ పిలుపునిస్తోంది. అమరుల వారోత్సవానికి సి.సి ఈ కింది నిర్దిష్ట కార్యక్రమాన్ని రూపొందించింది.

## అమరుల వారోత్సవానికి నిర్దిష్ట కార్యక్రమం:

**1.** అమరుల వారోత్సవం సందర్భంగా విస్తృత రాజకీయ ప్రచార క్యాంపెయిన్‌ను నిర్వహించాలి. అమరుల వారోత్సవ కార్యక్రమాల్లో పెద్ద యెత్తున ప్రజల్ని కదిలించడానికి అన్ని విధాలుగా కృషి చేయాలి. ఈ క్యాంపెయిన్‌లో అమరులు వారి నిరాడంబర జీవిత శైలినీ, కఠోర శ్రమనూ,వారి జీవితాల్లో వారు ఆచరించి, ఉన్నతంగా నిలిపిన ఆదర్శాలనూ, కమ్యూనిస్టు విలువలనూ పైకెత్తిపడుతూ

కేంద్రీకరించాలి. పార్టీ క్యాడర్‌కు వీటిని అనుసరించాలని పిలుపునివ్వాలి. ఈ కర్తవ్యాన్ని చేపట్టడానికి అందుబాటులో వున్న అన్నింటినీ ఉపయోగించుకోవాలి. అన్ని రాష్ట్రాల్లో అమరుల గురించి, అమరవీరుల వారోత్సవం గురించి పత్రికా ప్రకటనలు విడుదల చేయాలి. కరపత్రాలూ, పోస్టర్లూ మొదలైనవి తీసుకురావాలి. గోడ రాతలు కూడా విస్తృతంగా రాయాలి. మన ప్రభావం గట్టిగా వున్న ఏరియాల్లో ఖచ్చితమైన రహస్య పద్ధతులు పాటిస్తూ బ్యానర్లు కట్టాలి. సాధ్యమైన చోట జిల్లాలకూ, ప్రాంతాలకూ, వేదికలకూ చెందిన అమరవీరులా, మహిళా అమరుల ఫోటోలతో క్యాలెండర్లు తీసుకురావాలి. జోనల్ కమిటీ/ జిల్లా కమిటీ / డివిజనల్ కమిటీ / ఎస్.ఎ.సి / ఎస్.జడ్.సి / ఎస్.పి స్థాయిలో బుక్‌లెట్లు ప్రచురించాలి.

**2.** మన ప్రసంగాలూ, సమావేశాలూ, పోస్టర్లూ, కరపత్రాలూ, బుక్‌లెట్లూ మొదలైన వాటన్నింటిలో మన పార్టీ స్థాపకులైన నేతలిద్దరి పైనా ప్రత్యేకంగా కేంద్రీకరించాలి. వారి జీవిత చరిత్రలూ, రచనల గురించి క్లుప్తంగా పరిచయం చేయాలి. ప్రచార సామాగ్రి అంతటా ఈ నేతలిద్దరి ఫోటోలూ వుండాలి. ఈ నేతలిద్దరూ రూపొందించిన పంథాలో పురోగమించాలని ప్రజలకూ, పార్టీ క్యాడర్లకూ పిలుపునివ్వాలి.

**3.** మనకు కొంత బలమున్న చోట అమరవీరుల స్థూపాలు నిర్మించడానికి తప్పక ప్రయత్నించాలి. వాస్తవానికి అమరుల స్థూపాలను నిర్మించి, కాపాడుకోవటానికి ప్రభుత్వ, ప్రతీఘాతుక శక్తులకు వ్యతిరేకంగా పోరాడటంలో మన క్యాడర్‌కూ, ప్రజలకూ సుదీర్ఘమైన అనుభవముంది.అమరుల కుటుంబాలనూ, ఆ గ్రామాల ప్రజలనూ కదిలించి, సాధ్యమైనన్ని ఎక్కువ గ్రామాల్లో చిన్న చిన్నవి అమరుల స్థూపాలను నిర్మించడానికి తప్పక ప్రయత్నించాలి. మనం ప్రజాయుద్ధంలో వున్నామనే విషయాన్ని దృష్టిలో వుంచుకుని, సాధ్యమైనంత తక్కువ సమయంలో అమరుల స్థూపాల నిర్మాణాన్ని పూర్తి చేయాలి. ఏ రాష్ట్రంలోనైనా అమరుల స్మారక స్థూప నిర్మాణం సాధ్యమైతే, దాన్ని కేంద్రంగా చేసుకుని ప్రజలను స్థూపాల నిర్మాణానికి రాజకీయంగా కదిలించడానికి ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలి. ఆయా రాష్ట్రాల్లో కనీసం ఒకటీ రెండు చోట్ల దీన్ని చేపట్టాలి. ఇందుకోసం విస్తృత పునాదిగల కమిటీలను రూపొందించాలి.

**4.** అమరుల కుటుంబాలతో, బంధు మిత్రులతో బహిరంగ కమిటీలు ఏర్పాటు చేయాలి. ఈ కమిటీల ఆధ్వర్యంలో కొన్ని చోట్ల అమరుల స్థూపాలను నిర్మించాలి. సాధ్యమైన చోట్ల ఈ పేరుతో బహిరంగ సభలూ, విస్తృత ప్రచారం చేపట్టాలి. అమరులు ప్రజల ప్రియతమ నేతలనీ, వారి అమరత్వాన్ని కొనియాడే హక్కు ప్రజలకుందనీ ఈ వేదికల ద్వారా అమరుల కుటుంబాలూ, బంధు మిత్రులూ నిర్భయంగా చాటాలి. ప్రభుత్వ బలగాలూ, గూండాలూ, ప్రతీఘాతుక మూకలూ ఈ సంస్మరణ సభలను చెడగొట్టాలనీ, స్థూపాల నిర్మాణాన్ని అడ్డుకోవాలనీ ప్రయత్నిస్తే వాళ్ళను ప్రజలు ధైర్యంగా ఎదుర్కోవడానికి సంసిద్ధం చేయాలి. ఈ వేదికలను క్రియాశీలంగా రూపొందించి, ప్రజలకు విజ్ఞప్తి చేసే క్రమంలో కొంత మంది ప్రముఖులనూ, అభ్యుదయవాదులనూ ఇందులో పాల్గొనేట్లు మనం తప్పక ప్రయత్నించాలి.

**5.** బహిరంగ, రహస్య సమావేశాలు నిర్వహించాలి. సాయుధ పోరాటం జరుగుతున్న ప్రాంతాల్లో ఈ సభలు రహస్యంగా నిర్వహించాలి. మన పోరాటం ప్రాథమిక స్థాయిలో ఉన్న పట్టణాల్లో, ఏరియాల్లో ఏ మేరకు సాధ్యమైతే ఆమేరకు బహిరంగ సభలు నిర్వహించాలి. బహిరంగ కార్యక్రమాలైనా, రహస్య కార్యక్రమాలైనా స్థూపాలనూ, సభలనూ నాశనం చేయడానికి ప్రభుత్వం చేసే ప్రయత్నాలను ఎదుర్కొవడానికి మన ప్రజా మిలీషియా, పి.ఎల్.జి.ఎ బలగాలను సంసిద్ధం చేయాలి. అమరుల వారోత్సవం సందర్భంగా ప్రజలను భయభ్రాంతుల్ని చేయడానికీ పోలీసూ, పారామిలటరీ బలగాలు పెద్ద యెత్తున గాలింపు చర్యలు నిర్వహిస్తాయి. మన కార్యక్రమాలను భగ్నం చేయడానికి బహిరంగ సభల విషయంలో శత్రువును ఎదుర్కోవడానికి ప్రజల్ని పెద్దయెత్తున కదిలించడానికి తప్పక ప్రయత్నించాలి. ప్రజల్ని కదిలిస్తూ ఊరేగింపులూ, కాగడాల ప్రదర్శలను నిర్వహించడానికి కూడా తప్పక కృషి చేయాలి. అమరుల బంధు మిత్రులతో బహిరంగ, రహస్య ఊరేగింపులూ, మౌన ప్రదర్శనలూ, సమావేశాలూ, పత్రికా సమావేశాలూ ఇంకా ప్రజల్ని కదిలించే అటువంటి క్రియాశీల పద్ధతులకూ, ప్రచారానికి మనం ప్లాన్ చేయాలి.

**6.** శత్రువుపై చివరి శ్వాస వరకూ పోరాడుతామని పార్టీలో, పి.ఎల్.జి.ఎలో, ఆర్.పి.సిలలో, కె.కె.సిలో విప్లవ ప్రజా సంఘాలలోని మన కామ్రేడ్స్‌ను వారి వారి యూనిట్లలో ప్రతిజ్ఞ బూనేందుకు ప్రోత్సహించాలి. ప్రజల కొరకు తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించిన మన ప్రియతమ అమరుల ఆదర్శాలను ఉన్నతంగా ఎత్తిపట్టడానికి కృషి చేయాలి. అసాధారణమైన అమరుల సుగుణాలను అనుసరిస్తామనీ, ఆదర్శవంతమైన వారి జీవితాల నుండి నేర్చుకుంటామని వారితో ప్రతిజ్ఞ చేయించాలి. అమరుల వారోత్సవం సందర్భంగా అమరుల ఆశయాలను పూరించడానికి మనందరం తప్పక ప్రతిజ్ఞబూనాలి. గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా, పి.ఎల్.జి.ఎను పి.ఎల్.ఎగా గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా మార్చే కర్తవ్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకుపోవడానికి పూర్తి స్థాయిలో కృషి చేయాలి పై కర్తవ్యాన్ని పూర్తి చేయడం ద్వారానే అమరులు కన్న కలల్ని సాధించే మార్గంలో పురోగమించగలం. ఇందుకోసం చేసే ప్రతిజ్ఞ శత్రు బలగాలను సాహసంగా ఎదుర్కొని ఓడించడానికీ, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, సోషలిజం కమ్యూనిజాలను స్థాపించే వైపు పురోగమించే మన లక్ష్యాన్ని పరిపూర్తి చేయడానికీ మన మనసుల్లో నూతనోత్తేజాన్ని, నూతన సంకల్పాన్నీ సృష్టిస్తుంది.

**7.** అమరవీరుల కుటుంబాలన్నింటిని కలవడానికి మనం తప్పక కృషి చేయాలి. వారి విచారాన్నీ, దు:ఖాన్ని పంచుకుని, వారిని ఓదార్చి, వారికి సాధ్యమైనమేరకు విప్లవోద్యమంలో పాత్ర నిర్వహించడానికి ప్రోత్సహించాలి. అమరుల కుటుంబాలన్నింటినీ మనం కలవలేకపోవడం, వారిని కార్యక్రమాల్లో నిమగ్నం చేయలేకపోవటం చాలా దురదృష్టం, అమరత్వపు వార్తలు తెలిసిన వెంటనే పార్టీ క్యాడర్, ప్రజా సంఘాలతో పాటు అమరుల కుటుంబాలతో ఏర్పాటు చేసిన సంఘాలను వీలైనంత తొందరగా కదిలించాలి. ప్రతిసారీ ఇది ఆచరణలోకి రావాలి.అమరుల వారోత్సవాన్ని పాటించడంలో వారు

ముందుండేటట్లూ, అమరుల సంస్మరణ సందర్భంగా ఏర్పాటు చేసే వేదికల్లో భాగమయ్యేటట్లూ వారిని మనం తప్పక ప్రోత్సహించాలి.

కామ్రేడ్స్!

దిన దినం శత్రుదాడి అన్ని వైపులా పెరుగుతూ, మరింత క్రూరంగా మారుతున్న వాస్తవం మనకు తెలిసిందే. యు.పి.ఎ ప్రభుత్వమూ, అన్ని ప్రతిపక్షాలూ, రివిజనిస్టులూ, సి.పి.ఐ (ఎం) సోషల్ ఫాసిస్టు నాయకత్వంలోని వామపక్ష పార్టీలూ అన్నికలిసి సామ్రాజ్యవాదుల, భూస్వామ్య దళారీ నిరంకుశ బూర్జువాల ప్రయోజనాలను పరిరక్షించడానికి ఒక్కటై విప్లవ, ప్రజాస్వామిక ఉద్యమాలన్నింటిపైనా, ప్రజలపైనా క్రూరమైన దాడులు చేస్తున్నాయి. సి.పి.ఐ (మావోయిస్టు) ఆవిర్భవించినప్పటి నుండీ విప్లవకారులపై దేశవ్యాప్త దాడిని ప్రకటించి, అన్ని వైపులా వాళ్ళ దాడిని తీవ్రం చేస్తున్నారు. అన్ని రకాల శత్రు దాడులను ఎదుర్కొంటూ, మన కర్తవ్యాలన్నింటినీ పూర్తి చేసే చైతన్యాన్ని పెంపొందించుకోవాలి. రాజకీయంగా, చైతన్య వంతంగా ప్రజల్ని విస్తృతంగా కదిలించాలి. మన కార్యక్రమమంతటా గెరిల్లా యుద్ధ ఆచరణా, సిద్ధాంతాలనూ ఖచ్చితంగా అనుసరించాలి. శత్రు బలగాలను నాశనం చేసి, మన కార్యక్రమాన్ని ఖచ్చితంగా అనుసరించాలి. శత్రు బలగాలను నాశనం చేసి, మన కార్యక్రమాన్ని అమలు చేయటంలో, మన బలగాలను సంరక్షించుకోవటం చాలా ముఖ్యం. అందువల్ల, అమరుల వారోత్సవ క్యాంపెయిన్ చేపట్టడంలో మన పనికి సంబంధించిన దీర్ఘకాలిక లక్ష్యాన్నీ, శత్రువు యొక్క సాయుధ దాడి తీవ్రతనూ, స్థానిక నిర్దిష్ట పరిస్థితులనూ తప్పక దృష్టిలో వుంచుకోవాలి.

గొప్ప విప్లవోత్తేజం, ఉత్సుకతతో అమరుల వారోత్సవాన్ని పాటించుదాం రండి!

శత్రు బలగాలను పూర్తిగా నిర్మూలించి, ప్రజాయుద్ధాన్ని పురోగమింపచేసి, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా, పి.ఎల్.జి.ఎను పి.ఎల్.ఎగా, గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా మార్చి మన కామ్రేడ్స్ అమరత్వానికి రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి శపథం చేద్దాం.

మన దేశం నుండి సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్నీ, దళారీ నిరంకుశ బూర్జువానూ, ప్రపంచవ్యాప్తంగా ప్రతీఘాతకులందరినీ పూర్తిగా తుడిచి పెట్టి, నిజమైన ప్రజాస్వామిక, సోషలిస్టు, కమ్యూనిస్టు రాజ్యాన్ని నిర్మించడానికి తుది శ్వాస వరకూ పోరాడుతామని మన ప్రియతమ అమరవీరుల పేరున శపథం చేద్దాం.

క్రూరమైన శత్రు దాడిని ధైర్యంగా, గొప్ప త్యాగ స్ఫూర్తితో ఎదుర్కొని, శత్రువుతో వర్గ పోరాటంలోని కఠిన పరస్థితులతో తలపడటానికి మొత్తం పార్టీ క్యాడర్‌కూ, పి.ఎల్.జి.ఎ వీరోచిత కమాండర్లకూ, పోరాట యోధులకూ మొత్తం ప్రజానీకానికి అమరుల వారోత్సవం ఒక సైద్ధాంతిక – రాజకీయ తర్ఫీదుగా, ఎడ్యుకేషన్ క్యాంపెయిన్‌గా పాటించుదాం.

అమరుల వారోత్సవం సందర్భంగా కామ్రేడ్ మావో చెప్పిన ఈ కింది వాక్యాలను మననం చేసుకుందాం. "కమ్యూనిస్టు ఏ పరిస్థితుల్లోనూ తన స్వప్రయోజనాలను ముందు పెట్టడు. దేశ, ప్రజల ప్రయోజనాలకు లోబడే తన ప్రయోజనాలను వుంచుతాడు. స్వార్థం, పనిలో అలసత్వం, అవినీతి, పేరు ప్రతిష్టల కోసం వెంపర్లాట (కీర్తికాంక్ష) మొదలైనవి చాలా అధమమైనవికాగా, శక్తి కొద్దీ పని చేయడం, మన స్ఫూర్తిగా ప్రజల కొరకు పని చేయడం, నిరాడంబరంగా కఠోర శ్రమ చేయడం వంటి సుగుణాలన్నీ గౌరవనీయమైనవి". అమరుల వారోత్సవం సందర్భంగా ఇది సి.సి పిలుపు.

★ మన మహోపాధ్యాయులూ, ప్రియతమ నేతలూ కామ్రేడ్ సి.ఎం, కామ్రేడ్ కె.సిలు వర్థిల్లాలి.

★ మన ప్రియతమ నేతలు కామ్రేడ్స్ అమూల్యసేన్, సుశీతల్ రాయ్ చౌదరి,చంద్రశేఖర్‌దాస్, సరోజ్‌దత్తా, పంచాది కృష్ణమూర్తి, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, సుబ్బారావు పాణిగ్రాహి, బాబా భుజసింగ్, అప్పూ, సుదీప్తో బెనర్జీ ఇంకా ఇతరులు వర్థిల్లాలి!

★ మన ప్రియతమ నేతలు కామ్రేడ్స్ ప్రకాశ్ మాస్టర్, శ్యాం, మహేష్, మురళీ, పులి అంజన్నలు వర్థిల్లాలి!

★ మన ప్రియతమ నేతలు కామ్రేడ్స్ డేవిడ్, భక్తిదా, జీవ్‌లాల్, దారా, బచ్చాన్, పనీల్, గోపాల్, దధీచి, సాగర్, కృష్ణ, సదన్, నవీన్, జఖీరియా వర్థిల్లాలి!

★ మన ప్రియతమ నేతలు కామ్రేడ్స్ పంచాది నిర్మల, స్నేహలత, పద్మ, లలిత, సుగుణ, చిట్టెక్క, భాగ్య, పార్వతి, హజీమా, కవిత, ప్రశాంతి, బక్కిదేవి, ఊర్మిళ, అంజు, కరుణ ఇతరులు వర్థిల్లాలి!

★ ఎ.పి, బి.జె, డి.కె, ఛత్తీస్‌గఢ్, యు.పి, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, పంజాబ్, అస్సాం, త్రిపుర ఇంకా దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా అమరులైన మన ప్రియతమ కామ్రేడ్స్ వర్థిల్లాలి!

★ అమరుల ఆదర్శాలను సమున్నతంగా నిలిపి, వారి ఆశయాలను పరిపూర్తి చేయడానికి కదం తొక్కుతూ ముందుకు పోదాం!

★ గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా, పి.ఎల్.జి.ఎను పి.ఎల్.ఎగా, గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా మార్చి, దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని విస్తరింపజేయటమే మన ప్రియతమ అమరులకు మన మందించే నిజమైన నివాళి!

**పొలిట్ బ్యూరో**

**మే 25, 2007** **సి.పి.ఐ (మావోయిస్టు)**

# అమరవీరుల నెత్తుటి పతాకను సమున్నతంగా ఎత్తిపడుదాం! అమరవీరుల నెత్తుటితో ఎరుపెక్కిన మార్గంలో ముందుకు సాగుతూ విముక్తి ప్రాంతాలను స్థాపిద్దాం, పి.ఎల్.జి.ఎ.ను పి.ఎల్.ఎ.గా ఉన్నతీకరిద్దాం!!

*(జూలై 28 నుండి ఆగస్ట్ 3 వరకూ అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు)*

> *"వేన వేల అమరులు ప్రజల కోసం తమ ప్రాణాల్ని వీరోచితంగా అర్పించారు. వాళ్ల పతాకను సమున్నతంగా ఎత్తిపట్టి, వాళ్ల నెత్తుటితో ఎరుపెక్కిన దారిలో మున్ముందుకు కవాతు చేద్దాం"* - కామ్రేడ్ మావో

ప్రియమైన కామ్రేడ్స్,

2007 ప్రారంభంలో విజయవంతంగా ముగిసిన 9వ (ఐక్యతా) కాంగ్రెస్ తర్వాత దేశంలో సాయుధ వ్యవసాయ విప్లవం మరింత వుధృతమైంది. అందులో భాగంగా దేశవ్యాప్తంగా ప్రతీఘాతుక పాలకవర్గాలు పాల్పడుతున్న బహుముఖ నిర్బంధ దాడిలో 300 మందికి పైగా మన ప్రియతమ కామ్రేడ్స్ అమరులయ్యారు.

ఈ క్రూర వర్గ యుద్ధంలో వివిధ స్థాయిలకు చెందిన మన పార్టీ నాయకత్వం, క్యాడర్, పి.ఎల్.జి.ఎ. కమాండర్లూ, యోధులూ, వివిధ ప్రజాసంఘాల నాయకులూ, కార్యకర్తలూ, విప్లవ ప్రజానీకమూ శత్రు దాడిని ప్రతిఘటించడంలో అనేక గొప్ప అనుభవాలను పొందారు, అనేక ఎత్తుగడల ఎదురుదాడులను ముందుకు తీసికెళ్లారు. సామ్రాజ్యవాదుల సహాయంతో, సామ్రాజ్యవాదులు రూపొందించిన ఎల్.ఐ.సి. పథకాలూ, ఎత్తుగడలతో భారత ప్రతీఘాతుక పాలకవర్గాలు దేశవ్యాప్త సమన్వయంతో బహుముఖ దాడిని కొనసాగిస్తున్నాయి. ప్రత్యేకించి డీకేలో సల్వాజుడుం పేరుతో కేంద్ర బలగాలు, ప్రత్యేక పోలీసు బలగాలు సంయుక్తంగా

క్రూర దాడిని కొనసాగిస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా మన పి.ఎల్.జి.ఎ., విప్లవ ప్రజానీకం చేసిన వీరోచితమైన, మార్గదర్శకమైన ఎదురు దాడులు ప్రజాయుద్ధం పట్ల మన అవగాహనను పెంచాయి. బలమైన భారత రాజ్యానికీ, రాజ్య ప్రాయోజిత టెర్రిజానికీ వ్యతిరేకంగా యుద్ధాన్ని కొనసాగించడానికి అవసరమైన విలువైన పాఠాలను నేర్పాయి. అదే విధంగా బీహార్-ఝార్ఖండ్‌లో టి.పి.సి., జె.పి.సి., శాంతిసేనా వంటి రాజ్య ప్రాయోజిత సాయుధ ముఠాలతో కల్సి పోలీసులూ, పారా మిలిటరీ బలగాలూ చేస్తున్న క్రూర దాడిని ఎదిరిస్తూ మన పి.ఎల్.జి.ఎ. చేస్తున్న ప్రతిదాడి పార్టీకి సంపద్వంతమైన అనుభవాలనిచ్చింది, మిలిటరీ ఎత్తుగడలను సుసంపన్నం చేసింది.

గత అమరవీరుల సంస్మరణ వారం నుండీ దేశంలోని వివిధ గెరిల్లా జోన్లలో, పోరాట ప్రాంతాలలో 230 మందికి పైగా పార్టీకి చెందిన మన ప్రియతమ నాయకులూ, సభ్యులూ, సానుభూతిపరులూ, పి.ఎల్.జి.ఎ.కు చెందిన వీర కమాండర్లూ, యోధులూ, వివిధ ప్రజాసంఘాలకూ, రాజ్యాధికార అంగాలకు చెందిన నాయకులూ, సభ్యులూ, విప్లవ ప్రజలూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసికెళ్లే క్రమంలో శత్రువుతో సాహసోపేతంగా పోరాడుతూ తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేశారు. వీరిలో 130 మంది డీకేలో, 45 మంది బి.జె.లో, 12 మంది ఎన్.టి.లో, 12 మంది ఎ.ఒ.బి.లో, 9 మంది పశ్చిమ బెంగాల్లో, 5గురు ఒడిస్సాలో, ఇద్దరు మహారాష్ట్రలో, ఒకరు ఛత్తీస్‌గఢ్‌లో అమరులయ్యారు. ఈ విప్లవ యుద్ధ క్రమంలో 20 మందికి పైగా మహిళా కామ్రేడ్స్ తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేశారు. ఈ కాలంలో అధిక సంఖ్యలో ప్రజలు కూడా రాజ్యం చేతిలో ప్రాణాలు కోల్పోయారు. ప్రత్యేకించి డీకేలో, పశ్చిమ బెంగాల్లోని నందిగ్రాంలో ప్రజలు ఎక్కువగా ప్రాణాలు కోల్పోయారు. డీకేలో రాజ్య ప్రాయోజిత విప్లవ ప్రతీఘాత ఫాసిస్ట్ సాయుధ ముఠా అయిన సల్వాజుడుం చేతా, ప్రభుత్వ కిరాయి బలగాల చేత ప్రాణాలు కోల్పోతే, నందిగ్రాంలో సోషల్ ఫాసిస్ట్ సి.పి.ఎం. గూండాల చేత, ప్రభుత్వ కిరాయి బలగాలచేత ప్రాణాలు కోల్పోయారు. డీకేలోని బీజాపూర్ జిల్లా పామేడ్ సమీపంలోని కంచాల్ గ్రామం వద్ద కోవర్టులు ఇచ్చిన సమాచారంతో ఎ.పి. గ్రేహౌండ్స్ జరిపిన దారుణ హత్యాకాండలో ఖమ్మం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సాగర్‌తో సహా 18 మంది కామ్రేడ్స్ హత్య చేయబడ్డారు.

ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు - కా. అజయ్‌దా 2007 ఆగస్ట్‌లో, కా. అనురాధా గాంధీ 2008 ఏప్రిల్‌లో - సెరిబ్రల్ మలేరియా బారిన పడి అమరులయ్యారు. కా. అజయ్‌దా మన

పార్టీకి చెందిన చాలా సీనియర్ కామ్రేడ్. కా. అనురాధా గాంధీ కేంద్ర కమిటీకి ఎన్నికయిన అతికొద్ది మహిళా కామ్రేడ్స్‌లో ఒకరు. ఈ ఇద్దరి కేంద్ర కమిటీ నాయకుల అమరత్వం మొత్తం పార్టీకీ, భారత విప్లవానికీ చాలా పెద్ద నష్టం. ఈ కాలంలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు అమరులయ్యారు: ఎ.ఒ.బి. ఎస్.జడ్.సి. సభ్యుడైన కా. కొమ్మను ఎ.పి.ఎస్.ఐ.బి. పోలీసులు ఒడిస్సా నుంచి ఎత్తుకుపోయి విజయనగరం అడవుల్లో కాల్చి చంపారు. ఇదే జోన్‌కు చెందిన మరొక కా. రణదేవ్ గునుకురాయి ఆంబుష్‌లో శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ నేలకొరిగాడు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ సభ్యుడైన కా. సుకాంతోను మరో ఏడుగురు కామ్రేడ్స్‌తో పాటు ఈస్ట్ సింగ్‌భూమ్‌లోని బిటర్మడ దగ్గర నాగరిక్ సురక్షా సమితి గూండాలూ, స్పెషల్ పోలీసులు కల్సి హత్య చేశారు. ఎన్.టి.లోనూ, మహారాష్ట్రలోనూ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పని చేసిన కా. గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్‌నూ ఆయన జీవిత భాగస్వామి ఏసీ సభ్యురాలూ అయిన కామ్రేడ్ రమనూ ఎ.పి.ఎస్.ఐ.బి. వాళ్లు పట్టుకొని వరంగల్ అడవుల్లో హత్య చేశారు.

పి.ఎల్.జి.ఎ. చేసిన వివిధ ఆంబుష్‌ల్లో, దాడుల్లో, వివిధ ఎదురుదాడుల్లో, శత్రు బలగాలు చేసిన విప్లవ ప్రతీఘాత దాడుల్లో, ప్రమాదాలూ, అనారోగ్యం మొదలైన కారణాలతో కంపెనీ కమాండర్ కామ్రేడ్ మధు, పి.ఎల్.కమాండర్లు - కామ్రేడ్స్ రతన్, జగదీష్, సైతు, కా. సాగర్ (డి.సి.ఎస్-ఖమ్మం), కా. అరుణ్ (జడ్.సి.ఎం.-ఉత్తర ఛత్తీస్‌గఢ్), కా. బసంత్ యాదవ్ (సబ్ జోనల్ కమాండర్-బీహార్-ఝార్ఖండ్), కా. కుందన్ (బీ-ఝా), కా. సుధీర్ (మల్కాన్‌గిరి డి.వి.సి.ఎం.), కా. దసూరాం మాలేకా (బాశధార డి.వి.సి.ఎం.)లు అమరులయ్యారు. ఇంకా అనేక మంది సెక్షన్ కమాండర్లూ, పి.ఎల్.జి.ఎ. యోధులూ, అనేక మంది ఎ.సి.ఎం.లు, పార్టీ సానుభూతిపరులూ, వివిధ స్థాయిల ప్రజాసంఘ నాయకులు భారతదేశంలో ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసికెళ్లడంలో భాగంగా తమ జీవితాలను త్యాగం చేశారు.

అనేక మంది మహిళా కామ్రేడ్లు శత్రు బలగాలతో జరిగిన వీరోచిత పోరాటాల్లో తమ అమూల్యమైన ప్రాణాలర్పించారు. విప్లవ యుద్ధాన్ని ముందుకు తీసికెళ్లాలనే ప్రగాఢ సంకల్పం వాళ్లను ఆఖరి ఊపిరి వరకూ శత్రువుతో ధైర్యంగా పోరాడడానికి ప్రేరేపించింది. అది మన పార్టీకి గర్వకారణమైన గౌరవప్రదమైన విషయం. వాళ్ల త్యాగం విప్లవకారులందరికీ ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతుంది. వివిధ కంపెనీలకూ, ప్లటూన్లకూ చెందిన పి.ఎల్.జి.ఎ. యోధలూ, సెక్షన్ కమాండర్లూ, ప్రజా నాయకురాళ్లూ అయిన కామ్రేడ్స్ శ్యామల, దేవే,

బసంతి, రాధ, గున్ని, రజిత, కుమ్మే, శాంతి, రజిత, సుక్కి, బయ్యక్క, బుద్రి, సన్ని, జోగి, విమల, డీకేలో నల్గురు సి.ఎన్.ఎం. కార్యకర్తలూ, ఎన్.టి.లో కామ్రేడ్స్ జమున, సంగీతలు, ఎ.ఒ.బి.లో కామ్రేడ్స్ భవానీ, విజయ, రత్న, షకీల, శ్వేత, సుజాత, ఒడిస్సాలో కంపెనీ సెక్షన్ కమాండర్ కా. కమల, మహారాష్ట్రలో పి.ఎల్. సభ్యురాలైన వనిత, పి.ఎల్.జి.ఎ. యోధురాలూ, సబ్ డి.వి.సి.ఎం. అయిన కా. జనియాలు అమరులయ్యారు. ఆకాశంలో శాశ్వతంగా, నిరంతరాయంగా ప్రకాశించే ఈ అరుణతారలు అంతిమ విజయం దిశగా సాగిపోయేలా మనకు నిరంతరం ప్రేరణను ఇస్తారు.

ఫిలిప్పైన్స్, బంగ్లాదేశ్, టర్కీ, నేపాల్ ఇంకా ప్రపంచంలో ఇతర చోట్లా నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా ఎందరో కామ్రేడ్స్ తమ విలువైన ప్రాణాలను అర్పించారు. తమ స్వార్థరహిత త్యాగాల ద్వారా సోషలిస్టు విప్లవాన్ని వేగవంతం చేస్తున్న వివిధ ప్రపంచ కార్మిక విభాగాలకు చెందిన ఈ కామ్రేడ్స్ అందరికీ మనం విప్లవ శ్రద్ధాంజలిని అర్పిద్దాం.

మహత్తర ప్రపంచ శ్రామిక వర్గ విప్లవ క్రమంలో అత్యున్నత చైతన్యాన్ని ప్రదర్శించి అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసి మన దేశంలోనూ, ప్రపంచ వ్యాప్తంగానూ అమరులైన కామ్రేడ్సందరికీ వినమ్రంగా విప్లవ నివాళులర్పిద్దాం.

ప్రపంచవ్యాప్తంగా దోపిడీ వ్యవస్థ నిర్మూలన కోసం, మానవజాతి విముక్తి కోసం ఈ అమరులందరూ తమ అంతిమ శ్వాసవరకూ పోరాడారు. అమరుల మహోన్నత త్యాగాలు ఎన్నటికీ వృధా కావు. ఈ అమరుల గౌరవార్థమూ, స్మృత్యర్థమూ మనం తలవంచి జోహార్లు అర్పిద్దాం. ఈ అమరుల కుటుంబాలన్నింటికీ హృదయపూర్వకంగా సంతాపాన్ని తెలియజేద్దాం. వాళ్లందరి దుఃఖాన్నీ, జ్ఞాపకాలను పంచుకుంటామనీ, వాళ్ల కష్టాల్లో, బాధల్లో, దుఃఖాల్లో, సంఘర్షణల్లో నిరంతరం వాళ్ల పక్కన నిలబడుతామని ప్రతిజ్ఞ చేద్దాం. అరుణబాటను మరింత ప్రకాశవంతం చేసిన వాళ్ల స్ఫూర్తిదాయకమైన ఆదర్శాలను పాటిస్తామని శపథం చేద్దాం. ఒరిగిన ఈ ప్రజా వీరులూ, వీరనారులూ జ్వలింపజేసిన ఎర్రని మార్గానికి మనల్ని మనం పునరంకితం చేసుకుంటూ ఆ మార్గాన్ని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం.

విప్లవాభినందనలతో,

**పొలిట్ బ్యూరో**

**సి.పి.ఐ. (మావోయిస్టు)**

**15-5-2008**



**మన ప్రియతమ అమరుల ఉన్నతమైన కలల్ని నిజం చేద్దాం,**
**వారి కమ్యూనిస్టు లక్షణాల్ని పుణికి పుచ్చుకుందాం,**
**వారికి తగిన వారసులను వేలాదిగా సృష్టిద్దాం !**

## జులై 28 నుండి ఆగస్టు 3 వరకూ
## అమరవీరుల సంస్మరణ వారాన్ని జరపండి !

*—— 2009 అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా*
*భారతదేశ ప్రజలకు సిపిఐ (మావోయిస్టు) పిలుపు*

## మన ప్రియతమ అమరుల ఉన్నతమైన కలల్ని నిజం చేద్దాం, వారి కమ్యూనిస్టు లక్షణాల్ని పుణికి పుచ్చుకుందాం, వారికి తగిన వారసులను వేలాదిగా సృష్టిద్దాం !

# జులై 28 నుండి ఆగస్టు 3 వరకూ అమరవీరుల సంస్మరణ వారాన్ని జరపండి !

*- 2009 అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా భారతదేశ ప్రజలకు సిపిఐ (మావోయిస్టు) పిలుపు*

జులై 28, 2008 నుండి గత సంవత్సర కాలంలో 232 మంది కామ్రేడ్స్ మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని అంతిమ విజయం వైపుకు పురోగమింపజేయడానికి జరుగుతున్న ప్రజాయుద్ధ క్రమంలో తమ అమూల్యమైన ప్రాణాల్ని అర్పించారు. ఈ సంవత్సర కాలంలో దండకారణ్యం, ఝార్ఖండ్, బీహార్, ఒడిషా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో పాశవికమైన శత్రుదాడిని మరింత తీవ్రతరం చేయడంతో ఈ ఏడు రాష్ట్రాల్లో 226 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ అమరుల్లో ఒక కేంద్రకమిటీ సభ్యుడు పటేల్ సుధాకర్ అలియాస్ వికాస్ అలియాస్ సూర్యం, ఆంధ్రప్రదేశ్ నుండి ఇద్దరు రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్స్ మస్తాన్ రావు, రాంచందర్, పదకొండుగురు డిసి/డివిసి/జెడ్‌సి సభ్యులు, ఇద్దరు సబ్-జోన్ కమిటీ సభ్యులు, ఇరవైమంది ఎసి సభ్యులు/పిఎల్ కమాండర్లు/సెక్షన్ కమాండర్లు, 79 మంది పార్టీ సభ్యులు-పిఎల్‌జిఎ యోధులు, 39 మంది గ్రామ స్థాయి కార్యకర్తలు/మిలీషియా సభ్యులు, 80 మంది విప్లవ ప్రజానీకం ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి కా. శశి, కంధమాల్ నుండి కా. రింకీ, కోరాపుట్ నుండి కా. జ్యోతి, మహారాష్ట్రలోని గఢ్‌చిరోలి నుండి కా. మైనాబాయ్‌లను పోలీసులు క్రూర చిత్రహింసల పాలపాల్జేసి తర్వాత చంపివేశారు. వీరోచిత త్యాగాలూ, లోతైన అంకితభావం, పార్టీ పట్ల, ప్రజల పట్ల, విప్లవం పట్ల నిబద్ధత, శత్రు అమానుష చిత్రహింసలను ఎదుర్కోవడంలో అసాధారణ ధైర్యం, పార్టీ రహస్యాల్ని తమ కంటిపాపల వలే కాపాడుకోవడం వంటి వాటి ద్వారా ఈ కామ్రేడ్స్ ప్రతి ఒక్కరికీ గొప్ప ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సంవత్సర కాలంలో అమరులైన కామ్రేడ్స్ అందరికీ, భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా తమ ప్రాణాలను అర్పించిన వేలాదిమంది అమరులకూ, మన పార్టీ వ్యవస్థాపక నాయకులు కామ్రేడ్ సిఎం, కామ్రేడ్ కెసి లకూ, ప్రపంచంలోని వివిధ దేశాల్లో సామ్రాజ్యవాదానికీ, విప్లవ ప్రతీఘాతులకూ

వ్యతిరేకంగా పోరాడుతూ ఒరిగిపోయిన వారందరికీ వినమ్రంగా అరుణారుణ జోహార్లు అర్పిద్దాం.

గత సంవత్సర కాలంలో, భారతదేశంలోని విప్లవ ప్రతీఘాతుక పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల క్రియాశీలమైన మద్దతూ, మార్గదర్శకత్వంతో తమ విప్లవ వ్యతిరేక యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేశారు. కొనసాగుతున్న ఈ భారీ ప్రభుత్వ దాడిలోనూ, దండకారణ్యంలో కేంద్ర-రాష్ట్ర బలగాలూ, సల్వాజుడుం గుండాలూ చేపట్టిన ప్రభుత్వ ప్రాయోజిత టెర్రరిస్టు దాడిలోనూ 132 మంది అమరులు కాగా, బీహార్-ఝార్ఖండ్‌లో దాదాపు 60 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఇటువంటి తీవ్రమైన ప్రభుత్వ బీభత్సం, ప్రభుత్వ ప్రాయోజిత బీభత్సాల నడుమ మన బలగాలు గొప్ప ప్రతిఘటనను కనబరిచి, శత్రువుకు తీవ్రమైన నష్టాల్ని కలుగజేస్తూ అత్యంత వీరోచితమైన ఎత్తుగడల ఎదురుదాడుల్ని చేశారు. వాస్తవానికి, విప్లవకారులకు జరిగినదానికంటే ఎక్కువ నష్టాలు జరగడం, నష్టాల సంఖ్య పెరగడంతో శత్రువు మానసిక స్థయిర్యం చాలా పడిపోయింది. గత సంవత్సర కాలంలో మన వీరోచిత పిఎల్‌జిఎ, ప్రజా మిలీషియా, విప్లవ ప్రజానీకం 300 మందికి పైగా పోలీసు, కేంద్ర బలగాల్ని తుడిచిపెట్టేశారు. మనవైపు నుండి 115 మంది పార్టీ సభ్యుల్నీ, అంతే సంఖ్యలో విప్లవ ప్రజానీకాన్నీ మనం కోల్పోయాం. ఇంతకంటే పెద్ద సంఖ్యలో శత్రు బలగాలు మన దాడుల్లో గాయపడినాయి. మన ప్రజాయుద్ధ మొత్తం అభివృద్ధిలో ఇది ఒక ప్రముఖమైన అభివృద్ధి.

మన ప్రతిఘటన ప్రత్యేకించి 15వ లోక్‌సభ ఎన్నికల సమయం నుండి ప్రాముఖ్యతను సంతరించుకుంది. కేవలం ఈ నాలుగు నెలల కాలంలోనే దాదాపు 150 మంది శత్రు సిబ్బందిని తుడిచిపెట్టాం. శత్రు బలగాలపై చేసిన ఈ ఆంబుష్‌లూ, రెయిడ్‌లూ, దాడుల సందర్భంగా మన బలగాలు గొప్ప సాహసాన్ని ప్రదర్శించాయి. దామన్‌జోడిలోని నాల్కోపై చేసిన రెయిడ్‌లో సుమారు పది గంటలపాటు శత్రువుతో వీరోచితంగా పోరాడి పేలుడు పదార్థాల భాండాగారాన్ని అంతిమంగా స్వాధీనం చేసుకున్న తర్వాత మన నలుగురు కామ్రేడ్స్ - రాజు, కీర్తి (ఎసిఎంలు), రఘు, సుఖ్‌రాం (పార్టీ సభ్యులు) అమరులయ్యారు. శత్రుదాడికి వ్యతిరేకంగా మన ప్రతిఘటనను మరింతగా పెంచడం ద్వారా, గ్రామీణ ప్రాంతాల నుండి వాడి అధికారాన్ని కూలదోసి, ప్రజా విప్లవ-ప్రజాస్వామిక అధికారాన్ని స్థాపించడం ద్వారా, పార్టీని, ప్రజాసైన్యాన్నీ, విప్లవ ప్రజాసంఘాలనూ, అధికార అంగాలనూ బలోపేతం చేసుకోవడం ద్వారా మాత్రమే మనం మన శక్తుల్ని కాపాడుకోగల్గుతాం.

పెరుగుతున్న నష్టాల్ని చూసి దిగ్భ్రాంతి చెందిన శత్రువు సాధారణ ప్రజానీకాన్నీ, ప్రజాసంఘాలకు చెందిన గ్రామ స్థాయి కార్యకర్తల్నీ, మిలీషియా సభ్యుల్నీ ఊచకోత కోయడం ఆరంభించాడు.

నష్టాల నిష్పత్తి పోలీసులకు అనుకూలంగా మారాలని దంతెవాడ ఎస్పీ బహిరంగంగా ప్రకటించాడు. ఈ విధంగా ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలోని సింగారంలో చేసినలాంటి అత్యంత పాశవికమైన ఊచకోతలను మొదలుపెట్టారు. సింగారంలో జనవరి 8న కేంద్ర-రాష్ట్ర బలగాలూ, సల్వాజుడుం గ్యాంగులూ 18 మంది ఆదివాసుల్ని తమ గ్రామాల నుండి అపహరించుకుని పోయి చంపేశాయి. ఏప్రిల్ 16న ఝార్ఖండ్‌లోని లాతేహార్ జిల్లాలోని బధనియా గ్రామంలో ఐదుగురు గ్రామస్తుల్ని వారి ఇళ్ల నుండి ఎత్తుకుపోయి చంపేశారు. జనవరి 24న ఇంద్రావతి ప్రాంతంలోని దొండెంపారలో ఐదుగురు మిలీషియా సభ్యుల్ని హత్య చేశారు. జూన్ 22న దంతెవాడలో కోకవాడ అంబుష్ జరిగిన తర్వాత ఏడుగురు సభ్యుల్ని చంపేశారు. ఈ విధంగా బీభత్స వాతావరణాన్ని సృష్టించడానికీ, పార్టీతో గానీ, విప్లవోద్యమంతో గానీ ప్రజలు ఎటువంటి సంబంధాన్నీ కలిగి ఉండకుండా అడ్డుకోడానికీ విప్లవాన్ని సమర్థించే ప్రజలపై శత్రుదాడులు పెరుగుతూపోయాయి.

క్రూరుడైన శత్రువు పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాన్ని దెబ్బ తీయడంపై కేంద్రీకరిస్తూ వస్తున్నాడు. వాస్తవానికి, వాడు ఈ విషయంలో ఓ మేరకు విజయాన్ని సాధించాడు. కేంద్ర స్థాయి పార్టీ నాయకత్వాన్నీ, అలాగే వివిధ స్థాయిల నాయకత్వాన్నీ నిర్మూలించడానికి తన ప్రయత్నాల్ని వాడు ముమ్మరం చేస్తాడు. వాడు గ్రామ స్థాయిలో ప్రజాసంఘాల నాయకత్వాన్నీ, ప్రజా మిలీషియానీ నిర్మూలించడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఇందుకోసం మున్నెన్నడూ లేనంత స్థాయిలో వాడు బూటకపు ఎన్‌కౌంటర్లకూ, సామూహిక హత్యలకూ పాల్పడ్డానికి పథకం వేస్తున్నాడు. అందుకని మనం గొప్ప త్యాగాలకు సిద్ధపడుతూనే, కేంద్ర, రాష్ట్ర నాయకత్వాన్నీ, అలాగే ప్రజాసంఘాల నాయకత్వాన్నీ కాపాడుకోవడం పట్ల ప్రత్యేక జాగ్రత్తల్ని తీసుకోవాలి.

ప్రత్యేకించి కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ ప్రభుత్వం మరోసారి ఎన్నికయ్యాక దాడిని మరింతగా యుద్ధ ప్రాతిపదికన పెంచేశారు. నెలరోజుల లోపే పార్టీపై అఖిల భారత నిషేధాన్ని విధించి దాన్ని టెర్రరిస్టు సంస్థగా ప్రకటించేశారు. రాష్ట్ర బలగాలూ, సిపిఎంకి చెందిన లంపెన్ హర్మద్ బాహినీ గూండాలతో పాటు కేంద్ర బలగాలను లాల్‌గఢ్‌లో పెద్దెత్తున మోహరించి లాల్‌గఢ్ ప్రజానీకంపైనా, ఆ చుట్టుపక్కల ప్రాంతాలపైనా ఒక పాశవిక దాడిని ఎక్కుపెట్టారు. ఇవన్నీ అనివార్యంగా యుద్ధమూ, రాజ్య బలగాలు చేసే బూటకపు ఎన్‌కౌంటర్లూ, దారుణ అత్యాచారాలూ పెరుగుతాయనడానికి సూచికలే. పార్టీ, ప్రజాసైన్యమూ, మొత్తం ప్రజానీకమూ విప్లవ ప్రతీఘాతుక పాలకవర్గాలు చేపట్టిన ఈ క్రూరమైన దాడిని ఎదిరించి ఓడించడానికి సన్నద్ధం కావాలి.

ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్‌లలోనూ, ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌లలోనూ, శత్రువును వివిధ రూపాల్లో ప్రతిఘటించడంలోనూ చురుగ్గా పాల్గొన్న పిఎల్‌జిఎ యోధులకూ,

ప్రజా మిలీషియాకూ, ప్రజానీకానికీ మేం మా విప్లవాభినందనలను తెలియజేస్తున్నాం. సిఆర్‌పిఎఫ్ జవాన్లు బధనియాలో ఐదుగురు గ్రామస్తుల్ని హత్య చేసిన తర్వాత ప్రజలు చూపిన భారీ ప్రతిఘటన ఈ కాలంలో బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా జరిగిన ప్రతిఘటనల్లో గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది. బూటకపు ఎన్‌కౌంటర్లకూ, విప్లవ ప్రతీఘాతుక అణచివేతకూ వ్యతిరేకంగా అటువంటి ప్రతిఘటనను మరింత తీవ్రతరం చేయడానికి యావత్ పార్టీ శ్రేణులూ, పిఎల్‌జిఎ కమాండర్లూ, యోధులూ, విప్లవ ప్రజానీకమూ కృషి చేయాలని మేం పిలుపునిస్తున్నాం.

దేశవ్యాప్తంగా జులై 28 నుండి ఆగస్టు 3 వరకూ అమరుల సంస్మరణ వారాన్ని జరపాల్సిందిగా, సంస్మరణ సభల్ని జరపాల్సిందిగా, అమరుల జీవిత చరిత్రలను ప్రచురించాల్సిందిగా, వివిధ పద్ధతుల్లో విస్తృత ప్రచారాన్ని చేపట్టాల్సిందిగా, వీలైన చోట్లల్లా అమరుల స్మారక స్థూపాల్ని నిర్మించాల్సిందిగా యావత్ పార్టీ శ్రేణులకూ, పిఎల్‌జిఎ యోధులకూ, విప్లవ ప్రజా అధికార అంగాలకూ, విప్లవ ప్రజాసంఘాలకూ మేం పిలుపునిస్తున్నాం.

అసంఖ్యాకమైన అమరుల ప్రకాశవంతమైన కమ్యూనిస్టు గుణాల్ని, ప్రత్యేకించి కామ్రేడ్ వికాస్‌లోగల అంకితభావం, సాహసం, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, విప్లవ చేవలను అలవర్చుకుందాం. ఈ అమరవీరులకు మనం తగిన వారసులమని నిరూపించుకుందాం. విప్లవాన్ని పురోగమింపజేసే క్రమంలో అసువులు బాసిన ఆ అమరులకు అసంఖ్యాకంగా వారసులను సృష్టించడానికి మన శాయశక్తులా కృషి చేద్దాం.

విముక్తి ప్రాంతాలను స్థాపించడానికీ, పిఎల్‌జిఎని పిఎల్‌ఎగా మార్చడానికీ, గెరిల్లా యుద్ధాన్ని చలన యుద్ధంగా మార్చడానికీ అమరుల రక్తంతో తడిసిన ఎర్రజెండాను సమున్నతంగా ఎత్తిపట్టి ముందుకు అడుగేద్దాం. విప్లవ యుద్ధాన్ని కొనసాగిస్తూ దాన్ని మన దేశంలోని విశాల ప్రాంతాలకు విస్తరించస్తూ మన ప్రియతమ అమరుల కలల్ని సాకారం చేయడానికి, అంటే సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువాల, విప్లవ ప్రతీఘాతుక పెద్ద భూస్వాముల సంకెళ్ల నుండి మన దేశాన్ని విముక్తి చేసి, ప్రజల ప్రజాస్వామ్యానీ, సోషలిజాన్నీ, అంతిమంగా కమ్యూనిజాన్నీ స్థాపించడానికి ఇనుమడించిన దృఢదీక్షతో, ఉక్కులాంటి సంకల్పంతో కృషి చేస్తామని ప్రతినబూనుదాం.

**పొలిట్‌బ్యూరో,**

*జులై 10, 2009* **సిపిఐ (మావోయిస్టు)**



# అమరుల త్యాగాలను సమున్నతంగా ఎత్తిపట్టండి !
# అమరుల ఆశయ సాధనకు ప్రజాయుద్ధ మార్గంలో దృఢసంకల్పంతో పురోగమించండి !

***2010 జులై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారం ఘనంగా జరపాలని పార్టీ శ్రేణులకూ, పి.ఎల్.జి.ఏ. కమాండర్లకూ-యోధులకూ, విప్లవ ప్రజానీకానికి పోలిట్‌బ్యూరో, సి.పి.ఐ.(మావోయిస్టు) పిలుపు***

ప్రియమైన కామ్రేడ్స్ !

మహోన్నత లక్ష్య సాధన కోసం మన పార్టీ గొప్ప నిర్మాతలు - నాయకులు - అమరులు అయిన కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ్ ఛటర్జీలు చూపిన ప్రశస్తమైన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో పయనిస్తూ గత అమరవీరుల దినం - 28 జులై 2009 - తర్వాత 240 మందికి పైగా విప్లవ కార్మికవర్గ పుత్రికలు, పుత్రులైన మన ప్రియతమ కామ్రేడ్స్ తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. వీరందరికీ మన పార్టీ కేంద్ర కమిటీ, సి.ఎం.సి., కేంద్ర సుకోమోల తరపున పి.బి. వినమ్రంగా అరుణారుణ జోహార్లు పలుకుతోంది. మన ప్రియతమ అమరుల స్మృతిలో ప్రతి సంవత్సరం లానే ఈసారి అమరుల సంస్మరణవారాన్ని ఘనంగా జరపాలని పార్టీకీ, పి.ఎల్.జి.ఏ.కీ, ప్రజా నిర్మాణాలకూ, ప్రజలకూ పిలుపునిస్తున్నది.

దేశంలో పురోగమిస్తున్న ప్రజాయుద్ధ సమూల నిర్మూలనా లక్ష్యంగా భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల, ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి మద్దతుతో, సహాయసహకారాలతో కొనసాగిస్తున్న ప్రతీఘాతుక బహుముఖ-భారీ సైనిక దాడిని వీరోచితంగా తిప్పికొట్టే క్రమంలో ఈ కామ్రేడ్స్ నేలకొరిగారు. దేశం నలుమూలలా - దండకారణ్యం, ఝార్ఖండ్, బీహార్, బెంగాల్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లోని విశాల ప్రాంతాల్లో - అమరుల నునువెచ్చని రక్తం చిందింది. అమరుల రక్తంతో కొండకోనలు, మైదానాలు, గనులు, జనావాసాలు, పంటపొలాలు అన్నీ ఎరుపెక్కాయి. ఫాసిస్టు పాలకవర్గాలు అపూర్వ స్థాయిలో కొనసాగిస్తున్న అత్యంత క్రూరమైన దాడి నుండి ప్రజాయుద్ధ విజయాలను కాపాడుకోవడానికీ, ప్రజలను, పార్టీని, ప్రజాసేనని, నూతన ప్రజాస్వామిక అధికారాన్ని రక్షించుకోవడానికీ, ప్రజాయుద్ధ పురోగమనానికీ వీరంతా మొక్కవోని ధైర్య సాహసాలతో పోరాడి తుదిశ్వాస విడిచారు.

మన ప్రియతమ అమరుల్లో పార్టీ కేంద్ర సైనిక ఇంటెలిజెన్స్ విభాగం బాధ్యుడు,

సీనియర్ రాష్ట్ర కమిటీ స్థాయి కామ్రేడ్ అయిన శాఖమూరి అప్పారావు (రవి, జయలాల్) మొదలుకొని సాధారణ సభ్యుల వరకు ఉన్నారు. ఈ అమరుల్లో అసమాన ధైర్యసాహసాలు, వీరత్వం, త్యాగశీలత ప్రదర్శించిన షిల్దా వీరులు, తాడిమెట్ల (ముకరం) యోధులు ఉన్నారు. కామ్రేడ్ మంగేష్ లాంటి డివిజన్ కమాండ్ ఇన్‌ఛార్జ్ నుండి, మిలీషియా కామ్రేడ్ శకుంతల వరకూ, కామ్రేడ్ స్వర్ణ లాంటి సీనియర్ మహిళా కామ్రేడ్ నుండి, ప్రజావ్యవసాయ క్షేత్ర కార్యకర్త కామ్రేడ్ కుమ్లి వరకూ, ప్రజా నిర్మాణాల నేతలైన కామ్రేడ్స్ సింగన్న, ఆంధ్రు, సుధీర్ మెహతోల నుండి సభ్యుల వరకూ, 70 సంవత్సరాల వృద్ధుల నుండి ముక్కుపచ్చలారని 10 సంవత్సరాల పిల్లల వరకూ ఉన్నారు. అమరుల్లో ఒక రాష్ట్ర కమిటీ సభ్యుడు, ...... మంది జోనల్/డి.సి./డివిజన్ కమిటీ సభ్యులు, ......మంది  సబ్‌జోనల్/సబ్‌డివిసి కమిటీ సభ్యులు, ....... మంది ఏ.సి.ఎం.లు, ...... మంది పి.ఎం.లు ఉన్నారు. మొత్తం అమరుల్లో ...... మంది మహిళా కామ్రేడ్స్ ఉన్నారు.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో శత్రువు కొనసాగించిన హత్యాకాండలోనే అత్యధికులు అమరులయ్యారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని భూస్థాపితం చేయటానికి శత్రు బలగాలపై చేసిన లాహిరి, షిల్దా, తాడిమెట్ల వగైరా వీరోచిత యుద్ధాల సందర్భంగానూ, శత్రు కిరాయి బలగాలు చేసిన దాడుల్ని మన బలగాలు వీరోచితంగా తిప్పికొట్టే క్రమంలోనూ అమరులైన కామ్రేడ్స్ సంఖ్య గణనీయంగా ఉంది. శత్రువు చాలామంది కామ్రేడ్స్‌ని పట్టుకొని తీవ్ర చిత్రహింసల పాల్జేసి హత్య చేశాడు. మహిళలపై నాజీమూకల్లా సామూహిక అత్యాచారం చేసి ఘోరంగా చంపివేశారు. ఎన్‌కౌంటర్స్ పేరుతో పోలీసులు చేసిన హత్యలన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లే. పోలీసులు పెట్టిన క్రూరమైన చిత్రహింసలు, వేధింపులు భరించలేక కొంతమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఏర్పరచిన హంతక ముఠాలు మన కామ్రేడ్స్‌ని పట్టుకొని పలురకాలుగా చిత్రహింసలు పెట్టి హత్య చేశాయి. మరికొంతమంది కామ్రేడ్స్ ప్రమాదవశాత్తు ఆయుధాలు పేలి అమరులైనారు. అనారోగ్యంతో కూడా కొంతమంది కామ్రేడ్స్  కన్నుమూశారు.

మన బలగాలకూ శత్రు బలగాలకూ మధ్య జరిగిన దాడులు-ప్రతిదాడుల సందర్భంగానూ శత్రు బలగాలు నిరాయుధులైన ప్రజలపై విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లోనూ చాలా మంది కామ్రేడ్స్ గాయపడినారు. వేలాది మంది స్థానిక ప్రజానిర్మాణాల కామ్రేడ్స్, ప్రజలు అరెస్టు చేయబడి తీవ్రమైన చిత్రహింసలకు గురైనారు. వీరిలో వందలాది మంది బూటకపు కేసుల్లో ఇరికించబడి జైళ్లలో బంధించబడినారు. అమానుష పరిస్థితులున్న జైళ్లలో వందలాది మంది కామ్రేడ్స్ సంవత్సరాల తరబడి మగ్గిపోతున్నారు. అనేక మందిపై నల్లచట్టాలు మోపబడ్డాయి. ఆస్తుల విధ్వంసం, లూటీ, గ్రామాల దగ్ధం, పంటల నాశనం, పెంపుడు జంతు సంపద లూటీ దినదినం పెరిగి పోతున్నది. ప్రజల విస్థాపన కొనసాగుతూనే ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే దేశవ్యాప్తంగా ఫాసిస్టు శత్రువు కొనసాగిస్తున్న మాపింగ్ అప్ మహా విధ్వంసకాండ దినదినం పెరిగిపోయి ప్రజల బతుకుల్ని అల్లకల్లోలం చేస్తున్నది..

అడుగడుగునా శత్రు దమనకాండను తిప్పికొడుతూ పోరులో నేలకొరిగిన వందలాది మంది కామ్రేడ్స్ ప్రజాస్వామిక-కమ్యూనిస్టు చేతనతో ప్రదర్శించిన సాహసం, వీరత్వం, పాటించిన విలువలు, నెలకొల్పిన ఆదర్శాలు-త్యాగ సంప్రదాయాలు, అందించిన విలువైన అనుభవాలు భారత నూతన ప్రజాస్వామిక పోరుమార్గాన్నీ, ప్రపంచ సోషలిస్టు మహా విప్లవ మార్గాన్నీ కాంతివంతం చేశాయి. అమరుల సంస్మరణవారాన్ని పురస్కరించుకొని మన ప్రియతమ నాయకులు, త్యాగమూర్తులు కామ్రేడ్స్ సి.ఎం., కె.సి.లనూ, నక్సల్బరీ నుండి నేటి వరకు అమరులైన వేలాది మంది జ్ఞాత, అజ్ఞాత అమరులందరినీ తలచుకుంటూ పోలిట్‌బ్యూరో బరువెక్కిన గుండెలతో వినమ్రంగా తలవంచి నివాళులర్పిస్తున్నది. వారి ఆశయ సాధనకు తుదివరకూ అవిశ్రాంతంగా పోరాడ శపథం చేస్తున్నది. ఈ సందర్భంగా అమరుల బంధుమిత్రులందరికీ, సహచరులందరికీ ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ వారి సంవేదనలో పాలుపంచుకుంటున్నది. అమరులు లేని లోటును పూడ్చాలని వారి ప్రియ సహచరులందరినీ కోరుతున్నది. క్షతగాత్రులైన కామ్రేడ్స్ ప్రదర్శించిన గొప్ప స్పిరిట్‌కు అభినందిస్తూ వారు త్వరగా కోలుకొని క్రియాశీలంగా  ఉద్యమంలో పాలుపంచుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నది. శత్రువుచే అరెస్టు చేయబడినప్పటికీ క్రూరమైన చిత్రహింసలకు వెరవకుండా అత్యంత ధైర్యాన్ని, త్యాగనిరతిని ప్రదర్శించిన, అమానుష పరిస్థితులలో సైతం జైళ్లను వర్గపోరాట కేంద్రాలుగా మలిచిన సాహసిక కామ్రేడ్సందరికీ మన పి.బి. హార్ధికాభినందనలు తెలియజేస్తున్నది. దేశవ్యాప్తంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ దమనకాండకు గురైన లక్షలాది ప్రజానీకపు బాధలో పాలుపంచుకుంటున్నది. తమ కష్టాలకు, కన్నీళ్లకు, బాధలన్నింటికీ కారణమైన శత్రువుకు వ్యతిరేకంగా మరింత వర్గకసితో దృఢంగా అంతిమ విజయం సాధించే వరకు పోరాడాలని కోరుతున్నది.

ప్రజాస్వామ్యం, జాతీయ విముక్తి కోసం, వర్గదోపిడీ పీడనల నుండి విముక్తి కోసం సామ్రాజ్యవాదానికి, అన్ని రకాల ప్రతీఘాతుకత్వానికీ వ్యతిరేకంగా పోరాడే క్రమంలో దేశంలోనూ, వివిధ దేశాల్లోనూ గత పది నెలల కాలంలో వందలాది మంది మావోయిస్టులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థియువజనులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు, ఉద్యోగులు, మహిళలు, పీడిత జాతి ప్రజలు అమరులైనారు. వీరందరినీ అమరుల సంస్మరణవారం సందర్భంగా స్మరించుకొని  నివాళులర్పిద్దాం.

కామ్రేడ్స్,

మన పార్టీ నాయకత్వంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధం తీవ్రతరమవుతున్నదీ, విస్తృతమవుతున్నదీ, విజయాలు సాధిస్తున్నదీ, నూతన ప్రజాస్వామిక అధికారాన్ని సృష్టిస్తున్నదీ. కళింగనగర్, సింగూర్, నందిగ్రాం, సమరశీల ప్రజాఉద్యమాల ప్రేరణతో వినూత్న తరహాలో పెల్లుబికిన లాల్‌గఢ్, నారాయణపట్న చారిత్రాత్మక సమరశీల ప్రజా పోరాటాలు దేశ రాజకీయాలలో, ప్రజా ఉద్యమాలలో నూతన ఒరవడిని సృష్టించాయి. ఇవి దేశంలో మావోయిస్టు పార్టీ నాయకత్వ ఆవశ్యకతను చాటి చెప్తున్నాయి.

గత పది నెలల ఉద్యమ చరిత్రంతా శత్రువు కొనసాగిస్తున్న బహుముఖ-భారీ సైనిక దాడికి, ప్రత్యేకంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఏ. బలగాలు, ప్రజలు కొనసాగించిన పోరాట చరిత్రే. మన గొప్ప అమరుల త్యాగాలు లేకుండా, లక్షలాది మంది పీడిత ప్రజల కష్టాలు కన్నీళ్లు లేకుండా ప్రజాయుద్ధంలో మనం సాధించిన ఏ ఒక్క విజయాన్ని ఊహించలేము. వీరి త్యాగాలు లేకుండా పార్టీ చేపట్టిన రాజకీయ, సైనిక, నిర్మాణ, ఉత్పత్తి, ప్రజాసంక్షేమం, విస్తరణ వగైరా క్యాంపెయిన్లను, అవి సాధించిన సత్ఫలితాలను కూడా ఊహించలేము. అమరుల త్యాగాలు లేకుండా దేశంలోని వివిధ ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధం తీవ్రతరం-విస్తృతం కావడాన్నీ, ఈ యుద్ధంలో విజయాలు సాధించడాన్నీ, నూతన అధికారాన్ని సృష్టించడాన్నీ ఊహించలేము. లాల్‌గఢ్, నారాయణపట్న, కళింగనగర్ తదితర పోరాట విజయాలలో ఏ ఒక్కటీ అమరుల త్యాగాలు లేకుండా సాధించుకోలేదు. దేశంలోని ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీల శక్తులు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా సమైక్యంగా ఉద్యమించడానికి అమరుల త్యాగాలు ప్రేరణనందించాయి. అలాగే అమరుల త్యాగాలు లేకుండా మన ప్రజాయుద్ధానికి లభించిన దేశ విదేశ పోరాటశక్తుల మద్దతును గురించి కూడా ఊహించలేము. ఒక్కమాటలో చెప్పాలంటే మన పార్టీ ఈ కాలంలో సాధించిన ప్రతి రాజకీయ, సైనిక, నిర్మాణ విజయాలన్నింటికీ ప్రేరణ స్ఫూర్తి నందించింది అమరుల త్యాగాలే.

**కామ్రేడ్స్,**

భారత పాలకవర్గాలు అనుసరిస్తూ వచ్చిన ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల, విస్తరణవాదపూరిత, అభివృద్ధి నిరోధక ఆర్థిక, రాజకీయ, సామాజిక, పర్యావరణ విధానాల వల్లా, విప్లవోద్యమాన్ని అణచివేయడం పేరుతో ప్రజలపై ప్రతీఘాతుక యుద్ధాన్ని రుద్దడం వల్ల దేశంలో సామాజిక వైరుధ్యాలన్నీ మరింతగా పదునెక్కుతున్నాయి. దీనివల్ల మావోయిస్టు శక్తులు, ప్రగతిశీల ప్రజాస్వామిక శక్తులు, దేశభక్త శక్తులు, విశాల ఆదివాసీ, దళిత, మత మైనారిటీ తదితర సామాజిక పీడిత జన సమూహాలు, భారత విస్తరణవాద పీడన పాలైన జాతీయ విముక్తి ఉద్యమ శక్తులు సమైక్యం కావడానికీ, విస్తృత సమరశీల ప్రతిఘటన కొనసాగించడానికీ గొప్ప అవకాశాలు ముందుకొస్తున్నాయి. దక్షిణాసియా జ్వలిస్తున్నది. ప్రపంచంలో మౌలిక వైరుధ్యాలన్నీ తీవ్రతరమవుతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే దేశ, ప్రపంచ వస్తుగత పరిస్థితి అద్భుతంగా ఉంది.

విప్లవోద్యమంపై శత్రువు అత్యంత క్రూరంగా కొనసాగిస్తున్న ప్రతీఘాతుక దాడి వాడి రాజకీయ దివాళాకోరుతనాన్నే రుజువు చేస్తున్నది. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌నే గాకుండా పాలకవర్గాలు ప్రజాఉద్యమాలకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రతి పథకమూ ప్రజల ప్రతిఘటనతో అభాసుపాలై పోయింది, విఫలమైపోయింది. ప్రజాఉద్యమాలకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత సైన్యం, పారా మిలటరీ, ప్రత్యేక పోలీసు బలగాల్ని దించి రక్తపుటేరులు పారించినా

అవి పూర్తిగా సమసిపోలేదు. కాశ్మీర్, మణిపూర్, గూర్ఖాలాండ్, తెలంగాణా తదితర ప్రజాఉద్యమాలు ఆరని మంటల్లా రగులుతూనే ఉన్నాయి.

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని పోరాట ప్రాంతాలలోని పీడిత ప్రజానీకం అత్యంత ద్వేషంతో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దేశవ్యాప్తంగా చాలా తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. ఈ ప్రతిఘటన ఫలితంగా ప్రజలు చారిత్రాత్మక లహిరి, సరండ, సింగన్‌మడుగు, గయ, ఔరంగాబాద్, సిల్దా, తాడిమెట్ల సైనిక పోరాటాలనూ, లాల్‌గఢ్, నారాయణపట్న, కందమాల్ సమరశీల ప్రజాఉద్యమాలను సృష్టించుకున్నారు. గ్రీన్‌హంట్‌ని దేశంలోని పీడిత ప్రజలూ, మావోయిస్టు విప్లవకారులు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఫాసిస్టు పాలకులు, సామ్రాజ్యవాదులు కొనసాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కి వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధమే దేశ ప్రజల సమీకరణ శక్తిగా ఉంది. అంతేగాకుండా ఈ దాడిని అంతర్జాతీయంగా కార్మికవర్గ విప్లవ శక్తులు, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు వ్యతిరేకిస్తున్నాయి. నేటి సామాజిక దిశను నిర్దేశిస్తున్న వీరంతా వివిధ రూపాలలో మన ప్రజాయుద్ధ పురోగమనానికి తోడ్పడుతున్నారు.

కామ్రేడ్స్,

మన ప్రియతమ అమరవీరులు ఏకతా కాంగ్రెస్ నిర్ణయించిన కేంద్ర కర్తవ్యం పరిపూర్తి చేయడానికి తమ సర్వస్వాన్ని త్యాగం చేసి ఆ బాధ్యతను మనపై ఉంచి వెళ్లారు. గొప్ప త్యాగాలు లేకుండా ప్రపంచంలో ఏ విప్లవమూ విజయం సాధించలేదు. అమరుల త్యాగాలు వృధా కావు. ఇది విప్లవాలయుగం. ఇది త్యాగాల - విజయాల యుగం. నేడు విప్లవం మనల్ని పెద్ద విజయాలు సాధించడానికి మరిన్ని త్యాగాలకు సిద్ధం కమ్మంటోంది. విజయ సాధనకు తెగించి పోరాడేలా అమరులు మనని పురికొల్పుతున్నారు. పోరాడ సాహసించిన ప్రజలు-మావోయిస్టులు అజేయులని చరిత్ర చాటి చెప్పుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో అమరుల రక్తంతో ఎరుపెక్కిన అంతర్జాతీయ కార్మికవర్గ జెండా చేబూని మహోన్నత లక్ష్యంతో వారు నడిచిన ప్రజాయుద్ధ బాటలో దృఢసంకల్పంతో పురోగమించండి!

మన మార్గం ఎంత కష్టభరితంగా ఉన్నా, మలుపులు మెలికలతో కూడి ఉన్నా భవిష్యత్తు అత్యంత ఆశాజనకంగా, అద్భుతంగా ఉంది. మన పార్టీ నాయకత్వంలో ప్రజలు పోరాడుతున్నారు. వారు మన పార్టీపై ఎంతో నమ్మకంతో ఉన్నారు. మనపై గొప్ప చారిత్రక బాధ్యత ఉంది. అంతిమ విజయం మనదే-పీడిత ప్రజలదే !

కామ్రేడ్స్,

అమరవీరుల సంస్మరణ వారాన్ని విప్లవ స్ఫూర్తి ఉట్టిపడేలా ఊరూరా దేశవ్యాప్తంగా ఘనంగా జరపండి. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను భూస్థాపితం చేసే రాజకీయ కర్తవ్యాన్ని చేబూని ఊపిరిసలపని నిర్బంధం నడుమ అడుగడుగునా శత్రువును ఎదుర్కొంటూ అమరులైన

కామ్రేడ్స్ అంకితభావన, ధైర్యసాహసాలు, సృజనాత్మకత, కమ్యూనిస్టు విలువలు, త్యాగనిరతిని ఎత్తిపట్టండి. ఆదర్శవంతమైన అమరవీరుల జీవితచరితలను ప్రచురించండి. ఊరూరా అమరుల స్థూపాలను నిర్మించండి. కరపత్రాలు పంచడం, వాల్‌పోస్టర్లు వేయడం, వాల్ రైటింగ్స్ రాయడం, బ్యానర్లు కట్టడం తదితర రూపాల్లో సృజనాత్మక పద్ధతుల్లో ప్రభావవంతంగా అమరుల గురించి విస్తృతంగా ప్రచారం చేయండి. అమరుల ఆదర్శాలను ఎలుగెత్తి చాటేలా సభలు-సమావేశాలు నిర్వహించండి. పార్టీ, ప్రజా విముక్తి గెరిల్లా సేన, ప్రజా నిర్మాణాలు, ప్రజల్లో విప్లవోత్తేజం నింపేలా అమరుల సంస్మరణ వారం విజయవంతం చేయండి.

ఈ సంవత్సరం మనం అమరులను సంస్మరించుకునే సందర్భంగా వారి ఆశయ సాధనకు నేటి నిర్దిష్ట పరిస్థితులలో ఈ కింది కర్తవ్యాలను నెరవేర్చడానికి మన పొలిటికల్ బ్యూరో యావత్తు పార్టీకీ, పి.ఎల్.జి.ఏ.కూ, ప్రజానిర్మాణాలకూ, ప్రజలకూ పిలుపునిస్తున్నది.

* నేలకొరిగిన వీరుల స్థానాలను భర్తీ చేయడానికీ, పెద్ద సంఖ్యలో నూతన వారసులను తయారు చేయటానికీ పార్టీని సైద్ధాంతికంగా, రాజకీయంగా సంఘటితపరచండి ! అసంఖ్యాక నూతన సభ్యులను భర్తీ చేయండి ! అనవసర నష్టాలను నివారించండి ! కార్మికవర్గేతర ధోరణులు వదిలించండి !
* ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని ఓడించటానికి అసంఖ్యాకంగా లాహిరి, సరండా, సిల్దా, తంగినిగూడ, తాడిమెట్లలను సృష్టించండి ! అసంఖ్యాకంగా ప్రజలను కదిలించండి !
* భారత పాలకవర్గాలను, సామ్రాజ్యవాదులను ప్రజాప్రభంజనంతో తుడిచిపెట్టడానికి అసంఖ్యాకంగా కళింగనగర్, నందిగ్రాం, లాల్‌గఢ్, నారాయణపట్నలను సృష్టించండి!
* ప్రజాపునాదిని బలోపేతం చేయడానికి పార్టీ రాజకీయ పంథాను, వర్గపంథాను, ప్రజాపంథాను అంటిపెట్టుకొని ఉండండి !

విప్లవాభివందనాలతో,
పొలిట్‌బ్యూరో,
సి.పి.ఐ.(మావోయిస్టు)

**1 జూన్ 2010**

## దోపిడి పాలకవర్గాల ఆపరేషన్ గ్రీన్ హంట్ (ప్రజలపై యుద్ధం)కు వ్యతిరేకంగా

## కొనసాగుతున్న ప్రజాయుద్ధంలో అసువులు బాసిన

# అమరవీరుల త్యాగాలను ఎత్తిపట్టండి!
# అమరుల ఆశయాల వెలుగులో
# ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయండి!

**ప్రియమైన కామ్రేడ్స్,**

ఈ భూమిపై సోషలిజం-కమ్యూనిజం లక్ష్యసాధనలో భాగంగా భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై పోరాడుతూ గత సంవత్సర కాలంలో 225 మందికి పైగా మన పార్టీ నాయకులు-సభ్యులు, పిఎల్‌జిఏ కమాండర్లు, పోరాటయోధులు, వివిధ ప్రజా నిర్మాణాల నాయకులు-సభ్యులు, ప్రజా మిలీషియా యోధులు, విప్లవ-సాధారణ ప్రజానీకం తమ అత్యంత విలువైన ప్రాణాలను ప్రజల కోసం ధారపోశారు. భారత విప్లవ మహోపాధ్యాయులు, మన పార్టీ నిర్మాతలు, ప్రియతమ నాయకులు కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ్ ఛటర్జీలు రూపొందించిన దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గంలో నేలకొరిగిన ఈ కామ్రేడ్స్ అందరికీ మన పార్టీ కేంద్రకమిటీ వినమ్రంగా జోహార్లు అర్పిస్తోంది. కామ్రేడ్ చారు మజుందార్ అమరత్వం చెందిన రోజైన జులై 28 నుంచి వారం రోజుల పాటు మన ప్రియతమ అమరవీరుల స్మృతిలో సంస్మరణ వారాన్ని ప్రతి యేడాది లాగానే ఘనంగా జరపాలని పార్టీకి, పిఎల్‌జిఏకూ, విప్లవ ప్రజా ప్రభుత్వాలకు, విప్లవ ప్రజా సంఘాలకు, ప్రజలకు పిలుపు నిస్తున్నది.

భారతదేశంలో విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల నిర్దేశకత్వంతో, వారి పూర్తి మద్దతుతో చేపట్టిన ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా సాహసిక పిఎల్‌జిఏ బలగాలు నిర్వహించిన చారిత్రాత్మక ముకరం (తాడిమెట్ల-2) ఆపరేషన్ దెబ్బకు భారత పాలకవర్గాలు కంగుతిన్నాయి. అయితే కొద్దికాలంలోనే ఏపి ఎస్ఐబి కుక్కల వేటలో మన ప్రియతమ నాయకుడు, పార్టీ అధికార ప్రతినిధి కామ్రేడ్ ఆజాద్ (రాజకుమార్), పత్రికా విలేకరి హేంచంద్ర పాండేలు అమరులయ్యారు. తర్వాత పాలకవర్గాలు ఆపరేషన్ గ్రీన్ హంట్ (ప్రజలపై యుద్ధం) 2వ దశను ఆరంభించి తమ విప్లవ ప్రతీఘాతుక దాడిని మరింత తీవ్రతరం చేశాయి. ఈ దాడిని వీరోచితంగా తిప్పికొట్టే క్రమంలో, ప్రజాయుద్ధాన్ని నూతన ప్రాంతాలకు విస్తరించే క్రమంలో అనేక మంది కామ్రేడ్స్ మన దేశంలోని విశాలమైన అడవుల్లో, మైదానాల్లో, పట్టణాల్లో తమ నులివెచ్చని నెత్తురు పారించారు. ఇందులో దండకారణ్యంలో 81 మంది, బీహార్-ఝార్ఖండ్-ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లో 53 మంది, ఒడిషాలో 25 మంది, ఆంధ్ర-ఒడిషా సరిహద్దు ప్రాంతంలో 16 మంది, పశ్చిమ బెంగాల్‌లో ఐదుగురు, ఛత్తీస్‌గఢ్-ఒడిషా సరిహద్దులో 9 మంది,

మహారాష్ట్రలో ముగ్గురు కామ్రేడ్స్, ఉత్తర తెలంగాణలో ఒక కామ్రేడ్ ఉన్నారు. వీరిలో 25 మందికి పైగా మహిళా కామ్రేడ్స్ ఉన్నారు. వీరు విప్లవ లక్ష్యంలోనే త్యాగం యిమిడి వుందని, మృత్యువును ధిక్కరించి పోరాడకుండా మన లక్ష్యాన్ని సాధించలేమని గుర్తించి, దోపిడివర్గాలు 'ప్రజలపై సాగిస్తున్న యుద్ధాన్ని' ఓడించడం కోసం, ప్రజలను కాపాడడం కోసం, మొగ్గతొడుగుతున్న నూతన ప్రజా రాజ్యాధికారాన్ని మరింతగా ఎదిగించడం కోసం శత్రు బలగాలతో సాహసికంగా పోరాడుతూ ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేసే క్రమంలో తమ అసువులు బాసారు. వీరు చిందించిన రక్తం దేశం నలుమూలల్లోని విశాల ప్రజానీకానికీ, మొత్తం ప్రపంచానికి ప్రేరణ అవుతోంది. పోరాట స్ఫూర్తిని అందిస్తోంది.

మన దేశంలోని వివిధ పీడిత వర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు, దేశభక్తులు, ప్రగతిశీల సామాజిక కార్యకర్తలు, పర్యావరణ ఉద్యమకారులు, లాయర్లు, రచయితలు, కవులు, కళాకారులు, వివిధ ఎన్‌జిఓ సంస్థలు 'ప్రజలపై యుద్ధాన్ని' (గ్రీన్ హంట్) ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నా, దీన్ని దోపిడి పాలకవర్గాలు ఏమాత్రం లక్ష్యపెట్టకుండా ఆపరేషన్ 'గ్రీన్ హంట్' 2వ దశలో తమ కిరాయి పోలీసు మూకలతో, విప్లవ ప్రతీఘాతుక ముఠాలతో విచ్చలవిడి హత్యాకాండ కొనసాగించాయి. బూటకపు ఎన్‌కౌంటర్లు (డికెలో భిలాయ్, కొత్రపాల్, వాకుల్‌వాహి, తిమ్మాపూర్, పశ్చిమబెంగాల్‌లో బురుఢీ, ఝార్ఖండ్‌లో హేసియా తదితర); విప్లవోద్యమ ప్రజాపునాదిని దెబ్బతీసేందుకై గ్రామాలను చుట్టుముట్టి ప్రజలను భయభ్రాంతం చేసేలా గ్రామాల్లో, పొలాల్లో, అడవుల్లో కనిపించిన ప్రజలపై ఊచకోత నమలు జరిపాయి. సాధారణ ప్రజలపై లెక్కలేనన్నిసార్లు కాల్పులు, మోర్టార్ షెల్లింగులు (డికెలో సావర్‌గాం షెల్లింగ్) కొనసాగించాయి. వీటితో పాటు పిఎల్‌జిఏ బలగాలపై విషప్రయోగాలు (బీహార్‌లో ముంగేర్ జిల్లా గంగానది ఒడ్డున); ప్రజలపై, ప్రజా మిలీషియాపై శత్రు బలగాలు జరిపిన ఆంబుష్‌లు (డికెలో మెట్టగూడపార-సిలింగేర్, గోందుమెట్ట, బుర్గిల్, ఏఓబిలో చెరువూరు) ఎన్‌సర్కిల్‌మెంట్ దాడులు (ఉత్తర బీహార్‌లో తూర్పు చంపారన్ జిల్లాలోనూ, ఒడిషాలో కాశీపూర్‌లోనూ తదితర) మొదలైన ఘటనల్లోనే అత్యధిక కామ్రేడ్స్ అమరులయ్యారు. ఛత్తీస్‌గఢ్-ఒడిషా సరిహద్దున మహాసముంద్ జిల్లాలో పడ్కిపాలి దగ్గర విప్లవోద్యమ విస్తరణ కర్తవ్యంతో ప్రజల్లో పని చేస్తున్న పీఎల్‌జీఏ కంపెనీపై శత్రువు చేసిన ఆంబుష్‌లో ఆరుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు గ్రామస్తుల్ని కూడా శత్రువు క్రూరంగా హత్య చేశాడు.

శత్రు రహస్య హంతక ముఠాలు డికెలోని మాడ్ డివిజన్‌లో డికె ప్రెస్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ చైతెను సామూహికంగా అత్యాచారం చేసి అత్యంత క్రూరంగా హత్య గావించాయి. ఝార్ఖండ్‌లో సిమ్‌డేగా జిల్లాలో విప్లవ ప్రతీఘాతుక పిఎల్‌ఎఫ్‌ఐ (పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా) గూండా గ్యాంగులు కుడ్‌రూమ్, కోలేబిరా చౌక్, రామ్‌జోల్ బజార్ టాండ్‌లలో అనేక మంది మన పార్టీ సానుభూతిపరులను, యాక్టివిస్టు గ్రూపు కార్యకర్తలను, ధనుంజయ్ గూండా గ్యాంగులు రాంచి జిల్లాలో మన ప్లాటూన్ కమాండర్‌తో సహా మరికొందరు కామ్రేడ్స్‌ను పాశవికంగా చంపాయి.

శత్రు బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్లలో (ఝార్ఖండ్‌లోని బరంగ్‌బరు, గుమ్లా జిల్లా సామ్‌రీ, బీహార్‌లోని బాంకా జిల్లా మంజరి, తూర్పు చంపారన్ జిల్లా ధర్మాహా గ్రామంలో ఎన్‌సర్కిల్‌మెంట్ దాడి, డికెలో కుల్లెనార్ ఘటనలు) కొద్దిమంది కామ్రేడ్స్ అమరులయ్యారు. మన పిఎల్‌జిఏ బలగాలు అత్యంత ధైర్యసాహసాలతో శత్రు బలగాలపై సాగించిన దాడుల్లో వీరోచితంగా పోరాడుతూ కొంతమంది కామ్రేడ్స్ అమరులయ్యారు. శత్రువులు కొంతమంది కామ్రేడ్స్‌ను, ప్రజలను మాయం చేశారు. కొన్ని ఇతర ఘటనలు, దుర్ఘటనలలో కొద్దిమంది కామ్రేడ్స్ అమరులయ్యారు.

అమరులైన నాయకత్వ కామ్రేడ్స్‌లో పశ్చిమబెంగాల్‌లో లాల్‌గఢ్ ప్రాంతంలో ప్రజా నాయకుడు కామ్రేడ్స్ ఉమాకాంత్ మహతో, శశధర్ మహతో, ఆర్‌సి సభ్యుడు కామ్రేడ్ అరుణ్, మరొక కామ్రేడ్ ఖోఖన్ మహతో; బీహార్‌లో బాంకా జిల్లా కటోరియా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంజరి ఎన్‌కౌంటర్‌లో అమరులైన ఆరుగురిలో ఒక నాయకత్వ కామ్రేడ్; ఒడిషాలో ప్రఫుల్ నాయక్, లక్ష్మణ్ ముండా, గాగ్రీ కడేస్కీ; బీహార్–ఝార్ఖండ్‌లో స్ట్రైకింగ్ కంపెనీ కమాండర్ కామ్రేడ్ నితాంత్ (సెంట్రల్ మిలటరీ ఇన్‌స్ట్రక్టర్), ఒడిషాలో కాశీపూర్ చుట్టివేత దాడిలో బాసధార డివిజన్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ రవి, డికెలో ఉత్తర బస్తర్ డివిజనల్ కమాండర్–ఇన్–చీఫ్ కామ్రేడ్ నాగేష్, మహారాష్ట్రలో గోందియా డివిజనల్ కమాండర్–ఇన్–చీఫ్ కామ్రేడ్ నాగేష్, ఛత్తీస్‌గఢ్‌లోని మహాసముంద్ జిల్లాలో సిసిఎం గార్డు, ప్లాటూన్ కమాండర్ కామ్రేడ్ కోసా (అయితు), డికెలో విద్యా విభాగ కమిటీలో నూతనంగా చేరనున్న విప్లవ ప్రజా టీచర్ కామ్రేడ్ చందన మొదలైనవారు వున్నారు. వీరితో పాటు సబ్‌జోన్ స్థాయిలో బి–జె–ఉ.ఛలో కామ్రేడ్స్ రాజేష్ ముండా, భూత్‌నాథ్, సలీమ్ మహతో, ప.బె.లో అరూప్ మోచి; ఏరియా కార్యదర్శి కామ్రేడ్ కిశోర్ (డికె), ప్లాటూన్ కమాండర్ కామ్రేడ్ విక్రమ్ ముండా, సెక్షన్ కమాండర్ కామ్రేడ్ రతన్ యాదవ్ (బీహార్), ఏసి/పిపిసి స్థాయిలో డికెలో కామ్రేడ్స్ చైతె, విక్రమ్, కేశాల్, మంగ్డూ; మహాసముంద్ జిల్లాలో కామ్రేడ్ నతాషా, సెక్షన్/దళ డిప్యూటీ కమాండర్లు ఇద్దరు (డికె), ఒడిషాలో మన సప్లై విభాగపు డ్రైవర్ కామ్రేడ్ బాదల్ (మధు), డికె స్పెషల్ జోన్ యాక్షన్ టీం సభ్యుడు కామ్రేడ్ ప్రభాకర్, డివిజన్ ఐటీం సభ్యుడు కామ్రేడ్ రమేష్, పిఎల్‌జిఏ (కంపెనీ, ప్లాటూన్, సెక్షన్/దళ) సభ్యులు 27 మంది (డికెలో కామ్రేడ్స్ ప్రమీల, కోసాల్‌లతో పాటు ఆరుగురు, బిజెలో కామ్రేడ్ విజయ్‌దాస్‌తో పాటు 11 మంది, ఏఓబిలో సిఆర్‌సి కంపెనీ–3 సభ్యుడు కామ్రేడ్ సందీప్, బంగారురాజు, జ్యోతితో పాటు ఐదుగురు కామ్రేడ్స్, మహాసముంద్ జిల్లాలో కామ్రేడ్స్ రాజబత్తి, లచ్చుతో పాటు నలుగురు, మహారాష్ట్రలో కామ్రేడ్స్ మంజు, మంగులతో పాటు ముగ్గురు, పశ్చిమబెంగాల్‌లో కామ్రేడ్ జీవన్ టుడు); గ్రామ విప్లవ ప్రజా కమిటీ అధ్యక్షుడు కామ్రేడ్ రామాల్ (ఎన్‌టి), కెకెసి కార్యదర్శి కామ్రేడ్ రామాధార్ (బీహార్), సంఘ నాయకులు – ఏఓబిలో కామ్రేడ్స్ సీతన్న, సింగాల్ బీహార్‌లో కామ్రేడ్ ధరందేవ్, కెఏఎంఎస్ సీనియర్ నాయకురాలు కామ్రేడ్ విమల దేవిదాస్ కన్నాకే (డికె), జన్ మిలీషియా దళ కమాండర్ కామ్రేడ్ కోర్సా సుక్కాల్ (డికెలో), జన్ మిలీషియా సభ్యులు డికెలో ఎనిమిది మంది, ఝార్ఖండ్‌లో ఇద్దరు, యాక్టివిస్టు గ్రూపు కార్యకర్తలు

ముగ్గురు (ఝార్ఖండ్), గ్రామ రక్షణ ప్రజా మిలీషియా సభ్యులు 11 మంది (ఏఓబి–ఆరుగురు, డికె–ఐదుగురు) ఉన్నారు.

మన పిఎల్‌జిఏ బలగాలు శత్రువుపై చేసిన దాడుల్లో బీహార్‌లో కజరా ఆంబుష్‌లో సెక్షన్ కమాండర్ కామ్రేడ్ రతన్ యాదవ్, దండకారణ్యంలో ఊసూర్ ఆంబుష్‌లో ఓయం బుద్రు, వెట్టి హిడ్మాల్, మోర్‌పల్లి ఆంబుష్‌లో సెక్షన్ డిప్యూటీ కామ్రేడ్ ముచాకి గంగా, బెజ్జి ఆంబుష్‌లో మన పిఎల్‌జిఏ బెటాలియన్‌లో పిపిసిఎం, కమ్యూనికేషన్ మ్యాన్ కామ్రేడ్ మంగ్డూ, మహారాష్ట్రలో కోబ్రామెంద (గోందియా) ఆంబుష్‌లో గోందియా డివిజనల్ కమాండర్–ఇన్–చీఫ్ కామ్రేడ్ నాగేష్, పిఎల్‌జిఏ సభ్యులు కామ్రేడ్స్ మంజు, మంగు, మరో కామ్రేడ్, నార్గొండ (గడ్చిరోలి)లో ప్రజా శత్రువు, పరమ కర్కోటకుడు అయిన చిన్నా వెంటన్ని ఖతం చేసిన వీరోచిత చర్యలో ఇద్దరు కామ్రేడ్స్ ప్లటూన్–7 కమాండర్ కామ్రేడ్ మహరు, సభ్యుడు కామ్రేడ్ రాకేష్ నేలకొరిగారు. సులంగి ఆంబుష్‌లో ఒక కామ్రేడ్ అమరుడయ్యాడు.

మరో 50 మందికి పైగా సాధారణ, నిరాయుధ విప్లవ ప్రజలు డికె, బి–జె–ఉ.ఛ., లాల్‌గఢ్, ఒడిషాలలో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న 'ప్రజలపై యుద్ధం'లో బలయ్యారు. వీరిలో లాల్‌గఢ్ ప్రజా తిరుగుబాటులో భాగస్వాములైన ఆదివాసీ ప్రజలు, ఒడిషాలో విస్థాపన వ్యతిరేక ఉద్యమంలో ముందు పీఠిన నిలిచిన ఆందోళనకారులు, డికె, బి–జె–ఉ.ఛ.లలోని విప్లవ సానుభూతిపరులు, ప్రజలు ఉన్నారు. వీరందరినీ 'మావోయిస్టులు' అనే పేరుతో పోలీసు, పారామిలటరీ బలగాలు, పశ్చిమబెంగాల్‌లో హర్మద్ వాహిని, గణ ప్రతిరోధ్ కమిటీ గూండాలు, దండకారణ్యంలో కోయ కమాండోలు, ఎస్‌పిఓలు, సల్వాజుడుం గూండాలు హత్య చేశారు. లాల్‌గఢ్ ప్రాంతంలో పాలైబని, సియర్‌బని–కొత్వాలీ, తౌగ్‌వేదా–భూలావేదా, బందర్‌బోనీ, ఝూర్‌గ్రామ్, నేతాయి గ్రామాల్లో హర్మద్ వాహిని గూండాలు; కొటాలీ–జమీర్‌దంగా, పట్‌గజా, గోజ్‌రా–బారీకుల్, హైన్‌హాదుగీ–బారీకుల్ గ్రామాల్లో గణ ప్రతిరోధ్ కమిటీ గూండాలు; మరికొన్ని చోట్ల కేంద్ర–రాష్ట్ర సంయుక్త బలగాల వూచకోతలు; దండకారణ్యంలో కుట్రెం, రంగయ్యగూడ, కొత్తపల్లి, కొలార్, మడప, గురుగుట్ట, గోరుకొండ, సింగన్నగూడ, హిరోలి, ముదుంగ, మోర్‌పల్లి, తిమ్మాపూర్, కేశ్ముండి, చినారి, మన్కేలి, పుల్లుం, మెచానార్ వూచకోతలు ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఇవన్నీ 2010 ఆగస్టు నుంచి 2011 జూన్ మధ్య జరిగిన ఘటనలే.

అలాగే అనేక దశాబ్దాలుగా ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం ప్రజల పక్షాన నిలిచి పోరాడిన విప్లవ మేధావులు, పౌరహక్కుల ఉద్యమ నాయకులు కామ్రేడ్స్ కన్నబీరన్, పత్తిపాటి వెంకటేశ్వర్లు, ఆర్.ఎస్.రావు (సోమేశ్వరరావు) తదితరులు తుదిశ్వాస విడిచారు. వీరి అమరత్వం ప్రజాస్వామిక ఉ ద్యమాలకు తీరని లోటు.

మరోవైపు దేశంలో రోజు రోజుకూ పెరుగుతున్న బలవంతపు విస్థాపిత సమస్యకు వ్యతిరేకంగా ప్రజలు మిలిటెంట్ పోరాటాలకు దిగుతూ ఫాసిస్టు పోలీసుల కాల్పుల్లో అనేక మంది కళింగనగర్

(ఒడిషా), సోంపేట, కాకర్లపల్లి (ఏపి), జైతాపూర్ (మహారాష్ట్ర), భట్టా–పర్సోల్ (యు.పి.) వంటి చోట్ల నేలకొరిగారు. అలాగే యాంటీ మైనింగ్ ఉద్యమ కార్యకర్తలు ఒడిషాలోని కోరాపుట్ ప్రాంతంలో గంగుల్ తరంగీ, ఎం.సుబ్బారావు, బరగడలో మాధవ్ సింగ్ ఠాకూర్, రమేష్ సాహులను, డికెలో రావుఘాట్ మైనింగ్ వ్యతిరేక కార్యకర్త సనావు కుమెటీలను పట్టుకొని తీవ్ర చిత్రహింసలు పెట్టి హతమార్చారు. ఈ విస్థాపన వ్యతిరేక ఉద్యమంలో క్రియాశీల భాగస్వామ్య వహిస్తూ వాటికి నేతృత్వం వహిస్తున్న క్రమంలోనే ఒడిషాలో జాజ్‌పూర్ జిల్లాలోనూ, నియంగిరి ప్రాంతంలో కాశీపూర్‌లోనూ పోలీసు హత్యాకాండలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ రవితో సహా 14 మంది కార్యకర్తలు నేలకొరిగారు. విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో శత్రువు తలపెట్టిన దేశవ్యాప్త దాడిని ఓడించడంలో భాగంగా ప్రజాయుద్ధాన్ని నూతన ప్రాంతాలకు విస్తరింపజేసే వ్యూహాత్మక కర్తవ్యాన్ని చేపట్టి అమరులైన నియంగిరి, మహాసముంద్ ప్రాంతాల కామ్రేడ్స్ త్యాగాలు అమూల్యమైనవి.

ఆపరేషన్ గ్రీన్ హంట్‌లో భాగంగా ప్రస్తుత రెండవ దశలో శత్రు కిరాయి పోలీసు, పారామిలటరీ మూకల, విప్లవ ప్రతీఘాతుక ముఠాల పాశవికత మరింత పెరిగిందనేది స్పష్టం. ముందు పేర్కొన్న వివిధ ఘటనలతో పాటు దండకారణ్యంలో చింతల్‌నార్ హత్యలు–అత్యాచారాలు, గృహదహనాలు–లూటీలు, లాల్‌గఢ్ ప్రాంతంలో నేతాయి గ్రామంలో సిపిఎం గూండాలు, కేంద్ర–రాష్ట్ర సంయుక్త బలగాల అండతో సాగించిన నరసంహారం ఇందుకు ప్రత్యక్ష తార్కాణం. చింతల్‌నార్ ప్రాంతంలో మోర్‌పల్లి, తాడిమెట్ల, పులన్‌పాడ్, తిమ్మాపూర్ గ్రామాల్లో కోబ్రాలు, కోయ కమాండోలు, సల్వాజుడుం గూండాలు ఆరు రోజుల పాటు సాగించిన తెల్ల బీభత్సం (ముగ్గురి హత్య, ఆరుగురు మహిళలపై సామూహిక అత్యాచారం, కోట్లాది రూపాయలు విలువ చేసే ఆస్థులు, ధాన్యంతో కూడిన 300 ఇళ్ల లూటీ, అనంతరం దహనం), ఆ ప్రాంతానికి బయట నుంచి ఎటువంటి మద్దతు అందకుండా వారాల తరబడి పోలీసు, పారామిలటరీ బలగాల, కోయ కమాండోల దిగ్బంధం విప్లవ ప్రతీఘాతుక దాడి తీవ్రతకు అద్దం పడతాయి. దీనిని దేశవ్యాపితంగా ప్రజాస్వామికవాదులు తీవ్రంగా నిరసించారు. ఇలాగే నేతాయిలో సోషల్ ఫాసిస్టు సిపిఎం గూండాల నరసంహారానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో పెద్దయెత్తున ఆందోళన సాగింది. అంతేకాక వందలాది మంది స్థానిక ప్రజాసంఘాల, విప్లవ ప్రజా ప్రభుత్వాల కార్యకర్తలను, ప్రజలను అరెస్టు చేసి నల్లచట్టాలు మోపి జైలుపాలు చేస్తున్నారు. ప్రత్యేకించి, మన పార్టీ నాయకత్వాన్ని దెబ్బతీయడంలో భాగంగా శత్రు ఇంటెలిజెన్స్ కుక్కల వేటలో ఈ సంవత్సరం ఏప్రిల్ 29న ముగ్గురు కేంద్రకమిటీ సభ్యులు, జూన్ నెలలో పీబీఎం కామ్రేడ్ భూపేష్ దా, అనేక మంది ఇతర నాయకత్వ కామ్రేడ్స్, కార్యకర్తలు శత్రు చేత జిక్కారు. వీరిని జీవితాంతం జైలులో బంధించడం కోసం వీరిపై వివిధ రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో కేసులు మోపారు. ఒక్కమాటలో చెప్పాలంటే, దేశవ్యాప్తంగా శత్రువు 'ప్రజలపై సాగిస్తున్న యుద్ధం' ఫలితంగా ప్రజల బతుకులు అల్లకల్లోలమవుతున్నాయి.

అడుగడుగునా శత్రు దమనకాండను తిప్పికొడుతూ పోరులో నేలకొరిగిన వందలాది కామ్రేడ్స్

ప్రజాస్వామిక–కమ్యూనిస్టు చైతన్యంతో ప్రదర్శించిన సాహసం, వీరత్వం, పాటించిన విలువలు, నెలకొల్పిన ఆదర్శాలు, త్యాగ సాంప్రదాయాలు, అందించిన విలువైన అనుభవాలు మన విప్లవ మార్గాన్ని కాంతివంతం చేశాయి. అమరుల సంస్మరణ వారాన్ని పురస్కరించుకొని మన ప్రియతమ నాయకులు, త్యాగమూర్తులు కామ్రేడ్స్ సి.ఎం., కె.సిలనూ, నక్సల్బరీ నుండి నేటి వరకూ అమరులైన వేలాది మంది జ్ఞాత, అజ్ఞాత అమరులందరినీ తలచుకుంటూ కేంద్రకమిటీ బరువెక్కిన గుండెలతో వినమ్రంగా తలవంచి నివాళులర్పిస్తున్నది. వారి ఆశయ సాధనకు తుదివరకూ అవిశ్రాంతంగా పోరాడ శపథం చేస్తున్నది. ఈ సందర్భంగా అమరుల బంధు మిత్రులందరికీ, సహచరులందరికీ ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ వారి సంవేదనలో పాలుపంచుకుంటున్నది. అమరులులేని లోటును పూడ్చాలని వారి ప్రియ సహచరులందరినీ కోరుతున్నది. క్షతగాత్రులైన కామ్రేడ్స్ ప్రదర్శించిన గొప్ప చైతన్యాన్ని చూసి అభినందిస్తూ వారు త్వరగా కోలుకొని వుద్యమంలో క్రియాశీలంగా పాలుపంచుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నది. శత్రువు చేతజిక్కినప్పటికీ క్రూరమైన చిత్రహింసలకు వెరవకుండా అత్యంత ధైర్యాన్ని, త్యాగనిరతిని ప్రదర్శించిన , అమానుష పరిస్థితులలో సైతం జైళ్లను వర్గపోరాట కేంద్రాలుగా మలుస్తున్న సాహసిక కామ్రేడ్సందరికీ మన సి.సి. హార్దికాభినందనలు తెలియజేస్తున్నది. దేశవ్యాప్తంగా ఆపరేషన్ గ్రీన్ హంట్ దమనకాండకు గురైన లక్షలాది ప్రజల బాధలో పాలుపంచుకుంటున్నది. తమ కష్టాలకు, కన్నీళ్లకు, బాధలన్నింటికీ కారణమైన శత్రువుకు వ్యతిరేకంగా ప్రజలు మరింత వర్గకసితో దృఢంగా అంతిమ విజయం సాధించేవరకూ పోరాడాలని కోరుతున్నది.

ప్రపంచవ్యాపితంగా చూస్తే ఈ సంవత్సరం అరబ్బు ప్రపంచం తిరుగుబాట్లతో దద్దరిల్లుతోంది. వీటికి విప్లవ నాయకత్వం లేకపోయినప్పటికీ లక్షలాది మంది అరబ్బు ప్రజలు నిరంకుశత్వానికీ, అవినీతికీ, నిరుద్యోగానికీ వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం కోసం అమెరికా సామ్రాజ్యవాదుల తొత్తు పాలకవర్గాలకు వ్యతిరేకంగా మిలిటెంట్‌గా పోరాడుతున్నారు. ఈ ప్రజా తిరుగుబాట్లలో వేలాది మంది ప్రజలు, ప్రజా నాయకులు నేలకొరిగారు. వివిధ దేశాలలో ప్రజాస్వామ్యం కోసం, జాతి విముక్తి కోసం, వర్గ దోపిడీ పీడనల నుండి విముక్తి కోసం సామ్రాజ్యవాదానికి, అన్ని రకాల ప్రతీఘాతుకత్వానికి వ్యతిరేకంగా పోరాడే క్రమంలో నేలకొరిగిన వీరయోధులందరినీ అమరవీరుల సంస్మరణవారం సందర్భంగా స్మరించుకొని నివాళులర్పిద్దాం.

**కామ్రేడ్స్,**

మన పార్టీ ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ పిలుపు మేరకు మన కేంద్ర కర్తవ్య సాధనలో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో గెరిల్లా యుద్ధం తీవ్రతరం అవుతోంది. మన అమరవీరుల మహత్తర త్యాగాల ఫలితంగా మనం ప్రజాయుద్ధంలో ఒక్కొక్క విజయాన్ని సాధిస్తూ పురోగమిస్తున్నాం. అమరుల త్యాగాలు లేకుండా పార్టీ చేపట్టిన రాజకీయ, సైనిక, సాంస్కృతిక, నిర్మాణ, ఉత్పత్తి, ప్రజా సంక్షేమం, నూతన ప్రాంతాల్లోకి, రంగాల్లోకి విస్తరణ వగైరా క్యాంపెయిన్లను, అవి సాధించిన

సత్ఫలితాలను ఊహించలేం. పోలీసు, పారా మిలటరీ, కమాండో బలగాల సంఖ్యను పెంచుతూ ఉద్యమ ప్రాంతాలను కార్పెట్ సెక్యూరిటీతో నింపి ఉద్యమాన్ని గొంతు నులిమివేయాలని శత్రువు ఎన్ని కుట్రలూ, కూహకాలూ పన్నుతున్నప్పటికీ ఉద్యమంలో చొరవను మన చేతిలో నిలబెట్టడంలో అమరుల త్యాగాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. విప్లవోద్యమాన్ని పరిమితమైన ప్రాంతాల్లో కుదించివేసి నిర్మూలించాలని శత్రువు ప్రయత్నిస్తూ దేశంలోని విశాల నూతన ప్రాంతాలకు మనల్ని విస్తరించకుండా అడ్డుకోవడం కోసం పర్‌స్పెక్టివ్ ప్రాంతాలలో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను బలంగా ఏర్పర్చుకుంటున్నాడు. అయినప్పటికీ మన విస్తరణ బలగాలు శత్రువుతో బాహాబాహీ పోరాడుతూ, కఠోరమైన గెరిల్లా యుద్ధంలో చేస్తున్న అమూల్యమైన త్యాగాలు, ప్రజాయుద్ధాన్ని సజీవంగా నిలపడంలో తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి.

శత్రువు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించేందుకు మన పార్టీ, సైనిక కమీషన్లు, కమాండ్లు చేపట్టిన ఎత్తుగడల ఎదురుదాడులు ఈ కాలంలో చిన్న, మధ్యస్థాయిలో జరిగాయి. ప్రత్యేకించి గత సంవత్సరం బీహార్‌లో జరిగిన కజరా (లఖీసరాయి) ఆంబుష్, సరండాలో శత్రు దాడిని విఫలం చేసిన మన కౌంటర్ ఆపరేషన్, ఈ సంవత్సరం ఝార్ఖండ్‌లో తీవ్ర నిర్బంధం మధ్యనే లోహర్‌దగా జిల్లా ధర్‌ధరియా అడవుల్లో మన పిఎల్‌జిఏ అత్యంత సాహసంగా నిర్వహించిన ఆంబుష్, దండకారణ్యంలో మోర్‌పల్లి (చింతల్‌నార్) ఆంబుష్, బోర్‌గూడా నైట్ ఆంబుష్ (కేర్లాపాల్), అమామోరా (గరియాబంద్) ఆంబుష్, ఝూరాఘాటీ ఫ్రంటల్ అటాక్, గాటం వద్ద ఎంపివిపై నైట్ ఆంబుష్, బెజ్జి క్యాంపు సమీపంలోనే ఆంబుష్, కిరందుల్ నైట్ ఆంబుష్, సులంగి (కోయిలీబేడ) ఆంబుష్ మొదలైన ఘటనలు శత్రు దూకుడుతనానికి కళ్లెం వేశాయి. ప్రత్యేకించి, శత్రువు దండకారణ్యంలోని నారాయణపూర్ జిల్లాలో సైన్యాన్ని మోహరించే ప్రక్రియ వేగిరపరుస్తున్న తరుణంలో ఈ దాడులు జరగడం దోపిడీ పాలకవర్గాలను, శత్రు బలగాలను తీవ్రంగా కలవరపరిచాయి. అలాగే ఝార్ఖండ్‌లో వేలాది శత్రు బలగాలు సైన్యం తరహాలో మన కేంద్ర క్యాంపులపై జరిపిన దాడుల్ని మన పిఎల్‌జిఏ బలగాలు అత్యంత వీరోచితంగా తిప్పికొట్టాయి.

మరోవైపు లాల్‌గఢ్, నారాయణపట్నా ఉద్యమాలు తీవ్ర నిర్బంధంలో సైతం శత్రువుకు తలవంచకుండా మిలిటెంట్‌గా కొనసాగుతూ మరింతగా అభివృద్ధి అవుతున్నాయి. రాజ్య వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు రాజ్యాధికార స్వాధీనం కోసం సరియైన పంథాను చేపట్టి దీర్ఘకాల ప్రజాయుద్ధంలో భాగమయ్యాయి. ఇదే మార్గంలో ఒడిషాలో కళింగనగర్, నియంగిరి, మాలి–దేవమాలి, దండకారణ్యంలో లోహండిగూడ, రావుఘాట్, బోధ్‌ఘాట్, పల్లెమాడి, ఏపిలో సోంపేట, కాకర్లపల్లి, విశాఖ జిల్లాలో బాక్సైట్ గనుల తవ్వకాలకు, దుమ్రిగూడాలో చైనా మట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా విస్థాపన వ్యతిరేక పోరాటాలు మరింత ముందుకు పురోగమిస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఆందోళన రోజు రోజుకూ విశాల ప్రజా రాశుల పునాదిపై బలోపేతం అవుతూ మిలిటెంట్‌గా పురోగమిస్తోంది. అనేక మంది ప్రజలు తమ గుండెనెత్తుర్లు ధారపోస్తూ పోరాడిన ఫలితంగానే ఇది సాధ్యమైంది.

ఇటీవలి కాలంలో పెద్దఎత్తున విప్లవ శక్తుల భాగస్వామ్యంతో సాగిన ఇటువంటి సింగూర్, నందిగ్రామ్, కళింనగర్ పోరాటాలు, లాల్‌గఢ్, నారాయణపట్నా ప్రజా తిరుగుబాట్ల స్ఫూర్తితో విస్థాపన వ్యతిరేక పోరాటాలు దేశంలో అనేక ప్రాంతాల్లో రగుల్గొంటున్నాయి. సామ్రాజ్యవాదుల, వారి తొత్తు దోపిడి పాలకవర్గాల ధనికవర్గ–కార్పొరేట్ 'అభివృద్ధి నమూనా'ను ప్రజలు ఎక్కడికక్కడ వ్యతిరేకిస్తూ ఆందోళనలకు దిగుతున్నారు. ఇలాంటి పోరాటాలు ఎక్కడ బద్దలైనా వీటికీ మావోయిస్టులకు వున్న లింకును పసిగట్టే పనిలో ఇంటెలిజెన్స్ జాగిలాలు వాటి చుట్టూ తిరుగుతూ, వాటికి మావోయిస్టు రంగును పులిమేందుకు ప్రయత్నిస్తున్నాయంటే మావోయిస్టులంటే దోపిడీ పాలకవర్గాలు ఎంతగా కలవరపడుతున్నాయో అర్థమవుతుంది. మరోవైపు మావోయిస్టు ప్రజాయుద్ధం దేశంలోని ప్రజాస్వామికవాదులను, ప్రగతిశీల శక్తులను ఎంతగానో ఉత్సాహపరుస్తోంది. మన అమరవీరుల త్యాగాలే వీరికి ప్రేరణనందిస్తున్నాయి.

**కామ్రేడ్స్,**

భారత దళారీ పాలకవర్గాలు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, సామ్రాజ్యవాద అనుకూల, విస్తరణవాద, ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక, అభివృద్ధి నిరోధక ఆర్థిక, రాజకీయ, సామాజిక, పర్యావరణ విధానాలకు అడ్డుగా నిలిచిన విప్లవోద్యమాన్ని రూపుమాపడం కోసం ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో 'ప్రజలపై ప్రతీఘాతుక యుద్ధాన్ని' రుద్దడంతో దేశంలో సామాజిక వైరుధ్యాలన్నీ మరింత పదునెక్కుతున్నాయి. దీనివల్ల మావోయిస్టు శక్తులు, ప్రగతిశీల ప్రజాస్వామిక శక్తులు, దేశభక్త శక్తులు, జాతుల విముక్తి ఉద్యమ శక్తులు, విశాల ఆదివాసీ, దళిత, మత మైనారిటీ తదితర సామాజిక పీడిత జన సముదాయాలు సమైక్యం కావడానికీ, విస్తృత స్థాయిలో ప్రజా ప్రతిఘటనను కొనసాగించడానికి గొప్ప అవకాశాలు ముందుకొస్తున్నాయి. ఇటు దక్షిణాసియా, అటు అరబ్బు ప్రపంచం జ్వలిస్తుండడం, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో వనరుల దోపిడికీ వ్యతిరేకంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు కొనసాగడం, పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థిక సంక్షోభం ఫలితంగా అనేక పరిశ్రమల మూసివేత కారణంగా వీధుల పాలైన లక్షలాది కార్మికులు, నిరుద్యోగ యువతరం ఆందోళనలతో ప్రపంచంలో మౌలిక వైరుధ్యాలన్నీ తీవ్రతరమవుతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, దేశ, ప్రపంచ వస్తుగత పరిస్థితి అత్యద్భుతంగా ఉంది. ఇలాంటి స్థితిలో ఉద్యమాల నాయకత్వాన్ని, ప్రత్యేకించి మావోయిస్టు నాయకత్వాన్ని నిర్మూలించేందుకు శత్రువు చేసే అన్ని కుట్రలను, వ్యూహాలను, ఎత్తుగడలను తిప్పికొడుతూ నాయకత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన కర్తవ్యం మునుపెన్నటికంటే ప్రాధాన్యతను సంతరించుకుంది. శత్రువుకు అబేధ్యమైన పద్ధతిలో కార్మికవర్గతత్వంతో మావోయిస్టు ప్రజాయుద్ధ సిద్ధాంతపు గతిశీల తత్వాన్ని (డైనమిజం) లోతుగా అవగాహన చేసుకుంటూ కమిటీ పని పద్ధతులు, క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ మనల్ని కాపాడుకుంటూ, శత్రువును నిర్మూలించడంలో మన పార్టీ మొత్తం విప్లవ శ్రేణులకు ఆదర్శంగా నిలబడాలి. రహస్య పనిపద్ధతులు, నియమాలు దృఢంగా అమలు చేయాలి. శత్రు బలాన్నీ, వాడి వ్యూహాత్మక లక్ష్యాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకోవాలి.

మారిన పరిస్థితులకు అనుగుణంగా మనం పాత ఎత్తుగడలను, పని విధానాన్ని మార్చుకొని నూతన ఎత్తుగడలను, పని విధానాన్ని రూపొందించుకోవాలి. రూపొందించుకున్న ఎత్తుగడలను, రహస్య పని విధానాన్ని అమలు జరపడంలో ఖచ్చితంగా వ్యవహరించాలి. తద్వారా నాయకత్వ నష్టాలను తగ్గించుకుంటూ అనవసర నష్టాలను నివారించగలుగుతాం.

ఉద్యమ ప్రాంతాలలో కార్పెట్ సెక్యూరిటీ అండతో దూకుడుగా దాడికి వస్తున్న శత్రు బలగాల చొరవను దెబ్బతీసే విధంగా ప్రజాపునాదిపై ఆధారపడి పథకం ప్రకారం నిరంతరం చిన్న, మధ్యస్థాయి, పెద్ద చర్యల్ని కొనసాగిస్తూ గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం–విస్తృతం చేయాలి. విజయానికి హామీ ఉండే విధంగా చర్యల పథకాలు రూపొందించుకోవాలి. యుద్ధచర్యల్లో సృజనాత్మకంగా కంబాట్ స్కిల్స్‌ను, ఆయుధాలు, గ్రెనేడ్లు, మైన్లు, కాక్‌టైల్స్ వంటివి సమన్వయిస్తూ వినియోగించాలి. గెరిల్లా యుద్ధానికి అండగా సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక, ప్రభుత్వ వ్యతిరేక, రాజ్యహింస వ్యతిరేక ప్రజా పోరాటాలను, ఆందోళనలను తీవ్రతరం చేయాలి. ప్రజా ఆందోళనలను సాయుధ ప్రతిఘటనా పోరాటాలుగా అభివృద్ధి చేయాలి. విప్లవోద్యమానికి ప్రజాపునాది లేకుండా చేసి నిర్మూలించాలనే శత్రు ఎల్ఐసి మోసపు యుద్ధాన్ని ప్రజల్లో బహిర్గతం చేయాలి. ప్రజలను జాగరూకుల్ని చేసి విప్లవోద్యమం చుట్టూ విశాల ప్రజాపునాదిని బలోపేతం చేయాలి. పార్టీ, ప్రజాసైన్యంతో పాటుగా ఐక్యసంఘటనకు తగిన ప్రాముఖ్యత నిచ్చి నాలుగు వర్గాల ప్రజలను వివిధ ఆందోళనలలో సమీకరిస్తూ ఎత్తుగడలపరమైన ఐక్యవేదికలను నిర్మిస్తూ, బలోపేతం చేస్తూ వ్యూహాత్మక ఐక్యసంఘటన నిర్మాణానికి పునాదులు వేయాలి. వ్యూహాత్మక ఐక్యసంఘటనా రూపం అయిన విప్లవ ప్రజా కమిటీ (ఆర్‌పిసి)లను గ్రామస్థాయి నుంచి నిర్మించి బలోపేతం చేయాలి. ఉన్నతస్థాయి ఆర్‌పిసి కమిటీలను నిర్మిస్తూ భారతదేశ వ్యాప్తంగా విప్లవ ప్రజా కమిటీలను పునాదిగా చేసుకొని వ్యూహాత్మక ఐక్యసంఘటనను నిర్మించే దిశగా ముందుకు సాగాలి.

**కామ్రేడ్స్,**

మన ప్రియతమ అమరవీరులు ఐక్యతా కాంగ్రెస్ నిర్ణయించిన కేంద్ర కర్తవ్యం పరిపూర్తి చేయడానికి తమ సర్వస్వాన్ని త్యాగం చేసి ఆ బాధ్యతను మనపై ఉంచి వెళ్లారు. గొప్ప త్యాగాలు లేకుండా ప్రపంచంలో ఏ విప్లవమూ విజయం సాధించలేదు. అమరుల త్యాగాలు వృధా కావు. ఇది విప్లవాల యుగం. నేడు విప్లవం పెద్ద విజయాలు సాధించడానికి మనల్ని మరిన్ని త్యాగాలకు సిద్ధం కమ్మంటోంది. అందుకు అమరవీరులు మనల్ని పురికొల్పుతున్నారు. పోరాడ సాహసిస్తే ప్రజలు అజేయులని చరిత్ర చాటి చెబుతోంది. అత్యద్భుతంగా ఉన్న విప్లవ పరిస్థితులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ, అమరుల రక్తంతో ఎరుపెక్కిన అంతర్జాతీయ కార్మికవర్గ జెండాను చేబూని ప్రజాయుద్ధ బాటలో దృఢసంకల్పంతో పురోగమిద్దాం!

**కామ్రేడ్స్,**

అమరవీరుల సంస్మరణ వారాన్ని విప్లవ స్ఫూర్తి ఉట్టిపడేలా దేశవ్యాప్తంగా ఊరూరా ఘనంగా జరపండి. ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను భూస్థాపితం చేసే రాజకీయ కర్తవ్యాన్ని చేబూని, మన అమరవీరుల అంకిత భావన, ధైర్యసాహసాలు, సృజనాత్మకత, కమ్యూనిస్టు విలువలు, త్యాగనిరతిని ఎత్తిపడుతూ అడుగడుగునా శత్రువును ఎదుర్కొనండి. ఆదర్శవంతమైన అమరవీరుల జీవిత చరిత్రలను ప్రచురించండి. ఊరూరా అమరుల స్థూపాలను నిర్మించండి. కరపత్రాలు పంచడం, వాల్‌పోస్టర్లు వేయడం, వాల్ రైటింగ్, బ్యానర్లు కట్టడం తదితర రూపాల్లో సృజనాత్మకంగా అమరుల త్యాగాల గురించి విస్తృతంగా ప్రచారం చేయండి. వారి ఆదర్శాలను ఎలుగెత్తి చాటేలా సభలు–సమావేశాలు నిర్వహించండి. పార్టీ, పిఎల్‌జిఏ, ప్రజా నిర్మాణాలు, విప్లవ ప్రజల్లో ఉత్తేజాన్ని నింపేలా అమరవీరుల సంస్మరణ వారాన్ని విజయవంతం చేయండి.

ఈ సంవత్సరం అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా, వారి ఆశయ సాధనకు నేటి నిర్దిష్ట పరిస్థితుల్లో ఈ కింది కర్తవ్యాలను నెరవేర్చడానికి మన సిసి యావత్తు పార్టీకీ, పిఎల్‌జిఏకూ, ప్రజా నిర్మాణాలకూ, ప్రజలకూ పిలుపు నిస్తోంది.

- ★ విప్లవోద్యమానికి ప్రజాపునాది లేకుండా చేసి నిర్మూలించాలనే శత్రు ఎల్ఐసి మోసపు యుద్ధాన్ని ప్రజల్లో బహిర్గతం చేసి విశాల ప్రజల్ని కూడగడ్తూ ప్రజాపునాదిని బలోపేతం చేయండి!
- ★ నేలకొరిగిన వీరుల స్థానాల భర్తీకి, పెద్దయెత్తున నూతన వారసులను తయారు చేయడానికి, పిఎల్‌జిఏను పిఎల్ఏగా అభివృద్ధి చేసే లక్ష్యంతో పార్టీని, పిఎల్‌జిఏను సైద్ధాంతికంగా, రాజకీయంగా, సైనికంగా సంఘటితపరచండి. కార్మికవర్గేతర ధోరణులను వదిలించుకోవడానికి మావోయిస్టు గతిశీల (డైనమిక్) తత్వాన్ని అభివృద్ధి చేయండి. కార్మికవర్గ క్రమశిక్షణతో, రహస్య పని విధానాన్ని అమలు చేస్తూ అనవసర నష్టాలను నివారించండి! త్యాగాలకు వెరవకండి!
- ★ ఆపరేషన్ గ్రీన్ హంట్‌ని ఓడించడానికి ముకరం–తాడిమెట్ల, కొంగెర, మమాయిల్, సిల్దా, బైఫరిగూడా (మంత్రియాంబ), లఖీసరాయ్–కజరా, సరండా కౌంటర్ ఆపరేషన్, లొహర్‌దగ్గ–ధర్‌ధరియా, అమామోరా, గాటం, బోర్‌గూడా వంటి ఎత్తుగడల ఎదురుదాడులను ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున సాగించండి!
- ★ ప్రజల ఆకాంక్షల మేరకు అనన్య త్యాగాలు చేస్తూ మావోయిస్టు ప్రజాయుద్ధాన్ని విశాల ప్రాంతాలకు విస్తరింపజెయ్యండి!
- ★ సామ్రాజ్యవాదుల, భారత పాలకవర్గాల దోపిడి పీడనలను తుడిచిపెట్టడం కోసం లాల్‌గఢ్, నారాయణపట్నా, కళింగనగర్, నియంగిరి, సోంపేట, పోస్కో వ్యతిరేక గోవిందపూర్–ధింకియా వంటి ప్రజా ప్రభంజనాలను సృష్టించండి. రాజ్యాధికార లక్ష్యంతో వాటిని పురోగమింపజేయండి!

విప్లవాభినందనలతో,

**కేంద్రకమిటీ,**

తేది : 28-6-2011 **సి.పి.ఐ. (మావోయిస్టు)**

## అమరవీరుల ఆశయసాధనకు ప్రజాయుద్ధమార్గంలో దృఢసంకల్పంతో పురోగమించండి !

## మోసపూరిత శత్రు ఎల్ఐసీ పాలసీని అర్థం చేసుకుని , దాన్ని ఓడిస్తూ నాయకత్వాన్నీ, స్వీయాత్మక శక్తులనూ రక్షించుకుందాం !

## పార్టీని బలోపేతం చేస్తూ ప్రజాయుద్ధాన్ని పురోగమింప చేద్దాం !





*2012 జులై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారాన్ని*
*విప్లవ స్ఫూర్తితో జరపాలని పార్టీ శ్రేణులకూ, పిఎల్జిఎ*
*కమాండర్లకూ-యోధులకూ, విప్లవ ప్రజానీకానికీ*
*కేంద్రకమిటీ, సిపిఐ (మావోయిస్టు) పిలుపు*

**ప్రియమైన కామ్రేడ్స్ !**

మన పార్టీ నిర్మాతలు, గొప్ప నాయకులు, అమరులు కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ్‌చటర్జీలు నిర్దేశించిన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో పయనిస్తూ, భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై, సోషలిజం, అంతిమంగా కమ్యూనిజం స్థాపనకై అకుంఠిత దీక్షతో కృషి చేస్తున్న క్రమంలో గత జులై 28 నుండి ఇప్పటివరకు దాదాపు నూట యాభైకి పైగా కార్మికవర్గ ఉత్తమ పుత్రికలు, పుత్రులు, సాధారణ ప్రజానీకం అత్యంత విలువైన తమ ప్రాణాలను అర్పించారు. వీరిలో అనేకులు ప్రభుత్వ సాయుధ బలగాలు సాగించిన బూటకపు ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయారు. మన ప్రియతమ అమరులందరికీ మన పార్టీ కేంద్రకమిటీ వినమ్రంగా అరుణారుణ జోహార్లు అర్పిస్తూ వారి ఆశయసాధనకు పునరంకితమౌతోంది. మన ప్రియతమ అమరుల స్మృతిలో 2012 జులై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణవారాన్ని వారి త్యాగాల్ని సమున్నతంగా ఎత్తిపడుతూ, వారి ఆశయసాధనకై ప్రతినపూనుతూ విప్లవ స్ఫూర్తితో జరపాలని పార్టీకీ, పిఎల్‌జిఎకీ, విప్లవకర ప్రజాకమిటీలకూ (ఆర్పీసీలు), ప్రజాసంఘాలకూ, విప్లవ ప్రజానీకానికీ పిలుపునిస్తున్నది. అమరులను స్మరించుకుని నివాళి అర్పించడం, వారి కలల్ని సాకారం చేయడానికి పునరంకితమవ్వడం, వారి స్ఫూర్తిని మది నిండా నింపుకుని మన లక్ష్య సాధనకై మరింత దృఢంగా పురోగమించడం కోసం మనం పాటించే ఈ విప్లవ స్మృతిదినాలు ఏకకాలంలో అపరిమిత దు:ఖాన్నీ, అనంతమైన స్ఫూర్తినీ, గురుతరమైన బాధ్యతనీ కూడా అందిస్తాయి. దు:ఖాన్ని అధిగమిస్తూ, వారి స్ఫూర్తిదాయకమైన జీవితాల నుండి, ఆచరణ నుండి నేర్చుకోవడానికీ, వారి మహోన్నత ఆశయ సాధనకు దీక్ష బూనడానికి దోహదపడే విప్లవకర సందర్భంగా అమరవీరుల సంస్మరణ వారాన్ని పాటించడానికై శత్రువు కల్పించే అన్ని రకాల కష్టాలనూ, అడ్డంకులనూ అధిగమిద్దాం. యుద్ధంలో ఒరిగిన ఆ వీరులు అందించిపోయిన ఎర్రజెండాను ఒక చేత్తో ఎత్తిపడుతూ, మరోచేత ప్రజాయుద్ధంలో తుపాకులను ఎక్కుపెడుతూ దృఢదీక్షతో ముందుకు అడుగేద్దాం !

అత్యంత ప్రతీఘాతుక స్వభావం కలిగిన భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి అండతో, మార్గదర్శకత్వంతో, సహాయ సహకారాలతో కొనసాగిస్తున్న దేశవ్యాప్త బహుముఖ దాడి ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండవ దశ రోజురోజుకూ మరింత భయానకంగా, బీభత్సకరంగా, ప్రజలకు అత్యంత పీడాకరంగా

మారుతుండగా, దాన్ని వీరోచితంగా ప్రతిఘటిస్తూ మన ప్రియతమ అమరులు నేలకొరిగారు. మునుపెన్నటికంటే తీవ్రంగా కొనసాగుతున్న ఈ బహుముఖ సైనికదాడి నుండి ప్రజాయుద్ధ విజయాలను కాపాడుకోవడానికి, ప్రజలనూ, పార్టీనీ, ప్రజాసైన్యాన్నీ, గెరిల్లాజోన్‌లలో మొలకెత్తిన, నిలదొక్కుకుంటున్న నూతన ప్రజాస్వామిక అధికార అంగాల్నీ, గెరిల్లా బేసులను రక్షించుకోవడానికీ, విస్తరింపజేయడానికీ, నూతన ప్రాంతాలకు ప్రజాయుద్ధాన్ని విస్తరించడానికీ కృషి చేస్తున్న క్రమంలోనే మెజారిటీగా వీరంతా శత్రువుతో తల వంచకుండా తలపడుతూ, ప్రజాయుద్ధ చరిత్రకు నూతన త్యాగపూరిత అధ్యాయాల్ని చేరుస్తూ అసువులు బాసారు. కొందరు ప్రమాదాల్లోనూ, అనారోగ్య కారణాలతోనూ ప్రధానంగా శత్రు నిర్బంధం వల్లనే వైద్యసేవలు అందక తుదిశ్వాస విడిచారు. కొందరు శత్రు చిత్రహింసల్లో, కారాగారాల్లో మరణించారు. ఏ విధంగా మరణించినప్పటికీ వారందరి ఆశయం, నిస్వార్థపూరిత ఆచరణ, త్యాగాలు మన దేశప్రజలను, ప్రపంచ పీడిత మానవాళిని సకల దోపిడీ పీడనల నుండి విముక్తి గావించడం కోసమే. అందుకే వారి మరణం హిమాలయాల కంటే ఉన్నతమూ, స్మరణీయమూ అయ్యింది.

ఈ 2012 అమరవీరుల సంస్మరణ వారం మనకు ప్రత్యేకించి మరింత దు:ఖాన్నీ, అదే సమయంలో అత్యంత స్ఫూర్తిదాయకమైన అమరుని స్మృతులనూ తట్టిలేపేదిగా వున్నది. భారతదేశ విప్లవోద్యమ నాయకుడూ, ప్రజాయుద్ధ సేనానీ, మన పొలిట్‌బ్యూరో సభ్యుడూ, పీడిత ప్రజలకు ఆప్తుడూ అయిన కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వర్లు అలియాస్ కిషన్‌జీ 2011 నవంబర్ 24న కేంద్ర - బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు, బెంగాల్ ఎస్‌ఐబి సహా కేంద్ర ఇంటలిజెన్స్ సంస్థలు పన్నిన కుట్రకు బలై బూటకపు ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసారు. సోనియా-మన్మోహన్-చిదంబరం-ప్రణబ్ ముఖర్జీ-జయరాం రమేష్‌ల ఫాసిస్టు పాలక ముఠా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో కుమ్మక్కయ్యి చేసిన ఈ హత్య భారత విప్లవోద్యమానికి తీరని నష్టాన్ని కలుగజేసింది.

ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లా పెద్దపల్లి పట్టణంలో 1954లో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన కామ్రేడ్ కోటేశ్వర్లు 38 ఏండ్ల సుదీర్ఘ విప్లవ జీవితంలో ఆర్గనైజర్ స్థాయి నుండి పొలిట్‌బ్యూరో సభ్యుని స్థాయి వరకు ఎదిగి విశేష ప్రజాదరణ కలిగిన నేతగా ప్రజల హృదయాల్లో చిరస్థాయినొందారు. ఆంధ్రప్రదేశ్, దండకారణ్యం, బెంగాల్, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో ఆయన కార్యకలాపాలు సాగాయి. ఉద్యమాన్ని మలుపు తిప్పే,

పురోగమింపజేసే అనేక నిర్ణయాలు తీసుకునే ఉన్నత స్థాయి కమిటీల్లోని (రాష్ట్ర, కేంద్ర) ఒక కీలకమైన సభ్యునిగా పార్టీలో అనేక ముఖ్యమైన బాధ్యతల్లో వుండి ఆయన నిర్వహించిన పాత్ర గొప్పది. సృజనాత్మకతతో, విప్లవ నిబద్ధతతో కూడకున్నది. పార్టీలో తలెత్తిన అవకాశవాదానికి వ్యతిరేకంగా పార్టీ పంథా వైపు దృఢంగా నిలిచి రెండు పంథాల మధ్య పోరాటాన్ని నిర్వహించడంలో, మార్క్సిజం-లెనినిజం-మావోయిజంతో పార్టీ క్యాడర్‌కు సైద్ధాంతికంగా, రాజకీయంగా శిక్షణ గరిపి పార్టీని పటిష్టవంతం చేయడంలో ఆయన తన వంతు పాత్రను శ్లాఘనీయంగా నిర్వహించారు. విముక్తిప్రాంత లక్ష్యంతో ఉత్తర తెలంగాణ, దండకారణ్యాలను గెరిల్లా జోన్‌లుగా ఎదిగించడంలో, ప్రజాసైన్యమైన పిఎల్‌జిఎ నిర్మాణంలో, ఉత్తర, తూర్పు భారతాల్లో విప్లవోద్యమ విస్తరణ, ఎదుగుదలల్లో, బీజప్రాయంగా మొలకెత్తి ఎదుగుతున్న నూతన ప్రజాస్వామిక అధికార నిర్మాణంలో, విప్లవ శక్తులను ఐక్యం చేసి పార్టీని బలోపేతం చేయడంలో, విదేశీ విప్లవ సంస్థలతో సౌహార్ద సంబంధాల నెరపడంలో, లాల్‌గఢ్ ప్రజాతిరుగుబాటు వెల్లువను సృష్టించడంలో ఆయన నిర్వహించిన విశిష్టమైన, స్ఫూర్తిదాయకమైన పాత్ర సదా స్మరణీయం. పార్టీ నాయకునిగా ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడానికి తను పని చేసిన ప్రాంతాలన్నిటా ఆయన అహర్నిశలూ కృషి చేశారు. విప్లవ ప్రచారంలో, విప్లవ సాహిత్యం, పత్రికల ప్రచురణలో ఎల్లప్పుడూ విశేష కృషి చేసి పార్టీ క్యాడర్లకు, భారతదేశ ప్రజలకు విప్లవ రాజకీయాలను అందించి వారిని ఆచరణలోకి దించారు. తన కలాన్ని పీడిత ప్రజల విముక్తికి అంకితం చేసి రచనలు, అనువాదాలు చేశారు. ఆయన మరణానంతరం విప్లవ ప్రజలు, పార్టీలు, మేధావుల నుండి, వివిధ సెక్షన్ల ప్రజల నుండీ, దేశంలోని అనేక ప్రాంతాల నుండి, అంతర్జాతీయంగానూ వెలువడిన అపూర్వ స్పందనలు ఆయనను హతమార్చడంలో భారత పాలకవర్గాల కుట్రను తీవ్రంగా ఖండిస్తూ, ఒక గొప్ప నాయకునికి తగిన రీతిలో నివాళులర్పించాయి. అత్యంత పాశవికమైన, క్రూర చిత్రహింసలకు గురి చేసి తమ ప్రియతమ నేతను పొట్టన పెట్టుకున్న పాలకవర్గాలపై మన పార్టీ, పిఎల్‌జిఎ, విప్లవ ప్రజానీకం కసి ఇనుమడించింది. ఆయన లేని లోటు భారత విప్లవోద్యమానికి పూడ్చుకోలేనిదే అయినా, ఆయనా, వేలాదిమంది అమరుల త్యాగఫలితంగా ఎదిగిన ఉద్యమం, పెంపొందిన పార్టీ, ప్రజాసైన్యం, వారు అందించిపోయిన వెలకట్టలేని అనుభవాలు, నెలకొల్పిన విప్లవాదర్శాలు మరెందరో కామ్రేడ్ కిషన్‌జీ వంటి నేతలు ముందుకు వస్తారనడానికి హామీగా నిలుస్తున్నాయి. కామ్రేడ్ కిషన్‌జీ తన జీవితంలో, సుదీర్ఘ విప్లవాచరణలో, మరణంలో సైతం నెలకొల్పిన అత్యున్నతమైన

ఆదర్శాలనూ, విలువలనూ ఎత్తిపడదాం, మన ఆచరణలో అడుగడుగునా వాటిని భాగం చేసుకుంటూ ముందుకు సాగుదాం.

ఈ ఏడాదికాలంలో మనం ఇద్దరు రాష్ట్రస్థాయి నాయకులను, ఒక ఆర్‌సి స్థాయి అసోం లీడింగ్ కమిటీ కామ్రేడ్‌నూ కోల్పోయాం. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ హరక్ (శ్రీకాంత్) గుండె సంబంధిత తీవ్ర అనారోగ్యంతో 2012 ఫిబ్రవరి 26న తన 48వ ఏట అమరుడు కాగా, ఉత్తర తెలంగాణ ఎస్‌జెడ్‌సి సభ్యుడు కామ్రేడ్ గుండేటి శంకర్ (శేషన్న) పాముకాటుతో మార్చి 18న 47 ఏడేళ్లకే అకాల మరణం చెందాడు. రెడ్‌ఫ్లాగ్ పార్టీ నుండి మన పార్టీలోకి 1993లో చేరిన కామ్రేడ్ శ్రీకాంత్ ఛత్తీస్‌గఢ్‌లోని పట్టణ, మైదాన ప్రాంతాల్లో కార్మిక, యువజన, సాంస్కృతిక, విద్యార్థి రంగాల్లో పని చేశారు. 1998 నుండి దండకారణ్యంలోని గడ్చిరోలి డివిజన్‌లో పని చేస్తూ 2005లో డికెఎస్‌జెడ్‌సిలోకి ఎన్నికయ్యారు. చివరి వరకు గడ్చిరోలి డివిజన్ ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ అక్కడి ప్రజలకు ప్రియతమ నాయకుడయ్యాడు. తీవ్రమైన గుండెజబ్బుతో బాధపడ్తున్నా ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ క్యాడర్‌కు ప్రేమాస్పదుడైనాడు. డికె జోన్ రాజకీయ పత్రిక ప్రభాత్ సంపాదకమండలిలో ఉంటూ పత్రికా, ప్రచార రంగాల్లో కృషి చేశారు. ఉత్తర తెలంగాణ ఉద్యమాన్ని పునరుద్ధరించేందుకు అలుపెరుగని కృషిలో నిమగ్నమై వున్న సమయంలోనే 30 ఏండ్ల ఉద్యమానుభవం గల కామ్రేడ్ శేషన్న పాముకాటుకు గురై అకాల మరణం పొందడం పార్టీకి, ప్రత్యేకించి ఉత్తర తెలంగాణ ఉద్యమానికి తీరని నష్టం. దళసభ్యుడి స్థాయి నుండి రాష్ట్ర నాయకుడిగా ఎదిగి అనేక శత్రు నిర్బంధ క్యాంపెయిన్‌ల మధ్యనే ప్రజలనంటి పెట్టుకుని నిలబడ్డ ధీరుడు ఆయన. అనేక విప్లవ రచనలు, ముఖ్యంగా అమరుల గురించి ఆయన చేశారు. రాజకీయ, మిలటరీ, ప్రచార రంగాల్లో కృషి చేస్తూ క్యాడర్‌కు, ప్రజలకు మార్గదర్శకత్వం వహిస్తుండిన కామ్రేడ్ శేషన్న లేని లోటు ఉత్తర తెలంగాణ ఉద్యమానికి తీవ్రమైనదే అయినప్పటికీ ఆ పోరుగడ్డ మరింతమంది శేషన్నలను తయారు చేసుకుంటుందనేది చరిత్రలో నిరూపితమైన వాస్తవం.

బీహార్-ఝార్ఖండ్-ఉత్తర ఛత్తీస్‌గఢ్ స్పెషల్ ఏరియాలో పోలీసులతో జరిగిన సమరాల్లో దాదాపు 30 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. పిఎల్‌ఎఫ్‌ఐ, ఝార్ఖండ్ జనముక్తి పరిషద్ వంటి విప్లవ ప్రతీఘాతుక సాయుధ ముఠాల దాడుల్లో కొందరు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ స్పెషల్ ఏరియా విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించడానికి భారత పాలకవర్గాలు

ఇతర విప్లవోద్యమ ప్రాంతాలలోవలెనే ఓ వైపు సైనికదాడిని మున్నెన్నటికంటే తీవ్రతరం చేస్తూనే, మరోవైపు సంస్కరణలనూ-మానసిక యుద్ధాన్నీ అమలు చేస్తూ అక్కడి అపార ఖనిజ, అటవీ, జల, భూ సంపదలను లూటీ చేయడానికి మార్గాన్ని సుగమం చేసుకునే ప్రయత్నాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. అత్యంత ప్రతీఘాతుక 'సరండా యాక్షన్ ప్లాన్' ఇందులో భాగమే. ఇలాంటి ప్రభుత్వ అణచివేత పథకాల్ని వీరోచితంగా ప్రతిఘటిస్తూ అక్కడి ఆదివాసీ తదితర పీడిత ప్రజానీకం పార్టీ, పిఎల్‌జిఎ నాయకత్వంలో పురోగమిస్తున్నారు. బి-జె లో అమరులైన యోగేంద్ర ఓరావ్, పంచమ్ పాశ్వాన్, గులాచ్ ముండా, భాగబత్ మరాండీ, శ్రీ కృష్ణ మహతో, తాపేశ్వర్ గంజా, అనిల్ రాం మొదలైన కామ్రేడ్స్ అందరూ అక్కడి ప్రజలకు మాత్రమే చెందాల్సిన సహజ సంపదలను కాపాడుతూ, అక్కడ మొలకెత్తుతున్న ప్రజా రాజ్యాధికారాన్ని పరిరక్షిస్తూ శత్రువుతో సమరాల్లో అసువులు బాసారు.

తూర్పు రీజనల్ బ్యూరో ప్రాంతాలైన బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాల్లో నిర్బంధం తీవ్రరూపం దాల్చింది. బెంగాల్లో కామ్రేడ్  కిషన్‌జీని పట్టుకొని చంపడమే కాక, మరి ముగ్గురు కామ్రేడ్స్‌ను లాల్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్స్ పేరిట చంపివేశాయి ప్రభుత్వ బలగాలు. విప్లవోద్యమం విస్తరించి, బలోపేతం అవుతున్న అసోం రాష్ట్రంలోని టిన్‌సుకియాలో సైన్యం, పారామిలటరీ, రాష్ట్ర పోలీసులు 2012 మేలో జరిపిన ఒక బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఏకంగా నలుగురు కామ్రేడ్స్‌ను పొట్టన పెట్టుకుని తమ క్రూరత్వాన్ని చాటుకున్నారు. గత కొద్దిరోజులుగా అసోంలో, దాని సరిహద్దుల్లో మావోయిస్టు ఉద్యమ విస్తరణ గురించి ఇల్లెక్కి రచ్చ చేస్తున్న పి.చిదంబరం ఆఖరికి ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌తో తన రక్తదాహం తీర్చుకున్నాడు. ఆ నలుగురిలో ఒకరు అక్కడి నాయకత్వ కమిటీ లీడింగ్ టీం కామ్రేడ్ సిద్ధార్థ బుర్గోహెయిన్. మిగతా ముగ్గురూ కామ్రేడ్స్ రాజీవ్ గొగోయ్, అరుప్ చేతియా, కమలా గొగోయ్. దీనికన్నా మునుపు అసోంలోనే ఒక మిలటరీ యాక్షన్ సందర్భంగా కామ్రేడ్ పావెల్ అనే కమాండర్ అమరుడయ్యాడు. భారత విప్లవోద్యమంలోనే గాకుండా దక్షిణాసియాలో ఈశాన్య పీడిత జాతుల, విప్లవోద్యమాల వ్యూహాత్మక ప్రాధాన్యత రీత్యా ఈ నష్టాలు మనకు తీవ్రమైనవే. అయితే రోజురోజుకు జాతి విముక్తి ఆకాంక్షల సాధనలో ఒక భాగంగా ప్రజల దైనందిన సమస్యలపై, పెద్ద ఆనకట్టలకూ, విస్థాపనకూ వ్యతిరేకంగా విస్తృతంగా పోరాటాల్లోకి కదులుతున్న ఈశాన్య రాష్ట్రాల ప్రజల మధ్యనుండే మరింతమంది ప్రజానాయకులు ఈ అమరుల స్ఫూర్తితో ముందుకు వస్తారనడంలో సందేహం లేదు. ఒడిశా రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ పరిధిలోని ప్రాంతంలో 2012 జనవరిలో పోలీసు మూకలు

జరిపిన కాల్పుల్లో కామ్రేడ్ మీటు (ఎసి సభ్యుడు) అమరుడయ్యాడు. ఒడిశా రాష్ట్రంలో ప్రతిఘటనా చర్యలు కొనసాగించడానికి వెళ్లిన 2వ మధ్య రీజనల్ కంపెనీకి చెందిన కామ్రేడ్ ఉంగాల్ 2012 జనవరి 4న యాక్సిడెంటల్ మైన్ పేలుడులో అమరుడు కాగా, కామ్రేడ్ రవి 2011 డిసెంబర్‌లో అనారోగ్యంతో అమరుడయ్యాడు.

దండకారణ్యంలో నేతనార్ సమీపంలో అక్టోబర్ 11న శత్రు బలగాలపై జరిపిన ఒక ఆంబుష్ క్రమంలో కాంగేర్‌ఘాటీ ఎల్‌జిఎస్ కమాండర్ కామ్రేడ్ మహేశ్ వీరమరణం పొందాడు. ఆగస్టు 16న తూర్పు బస్తర్‌లో తిర్క గ్రామంలో కామ్రేడ్స్ బద్రు, గోపి, ఆకాశ్, రాంసాయ్‌లు శత్రు చుట్టివేతను వీరోచితంగా ప్రతిఘటిస్తూ ఒక ఎస్‌టిఎఫ్ జవానును హతమార్చి అమరులయ్యారు. పాశవిక పోలీసులు వారున్న ఇంటిని దిగ్బంధనం చేసి పెద్దెత్తున గ్రెనేడ్స్ వేసి చివరికి నిప్పు పెట్టారు. 2012 మార్చి 26న ఛెజ్జి సమీపంలో పీఎల్‌జిఏ చేసిన ఆంబుష్‌లో శత్రు బలగాలతో సాహసికంగా పోరాడుతూ కామ్రేడ్స్ పాక్లు, మంగ్లి అమరులయ్యారు. పశ్చిమ బస్తర్ యాక్షన్ టీం కమాండర్ కామ్రేడ్ ప్రమోద్ ప్రజాశత్రువైన రాజ్‌కుమార్ తావెూను హతమార్చే ప్రయత్నంలో బాడీగార్డ్ జరిపిన కాల్పుల్లో అమరుడయ్యాడు. మరి కొందరు కామ్రేడ్స్ ప్రతిఘటనలో భాగంగా, ఇతర కారణాల రీత్యా అమరులయ్యారు.

దండకారణ్యంలోని ఉత్తర బస్తర్ ఉద్యమంలో, పిఎల్‌జిఎలో చాలాకాలంపాటు పని చేసి 2010 నుండి మధ్య భారతంలో విప్లవోద్యమ విస్తరణ కర్తవ్యాన్ని నెరవేరుస్తున్న క్రమంలోనే 2012 జనవరి 27న ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు రాష్ట్ర ఉద్యమ డివిజనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ మంగు పద్దాం (సుక్కు) ఛత్తీస్‌గఢ్‌లోని రాయగఢ్ జిల్లాలో శత్రువుతో పోరాడుతూ అసువులు బాసాడు. విస్తరణ ఉద్యమానికి ఇది ఒక పెద్ద నష్టం.

ఉత్తర తెలంగాణలో కామ్రేడ్స్ సుక్కాల్ (ఎసియం), సోమాల్ (మిలీషియా)లను ఖమ్మం జిల్లాలోని చర్లలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపివేశారు. కామ్రేడ్ సుతారి పాపారావు (ఎల్‌జిఎస్ కమాండర్) ఖమ్మం జిల్లా సాయన్నపల్లి ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసారు.

ఈ సంవత్సర కాలంలో ఎంతో విలువైన కొందరు మహిళా కామ్రేడ్స్ అమరులైనారు. పార్టీలో 28 ఏళ్లుగా ఎపి రాష్ట్రకమిటీకీ, కేంద్రకమిటీకి చెందిన టెక్నికల్ రంగంలోనూ, దండకారణ్యంలో టైలర్‌గానూ తన సేవలనందించిన కామ్రేడ్ స్వరూప (సునీత) 2012 మార్చిలో రొమ్ము క్యాన్సర్‌తో మరణించింది. సుదీర్ఘకాలం టెక్ రంగంలో ఉన్నప్పుడు పార్టీ

ఉన్నతస్థాయి నాయకత్వాన్ని కంటికి రెప్పలా కాపాడిన అజ్ఞాత, నిస్వార్థ ప్రజాసేవకురాలు ఆమె. తన మొత్తం విప్లవ జీవితంలో అనారోగ్యం, జీవిత సహచరులను కోల్పోవడం, పితృస్వామ్యం, ఒంటరితనం వంటి అనేక సమస్యలను అమరవీరుల స్ఫూర్తితో, బోల్షవిక్ పట్టుదలతో అధిగమించిన కామ్రేడ్ స్వరూప ఒక ఆదర్శంగా నిలుస్తుంది. 2011 ఆగస్టు 20న దండకారణ్యంలోని గడ్చిరోలిలోని మాకడ్‌చువ్వ గ్రామంలో కామ్రేడ్ రాంకో హిచ్చామి (రణిత) ఒంటరిగా శత్రు దిగ్బంధంలో చిక్కుకున్నప్పటికీ ఏ మాత్రం వెరవక అసమాన ధైర్య సాహసాలతో తన .303 రైఫిల్‌తో ముగ్గురు కోబ్రా/సి-60 కమాండోలను మట్టుబెట్టి మరో నలుగురు జవాన్లను గాయపరిచి వీరమరణం పొందింది. ఒక బెటాలియన్ సంఖ్యలో సాయుధ బలగాలనూ, వేలాది తూటాలనూ, డజన్ల కొద్దీ చేతిబాంబులనూ, మోర్టార్ షెల్స్‌నూ ఉపయోగించినా మొక్కవోని పట్టుదలతో ఆమె వాటినన్నిటినీ ఎదుర్కొంటూ అనేక గంటలపాటు శత్రువును నిలువరించి నష్టపరిచింది. చాద్‌గాం ఏరియా జనతన సర్కార్ అధ్యక్షురాలైన కామ్రేడ్ రణిత ప్రజాయుద్ధ, నూతన ప్రజాస్వామిక వ్యవస్థ ఆవిర్భావ చరిత్రలో తన పేరిట ఒక వీరోచిత ఘట్టాన్ని రక్తాక్షరాలతో నమోదు చేసుకున్న సాహసి, పీడిత జన ప్రియపుత్రిక. ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు ఉద్యమానికి చెందిన మైన్‌పూర్ డివిజన్‌లో 31-5-2012న జరిగిన ఎదురుకాల్పుల్లో కామ్రేడ్స్ సమీర, అమీల, అరుణలు అమరులయ్యారు. కామ్రేడ్ సమీరది ఆంధ్రప్రదేశ్‌లోని నల్గొండ జిల్లా. ఎపి రాష్ట్ర నాయకత్వ రక్షణ ప్లాటూన్‌లో పని చేసి ఆ కాలంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లలో తన ప్రాణాలను ఒడ్డి నాయకత్వాన్ని కాపాడ్డానికి ప్రయత్నించిన సాహసి. 2009 నుండి దండకారణ్య ఉద్యమంలో భాగమై తూర్పు బస్తర్‌లో మహిళా రంగంలో విశేష కృషి చేసింది. తర్వాత మైన్‌పూర్ డివిజన్‌లోని గోబ్రా ఎల్‌ఓఎస్ ప్రాంతంలో పీడిత ప్రజలకు అత్యంత ఆప్తురాలైన నాయకురాలిగా, ఏసియస్‌గా ఎదిగింది. దండకారణ్యంలో పుట్టి విప్లవ పాఠాలు నేర్చిన కామ్రేడ్ అరుణ మైనపూర్ ప్రజల-పార్టీ నమ్మకం చూరగొన్న సీనియర్ ఏసియం కాగా, కామ్రేడ్ అమీల దండకారణ్యంలో ఉన్నప్పుడే గొప్ప కళాకారిణి, ఎన్నో వాగ్దానాలను నెరవేర్చగల శక్తి కలిగిన చురుకైన ఏసియం. మధ్యభారతంలో విప్లవోద్యమ విస్తరణలో కీలకపాత్ర వహించే మైన్‌పూర్ డివిజన్‌కు ఈ నష్టం తీరని లోటుని కల్గించింది. పార్టీకీ, ప్రజలకూ అత్యంత నమ్మకమైన, ప్రేమాస్పదులైన ఆ యువ మహిళా అమరుల స్మృతి అమరమై, అజరామరమై నిలుస్తుంది. దర్భ డివిజన్‌లో కామ్రేడ్ సోంబారి ఒక మిలటరీ యాక్షన్ సందర్భంగా కాలిపోయి మరణించడం హృదయవిదారకమైనది. ఆ యువ

సైనికురాలికి ప్రజలు, తోటి పిఎల్‌జిఎ సైనికులు ఘనంగా నివాళులర్పించారు.

కార్మికోద్యమ నేత, శ్రమజీవి కార్మిక పత్రిక సంపాదకుడు, పీడిత ప్రజల న్యాయవాది, రాజకీయ ఖైదీల విడుదలకై అవిశ్రాంతంగా కృషి చేస్తున్న నాయకుడు, సుదీర్ఘకాలంగా ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమానికి ప్రగాఢమైన సానుభూతిపరుడు అయిన కామ్రేడ్ బిఎస్ఎ సత్యనారాయణ 2012 జూన్ 22న తుదిశ్వాస విడిచారు. దాదాపు నలభై ఏళ్ల పైగా సాగిన ఆయన విప్లవ కార్యాచరణలో ఆయన కార్మికుల హక్కుల కోసం, పౌరహక్కుల కోసం, రాజకీయ ఖైదీల కోసం అందించిన సేవలు అమూల్యమైనవి, ఒక ఆదర్శంగా తీసుకుని పీడిత జన పక్షపాతులంతా ఆచరించదగినవి. మన కేంద్రకమిటీ ఆయన అమర స్మృతికి ఘనంగా, వినమ్రంగా నివాళినర్పిస్తోంది.

సాధారణ ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజా ప్రభుత్వాల కార్యకర్తలూ పోలీసు కాల్పుల్లో, పోలీసు కస్టడీలో చిత్రహింసల వల్ల మరణించిన ఘటనలూ, ఇండ్ల నుండి ఎత్తుకుపోయి బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపిన పలు ఘటనలూ ఈ ఏడాదికాలంలో కొనసాగాయి. ముఖ్యంగా 28-6-2012న దండకారణ్యంలోని బీజాపూర్ జిల్లాలో బాసగూడ ప్రాంతంలో జలియన్‌వాలాబాగ్‌ను తలపించేలా ఆదివాసీ గ్రామీణ ప్రజలపై పారామిలటరీ, కుఖ్యాత కోబ్రా, పోలీసు బలగాలు మూడువైపులా చుట్టుముట్టి జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో సార్కిన్‌గూడ, రాజుపెంట, కొత్తగూడ గ్రామాలకు చెందిన స్త్రీలు, పిల్లలు, స్కూలు విద్యార్థులు సహా 17 మంది నిరాయుధ ప్రజలు తమ నిండు ప్రాణాలను కోల్పోయారు. పదులమంది గాయపడ్డారు. సమీపంలోని ఇమ్లిపెంటలో మరో ఇద్దరు గ్రామస్తులను కూడా చంపడంతో చనిపోయినవారి సంఖ్య 19 అయ్యింది. పెరుగుతున్న శత్రు ఫాసిస్టు స్వభావానికీ, క్రూరత్వానికీ ఇది మరో నిదర్శనంగా నిలుస్తుంది. కామ్రేడ్ సోడీ నాని (మిలీషియా ప్లాటూన్ డిప్యూటీ కమాండర్) నూ, కామ్రేడ్ వెంజెం కేలు (మిలీషియా సభుడు)నీ, దక్షిణ బస్తర్‌లో చిక్‌పాల్ గ్రామ పటేల్ మడ్కామి మాసాను, పొడియామి మాసాను, తూర్పు బస్తర్ డివిజన్‌లోని ఇన్నర్ గ్రామంలో కామ్రేడ్ నేగి యాదవ్ అనే సీనియర్ ప్రజాసంఘ కార్యకర్తను, ఇంకా మరికొందరినీ దండకారణ్యంలోని వివిధ ప్రాంతాల్లో బూటకపు ఎన్‌కౌంటర్‌లలో లేదా లాకప్పుల్లో చంపివేశారు. మాడ్ ప్రాంతంలో 2012 మార్చిలో మూడు వేలమంది శత్రు పారామిలటరీ, పోలీసు బలగాలు చేపట్టిన ఆపరేషన్ హాకాలో భాగంగా తోకె గ్రామస్తుడైన డుంగ ధుర్వను దారుణంగా కొట్టి చంపేశారు. ఝార్ఖండ్‌లోని గుమ్లా జిల్లా తిర్రా గ్రామంలో ఒక టేకేదారు జరిపిన కాల్పుల్లో అకలీ దేవీ, ఆమె కొడుకు మరణించారు.

**కామ్రేడ్స్,**

రోజురోజుకూ తీవ్రతరమౌతున్న సామ్రాజ్యవాద ఆర్థిక సంక్షోభం భారతదేశ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్రమైన ప్రభావాన్ని వేస్తున్నది. తమ సంక్షోభం నుండి బయటపడ్డం కోసం సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులూ, అర్ధవలస-అర్ధ భూస్వామ్య దేశాల దళారీ పాలకులూ తమ పెట్టుబడులకూ, వనరుల దోపిడీకీ, మార్కెట్లకూ అడ్డం వచ్చే ఎటువంటి శక్తులనైనా క్రూరంగా అడ్డం తొలగించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌ల దురాక్రమణ, లిబియాలో కొనసాగించిన ప్రత్యక్ష జోక్యం అయినా, పాకిస్తాన్, సిరియాలలో కొనసాగిస్తున్న జోక్యం అయినా, ఇరాన్, ఉత్తర కొరియాలపై బెదిరింపులైనా, ఫిలిప్పీన్స్, భారతదేశాల్లో విప్లవోద్యమాల్ని క్రూరంగా అణచివేయడానికి వరుసగా ఒప్లాన్ బయానిహాన్, ఆపరేషన్ గ్రీన్‌హంట్ వంటి దేశవ్యాప్త, బహుముఖ, అత్యంత విప్లవ ప్రతీఘాతుక ఆపరేషన్‌లైనా అన్నీ వారి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసమే. అపార ఖనిజ, అటవీ, జల సంపదలకు నిలయమైన మధ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాలు వారికి ప్రత్యేక లక్ష్యాలుగా మారాయి. సామ్రాజ్యవాదులు, వారి తొత్తులు దేశవ్యాప్తంగా విచ్చలవిడిగా కొనసాగిస్తున్న వనరుల లూటీనీ, దోపిడీ పీడనలనూ అడ్డుకుంటున్న విప్లవ, ప్రజాస్వామిక, దేశభక్త శక్తులన్నిటినీ పాశవికంగా అణచివేస్తూనే, ఆ ప్రాంతాల్లో ప్రజలను సాయుధం చేస్తున్న మన పార్టీనీ, పిఎల్‌జిఎనీ, విప్లవ ప్రజా రాజ్యాధికార సంస్థలను లక్ష్యంగా చేసుకుని భారీ సైనిక దాడిని కొనసాగిస్తున్నారు.

ఈ దాడిలో మనం నాయకత్వపరంగా, స్వీయాత్మక శక్తులపరంగా తీవ్ర నష్టాల్నే చవి చూసినప్పటికీ మన బలమైన ప్రాంతాల్లో విప్లవోద్యమం నిలదొక్కుకుని శత్రువుకు తీవ్రమైన సవాలుగా నిలుస్తోంది. వివిధ ఎత్తుగడల ఎదురుదాడుల క్యాంపెయిన్‌లలో శత్రు బలగాలకు నష్టాల్ని కలిగిస్తోంది. విప్లవోద్యమం కొత్త ప్రాంతాలకూ, అంతర్గతంగా గెరిల్లా జోన్‌లలో కొన్ని చోట్లా విస్తరిస్తోంది. పార్టీని బోల్షవీకరించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నాం. వీటితో పాటు ముఖ్యంగా సైద్ధాంతికంగా, రాజకీయంగా పాలకవర్గాల బూటకపు అభివృద్ధి నమూనాను మన పార్టీ బట్టబయలు చేస్తున్నది. బీజప్రాయంగానైనా ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను దండకారణ్యం, బి-జె, బెంగాల్, ఏఓబిలలో నిర్మించి చూపింది. డికెలో డివిజన్ స్థాయి జనతన సర్కార్లు ఏర్పడి పని చేస్తున్నాయి. దేశంలో జాతి విముక్తి ఉద్యమాలకు, పీడిత ప్రజల, పీడిత ప్రజా సముదాయాల  ఉద్యమాలకు అండగా నిలుస్తూ, వారితో

కలిసి సమైక్యంగా పోరాడ్డానికి కృషి చేస్తున్నది. నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమ కాలాల నుండి నేటి వరకు ప్రభుత్వాల ఎజెండాలో పేద రైతులూ, ఆదివాసుల హక్కులకు సంబంధించిన చట్టాలుగానీ, సంస్కరణలు గానీ అన్నీ మావోయిస్టు ఉద్యమ ప్రభావాన్ని తగ్గించడం పేరుతోనే పాలకవర్గాలు చేశాయి అంటే, నేటికీ అభివృద్ధికి సంబంధించిన ఏ చర్చోపచర్చలైనా మావోయిస్టు ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనానూ, రాజకీయ, ఆర్థిక ప్రత్యామ్నాయాన్నీ చర్చించకుండా జరగడం లేదంటే మన పార్టీ రాజకీయ పంథా-ప్రజాయుద్ధ ఆచరణ ప్రాధాన్యతే అందుకు కారణం. అసమాన త్యాగాలతో, సరైన రాజకీయ ప్రత్యామ్నాయంతో దేశ పీడిత ప్రజలందరికీ ఒక ఆశాజ్యోతిగా నిలుస్తున్నందునే నేడు రాజ్యం మన పార్టీనీ, దాని నేతృత్వాన్నీ నిర్మూలించడానికి యింతగా త్వరపడుతోంది. మనపై బహుముఖ భారీ సైనిక దాడికి పాల్పడుతోంది.

మనం సాధించిన రాజకీయ విజయాలు, ప్రజాయుద్ధంలో సాధిస్తున్న పురోగమనాలు, గెరిల్లా యుద్ధం, విప్లవోద్యమాల విస్తరణ, ప్రజా రాజ్యాధికార స్థాపన-అభివృద్ధి, దేశంలోనూ, అంతర్జాతీయంగానూ మన నూతన ప్రజాస్వామిక విప్లవానికి అందుతున్న సౌహార్దత, మద్దతు ఏవైనా గానీ అమరవీరుల త్యాగాలు లేకుండా, వారు సమాజానికి అందించిన, పార్టీలో నెలకొల్పిన అత్యున్నత ఆదర్శాలు, విలువలు లేకుండా ఊహించుకోలేం. కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ్ చటర్జీల, మన వేలాది అమరవీరుల అద్భుతమైన ఆచరణ యిచ్చిన ప్రేరణతోనే, వారి త్యాగాల స్ఫూర్తితోనే మన పార్టీ అన్ని రకాల అననుకూల పరిస్థితుల్నీ అధిగమిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై పురోగమిస్తోంది.

**కామ్రేడ్స్,**

దేశంలోనూ, ప్రపంచంలోనూ రోజురోజుకూ వస్తుగత పరిస్థితులు మరింత విప్లవానుకూలంగా మారుతున్నాయి. అన్ని రకాల సామాజిక వైరుధ్యాలు పదునెక్కుతూ ప్రజలు ఉద్యమించేలా, విప్లవంలోకి మరింతగా చేరేలా చేస్తున్నాయి. ఈ అద్భుతమైన విప్లవ పరిస్థితిని వినియోగించుకుని భారతదేశంలో విప్లవాన్ని విజయం వైపుగా పురోగమింపచేయాలంటే, మన 9వ కాంగ్రెస్-ఐక్యతా కాంగ్రెస్ నిర్దేశించిన కేంద్ర కర్తవ్యం అంటే గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా, పిఎల్‌జిఎని పిఎల్ఎగా అభివృద్ధి చేసి దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్‌లను విముక్తి ప్రాంతాలుగా నిర్మించే లక్ష్యం నెరవేర్చడానికి మనం ఈ కింది తక్షణ కర్తవ్యాలను పరిపూర్తి చేయాల్సి ఉంటుంది.

అద్భుతమైన వస్తుగత పరిస్థితిని వినియోగించుకుని విప్లవాన్ని విజయం వైపుకు పురోగమింపజేయాలంటే మనం మన స్వీయాత్మక పరిస్థితులను కూడా అంతే వేగంగా మెరుగుపరుచుకోవల్సి ఉంటుంది. స్వీయాత్మక శక్తుల నష్టాల్ని నివారించడం, ముఖ్యంగా ఉన్నత నాయకత్వ స్థానాల్లో వాటిని నివారించడం అనేది మన పార్టీ ముందున్న అత్యంత ముఖ్యమైన కర్తవ్యాల్లో ఒకటి. విప్లవోద్యమ క్రమంలో ప్రజలే విప్లవ నాయకులను తయారు చేసుకుంటారు అనేది ఎంత వాస్తవమో, అలా తయారు అయిన నాయకులను, పదుల ఏండ్లుగా అపారమైన అనుభవాన్ని గడించి, విప్లవం పట్ల, ప్రజల పట్ల అచంచల విశ్వాసంతో పార్టీకి మార్గదర్శకత్వం వహిస్తున్న నాయకత్వాన్ని కోల్పోయాక తిరిగి అలాంటివారిని తయారు చేసుకోవడం అంత సులభం ఏమీ కాదనేదీ అంతే వాస్తవం. యుద్ధంలో మన లక్ష్యం వీలైన మేరకు మన శక్తులను కాపాడుకుంటూ, శత్రు బలగాలకు వీలైనంత మేరకు నష్టాన్ని కలిగించడంగా ఉంటుందనే సాధారణ సూత్రానికి లోబడే నాయకత్వ పరిరక్షణనూ, స్వీయాత్మక శక్తుల నష్టాలను తగ్గించుకోవడాన్నీ, అనవసరమైన నష్టాలను నివారించడాన్నీ మనం గంభీరంగా తీసుకుని కృషి చేయాల్సిన అవసరం వున్నది.

శత్రు మోసపూరిత ఎల్ఐసీ వ్యూహాన్ని అధ్యయనం చేయడంలో, అందులో భాగంగా శత్రువు మన నాయకత్వాన్నీ, స్వీయాత్మక శక్తుల్నీ నిర్మూలించడానికి వేసే ఎత్తుగడల్ని అర్థం చేసుకుని దీటైన ప్రతి ఎత్తుగడలను వేయడంలో మన వైఫల్యాలు, మన లోపాలే మనం తీవ్ర నష్టాలను చవి చూడడానికి కారణం. కాబట్టి ఈ విషయంలో మనం ఏ మేరకు మనం నిపుణులం అవుతామో ఆ మేరకు మన నష్టాలను తగ్గించుకోగల్గుతాం. అందుకోసం అనుకూలమైన వస్తుగత పరిస్థితులకూ, ఉద్యమ స్థాయికీ, కర్తవ్యాలకూ తగినట్టు మన పని పద్ధతుల్లో మార్పు రావాలి. విప్లవ విజయానికి మూడు అద్భుత ఆయుధాలైన పార్టీనీ, పిఎల్‌జిఎనీ, ఐక్యసంఘటననూ సంఘటితం చేసేలా, వాటిని బలోపేతం చేసేలా మన పని పద్ధతులను మెరుగుపర్చుకోవాలి. మన నష్టాల్ని తగ్గించుకోవడానికి ఇది ఒక పునాదిని ఏర్పరుస్తుంది. అలాగే మన స్వీయాత్మక శక్తుల రక్షణ కోసం, వాటిని బలోపేతం చేసుకోవడం కోసం పార్టీని సైద్ధాంతికంగా, రాజకీయంగా, మిలటరీపరంగా, నిర్మాణపరంగా బోల్షివీకరించాలి.

ప్రజాపునాదిని పెంచుకోవడం అనేది ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న సమస్యలన్నిటి పరిష్కారానికీ కీలకమైనదిగా వున్నది. జరిగిన నష్టాలను పూడ్చుకోవడానికైనా బలమైన ప్రజాపునాది ప్రాథమిక షరతుగా వుంటుంది. కావున బలమైన ప్రజాపునాదిని నిలుపుకోవడానికీ, నిర్మించడానికి మనం కృషి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం మనం

ప్రజలను రాజకీయంగా సమీకరించాలి, సంఘటితం చేయాలి. వివిధ ఉద్యమాల్లో, పోరాటాల్లో ప్రజలను, ప్రత్యేకించి వ్యవసాయ విప్లవోద్యమంలో రైతాంగాన్నీ విస్తృతంగా, సమరశీలంగా కదిలించాలి. మొత్తంగా విప్లవ ప్రజానీకాన్ని ప్రజాయుద్ధంలో క్రియాశీలంగా కదిలించాలి. ప్రజల సంఘటిత శక్తినీ, పునాదినీ దెబ్బ తీయడానికి ఎల్ఐసీ పాలసీలో భాగంగా కొనసాగిస్తున్న సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలనూ, బూటకపు సంస్కరణలనూ, హంతక దాడుల్నీ, మోసపు యుద్ధాన్నీ ఓడించే విధంగా ఎంతో నైపుణ్యాన్ని ప్రదర్శించి, కార్మిక-కర్షక పీడిత ప్రజలపై ఆధారపడి  మధ్యతరగతి ప్రజలనూ, మేధావులనూ కదిలించాలి.

దేశంలో గెరిల్లా యుద్ధం తీవ్రంగా కొనసాగుతున్న జోన్లలో మనం దాన్ని మరింత తీవ్రతరం చేయాలి, దానిని మరింత విశాల ప్రాంతానికి విస్తరింపజేయాలి. గెరిల్లా జోన్లను, ఉద్యమ ప్రాంతాలను చిన్న ప్రాంతాలకు కుదించివేయడానికీ, తక్కువ సమయంలో యుద్ధాన్ని ముగించడానికీ  (మనల్ని నిర్మూలించడం ద్వారా లేదా మన పోరాటశక్తిని గుణాత్మకంగా బలహీనపర్చడం ద్వారా) శత్రువు చేసే అన్ని రకాల విప్లవ ప్రతీఘాతుక ప్రయత్నాలను మనం ప్రజలను విస్తృతంగా కదిలించడం, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం, విస్తృతం చేయడం, ప్రజా రాజ్యాధికార అంగాలను-గెరిల్లా బేసులను సంఘటితపరిచి విస్తృతపరచడం, గెరిల్లా ప్రాంతాలను విస్తరించడం, ప్రజాయుద్ధ విజయాలను నిలుపుకుంటూ మెట్టుమెట్టుగా ఉద్యమాన్ని అభివృద్ధి చేయడం ద్వారా, యుద్ధం దీర్ఘకాలం కొనసాగేలా చేయడం ద్వారా ఓడించాలి.

ప్రజారాజ్యాధికారాన్ని-గెరిల్లా బేసులను నిర్మించిన చోట్ల వాటిని బలోపేతం చేయడానికి ప్రజల్ని మరింత సాయుధం చేయడం, మరిన్ని ప్రాంతాలకు వాటిని విస్తరింపజేయడం కూడా మన ముందున్న ముఖ్య కర్తవ్యాల్లో ఒకటి. అన్ని రకాల ప్రజా ఆందోళనల్నీ, వర్గపోరాటాలనూ ప్రత్యేకించి భూపోరాటాలనూ, విస్థాపన వ్యతిరేక పోరాటాలనూ పెంపొందిస్తూ, ఆ పోరాటాల్లో సంఘటితం అయ్యే ప్రజానీకాన్ని సాయుధం చేస్తూ, పాలకవర్గాల రాజ్య పరిపాలనను తిరస్కరిస్తూ ప్రత్యామ్నాయ ప్రజా రాజ్యాధికారం నిర్మించుకునే వైపుగా, బలమైన ప్రజావిముక్తి సైన్యం నిర్మించుకుని విముక్తి ప్రాంతాలు స్థాపించుకునే వైపుగా వారిని ఉత్తేజితుల్ని చేయాలి. ప్రజల్ని ప్రజాయుద్ధంలో క్రియాశీలంగా కదిలించడం దీనికి కీలకంగా ఉంటుంది.

బస్తర్‌లో సైన్యాన్ని దించడం, సైన్య శిక్షణా స్కూళ్లను తెరవడం, బ్రిగేడ్ బలగాలకు ప్రత్యేక శిక్షణనివ్వడం, ప్రతి సంవత్సరం నూతన బెటాలియన్ల నిర్మాణం, సైనిక బడ్జెట్‌లో

విపరీతమైన పెరుగుదల, వాయుసేనని మోహరించి ప్రయోగించడానికి అవసరమైన నదుపాయాల నిర్మాణం, హెలికాప్టర్లు, యుఎవిల కొనుగోలు-అద్దెకు తీసుకోవడం-వినియోగం మొదలైనవన్నీ మన పార్టీని సమూలంగా నిర్మూలించడానికి ఎక్కుపెట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ బహుముఖ భారీ సైనిక దాడిలో భాగమే. బస్తర్‌లో సైన్యం దిగడం అనేది అక్కడి ఉద్యమాన్ని నిర్మూలించడానికే కాక, బస్తర్ సరిహద్దులైన ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, అలాగే ఝార్ఖండ్, బీహార్, ఇతర ఉత్తర, తూర్పు రాష్ట్రాల ఉద్యమాలను, దక్షిణ-పశ్చిమ భారతదేశంలోని ఉద్యమాలను దెబ్బ తీయడానికి, తద్వారా మొత్తం దేశవ్యాప్తంగానే మనల్ని నిర్మూలించడానికి ఉద్దేశించబడింది. అందుకే ఉద్యమ ప్రాంతాల్లో, నిర్దిష్టంగా బస్తర్‌లో సైన్యం మోహరింపును వ్యతిరేకిస్తూ ఉద్యమ ప్రాంతాల్లో, దేశ-విదేశాల్లో విశాలమైన, మిలిటెంట్ ప్రజా నిరసన ఉద్యమాన్ని నిర్మించడంపై ప్రత్యేక కృషి చేయాలి.

ఇటీవల దండకారణ్యం, ఝార్ఖండ్, బీహార్, ఒడిశా, సిఓబి, ఏఓబిలలో బ్రిగేడ్ స్థాయిలో శత్రు బలగాలు చేపట్టిన భారీ స్పెషల్ ఆపరేషన్స్‌లో యుఎవి (మానవ రహిత విమానాలు)లను వినియోగించారు. వాటి విస్తృత వినియోగానికై (సమాచార సేకరణకు, బాంబులు కురిపించడానికి, కాల్పులు జరపడానికి) అన్ని సన్నాహాలూ పూర్తి చేస్తున్నారు. యుఎవిల-డ్రోన్‌ల వినియోగానికి వ్యతిరేకంగా పెద్దెత్తున అన్ని సెక్షన్ల ప్రజలనూ కదిలించాలి. అంతర్జాతీయంగా, ప్రత్యేకించి ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, యెమెన్, ఇరాక్, పాలస్తీనా తదితర దేశాలలో డ్రోన్‌ల వినియోగానికి వ్యతిరేకంగా ఎగుస్తున్న ఉద్యమాలతో దీన్ని అనుసంధానించాలి. మన ఉద్యమ ప్రాంతాల్లో సైన్య మోహరింపుకూ, డ్రోన్‌ల వినియోగానికీ వ్యతిరేకంగా అంతర్జాతీయంగా మద్దతు కూడగట్టేలా కృషి చేయాలి. నిజానికి నేడు దేశంలో మన ఉద్యమ ప్రాంతాలపై వినియోగిస్తున్న లక్షలాది సాయుధ బలగాల, పారామిలటరీ, పోలీస్ బలగాల సంఖ్య గానీ, హెలికాప్టర్ల సంఖ్య గానీ ప్రపంచంలోని అత్యధిక దేశాల ప్రభుత్వ సాయుధ బలగాల, వాయుసేన విమానాల, హెలికాప్టర్ల సంఖ్య కంటే ఎక్కువ అనే వాస్తవాన్ని దేశ-విదేశీ ప్రజల ముందుంచి వారిని కదిలించాలి.

1947లో జరిగిన అధికార మార్పిడికి ముందు వలస పాలకులు, ఆ తర్వాత వారి తొత్తులూ చేసిన పిడి యాక్టు, ఎన్ఎస్ఎ, ఆయుధాల నిరోధక చట్టం తదితర అనేక నిరంకుశ చట్టాలతో పాటు సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ), ఊపా, మకోకా, ఛత్తీస్‌గఢ్ జన సురక్షా కానూన్ వంటి అనేక పాశవిక చట్టాల్ని తెచ్చి ప్రజల జీవించే హక్కునూ, ప్రాథమిక హక్కులనూ కాలరాచివేస్తున్నారు. వీటన్నిటినీ తలదన్నే విధంగా

జాతీయ ఉగ్రవాద వ్యతిరేక కేంద్రాన్ని (ఎన్‌సిటిసి) ఏర్పరచడానికి సన్నాహాలు తీవ్రతరం చేస్తున్నారు. అమెరికాలోని ఎన్‌సిటిసి తరహాలో, అమెరికా సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో ఏర్పడి నడవబోయే ఈ సంస్థ ఎటువంటి అడ్డూ ఆపూ లేకుండా సంపూర్ణంగా పోరాడే ప్రజలను అణగదొక్కడానికి ఉద్దేశింపబడినది. సైనిక, నియంతృత్వ, ఎమర్జెన్సీ తరహా పాలనను అమలు చేసే సాధనంగా దీన్ని పాలకవర్గాలు ఉపయోగించబోతున్నారు. ఈ సంస్థ ఏర్పడితే ఇక పౌరహక్కులు అనే మాటకే విలువ లేకుండా అయిపోతుంది. భారత ప్రజలకే కాక యావత్ దక్షిణాసియా ప్రజలకే ఇది ప్రమాదకరంగా పరిణమించబోతోంది. విప్లవోద్యమాన్ని నిర్మూలించడం కొరకే కాక తమ న్యాయబద్ధమైన డిమాండ్ల కోసం పోరాడే ప్రజలను, జాతి విముక్తి ఆకాంక్షలతో పోరాడే కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఉద్యమాలనూ, అన్ని రకాల ప్రజాస్వామిక ఉద్యమాలను, విస్థాపన వ్యతిరేక ఉద్యమాలను దారుణంగా అణచివేయడం పాలకవర్గాల లక్ష్యం. అందుకే పాశవిక చట్టాలను తెస్తూ, న్యాయవ్యవస్థను మరింత నిరంకుశంగా మారుస్తూ "ప్రజలపై యుద్ధాన్ని" తీవ్రతరం చేస్తున్నారు. నేడు శత్రు నిర్బంధంలోని ఒక ముఖ్యమైన పార్శ్వం మన కామ్రేడ్స్‌ను (సిసి నుండి పార్టీ సభ్యుల వరకు, సాధారణ ప్రజానీకం వరకు) అరెస్టులు చేసి, అక్రమ కేసుల్లో ఇరికించి, సంవత్సరాల తరబడి లేదా జీవితాంతం జైళ్లలో మగ్గిపోయేలా చేయడం. ఉరి, యావజ్జీవ కారాగారవాసం వంటి శిక్షలు వేస్తూ, బెయిల్స్ నిరాకరిస్తూ, బెయిల్స్ వచ్చినా గేటు ముందే తిరిగి అరెస్టులు చేసి కొత్త కేసులు పెడ్తూ, కనీసమైన సౌకర్యాలు, ముఖ్యంగా వైద్య సౌకర్యాలు ఇవ్వకుండా రాజకీయ ఖైదీలను యమయాతనలు పెడ్తున్నారు. మరోవైపు రోజువారీగా ప్రజల హక్కులను అసంఖ్యాక సందర్భాల్లో కాలరాచివేస్తూ, ఊచకోతలను కొనసాగిస్తూ హిట్లర్ పాలనను తలపిస్తున్నారు మన దేశ పాలకులు. ఈ స్థితినంతటినీ ప్రభావవంతంగా ఎదుర్కొనగల శక్తివంతమైన, ఐక్య పౌరహక్కుల ఉద్యమ నిర్మాణం, దాన్ని బలోపేతం చేయడం అందుకే నేడు ఒక ముఖ్య కర్తవ్యంగా మన ముందు ఉన్నది.

**కామ్రేడ్స్,**

అమరవీరుల సంస్మరణ వారాన్ని ఊరూరా, వాడవాడలా దేశవ్యాప్తంగా విప్లవస్ఫూర్తితో జరపండి. శత్రు ఎల్ఐసీ మోసపూరిత యుద్ధంలో భాగంగా దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించడానికి అమరుల జీవితాల నుండి, ఆచరణ నుండి నేర్చుకున్న విలువలను, ఆదర్శాలను, త్యాగాన్నీ, ధైర్యసాహసాలనూ, ప్రజల పట్ల అంకిత భావాన్నీ, నిబద్ధతనూ మన నిత్యజీవితంలోనూ, ఈ సందర్భంగా కూడా ఎత్తిపడుతూ ప్రజల్లోకి వాటిని విస్తృతంగా, సృజనాత్మకంగా వివిధ రూపాల్లో తీసుకెళ్లండి. నిస్వార్థపూరితమైన అమరుల

జీవిత చరిత్రలను ప్రచురించి, వారికి స్థూపాలు నిర్మించి ఘనంగా నివాళులర్పించండి. పాత స్థూపాలకు రంగులు వేసి, ఆ పరిసరాలను ప్రజలు ఈ సందర్భంలోనే కాక ప్రతి సంవత్సరం ముందుకు వచ్చే వివిధ విప్లవ దినాల సందర్భంగా అమరులకు నివాళి అర్పించేందుకు వీలుగా శుభ్రంగా తీర్చిదిద్దండి. అమరవీరులపై కరపత్రాలూ, పోస్టర్లు, బ్యానర్లు, ఫోల్డర్స్, కేలండర్లు, బుక్‌లెట్లు వంటి విభిన్న రూపాల ప్రచార సామగ్రిని వెలువరించి వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లండి.

దేశవ్యాప్తంగా మన ఉద్యమ ప్రాంతాల్లో అనేక చోట్ల ప్రజలు అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో, వారి సంస్మరణార్థం వందలాది గ్రామాల్లో స్థూపాలను నిర్మించుకునే విప్లవ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. అయితే అలా నిర్మించుకున్న స్థూపాలను అనేక చోట్ల పోలీసు, పారామిలటరీ బలగాలు సంపూర్ణంగా లేదా పాక్షికంగా కూలగొట్టడం, బలవంతంగా ప్రజలతోనే కూలగొట్టించడానికి ప్రయత్నించడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ప్రజలు చాలాచోట్ల దీన్ని ప్రతిఘటిస్తున్నారు. కూలగొట్టిన స్థూపాలను పట్టుదలగా తిరిగి నిర్మించుకుంటున్నారు. అమరుల స్మృతి చిహ్నాలను కూలగొట్టడాన్ని ఖండిస్తూ, వాటిని పరిరక్షించుకోవడానికి వివిధ రూపాల్లో ప్రతిఘటనను తీవ్రతరం చేసేలా కృషి చేస్తూ, వాటిని నిర్మాణం, పునర్నిర్మాణం చేస్తూ, గ్రామగ్రామాన స్థూపావిష్కరణలు చేసేలా, అమరుల ఆశయ సాధన కోసం ధైర్యంగా తెగించి పోరాడేలా వారి చైతన్యాన్ని మరింతగా పెంచాలి. అమరవీరుల కుటుంబాలను, బంధుమిత్రులను ఈ సందర్భంగా కలిసి వారిని ఈ సభల్లో, ప్రచార వారంలో భాగస్వాములను చేయండి. వారితో స్థూపావిష్కరణలు చేయించి, సభలలో అమరుల స్ఫూర్తిదాయకమైన జీవితాలపై మాట్లాడించండి. అమరుల ఆశయ సాధనకూ తామూ కృషి చేసేందుకు పూనుకునేలా వారికి ఉత్తేజం కలిగించండి. అమరుల కుటుంబాల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే కృషి చేస్తూ విప్లవోద్యమం వారికి ఎల్లప్పుడూ అండగా వుంటుందనే ఆశ్వాసననివ్వండి. మొత్తంగా అమరవీరుల ఆశయ సాధనకు పునరంకితమయ్యే గంభీరమైన, ఉత్తేజపూరితమైన దినాలుగా వాటిని పాటించండి.

**విప్లవాభినందనలతో,**

**కేంద్రకమిటీ,**

***జులై 5, 2012*** **సిపిఐ (మావోయిస్టు)**

**మన ప్రియతమ అమరవీరుల విలువలను, ఆదర్శాలను,**

**అత్యున్నత త్యాగాలను, సాహసాన్ని, అంకితభావాన్ని, నిబద్ధతను**

**అలవరుచుకుందాం!**

**వాటిని విస్తృతంగా ప్రచారం చేద్దాం!**

**విప్లవ యుద్ధాన్ని పరిరక్షించడం, దానిని పురోగమింపజేయడమే**

**మహోన్నత అమరులకు మనమివ్వగల నిజమైన నివాళి!**

*2013 జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల స్మారక వారాన్ని విప్లవోత్సాహంతో జరపాల్సిందిగా*

*పార్టీ శ్రేణులకు, పిఎల్‌జిఏ కమాండర్లు-పోరాటయోధులు, విప్లవ ప్రజా కమిటీలు, విప్లవ ప్రజారాశులకు సి.పి.ఐ. (మావోయిస్టు) కేంద్రకమిటీ పిలుపు!*



**కేంద్రకమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

## మన ప్రియతమ అమరవీరుల విలువలను, ఆదర్శాలను, అత్యున్నత త్యాగాలను, సాహసాన్ని, అంకితభావాన్ని, నిబద్ధతను అలవరుచుకుందాం!

## వాటిని విస్తృతంగా ప్రచారం చేద్దాం!

## విప్లవ యుద్ధాన్ని పరిరక్షించడం, దానిని పురోగమింపజేయడమే మహోన్నత అమరులకు మనమివ్వగల నిజమైన నివాళి!

***2013 జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల స్మారక వారాన్ని విప్లవోత్సాహంతో జరపాల్సిందిగా***

***పార్టీ శ్రేణులకు, పిఎల్‌జిఏ కమాండర్లు-పోరాటయోధులు, విప్లవ ప్రజా కమిటీలు, విప్లవ ప్రజారాశులకు సి.పి.ఐ. (మావోయిస్టు) కేంద్రకమిటీ పిలుపు!***

**ప్రియమైన కామ్రేడ్స్,**

త్యాగాలు అనివార్యమే కాదు, సమాజ మార్పుకై విప్లవం త్యాగాలను డిమాండ్ చేస్తుంది కూడా. ఇలాంటి ప్రతి మార్పు చరిత్ర నిర్మాతలైన ప్రజల అసంఖ్యాకమైన త్యాగాలతో కూడుకొని ఉంటుంది. త్యాగాల ద్వారానే ప్రతి మార్పు సాధించబడుతుంది. మానవుల వర్గపోరాటాల చరిత్రలో సాధించిన విజయాలు, పొందిన గెలుపులు అన్నీ అబ్బురపర్చే, మనసుల్ని కదిలించే, గుండెల్ని పిండేసేటటువంటి; మానవ జాతిని విముక్తి చేసే లక్ష్యాన్ని తమ ప్రాణాల కన్నా మిన్నగా ఎంచి, తమకు అత్యంత ఉన్నతమైన ప్రాణాల్ని ఫణంగా పెట్టడంతో సహా అసాధారణ త్యాగాలతో కూడినటువంటి దేదీప్యమానమైన గాథలతో నిండి ఉన్నాయి.

నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు సాగిన గత 46 సంవత్సరాల నుంచి నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో, మన పార్టీ సంస్థాపకులు, గొప్ప నాయకులు, అమరులు కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ కన్హయ్ చటర్జీలు రగిలించిన దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గంలో నూతన ప్రజాస్వామిక సమాజం, అనంతరం సోషలిజం, అంతిమంగా కమ్యూనిజం స్థాపనకై వేలాది మంది కామ్రేడ్స్, ప్రజలు దేదీప్యమానమైన త్యాగాలు చేశారు. సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి మద్దతుతో, వారి నిర్దేశత్వంలో భారత పాలకవర్గాలు కొనసాగిస్తున్న దేశవ్యాప్త ఫాసిస్టు, బహుముఖ దాడిలో గత సంవత్సరం మనం జరుపుకున్న అమరవీరుల స్మారక వారం తర్వాత ఈ సంవత్సర కాలంలో వంద మందికి పైగా మన దేశ ఉత్తమ పుత్రికలు, పుత్రులు అత్యంత అమూల్యమైన తమ ప్రాణాలను అర్పించారు.

ఇదే కాలంలో, నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో ఫిలిప్పైన్స్ రాజ్యం ప్రజలపై సాగిస్తున్న ఫాసిస్టు ఒప్లాన్ బయనిహాన్‌ను తిప్పికొడుతూ, ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేస్తూ ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ (సిపిపి), నూతన ప్రజాసైన్యం (ఎన్‌పిఏ), జాతీయ ప్రజాస్వామిక వేదిక (ఎన్‌డిఎఫ్)కు చెందిన అనేక మంది కామ్రేడ్స్, విప్లవ ప్రజానీకం అమరులయ్యారు. నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో టర్కీ, బంగ్లాదేశ్, పెరూ; సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికవర్గం; జాతి విముక్తి పోరాటాలలో, సామ్రాజ్యవాద దురాక్రమణ దాడికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలలో; అన్ని రకాల అభివృద్ధినిరోధకులకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలలో మావోయిస్టులు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత, మేధావులు, ప్రజాస్వామికవాదులు, ఉద్యోగులు, మహిళలు, ప్రజలు ప్రపంచవ్యాప్తంగా తమ ప్రాణాలను ధారపోశారు.

భారత విప్లవంలో, ప్రపంచ సోషలిస్టు విప్లవంలో నేలకొరిగిన ఈ అమరులందరికీ మన అమరవీరుల స్మారక వారం సందర్భంగా తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిద్దాం. వారందించిన ఉత్తేజంతో, వారి ఆకాంక్షలను, వారు కన్న కలల్ని నెరవేర్చేంత వరకూ పోరాడుతామని పిడికిలి బిగించి శపథం చేద్దాం. తమ దేశ విప్లవంలో భాగంగా ఒక దేశంలోని కమ్యూనిస్టులు తమ ప్రాణాలను త్యాగం చేయవచ్చు కానీ, వారి త్యాగం ఆ దేశానికే పరిమితం కాదు. అదే విధంగా మన ప్రియతమ అమరుల అసంఖ్యాకమైన త్యాగాలు సైతం ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులు చేస్తున్న అపారమైన త్యాగాలలో అంతర్భాగమే. వాళ్లు తమ దేశాలలో ప్రజల విముక్తి కోసమే గాక ప్రపంచవ్యాపితంగా పీడిత ప్రజల విముక్తి కోసం కూడా సేవలు అందించారు.

సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ, 2013 జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల స్మారక వారాన్ని విప్లవోత్సాహంతో జరపాల్సిందిగా పార్టీ శ్రేణులకు, పిఎల్‌జిఏ కమాండర్లు–పోరాటయోధులకు, విప్లవ ప్రజా కమిటీ (ఆర్‌పిసి)లకు, విప్లవ ప్రజా సంఘాలకు పిలుపునిస్తోంది. మహత్తర భారత విప్లవ లక్ష్యం కొరకై తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన మన ప్రియతమ అమరవీరుల దేదీప్యమానమైన గొప్ప త్యాగాలను సంస్మరిస్తూ, వాటిని ఉన్నతంగా ఎత్తిపట్టాల్సిందిగా కోరుతోంది.

మన పార్టీ కేంద్రకమిటీ మన ప్రియతమ అమరవీరులందరికీ వినమ్రంగా అరుణాంజలి ఘటిస్తోంది. గొప్పదీ, యెల్లప్పటికీ ఉత్తేజకరమైనదీ అయిన ఇటువంటి సందర్భాన్ని పురస్కరించుకొని అమరుల మహోన్నత, నిస్వార్ధపూరిత ఆశయాల పరిపూర్తికై పునరంకితం కావాల్సిందిగా పిలుపు నిస్తోంది. విప్లవాల యుగంలో, అమరుల నిస్వార్ధ త్యాగాలు పరమ ఆదర్శాలుగా నిలుస్తాయి. ఈ ఆదర్శాలను తీసుకొని, విప్లవ యుద్ధ క్రమంలో అసంఖ్యాకమైన త్యాగాలు చేసేందుకై ప్రజానీకం ముందుకు వస్తుంది. ప్రజా శత్రువులపై మనం సాగించే యుద్ధంలో అలాంటి గొప్ప అమరుల స్మృతులను స్మరించుకుంటూ, వారి ఆదర్శాలను, విలువలను

ఒక ఆయుధంగా చేపడుదాం. అందుకు ఈ సందర్భాన్ని అత్యంత సమర్ధవంతంగా ఉపయోగించుకుందాం. అలాంటి ఆయుధంతో చేసే దాడి ముందు ఎంతటి వర్గశత్రువుల కోటలు సైతం నిలబడలేవు. ప్రాణంతో ఉన్న విప్లవకారులు వర్గశత్రువులకు ఒక పెద్ద ముప్పు కాగా, అమరులైన విప్లవకారులు వారికి దుర్భేధ్యమైన ప్రత్యర్థులు. అమరుల నిస్వార్ధ త్యాగం అనే ఆయుధంతో సాటిరాగల శత్రు ఆధునిక ఆయుధాలేవీ లేవు.

ధీరోదాత్తమైన మన పార్టీ, పిఎల్‌జిఏ కామ్రేడ్స్ అనేక మంది శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ నేలకొరిగారు. శత్రు సాయుధ బలగాల దాడులలో కొంతమంది అమరులయ్యారు. కొంతమంది మన సీనియర్ కామ్రేడ్స్ అనారోగ్యంతో కన్నుమూయగా, కొంతమంది పాము కాటు వంటి ప్రమాదాలకు గురై చాలా బాధాకరంగా తుదిశ్వాస విడిచారు. శత్రు బలగాలు విచ్చలవిడిగా చేసిన కాల్పుల్లో, పోలీసు లాకప్పులలో కొంతమంది గ్రామ విప్లవ కార్యకర్తలు అమరులయ్యారు. వారందరి ఉమ్మడి లక్ష్యం ఒక్కటే - భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా అన్ని రకాల దోపిడీ, పీడన, అణచివేతల నుండి పీడిత ప్రజలను విముక్తి చేయడం. ఈ గొప్ప అమరులందరికీ వందనాలు అర్పిద్దాం.

ఝార్ఖండ్‌లోని చత్రా జిల్లా కుంద పోలీస్‌స్టేషన్ పరిధిలో లకడ్‌బంద గ్రామంలో త్రితీయ ప్రస్తుతి కమిటీ (టిపిసి) గూండాలు, పోలీసు, సిఆర్‌పిఎఫ్-కోబ్రా కమాండోలు 2013 మార్చి 27-28 అర్ధరాత్రి ఒక క్రూరమైన హత్యాకాండ సాగించారు. వందలాది టిపిసి, ఝార్ఖండ్ పోలీసు, సిఆర్‌పిఎఫ్-కోబ్రా బలగాలు పథకం ప్రకారం సాగించిన కోవర్టు ఆపరేషన్‌లో భాగంగా ఒక పిఎల్‌జిఏ క్యాంపును చుట్టుముట్టి క్రూరంగా దాడి చేశాయి. ఈ దాడిని ప్రతిఘటిస్తూ ముగ్గురు కామ్రేడ్స్ నేలకొరగగా, ఏడుగురు సజీవంగా పట్టుబడ్డారు. ఆ ఏడుగురిని టిపిసి, పోలీసు, సిఆర్‌పిఎఫ్-కోబ్రా హంతక మూకలు క్రూరంగా హత్య గావించాయి. వారిని అమానవీయంగా చిత్రహింసలు పెట్టి కాల్చిచంపారు. కామ్రేడ్ లాలేష్ యాదవ్ అలియాస్ ప్రశాంత్ (ఆర్‌సిఎం-ఆర్‌సి అధికార ప్రతినిధి), కామ్రేడ్ ధర్మేంద్ర యాదవ్ (సబ్‌జోనల్ కమిటీ సభ్యుడు), కామ్రేడ్ ప్రఫుల్ (సబ్‌జోనల్ కమిటీ సభ్యుడు), కామ్రేడ్ జయకుమార్ యాదవ్ (ప్లాటూన్ కమాండర్), కామ్రేడ్ బోలా అలియాస్ అజయ్ యాదవ్, కామ్రేడ్ అల్బర్ట్ అలియాస్ బిజయ్, కామ్రేడ్ ప్రమోద్, ఇతరులు ఈ దాడిలో నేలకొరిగారు. టిపిసి, జెపిసి, జెఎల్‌టి, పిఎల్‌ఎఫ్‌ఐ, గ్రామ రక్షణ దళం, నాగరిక్ సురక్షా సమితి వంటి అనేక సాయుధ హంతక గ్యాంగులను పీడక ప్రభుత్వాలే పెంచి పోషించాయి. వాస్తవానికి రాజ్యమే వీటిని సృష్టించి సాయుధం చేసి నడుపుతోంది. ఈ దాడి చత్రా జిల్లాలోని మన ఉద్యమానికి, స్థూలంగా ఝార్ఖండ్ ఉద్యమానికి ఒక పెద్ద దెబ్బ. ఇందులో అమరులైన కామ్రేడ్స్ వదిలివెళ్లిన కర్తవ్యాలను, వారు కన్న కలల్ని నెరవేర్చాల్సిన బాధ్యత మన మీద ఉంది. నక్సల్బరి తర్వాత భారతదేశంలో మగధ్ ప్రాంత ప్రజలు ఫ్యూడల్ వ్యతిరేక పోరాటాలలో, గెరిల్లా బలగాల, గెరిల్లా యుద్ధ

నిర్మాణంలో ఒక చారిత్రాత్మక భూమిక పోషించారు. నిర్ణయాత్మకంగా ముందుకు పురోగమించడం ద్వారా వారు ఖచ్చితంగా ఈ నష్టాన్ని కూడా అధిగమిస్తారు. బీహార్–ఝార్ఖండ్–ఉత్తర ఛత్తీస్‌గఢ్ స్పెషల్ ఏరియాలో పోలీసు, అర్ధసైనిక, ప్రత్యేక బలగాలతో జరిగిన తీవ్రమైన ఎన్‌కౌంటర్లలో కోయల్–శంఖ్ జోన్‌లో కామ్రేడ్ సుభాష్, లాతేహార్ జిల్లా కటియా అడవుల్లో ఐదుగురు కామ్రేడ్స్, సరాయికేలా–ఖరస్వాన్ జిల్లాలో ఒక కామ్రేడ్, ఖుంటి జిల్లాలోని హుర్వా అడవుల్లో ఒక కామ్రేడ్, మరి కొంతమంది కామ్రేడ్స్ శత్రు బలగాలను వీరోచితంగా తిప్పికొడుతూ అమరులయ్యారు. బీహార్‌లోని కోయల్–శంఖ్ జోన్‌లో కామ్రేడ్ చందన్‌ను జెఎంఎం ముఠా హత్య గావించగా, మధ్య జోన్‌లోని కామ్రేడ్ సద్దేవ్ (ఏసిఎం)ను జెపిసి హత్య చేసింది.

ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ పోలీసు, సిఆర్‌పిఎఫ్–కోబ్రా బలగాలు సంయుక్తంగా 2013 ఏప్రిల్ 16న ఇన్‌ఫార్మర్ల సమాచారంతో ఆంధ్రప్రదేశ్ సరిహద్దులలోని పువ్వార్ గ్రామం (కుంట బ్లాక్, సుక్మా జిల్లా)పై దాడి చేశాయి. ఉత్తర తెలంగాణకు చెందిన ఐదుగురు మహిళా కామ్రేడ్స్‌తో సహా తొమ్మిది మందిని నిర్దాక్షిణ్యంగా హత్య చేశాయి. ఈ కఠిన పోరాటంలో శత్రు బలగాలతో వీరోచితంగా చివరి ఊపిరి ఉన్నంత వరకూ పోరాడుతూ ఎన్‌టి ఎస్‌జడ్‌సి సభ్యుడు కామ్రేడ్ మర్రి రవి అలియాస్ సుధాకర్ (38), కెకెడబ్ల్యు డివిసిఎం కామ్రేడ్ గుగ్లోత్ లక్ష్మి అలియాస్ పుష్ప (32), ఏటూరునాగారం ఏసిఎస్ కామ్రేడ్ వెట్టి నర్సక్క అలియాస్ సబిత (33), ఏసిఎం కామ్రేడ్ దుర్గం రాజు (26), ఏసిఎం కామ్రేడ్ రీనా, ఏసిఎం కామ్రేడ్ వెట్టి రామక్క అలియాస్ బడే ఊర్మిళ (24), కామ్రేడ్ మద్ది సీత అలియాస్ నవత (పిఎం), కామ్రేడ్ మడకం భీమ అలియాస్ అజయ్ (20) (పిఎం), కామ్రేడ్ అర్లి వెంకటి అలియాస్ గౌతమ్ (35) (పిఎం)లు తమ ప్రాణాలు అర్పించారు.

కామ్రేడ్ సుధాకర్ 18 యేళ్ల వయసులోనే ఉద్యమంలో చేరి, కొంతకాలం పాటు సిపిఐ (ఎంఎల్) ప్రతిఘటన (సిపి రెడ్డి) గ్రూపులో పనిచేశాడు. వారి రివిజనిస్టు రాజకీయాల్ని వ్యతిరేకించి ఆ పార్టీని వదిలి మన పార్టీలో చేరాడు. పిఎల్‌జిఏ దళ సభ్యునిగా అతని విప్లవ జీవితం ఆరంభమై ఎస్‌జడ్‌సి స్థాయి వరకూ అభివృద్ధి అయ్యింది. గోదావరి లోయలోని వివిధ మితవాద అవకాశవాద మార్క్సిస్టు–లెనినిస్టు గ్రూపులకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో అతను ప్రముఖ పాత్ర పోషించాడు. కామ్రేడ్ పుష్ప 10 సం॥ల వయసు నుంచే విప్లవోద్యమంలో భాగమైంది. లంబాడీ ఆదివాసీ తెగ నుంచి వచ్చిన ఆమె ఒక దళ సభ్యురాలిగా చేరి డివిసిఎంగా అభివృద్ధి అయ్యింది. 2007లో ఆమె ఒక బిడ్డకు జన్మనిచ్చింది. కాని ఆ బిడ్డను బంధువులకు అప్పగించి విప్లవోద్యమంలో తన కృషిని కొనసాగించింది. కామ్రేడ్స్ సుధాకర్, పుష్ప దంపతులు. ఈ సీనియర్ కామ్రేడ్స్ విప్లవోద్యమ క్రమంలో విలువైన అనుభవాలు గడించారు. ఆ కాలంలో వీరు తీవ్రమైన అననుకూలతల మధ్య అనేక శత్రు దాడులను వీరోచితంగా తిప్పికొడుతూ దృఢంగా నిలబడ్డారు. ఈ అనుభవాలను వినియోగించుకుంటూ ఉత్తర తెలంగాణలో ఉద్యమాన్ని

పునర్నిర్మాణం చేసేందుకై తీవ్రంగా ప్రయత్నించారు. ఈ తొమ్మిది మంది కామ్రేడ్స్ ప్రస్తుతం ఉత్తర తెలంగాణలో నెలకొని ఉన్న తీవ్రమైన కఠిన పరిస్థితుల్లో పనిచేయడంలో అత్యున్నతమైన విప్లవ స్ఫూర్తిని ప్రదర్శించారు. ఉత్తర తెలంగాణలో పునర్నిర్మాణం చేయడంలో మనం చేస్తున్న కృషికి ఈ ఎన్‌కౌంటర్ ఖచ్చితంగా ఒక పెద్ద దెబ్బ. ఈ కామ్రేడ్స్ అంతా పీడిత వర్గాల నుంచి, పీడిత సామాజిక సెక్షన్ల నుంచి వచ్చినవారూ, 38 సం॥లకు లోపువారూ. పువ్వార్‌లో మన ప్రియతమ కామ్రేడ్స్, వీర యోధులు అమరులైనప్పటికీ, వారు అందించిన విలువైన అనుభవాలు మన ముందున్నాయి. ఉత్తర తెలంగాణలో పునర్నిర్మాణంలో ఇవి తప్పనిసరిగా మనకు తోడ్పడతాయి. వారందించిన ఉత్తేజం మన పార్టీ సెంట్రల్ రీజియన్ అంతటా మన ఉద్యమానికి వేగుచుక్కలా తోడ్పడుతుంది. ఎస్‌జడ్‌సిఎం గార్డు అయిన కామ్రేడ్ జగన్ (పిఎం) 2012 నవంబర్ 11న పోలీసులతో జరిగిన ఒక ఎన్‌కౌంటర్లో అమరుడయ్యాడు. నాయకత్వాన్ని కాపాడడం కోసం తన నిండు జీవితాన్ని అర్పించాడు.

దండకారణ్యంలో దక్షిణ గడ్చిరోలి డివిజన్ గోవింద్‌గావ్ గ్రామంలో 2013 జనవరి 20న శత్రు సాయుధ బలగాలు సాగించిన ఒక ఆంబుష్‌లో ఇద్దరు మహిళలతో సహా ఆరుగురు కామ్రేడ్స్ హత్య గావించబడ్డారు. ఇందులో కామ్రేడ్స్ శంకర్ లక్డా (డివిసిఎం), వినోద్ కొడపే (ఏసిఎం), గీత కుమొటి (ప్లాటూన్ డిప్యూటీ కమాండర్), మోహన్ కోవాసీ (ఎల్‌జిఎస్ డిప్యూటీ కమాండర్), పిఎల్‌జిఏ సభ్యులు కామ్రేడ్స్ లబ్బే గావడే, జూరు మట్టామిలు అమరులయ్యారు. కామ్రేడ్స్ వినోద్, గీత దంపతులు. 2013 ఏప్రిల్ 4న భట్‌పర్ గ్రామం వద్ద జన్ మిలీషియా స్క్వాడ్‌పై శత్రు బలగాలు దాడి చేయగా, కామ్రేడ్ లక్షణ్ (ఏసిఎం, కమాండర్), ఒక జన్ మిలీషియా స్క్వాడ్ సభ్యుడు, ఇద్దరు గ్రామస్థులు అమరులయ్యారు. గడ్చిరోలి జిల్లా ధనోరా తహసీల్ సిందేసూర్ గ్రామం వద్ద 2013 ఏప్రిల్ 12న గెరిల్లాలకూ, పోలీసులకూ మధ్య జరిగిన హెూరాహెూరీ ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్స్ కైలాస్ (ఏసిఎం), నందు (డిప్యూటీ కమాండర్), చంప (కంపెనీ 4 సభ్యురాలు), ఇద్దరు మహిళలతో సహా నలుగురు గ్రామస్థులు నేలకొరిగారు. గెరిల్లాల ప్రతిఘటనలో ఒక పోలీసు జవాను మట్టిగరిచాడు. సాయుధ బలగాలు భట్‌పర్, సిందేసూర్‌లలో ఒక పథకం ప్రకారం విచక్షణారహితంగా కాల్పులు జరిపాయి. ప్రజలలో భయోత్పాతాన్ని సృష్టించి మావోయిస్టుల నుంచి వారిని దూరం చేసే లక్ష్యంతోనే, గ్రామస్థులు మావోయిస్టులతో ఉన్న సమయంలో వారిని హత్య గావించాయి. 2012 నవంబర్‌లో అంబాపూర్ ఎన్‌కౌంటర్‌లో శత్రుదాడిని వీరోచితంగా తిప్పికొడుతూ కామ్రేడ్ మంద అమరురాలైంది. ఇదే విధంగా 2012 డిసెంబర్‌లో మోర్ఖొండి ఎన్‌కౌంటర్‌లో గట్ట ఎల్‌ఓఎస్ సభ్యురాలు కామ్రేడ్ శారద నేలకొరిగింది. ఈ 'ఎన్‌కౌంటర్లు' అన్నీ నిజానికి ఊచకోతలు తప్ప మరేమీ కాదు.

మహారాష్ట్రలో, గోందియా–బాలాఘాట్ డివిజన్‌లో మొదటి నుంచి మన కామ్రేడ్స్ తమ రక్తాన్ని చిందిస్తూనే ఉద్యమాన్ని పురోగమింపజేశారు. కోర్చి ఏరియాలో నిర్వాసిత సమస్యపై

పదుల వేల సంఖ్యలో ప్రజలు నిలబడ్డారు. దీనితో రెచ్చిపోయిన కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలు క్రూరమైన పోలీసు నిర్బంధం ద్వారా, నాయకత్వాన్ని తుడిచిపెట్టడం, ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించడం ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తున్నాయి. శత్రుదాడిని ఓడించే లక్ష్యంతో కొనసాగుతున్న ప్రతిఘటనలో భాగంగా గాంగిన్ గ్రామం వద్ద సి-60 కమాండోలతో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో ప్లాటూన్-56 డిప్యూటీ కమాండర్ కామ్రేడ్ మోహన్ అమరుడయ్యాడు. కామ్రేడ్ మోహన్ తన పార్టీ జీవితంలో 18 సార్లు శత్రు బలగాలతో హోరాహోరీ తలపడ్డాడు. అతను ధైర్యం, పట్టుదల, క్రమశిక్షణ, సైనిక వ్యవహారాలలో చొరవ కలిగిన కామ్రేడ్. ఆయన అమరత్వం డివిజన్ ఉద్యమానికి ఒక పెద్ద నష్టం. కంపెనీ కమాండర్ గార్డు కామ్రేడ్ ప్రమోద్ 2013 మే 19న హెట్టాకసా వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. ఈ హత్యలన్నీ కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై తీవ్రంగా సాగిస్తున్న యుద్ధంలో భాగంగానే చూడాలి.

దండకారణ్యంలో పశ్చిమ బస్తర్ డివిజన్ గంగలూరు ఏరియా కొర్సెల్ గ్రామం వద్ద జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో శత్రు బలగాలు వేసిన మోర్టార్ షెల్ పేలి కామ్రేడ్ కిస్మత్ అమరుడయ్యాడు. అతను కంపెనీ-2లో పిపిసిఎంగా పనిచేస్తున్నాడు. గెరిల్లా డాక్టర్‌గా వైద్య సేవలు అందిస్తూ తోటి కామ్రేడ్స్, ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నాడు. మహిళా కామ్రేడ్స్ సనోతి, సుమిత్రలు ఉత్తర బస్తర్‌లోనుట టేక్‌మెట్ట గ్రామంలో ఒక శత్రు దాడిని తిప్పికొడుతూ అమరులయ్యారు. 2013 మే 17న దంతేవాడ జిల్లా అరన్‌పూర్ పోలీస్‌స్టేషన్ నుంచి సర్చింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్న సిఆర్‌పిఎఫ్, ఎస్‌టిఎఫ్, జిల్లా పోలీసుల సంయుక్త బలగాలపై పురుంగిల్ గ్రామ సమీపంలో మన పిఎల్‌జిఏ బలగాలు ఆంబుష్ నిర్వహించాయి. ఇందులో ఒక పోలీసు జవాను మరణించగా, ఇద్దరు గాయపడ్డారు. ఈ వీరోచిత పోరాటంలో జన్ మిలీషియా స్క్వాడ్ డిప్యూటీ కమాండర్ కామ్రేడ్ మసు అమరుడయ్యాడు. 2013 జూన్ 8న ఆర్‌కెబి (మాన్‌పూర్) డివిజన్‌లో జరిగిన ఒక తీవ్రమైన పోరాటంలో కామ్రేడ్స్ ఉదమ్ సింగ్ (ఏసిఎస్), మహిళా సభ్యురాలు తార అమరత్వం దండకారణ్యంలోని మైదాన ప్రాంతాలలో మన కృషికి ఒక పెద్ద నష్టం. 2013 జూన్ 13న నేల్‌నార్ ఏరియాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ సరిత (బెటాలియన్-2 సభ్యురాలు) నేలకొరిగింది.

జల్-జంగల్-జమీన్‌లపై ప్రజల నిజమైన హక్కును పరిరక్షిస్తూ, దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్‌లలో మొగ్గతొడుగుతున్న ప్రజా రాజకీయాధికారాన్ని రక్షిస్తూ, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపజేయడంలో ఇతర అనేక మంది కామ్రేడ్స్ తమ ప్రాణాలు ధారపోశారు.

ఈ కాలంలో చాలా బాధాకరంగా వర్గ పోరాటంలో రాటుదేలిన, దశాబ్దాల విప్లవ జీవితం, అనుభవం కలిగిన ముగ్గురు సీనియర్ కామ్రేడ్స్‌ను మనం కోల్పోయాం. కామ్రేడ్ గడ్డం లక్ష్మి అలియాస్ మహిత సెంట్రల్ రీజియన్ పొలిటికల్ స్కూల్ (రీపోస్) టీచర్‌గా, రాష్ట్ర స్థాయి

సీనియర్ మహిళా కామ్రేడ్‌గా ప్రజలకు, విప్లవానికి మూడు దశాబ్దాల పాటు సేవ చేసి, 2013 ఏప్రిల్ 29న మలేరియా బారినపడి అమరురాలైంది. ఆమె ఒక గొప్ప ఆదర్శ కమ్యూనిస్టు. ఆమె శత్రువు ఉచ్చులో రెండుసార్లు చిక్కుకున్నప్పటికీ, చంపుతామని బెదిరించినప్పటికీ గుండె నిబ్బరాన్ని ఏమాత్రం కోల్పోలేదు. ఏపి, ఏఓబిలలో పట్టణ, గ్రామీణ మహిళా ఉద్యమాన్ని అభివృద్ధి చేయడంలో, మహిళా కామ్రేడ్స్‌ను అభివృద్ధి చేయడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, ఏఓబి స్పెషల్ జోన్ స్థాయి మహిళా సబ్‌కమిటీలలో సభ్యురాలిగా మహిళా సమస్య పట్ల పార్టీ అవగాహనను పెంపొందింపజేయడంలో ఆమె తోడ్పాటును అందించింది. ఆమె కొన్ని సం॥ల పాటు పట్టణ, గ్రామీణ, అటవీ ప్రాంతాలలో పనిచేసి మహిళలను, పట్టణ పేదలను, ఆదివాసీలను, రైతాంగాన్ని సంఘటితం చేసింది. రాజకీయ టీచర్‌గా సెంట్రల్ రీజియన్‌లో క్యాడర్లకు రాజకీయ విద్యను అందించడంలో ఆమె గొప్పగా తోడ్పడింది. డికెలో కేడర్ల విద్య కొరకు సిలబస్‌లను తయారు చేయడంలో తోడ్పడింది. ఆమె ఒక మంచి రచయిత, వక్త. ఆమె శారీరకంగా బలహీనంగా, తీవ్ర అనారోగ్యంతో ఉన్నప్పటికీ, కేడర్లను విద్యావంతం చేసేందుకు, ఎంఎల్ఎంతో వారిని సాయుధ చేసేందుకు ఆమె తీవ్రంగా కృషి చేసింది. ప్రేమాభిమానాలను పంచడం ద్వారా అందరి చేత ప్రేమించబడింది. మహిళా సమస్యపై లోతైన అధ్యయనం ద్వారా అందరి మన్ననల్ని పొందింది.

కామ్రేడ్ కనకస్వామి అలియాస్ అమన్ డికె టెక్నికల్ డిపార్ట్‌మెంట్ (టిడి)లో సీనియర్ డివిసి స్థాయి కామ్రేడ్. మలేరియా బారినపడి 2012 సెప్టెంబర్ 24న అమరుడయ్యాడు. మూడు దశాబ్దాల తన సుదీర్ఘ విప్లవ జీవితంలో అతను వరంగల్ జిల్లా కమిటీ, హైదరాబాద్ సిటీ కమిటీల కొరియర్‌గానూ, టిడిలోని ఆయుధాల తయారీ, సరఫరా యూనిట్లలోనూ పనిచేసి ప్రజలకు, విప్లవానికి నిస్వార్థంగా సేవ చేశాడు. రూర్కెలాలో ఇతర కామ్రేడ్స్‌తో పాటు అరెస్టయినప్పుడు చిత్రహింసలకు తలవంచలేదు. జైలులో సైతం ధైర్యాన్ని ప్రదర్శించి ఆదర్శంగా నిలిచాడు. జైలు నుండి విడుదలైన తర్వాత డికెలోని టిడిలో చేరి గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడానికై గెరిల్లాల కోసం ఆయుధాల తయారీ, సరఫరా చేయడానికి చాలా తీవ్రంగా కృషి చేశాడు. ఆయన ఒక ఆదర్శ కమ్యూనిస్టు. నైపుణ్యం ఉన్న రెడ్ టెక్నీషియన్.

కామ్రేడ్ నొహరి బాయి అలియాస్ సమిత (ఏసిఎం) రెండు దశాబ్దాలకు పైగా నిస్వార్థంగా విప్లవానికి సేవ చేసి, క్యాన్సర్ బారిన పడి 2013 ఫిబ్రవరి 7న అమరురాలైంది. ఆమె గడ్చిరోలి జిల్లాలో ఒక ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చింది. గడ్చిరోలిలో, ప్రస్తుత గోందియాలో దళాల్లో పనిచేస్తూ ప్రజలను సంఘటితం చేసింది. ఆమె పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లలో రెండుసార్లు గాయపడింది. కానీ ఎన్నడూ వెనకంజ వేయలేదు. ఆమె డికె ప్రెస్ యూనిట్‌లో నాలుగు సంవత్సరాలు పనిచేసింది. తర్వాత మాడ్‌లోని ఒక ఆర్‌పిసిలో వ్యవసాయ శాఖకు బదిలీ చేయబడింది. అక్కడే ఆమె చివరి వరకూ పనిచేసింది. ఆమె పనిచేసిన గ్రామాలలో ప్రతి

కుటుంబంలో ఒక కుటుంబ సభ్యురాలిగా కలిసిపోవడంలో ఆమె ఉన్నత ఆదర్శాలను నిలబెట్టింది. ఆమె మరే ఇతర ప్రయోజనాన్ని ఆశించకుండా విప్లవం కోసం తీవ్రంగా కృషి చేసింది. చివరి రోజుల్లో తన కంటిచూపు కోల్పోయినప్పటికీ, అనారోగ్యానికి గురైనప్పటికీ పల్లెతి చెప్పేది కాదు, బెంబేలెత్తి పనిచేయలేనని అనలేదు. కామ్రేడ్ సమిత ఆదర్శాలను మనం అందరం అనుసరించాలి. ఈ ముగ్గురు సీనియర్ కామ్రేడ్స్‌ను అనారోగ్య కారణాల వల్ల కోల్పోవడం వారు పనిచేస్తున్న రంగాలలో మన పార్టీకి తీవ్రమైన నష్టం.

కామ్రేడ్ జువ్వాజి వెంకట సుబ్బయ్య (75) మన పార్టీలో సీనియర్ నాయకుడు. మహత్తర శ్రీకాకుళ సాయుధ రైతాంగ ఉద్యమ కాలం నుండి ఆయన ఉద్యమంతో ఉన్నాడు. వృద్ధాప్యం కారణంగా కన్నుమూశాడు. 1969లో శ్రీకాకుళంలో పనిచేయుడానికి వెళుతుండగా మార్గమధ్యంలోనే ఆయన అరెస్టయ్యాడు. మితవాద, అతివాద అవకాశవాదాలను తిప్పికొట్టడంలో ఆయన జైలులో కూడా నక్సల్బరీ రాజకీయాలతో, పంథాతో దృఢంగా అంటిపెట్టుకొని ఉన్నాడు. గుంటూరు జిల్లాలో, నల్లమల అడవుల్లో ఉద్యమానికి పునాదులు వేయడంలో తోడ్పడ్డాడు. ఆయన పార్టీలో ఒక దళ సభ్యుడి నుంచి జిల్లా కమిటీ సభ్యుడి వరకు వివిధ స్థాయిల్లో పనిచేశాడు. వృద్ధాప్యం, అనారోగ్య కారణాల వల్ల పార్టీ ఆయనను రైతాంగ వేదికకూ, ఐక్యసంఘటనా కార్యకలాపాలలో బహిరంగ కృషి చేయడానికీ బదిలీ చేసింది. చివరి వరకు ఆయన ఆ రంగంలోనే కొనసాగాడు. ఆయన తన నాలుగు దశాబ్దాలకు పైగా విప్లవ జీవితంలో పార్టీ ఎదుర్కొన్న అన్ని మెలికలు, మలుపుల్లోనూ, ఎగుడు దిగుడుల్లోనూ ఆయన దృఢంగా నిలబడ్డాడు. ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ ఉద్యమం వెనకంజను ఎదుర్కొన్నప్పుడు రాష్ట్రంలోని ప్రజలకు, ప్రజాసంఘాల కామ్రేడ్స్‌కు ఉత్తేజాన్ని కలిగించే ఒక వనరుగా తోడ్పడ్డాడు. మన పార్టీలోని అటువంటి మొక్కవోని సీనియర్ కమ్యూనిస్టు నాయకుల ఆదర్శాలను యువతరంలో ప్రచారం చేయడం, తమ ఆచరణలో వారి ఆదర్శాలను వంటబట్టించుకునేలా చేయడం మన బాధ్యత.

ఉత్తర గడ్చిరోలి డివిజన్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ కారం సోమ్లి (ఇందిర) 2013 మే నెలలో పాముకాటు వల్ల కన్నుమూసింది. అనుభవం ఉండి, ప్రజలలో నాయకురాలిగా గుర్తింపు పొందిన ఆమె మరణం ఒక తీవ్రమైన నష్టం. ఆమె పశ్చిమ బస్తర్ డివిజన్‌లో రిక్రూట్ అయి, పార్టీ నిర్ణయం మేరకు గడ్చిరోలికి వెళ్లి, ప్రజల, కేడర్ల విశ్వాసాన్ని చూరగొంది. తన జీవన సహచరుడు కామ్రేడ్ కైలాస్ కొద్ది రోజుల క్రితమే సిందేసూర్ ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. బీహార్‌లోని కోయల్-శంఖ్ జోన్‌లో కామ్రేడ్ బుధరామ్ కూడా పాముకాటుకు బలయ్యాడు. బార్సూర్ దళానికి చెందిన (తూర్పు బస్తర్, డికె) కామ్రేడ్ మైను ఇంద్రావతి నదిని దాటుతుండగా మునిగి చనిపోయాడు. వీళ్లంతా ప్రమాదాలలో మృతి చెందినప్పటికీ, వారి నిబద్ధత, అంకితభావం మనకు ఎల్లప్పుడూ ఒక ఉత్తేజంగా నిలుస్తాయి.

కర్నాటకలోని మల్నాడు ప్రాంతం (పశ్చిమ కనుమలు)లో విప్లవోద్యమాన్ని అణచివేసేందుకై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు క్రూరమైన దాడిని తీవ్రతరం చేశాయి. మన పిఎల్‌జిఏ బలగాలకూ, శత్రు బలగాలకూ మధ్య అనేక ఎన్‌కౌంటర్లు చోటు చేసుకున్నాయి. దక్షిణ కన్నడ జిల్లా కడబ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2012 సెప్టెంబర్ 2న జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ ఎల్లప్ప అలియాస్ దినకర్ (ఏసిఎం) అమరుడయ్యాడు.

పశ్చిమ బంగ్‌లో లాల్‌గఢ్ ఉద్యమం వెనుకంజ వేయడం, కామ్రేడ్ కిషన్‌జీ అమరత్వంతో దొరికిన అవకాశాన్ని వినియోగించుకొని అక్కడి మావోయిస్టు ఉద్యమాన్ని పూర్తిగా అణచివేయడానికి మమత ప్రభుత్వం, కేంద్రం నిరాఘాటంగా సాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్ హంట్‌లో భాగంగా కూంబింగ్ ఆపరేషన్లు, అరెస్టులు, ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయి. 2012 నవంబర్‌లో సాయుధ బలగాలతో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో పురులియా జిల్లా అయోధ్య ఏరియా దళానికి చెందిన ఇద్దరు సీనియర్ దళ సభ్యులు అమరులయ్యారు.

జైళ్లలో కూడా కొంతమంది కామ్రేడ్స్ అమరులయ్యారు. జైలు అధికారులు తగిన వైద్య సహాయం అందించడంలో నిర్లక్ష్యం చేసిన కారణంగా కొండగావ్ జిల్లా బడే వెడమ గ్రామానికి చెందిన కుంజాం కోసా (నక్సలైటు ఖైదీ) 2013 మే 6న అమరుడయ్యాడు.

నాయకత్వ పరంగా, పార్టీకి చెందిన ఒక సీనియర్ నాయకుడిని (కామ్రేడ్ వెంకట సుబ్బయ్య), ఇద్దరు ఎస్‌జడ్‌సి స్థాయి కామ్రేడ్స్‌ను (కామ్రేడ్స్ మహిత, సుధాకర్), ఒక ఆర్‌సిఎం (కామ్రేడ్ ప్రశాంత్)ను, 7 గురు డివిసి/జడ్‌సి స్థాయి కామ్రేడ్స్‌ను, ముగ్గురు సబ్‌జోనల్ కమిటీ స్థాయి కామ్రేడ్స్‌ను, ఇద్దరు ఏసి కార్యదర్శులను, 11 మంది ఏసి సభ్యులను మనం కోల్పోయాం. అమరులైన ఇతరులలో పిఎల్‌జిఏలో, గ్రామాలలోని వివిధ స్థానిక సంస్థలలోని పిఎంలు, సభ్యులు, ప్రజలు ఉన్నారు. గత జూలై 28 నుంచి ఇప్పటి వరకూ మొత్తం 23 మంది మహిళా కామ్రేడ్స్ అమరులయ్యారు.

సార్కిన్‌గూడ నరమేధం జరిగి ఒక సంవత్సరం గడవక ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దండకారణ్యానికి చెందిన బీజాపూర్ జిల్లా ఎడ్స్‌మెట్ట గ్రామంలో అలాంటిదే మరో దారుణ నరమేధానికి పాల్పడ్డాయి. మే 17న జరిగిన ఈ ఘటనలో నలుగురు మైనర్లతో సహా 8 మంది ఆదివాసీలు హత్యకు గురయ్యారు. ప్రజలను భయభ్రాంతం చేయడం, పార్టీ నుంచి వారిని వేరుచేయడం, ఉద్యమం బలంగా ఉన్న ప్రాంతాలను దెబ్బతీయాలనే అర్ధసైనిక, పోలీసు, ఇంటలిజెన్స్ ఉన్నతాధికారుల ఉద్దేశపూరిత పథకంలో భాగంగానే నరమేధాలు సాగించేందుకై గ్రామాలను ఈ విధంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న ఎంఓయులు ప్రజా ప్రతిఘటన కారణంగా చిత్తు కాగితాల్లా మారిపోతుండగా, వాటిని అమలు చేయడంలో ప్రధాన అడ్డంకులలో ఒకటిగా ఉన్న విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో తీవ్రతరం చేస్తున్న నూతన దాడులలో భాగమే ఈ నరమేధాలు.

ఈ కాలంలో వివిధ ఏరియాల్లో పోలీసులు విచ్చలవిడిగా చేసిన కాల్పుల్లో, పట్టుకొనిపోయి

సాగించిన బూటకపు ఎన్‌కౌంటర్లలో ఒక డజనుకు పైగా గ్రామస్థులు, కార్యకర్తలు హత్యకు గురయ్యారు. శత్రు బలగాలు సాగించిన విచ్చలవిడి కాల్పుల్లో అనేక మంది ప్రజలు గాయపడ్డారు. మరి కొందరు జీవితాంతం వికలాంగులయ్యారు. 2012 సెప్టెంబర్‌లో కాంకేర్ జిల్లా నిర్మెట్ట గ్రామంలో చైను అనే గ్రామీణ యువకుడిని పట్టుకొని తర్వాత హత్య గావించారు. అనేక రంగాలలోనూ, కంపెనీ–2లోనూ పనిచేసి అనుభవం సంపాదించిన కామ్రేడ్ సలీమ్‌ను 2013 ఫిబ్రవరిలో పట్టుకొని అవునార్ (పశ్చిమ బస్తర్)లో ప్రజల ముందు కాల్చిచంపారు. తూర్పు బస్తర్‌లోని మఢోనార్ గ్రామ జన్ మిలీషియా కార్యకర్త బుధరామ్ నేండిని, ఓంగ్‌నార్ గ్రామానికి చెందిన జైసింగ్, ఫుల్‌సింగ్ (అన్నదమ్ములు)లను పోలీసులు పట్టుకొని హత్య గావించారు. యువరైతు పండిరామ్‌ను కూడా గ్రామస్థుల ముందే పోలీసులు హత్య చేశారు.

ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ 2013 మార్చి 8న కంచాల గ్రామాన్ని చుట్టుముట్టి విచ్చలవిడిగా జరిపిన కాల్పుల్లో గ్రామ మహిళ వంజం దేవి మరణించింది. మరో గ్రామస్థుడు తీవ్రంగా గాయపడ్డాడు.

బీహార్–ఝార్ఖండ్–ఉత్తర ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలోని మధ్యజోన్‌లో కామ్రేడ్ జితేందర్, మాజీ కార్యకర్త పరాస్‌లు బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్యకు గురి కాగా, పోలీసు లాకప్‌లో కామ్రేడ్ మదన్ అమరుడయ్యాడు.

ఒడిశాలోని గజపతి జిల్లా భలియాగూడ గ్రామంలో ఐదుగురు గ్రామస్థులు ఐబా పద్రా (35), శ్యామ్‌సన్ మాఝీ (50), ఘాసీరామ్ బాగ్‌సింగ్ (33), లక్ష్మీకాంత నాయక్, సనతన్ మల్లిక్ (27)లను పోలీసులు నిర్దాక్షిణ్యంగా హత్య చేశారు.

పెద్దయెత్తున గ్రామాల విధ్వంసం, అత్యాచారాలు/సామూహిక అత్యాచారాలు, అరెస్టులు, అక్రమ కేసులు బనాయించి జైళ్లలో కుక్కడం, కొట్టడం మొదలైనవి కౌంటర్–ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్లలో భాగంగా రోజువారీగా నిరాఘాటంగా కొనసాగుతున్నాయి. వీటితో పాటు మానసిక యుద్ధాన్ని, బూటకపు సంస్కరణలను సైతం కొనసాగిస్తున్నారు. వర్గశత్రువులను, వారి ఏజెంట్లను, పోలీసు/పారామిలటరీ ఇన్ఫార్మర్లను, కార్పొరేట్ ఏజెంట్లను, ఉద్యమం నుంచి దిగజారిన శక్తులను, హంతక గ్యాంగులను, కోవర్టులను వినియోగించుకొని విష ప్రయోగం, కోవర్టు ఆపరేషన్ల ద్వారా పార్టీ, పిఎల్‌జిఏ కామ్రేడ్స్‌ను, ఆర్‌పిసి కార్యకర్తలను హత్య గావించాలని ప్రయత్నిస్తున్నారు.

**కామ్రేడ్స్,**

ప్రజలపై యుద్ధం నానాటికీ తీవ్రతరమవుతూ మరింత క్రూరంగా మారుతోంది. చిత్రహింసలు, వేధింపులు, ఉరిశిక్షలు, యావజ్జీవ శిక్షలతో సహా తీవ్రమైన జైలు శిక్షలు, బెయిల్ నిరాకరణ, అమానవీయ జీవన పరిస్థితులను ఎదుర్కొంటూ నాలుగు వేలమందికి పైగా మావోయిస్టు రాజకీయ ఖైదీలు జైళ్లలో మగ్గుతున్నారు. అయితే వీటన్నింటికి వ్యతిరేకంగా వారంతా విప్లవ స్ఫూర్తితో పోరాడుతూ జైళ్ల యుద్ధరంగాన్ని బలోపేతం చేస్తున్నారు. సైన్యం కోవర్టు భూమిక పెరిగింది. ప్రత్యేకించి మే 25 ఘటన తర్వాత దీనిని మరింత పెంచాలని

పాలకవర్గాలు కోరుతున్నాయి. మే 25 తర్వాత అనేక అణచివేత చర్యలను ప్రకటించినప్పటికీ, అవన్నీ ఇప్పటికే కొనసాగుతున్న పథకాలకు కొనసాగింపే. 2,199 కమ్యూనికేషన్ టవర్లను నిర్మించాలని పథకం రూపొందించారు. లాజిస్టికల్ సపోర్టు పేరుతో మరిన్ని ఐఏఎఫ్ హెలికాప్టర్లు, నాగపూర్‌లో ఒక నూతన హెలికాప్టర్ యూనిట్ కేటాయించబడ్డాయి. నిజానికి వాటి లక్ష్యం గెరిల్లాలపై దాడి చేసేందుకు వినియోగించడం. సాయుధ ఘర్షణలు జరుగుతున్న సందర్భంగా లాజిస్టికల్ సపోర్టును అందించడంతో పాటు గ్రామాలపై దాడులు చేసేందుకు కూడా ఇప్పటికే వాటిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఇంటలిజెన్స్ సమాచార సేకరణ కోసం ఉపయోగిస్తున్న డ్రోన్లను భవిష్యత్తులో మరింత విస్తృతంగా బాంబింగ్‌కు సైతం వినియోగించేందుకై పథకం రూపొందించారు. బలప్రయోగంతో మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (మౌలిక సదుపాయాలు) అభివృద్ధి కోసం భారీ స్థాయిలో అనేక శక్తులతో కూడిన అర్ధసైనిక బలగాలను మోహరిస్తున్నారు. మే 25 ఘటన జరిగిన వెంటనే రెండు బెటాలియన్లను బస్తర్‌కు తరలించారు. త్వరలో దేశంలోని మావోయిస్టు ప్రాంతాలలో 27 బెటాలియన్ల అర్ధసైనిక బలగాలను మోహరిస్తామని ప్రకటించారు. భారీ స్థాయి దాడులకై అప్పటికే తీవ్రస్థాయిలో ఉన్న అన్ని రకాల సన్నాహాలు మే 25 తర్వాత యుద్ధ ప్రాతిపదికన వేగవంతమయ్యాయి. కార్పొరేట్ మీడియాను ఇతర పద్ధతులను వినియోగించుకుంటూ మున్నెన్నడూ లేనిస్థాయిల్లో మానసిక యుద్ధాన్ని నిర్వహిస్తూ మావోయిస్టులపై, విప్లవోద్యమంపై విషాన్ని చిమ్ముతున్నారు. ఇదంతా బూటకపు సంస్కరణలతో సమన్వయించి కొనసాగిస్తున్నారు. ఉద్యమ ప్రాంతాలలో సాయుధ బలగాలచే ఏదో ఒక సివిక్ ప్రోగ్రాం లేకుండా ఒక్క రోజు కూడా గడవడం లేదు. 'సరండా నమూనా'ను డికె, బిజె, ఒడిశాల్లోని మరిన్ని గెరిల్లా ప్రాంతాలకు విస్తరించారు. మావోయిస్టు ప్రాంతాలలో ఇప్పటికే అమలవుతున్న సమీకృత కార్యాచరణ పథకం (ఐఏపి) కాలపరిమితిని విస్తరించి మరో 1000 కోట్ల రూ॥లను కేటాయించారు. 'రోషిణి' పేరుతో యువకులకు ఉద్యోగాలిస్తామనే బూటకపు హామీలతో కూడిన పథకాన్ని రెండు జిల్లాల (సుక్మా, పశ్చిమ సింఘ్‌భూం) నుంచి 24 జిల్లాలకు విస్తరించారు. శత్రువు ప్రధాన కేంద్రీకరణ ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల నుంచి ప్రారంభమై, లాల్‌గఢ్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లలోని గంగానది దక్షిణ ప్రాంతం వరకూ ఉన్న మన గెరిల్లా బేసులపై, గెరిల్లా ప్రాంతాలపై ఉన్నది. వ్యూహాత్మకంగా ఆ ప్రాంతాలను ఒకదాని నుంచి మరొకదానిని వేరుచేయడానికి, వాటిని అణచివేయడానికి వాడు కార్పెట్ సెక్యూరిటీతో వాటిని చుట్టుముడుతున్నాడు. ఈ వ్యూహాత్మక పథకం ప్రత్యక్షంగా భారత సైన్యం పర్యవేక్షణ కిందే రూపొందించబడి అమలు చేయబడుతుంది.

భారత పాలకవర్గాలు ప్రకటించిన దానికి సరిగ్గా భిన్నంగా భారత ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలో కూరుకుపోతోంది. దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న ఎంఓయులను అమలు చేయడానికి వారి మీద పెరుగుతున్న ఒత్తిడి ఫలితంగా; ఆ 'అభివృద్ధి నమూనా' పట్ల ప్రజలలో తీవ్రమైన అసంతృప్తికి దారితీస్తూ, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల భ్రమలు తొలగిపోతూ వారిని ప్రతిఘటిస్తున్న ప్రజలపై మరింతగా క్రూరత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.

అంతర్జాతీయంగా, 1930ల తర్వాత కాలంలో మునుపెన్నడూ లేనంతటి తీవ్రస్థాయిలో ఆర్థిక సంక్షోభం నిరంతరాయంగా కొనసాగుతున్న ఫలితంగా, హతాశులవుతున్న సామ్రాజ్యవాదులు ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ మొదలైన వాటిలో హత్యలు-విధ్వంసకాండలను కొనసాగించడంతో పాటుగా సిరియా వంటి దేశాలపై దాడులు, ఉత్తర కొరియాను బెదిరించడం వంటివి పెరుగుతున్నాయి. సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి ప్రోద్బలంతో ఫిలిప్పైన్స్, భారతదేశాలలోని పాలకవర్గాలు విప్లవోద్యమాలను క్రూరంగా అణచడం కోసం వరుసగా ఒప్లాన్ బయనిహాన్, ఆపరేషన్ గ్రీన్ హంట్ వంటి దేశవ్యాప్త, బహుముఖ, అత్యంత అభివృద్ధి నిరోధక ఆపరేషన్లను అత్యంత తీవ్రస్థాయిలో కొనసాగిస్తున్నారు. మొత్తం మీద నిరంకుశ చట్టాల ద్వారా కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, మేధావి వర్గంతో పాటుగా పీడిత దేశాలలోని ప్రజాస్వామిక, విప్లవ శక్తులపై దాడులు కొనసాగుతున్నాయి.

ఈ దాడిలో గత సంవత్సరం నాయకత్వ పరంగా, స్వీయాత్మక శక్తుల పరంగా మనం కొన్ని తీవ్రమైన నష్టాలను పొందినప్పటికీ, మొత్తం మీద మన విప్లవోద్యమం బలంగా ఉన్న ప్రాంతాలలో దానిని ప్రతిఘటించడంలో విజయవంతమయ్యాం. ఉద్యమం నిలదొక్కుకోకుండా చేయడంలో, దాన్ని ధ్వంసం చేయడంలో శత్రువు విఫలం కావడం దానికదే ఒక విజయం. వివిధ ఎత్తుగడల ఎదురుదాడులు కొనసాగుతూ శత్రువుకు నష్టాలు జరుగుతున్నాయి. గత స్థాయిలో కాకపోయినా ఆయుధాలు, అమ్యునిషన్ స్వాధీనం జరుగుతోంది. 2013 జనవరి 7న లాతేహార్ జిల్లా అమ్‌వాడిహా గ్రామం వద్ద మన సాహసిక పిఎల్‌జిఏ గెరిల్లాలు నిర్వహించిన ఒక భారీ ఆంబుష్‌లో 17 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లను తుడిచిపెట్టారు. వారి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మే 25న జరిగిన ఆంబుష్ సల్వాజుడుం నిర్మాత, నరహంతకుడు మహేంద్ర కర్మ, మరి కొంతమంది ప్రజా శత్రువుల తుడిచివేత దేశవ్యాప్తంగానూ, ప్రత్యేకించి డికెలోని విప్లవ ప్రజానీకాన్ని ఉత్సాహపరిచింది. మునుపెన్నడూ లేనివిధంగా అవినీతి, కుంభకోణాలు పెరగడం, పార్లమెంటరీ వ్యవస్థ దివాళాకోరుతనం వల్ల మన పార్టీ ముందుకు తెస్తున్న విప్లవ ప్రత్యామ్నాయం వైపుగా ప్రజలు మరింతగా ఆకర్షితులవుతున్నారు. అనేక సమస్యలపై, ప్రత్యేకించి నిర్వాసిత సమస్యపై ప్రజలు మన పార్టీ నాయకత్వంలో సమీకృతులవుతున్నారు. నూతన ప్రాంతాలలోకి విస్తరించడం కోసం, ఇప్పటికే ఉనికిలో ఉన్న జోన్లలో అంతర్గతంగా విస్తరించడం కోసం మన ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా, భారతదేశంలో ప్రజాయుద్ధానికి సంఘీభావంగా అంతర్జాతీయంగా సాగుతున్న క్యాంపెయిన్ మరింతగా సంఘటితమవుతూ, మన దేశంలో పోరాడుతున్న ప్రజలకు అవసరమైన నైతిక మద్దతును అందిస్తోంది. మన అమరుల గొప్ప త్యాగాలు, శత్రు బలగాలను మనం ప్రతిఘటిస్తుండడం, ప్రజాయుద్ధంలోకి ప్రజలను సమీకరించడం, అనేక అననుకూలతలను, కష్టాలను ఎదుర్కొంటున్నప్పటికీ అనేక విజయాలు సాధిస్తుడడం అనే వాస్తవం, భారతదేశంలోని మన నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఈ

రకమైన మద్దతు సాధించడంలో కీలకమైన అంశాలు. నిరంతరాయంగా కొనసాగుతున్న శత్రుదాడి మధ్య మనం ఎదుర్కొంటున్న, కఠిన పరిస్థితుల నుండి బయటపడేందుకు మనం తీవ్రంగా కృషి చేస్తున్నాం. ఈ క్రమంలో మనం సాధించిన పాజిటివ్ ఫలితాలన్నింటి వెనుక మన ప్రియతమ అమరవీరుల విలువలు, ఆదర్శాలు, అత్యున్నతమైన త్యాగాలు, సాహసం, అంకితభావం, నిబద్ధత ఉన్నాయి.

**కామ్రేడ్స్,**

ప్రపంచంలో రోజు రోజుకూ సామ్రాజ్యవాదానికీ, పీడిత జాతులు-ప్రజలకూ మధ్య ప్రధాన వైరుధ్యం, ఇతర రెండు మౌలిక వైరుధ్యాలు పదునెక్కుతూ, మన దేశంలోనూ, ప్రపంచంలోనూ భౌతిక పరిస్థితి విప్లవానికి మరింత అనుకూలంగా మార్చుతున్నాయి. అన్ని రకాల సామాజిక వైరుధ్యాలు పదునెక్కుతున్నాయి. వాటిని పరిష్కరించడం కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రజలు మరింతగా విప్లవ పంథాను ఆమోదిస్తూ, ప్రచారం చేస్తూ, అందులో చేరుతున్నారు. అద్భుతమైన ప్రస్తుత ఈ భౌతిక పరిస్థితిని మనం ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజాయుద్ధంలోకి ప్రజలను క్రియాశీలంగా, విస్తృతంగా కదిలించాలి. గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేయడం ద్వారా విప్లవాన్ని పురోగమింపజేయాలి. అనుకూల పరిస్థితిని పూర్తిగా ఉపయోగించుకునేందుకై మనం ప్రయత్నించాలి. స్వీయాత్మక పరిస్థితులను సృష్టించుకోవాలి. మన ఉద్యమం సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న, వర్గపోరాటంలో ప్రజలు స్వయంగా అనుభవం సంపాదించుకున్న, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల నుంచి లాల్‌గఢ్, బీహార్‌లోని గంగానదీ దక్షిణ ప్రాంతం వరకు కనీసం కొన్ని ప్రాంతాల్లో అయినా తమ రాజకీయాధికారాన్ని చవిచూసిన, లక్షల చదరపు కిలోమీటర్లలో పరిధిలోని కోట్లాది ప్రజలు నివసించే విస్తారమైన ప్రాంతంలో ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేసేందుకు అనేక అవకాశాలు ఉన్నాయి. వీటిపై ఆధారపడి మనం స్వీయాత్మకంగా ఇటీవల ఎదుర్కొన్న ప్రతికూలతలను అధిగమించగలుగుతాం. మన పార్టీ ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ ఇచ్చిన కర్తవ్యాల పరిపూర్తి దిశగా పురోగమించగలుగుతాం. ఇందుకోసం మనం ఈ కింది తక్షణ కర్తవ్యాలను చేపడుదాం.

1) పార్టీని బలోపేతం చేసి బోల్షివీకరిద్దాం. పిఎల్‌జిఏను, ప్రజా పునాదిని బలోపేతం చేసి విస్తరిద్దాం. మన సాధారణ రాజకీయ పంథాకు దృఢంగా అంటిపెట్టుకొని ఉండడమే కాక, శత్రు దాడి గంభీరంగా పెరుగుతున్న చోట, మనం నష్టాలు ఎదుర్కొంటున్న చోట, కొంతమంది వ్యక్తులు మితవాద అవకాశవాద వాదనలు ముందుకు తెచ్చి పార్టీని వదిలివెళ్లిన చోట దానిని సృజనాత్మకంగా దృఢంగా అమలు చేద్దాం. అటువంటి మితవాద అవకాశవాద ధోరణులు భవిష్యత్తులో కూడా తలయెత్తే అవకాశం ఉన్నందున వాటి పట్ల జాగరూకత వహిద్దాం, వాటిని తిప్పికొడదాం. అంతర్గత సంబంధాలలో పార్టీ ఐక్యతకు, పార్టీకి-ప్రజలకు మధ్య సంబంధాలకు హాని కల్గిస్తూ, మనల్ని ప్రజల నుంచి వేరుచేస్తూ, శత్రువుకు తోడ్పడుతున్న ఒంటెత్తుపోకడ, పెత్తందారీ ధోరణులను వదిలించుకుందాం.

2) ప్రపంచంలో, దేశంలో నెలకొని ఉన్న విప్లవ సంక్షోభాన్ని అర్థం చేసుకుందాం. సమరశీల ప్రజా పోరాటాలలోకి ప్రజల్ని విస్తృతంగా సమీకరిద్దాం. వివిధ రీజియన్లలో, ప్రాంతాలలో నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేద్దాం.

3) శత్రు వ్యూహం-ఎత్తుగడలలో, వాడి ఎల్ఐసి పాలసీలో వస్తున్న మార్పులను అధ్యయనం చేద్దాం. ఆ అధ్యయనంపై ఆధారపడి, మన రాజకీయ-సైనిక ఎత్తుగడలను అభివృద్ధి చేద్దాం. గెరిల్లా యుద్ధ కార్యాచరణ సూత్రాలను ప్రజలపై ఆధారపడి సృజనాత్మకంగా అన్వయిద్దాం. ఇది మన చొరవను అభివృద్ధి చేసేందుకు తోడ్పడుతుంది.

4) ఈ దశలో శత్రుదాడికి విస్పష్ట లక్షణంగా ఉన్న సైన్యం, వాయుసేన, డ్రోన్ల మోహరింపుకు వ్యతిరేకంగా విశాలమైన ఉద్యమాన్ని; ప్రజలపై, విప్లవకారులపై రాజ్యం సాగిస్తున్న నరమేధాలను, ఇతర అన్ని రకాల అత్యాచారాలను తిప్పికొట్టే విధంగా బలమైన, విశాల పౌరహక్కుల ఉద్యమాన్ని నిర్మిద్దాం. మే 25 తర్వాత, క్రూరమైన ఫాసిస్టు దాడులు, విచ్చలవిడి దాడులు, నరమేధాలు, హెలికాప్టర్ల, డ్రోన్ల మోహరింపు, ఉపా వంటి నిరంకుశ చట్టాలను ఉపయోగించుకుంటూ ప్రజల గొంతులను నులమడం పెరుగుతున్నాయి. అందువల్ల ఈ కర్తవ్యాలకు గొప్ప ప్రాముఖ్యత ఉంది.

5) విప్లవ విజయాలను వమ్ము చేసేందుకు, ప్రజల నుంచి పార్టీని, పిఎల్జిఏను వేరుచేసేందుకు, మన పార్టీ ప్రజాపునాదిని దెబ్బతీసేందుకు, గెరిల్లా దాడులను, మన విస్తరణను నిరోధించేందుకు, ఈ కర్తవ్యాల్ని దృఢసంకల్పంతో పరిపూర్తి చేసే ప్రజా పోరాటాలను అణచివేసే లక్ష్యంతో సాగుతున్న పాలకవర్గాల ఫాసిస్టు ఆపరేషన్ గ్రీన్ హంట్ను తిప్పికొడదాం, ఓడిద్దాం.

**కామ్రేడ్స్,**

అమరవీరుల స్మారక వారాన్ని దేశవ్యాప్తంగా విప్లవోత్సాహంతో జరపండి. మన అందుబాటులో ఉన్న అన్ని సాధనాలను వీలైనంత విస్తృతంగా మన ప్రియతమ అమరవీరుల విలువలను, ఆదర్శాలను, అత్యున్నత త్యాగాలను, సాహసాన్ని, అంకిత భావాన్ని, నిబద్ధతను ప్రచారం చేయండి. వారి ఆకాంక్షల మేరకు, వాటిని ఒంటబట్టించుకొని ఒక నూతన ప్రజాస్వామిక భారతాన్ని నిర్మించేందుకై వారి మార్గాన్ని అనుసరించేలా ప్రజల్ని ఉత్తేజపరచండి. ప్రజలు, ప్రజలు మాత్రమే చరిత్ర నిర్మాతలు. అమరుల త్యాగాలతో ఉత్తేజితులైన ప్రజలు దీర్ఘకాల ప్రజాయుద్ధ క్రమంలో అద్భుతాలు సాధించగలరు. ఈ వాస్తవాన్నే ఇప్పటి వరకూ విజయవంతమైన విప్లవాలన్నీ ఎంతో గొప్పగా నిరూపించాయి.

విప్లవాభినందనలతో,

**కేంద్రకమిటీ,**

జూన్ 15, 2013 **సి.పి.ఐ. (మావోయిస్టు)**

# అమరుల గుండె నెత్తుర్లతో తడిసిన అరుణ పతాకను ఎత్తిపట్టండి!

# వారు నడచిన ప్రజాయుద్ధ బాటే

# మన దేశ విముక్తి మార్గమని ఎలుగెత్తి చాటండి!






*2014 జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల స్మారక వారాన్ని*
*స్ఫూర్తిదాయకంగా జరపాల్సిందిగా*
*పార్టీ శ్రేణులకు, పిఎల్‌జిఏ కమాండర్లు-పోరాటయోధులకు, విప్లవ ప్రజా*
*కమిటీలు-విప్లవ ప్రజా సంఘాలకు, విప్లవ ప్రజారాశులకు*
*సి.పి.ఐ. (మావోయిస్టు) కేంద్రకమిటీ పిలుపు!*

ప్రియమైన కామ్రేడ్స్,

ప్రజల కోసం మరణించడం హిమాలయ శిఖరాల కన్నా ఉన్నతమైంది. దోపిడి వర్గాల కోసం మరణించడం ఈక కన్నా తేలికైంది. మానవులకు అన్నింటి కంటే విలువైంది ప్రాణం. సామాజిక విప్లవం కోసం, ప్రజా ప్రయోజనాల కోసం కమ్యూనిస్టు విప్లవకారులు సంపూర్ణంగా అంకితమవుతారు. లక్ష్యసాధన కోసం వారు అకుంఠిత దీక్షతో పనిచేస్తూ తమ ప్రాణాలతో పాటు సర్వస్వాన్నీ అర్పిస్తారు. ప్రతి గొప్ప మార్పూ త్యాగాన్ని కోరుతుంది. వర్గాలు ఏర్పడినప్పటి నుండీ సమాజ చరిత్రంతా వర్గ పోరాట చరిత్రే అన్నది ఎంత వాస్తవమో, వర్గ పోరాటాల చరిత్ర అంతా త్యాగాల చరిత్రే అన్నది కూడా అంతే వాస్తవం.

మన దేశంలో మహత్తర నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు నుండి మొదలుకొని గత 47 సంవత్సరాలుగా కొనసాగుతోన్న నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో, మన పార్టీ సంస్థాపకులు, గొప్ప నాయకులు, అమరులు కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ కన్హయ్ చటర్జీలు రూపొందించిన దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గంలో లక్ష్యసాధనకై మునుముందుకు సాగుతూ వేలాది మంది కామ్రేడ్స్, ప్రజలు గొప్ప త్యాగాలు చేశారు. సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి మద్దతుతో, వారి నిర్దేశత్వంలో భారత పాలకవర్గాలు తీవ్రతరం చేసి కొనసాగిస్తున్న దేశవ్యాప్త ఫాసిస్టు, బహుముఖ దాడి, ప్రజలపై యుద్ధంలో – 'ఆపరేషన్ గ్రీన్ హంట్'లో ఈ సంవత్సర కాలంలో 120 మందికి పైగా (అఖిల భారత–2, దండకారణ్యం–59, బీహార్–ఝార్ఖండ్–22, ఆంధ్ర–ఒడిశా బార్డర్–24, ఒడిశా–4, తెలంగాణ–3, ఆంధ్రప్రదేశ్–3, పశ్చిమబెంగాల్–3, గుజరాత్–1) మన దేశ పీడిత జన ఉత్తమ పుత్రికలు, పుత్రులు అమూల్యమైన తమ ప్రాణాలను అర్పించారు.

ఇదే కాలంలో, నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో ఫిలిప్పైన్స్, టర్కీ, బంగ్లాదేశ్, పెరూలలో; సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికవర్గ విప్లవోద్యమాలలో; సామ్రాజ్యవాద దురాక్రమణ దాడికి గురైన దేశాలలో, ఇతర దేశాలలో సాగుతున్న జాతి విముక్తి పోరాటాలలో; ప్రపంచవ్యాప్తంగా అన్ని రకాల అభివృద్ధినిరోధకులకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలలో మావోయిస్టులు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత, మేధావులు, ప్రజాస్వామికవాదులు, ఉద్యోగులు, మహిళలు, ప్రజలు ఎంతో మంది ప్రపంచవ్యాప్తంగా తమ ప్రాణాలను ధారపోశారు.

భారత విప్లవంలో, ప్రపంచ విప్లవోద్యమాలలో నేలకొరిగిన ఈ అమరులందరికీ మన అమరవీరుల స్మారక వారం సందర్భంగా తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిద్దాం. వారందించిన ఉత్తేజంతో, వారి ఆకాంక్షలను, వారు కన్న కలల్ని నెరవేర్చడానికి దృఢసంకల్పంతో పోరాడుతామని పిడికిలి బిగించి శపథం చేద్దాం.

సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ, 2014 జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల స్మారక వారాన్ని స్ఫూర్తిదాయకంగా జరపాల్సిందిగా పార్టీ శ్రేణులకు, పిఎల్‌జిఏ కమాండర్లు–

పోరాటయోధులకు, విప్లవ ప్రజా కమిటీ (ఆర్‌పిసి)లకు, విప్లవ ప్రజా సంఘాలకు, విప్లవ ప్రజలకు పిలుపునిస్తోంది. మహత్తర భారత విప్లవ లక్ష్యం కొరకై తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన మన ప్రియతమ అమరవీరుల గొప్ప త్యాగాలను సంస్మరిస్తూ, వాటిని ఉన్నతంగా ఎత్తిపట్టాల్సిందిగా కోరుతోంది.

మన పార్టీ కేంద్రకమిటీ ప్రియతమ అమరవీరులందరికీ వినమ్రంగా అరుణాంజలి ఘటిస్తోంది. యెల్లప్పటికీ ఉత్తేజకరమైన ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అమరుల మహోన్నత, నిస్వార్ధపూరిత ఆశయాల పరిపూర్తికై పునరంకితం కావాల్సిందిగా పిలుపు నిస్తోంది.

అమెరికా సామ్రాజ్యవాదులచే నిర్దేశించబడిన ఎల్.ఐ.సి. విధానాన్ని అనుసరిస్తున్న భారత పాలకవర్గాలు ఈ సంవత్సర కాలంలో తమ దాడిని మరింత తీవ్రతరం చేస్తూ సాగించిన మోసపు దాడులలో కిందిస్థాయిలో ఎక్కువ మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, సంఖ్యాధిక్యత, విస్తృత ఆధునిక ప్రచార మాధ్యమాన్ని వినియోగించుకొని ప్రభుత్వ కిరాయి పోలీసు–అర్ధసైనిక బలగాలు మన ప్రజా గెరిల్లా బలగాలను, విప్లవ ప్రజా సంఘాల నాయకత్వాన్నీ, పార్టీ స్థానిక నాయకత్వాన్నీ నిర్మూలించేందుకు మోసపు దాడుల మీదనే ప్రధానంగా ఆధారపడుతున్నాయి. నిజానికి ఎల్‌ఐసి అంటేనే మోసపు యుద్ధం. భారత పాలకవర్గాలు దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో దాడి–సంస్కరణలు అనే ద్విముఖ వ్యూహంతో ఈ మోసపు యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి.

ఈ సంవత్సర కాలంలో శత్రు బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్లలో శత్రు దాడిని వీరోచితంగా తిప్పికొడుతూ 33 మంది వీర యోధులు అమరులయ్యారు. బూటకపు ఎన్‌కౌంటర్లు, హత్యాకాండలలో, నల్లదండు ముఠాలు, గూండాల దాడులలో 66 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. శత్రువు సాగించిన ఈ హత్యాకాండలలో 13 మంది సాధారణ, నిరాయుధ ప్రజలు కూడా ఉన్నారు. మన పార్టీ నాయకత్వంలోని పిఎల్‌జిఏ బలగాలు, ప్రజా మిలీషియా ప్రజల మద్దతుతో ఈ సంవత్సరం కాలంలో శత్రు బలగాలపై సాగించిన ఎత్తుగడల ఎదురుదాడులలో, టిసిఓసిలలో 118 కిరాయి పోలీసు, కమాండో, అర్ధసైనిక మూకలు మట్టికరవగా, 276 మంది గాయపడ్డారు. మన ఈ సాహసోపేత గెరిల్లా యుద్ధచర్యలలో ఇద్దరు గెరిల్లాలు అమరులయ్యారు. ప్రాణాంతకమైన వ్యాధులు, ప్రమాదాలు, ఇతర ఘటనలలో 12 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు.

ఈ సంవత్సర కాలంలో అమరులైన వారిలో భారత విప్లవ నేతలు కామ్రేడ్స్ సుశీల్ రాయ్, రవూఫ్; సీనియర్ కామ్రేడ్స్ సునీతి కుమార్ ఘోష్, ఆకుల భూమయ్య, కరదమ్ భట్; సీనియర్ మహిళా కామ్రేడ్స్ గజ్జెల సరోజన, శాంతక్క (దక్షిణ బస్తర్, డికె); ఇద్దరు డివిసిఎంలు కామ్రేడ్స్ నరేష్, లాల్సూ; సబ్–జడ్‌సిఎం కామ్రేడ్ కామేశ్వర్ సింగ్ అలియాస్ బ్రిజేశ్‌జీ (గఢవా, ఝార్ఖండ్)లు ఉన్నారు. వీరితో పాటు 13 మంది ఏసి/పిపిసిఎంలు (డికె – కామ్రేడ్స్ బొజ్జాల్, దన్ని, రీతా, నవీన్,

వీరు, నవీన్, సునీల్, పున్నీ, శ్యామ్కో, దర్బార్; ఏఓబి – కామ్రేడ్స్ నరేందర్ (మంగన్న), డుంబ్రి (మహేందర్), కామ్రేడ్ శిరీష, మాధవ్ అమరులైనారు. మన అమరులలో 67 మంది పార్టీ/పిఎల్‌జిఏ సాధారణ సభ్యులు [డికె – కామ్రేడ్స్ అప్కా శాంతి, జ్యోతి, విజయ్, పాముల చందు, సోమాల్, తాతి హితేష్, సుధీర్, సరిత, రాజేష్, మాధురి; బిజె – కామ్రేడ్ రామేష్ ముండా; ఏఓబి – కామ్రేడ్ ఊరాల్; ఒడిశా – కామ్రేడ్స్ సంతోష్, ధనాజీ, సుక్కాయి; తెలంగాణ – కామ్రేడ్ రాము; ఆంధ్రప్రదేశ్ – కామ్రేడ్ జానా బాబూరావు, నాగమణి, కవిత; స్టాఫ్ కామ్రేడ్ రాకేష్ (డికె), సాంస్కృతిక కార్యకర్త కామ్రేడ్ కోసా (మల్కన్‌గిరి)] మొదలైన కామ్రేడ్స్‌తో పాటు 5 గురు ప్రజా సంఘాలు/ఆర్‌పిసిల నాయకులు (డికె – కామ్రేడ్స్ బోటి, ఫాగూ, సుఖ్‌రాం, పశ్చిమ బెంగాల్ – కామ్రేడ్ హేమంత్ మహతో, మరొకరు), ఇద్దరు బాల కామ్రేడ్స్ పరదేశీ–లాతేహార్, గంగి–మల్కన్‌గిరి; 17 మంది వివిధ ప్రజా మిలీషియా యూనిట్ల కమాండర్లు, సభ్యులు (డికె – కామ్రేడ్స్ ఫాగూ, జోగాల్, ఉంగా, ఏఓబి – కామ్రేడ్స్ గంగా, ఊరా, ఇర్మా, పొదియా) ఉన్నారు. మొత్తం అమరులైన వారిలో 21 మంది మహిళా కామ్రేడ్స్ ఉన్నారు. జైలులో తీవ్ర అనారోగ్యం పాలై అధికారుల నిర్లక్ష్యంతో ముగ్గురు కామ్రేడ్స్ (డికె– రామ్‌లాల్, బుధరాం, ఏఓబి – రామా కోవాసి) అమరులయ్యారు.

మన పార్టీ సీనియర్ పొలిట్‌బ్యూరో సభ్యులు, భారత విప్లవ ప్రముఖ నాయకులు కామ్రేడ్ సుశీల్ రాయ్ (అశోక్, శోమ్, బరున్‌దా) సుదీర్ఘకాలం పాటు అనారోగ్యం తర్వాత 2014 జూన్ 18న ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో కన్నుమూశారు. దాదాపు అర్ధ శతాబ్ద కాలం పాటు, తన చివరి ఊపిరి వరకు పీడిత ప్రజల ప్రయోజనాల కోసం, విప్లవ ప్రయోజనాల కోసం నిస్వార్థంగా పాటుపడిన తమ గొప్ప పుత్రుడిని మన దేశ కార్మికవర్గం, పీడిత ప్రజలు కోల్పోయారు. కామ్రేడ్ సుశీల్ రాయ్ అమరులు, అజరామరులు!

కామ్రేడ్ సుశీల్ రాయ్ 76 సంవత్సరాల క్రితం ప్రస్తుత బంగ్లాదేశ్‌లో జన్మించారు. 1960ల ప్రారంభం నుంచి ఆయన తన 20ల ప్రారంభంలో కమ్యూనిస్టు ఉద్యమంలో క్రియాశీలమయ్యారు. ఆయన కార్మికవర్గ ఉద్యమంలో పనిచేసి 1963లో సి.పి.ఐ.లో చేరారు. ఆయన వియత్నాంపై అమెరికా అన్యాయ యుద్ధానికి నిరసనగా సాగిన అమెరికా వ్యతిరేక ప్రదర్శనలలో, 1966 ఆహార ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నారు. ఆయన సి.పి.ఐ.లోని రివిజనిస్టులకు వ్యతిరేకంగా సాగిన అంతర్గత పోరాటంలో భాగమయ్యారు. ఆయన తన తోటి సహచరుల మాదిరిగానే, రివిజనిస్టు సి.పి.ఐ. నుంచి చీలి ఆవిర్భవించిన సి.పి.ఐ.(ఎం) ఒక విప్లవ పార్టీగా రూపొందుతుందనే ఆశాభావంతో 1964లో అందులో చేరారు.

ఆయన చైనా విప్లవ మార్గంలో ఒక విప్లవ పార్టీ కోసం, నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ సన్నాహాలలో తలమునకలుగా ఉన్న కామ్రేడ్స్ కన్హయ్ చటర్జీ (కెసి), అమూల్య సేన్‌లతో సంబంధాలు పెట్టుకున్నారు. రివిజనిజం నడ్డివిరిచిన వసంత కాల మేఘగర్జన నక్సల్బరి ఇచ్చిన ఉత్తేజకరమైన పిలుపును సమర్థిస్తూ, 'నక్సల్బరీ ఏక్ హీ రాస్తా' అంటూ దానిని

ఆయన ఎత్తిపట్టారు. ఆయన తొలినాళ్ల నుంచే చింతా, దక్షిణ్ దేశ్ గ్రూపులో భాగమయ్యి, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎంసిసి) సంస్థాపక సభ్యులలో ఒకరయ్యారు. ఆయన వృత్తి విప్లవకారుడిగా మారి, వ్యూహాత్మక దృక్పథంతో పని చేయడానికి పశ్చిమ బెంగాల్‌లోని మారుమూల గ్రామాలలోకి వెళ్లారు.

దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను సృజనాత్మకంగా అమలు చేయడంలో భాగంగా ఎంసిసి పశ్చిమ బెంగాల్‌లోని సోనార్‌పూర్, కాంక్సా ప్రాంతాలలో ఉద్యమాన్ని నిర్మించడంలో తొలి అనుభవాలను గడించింది. ఈ ఉద్యమాలు తాత్కాలికంగా వెనుకపట్టు పట్టడానికి దారితీసిన బలహీనతలను పార్టీ లోతుగా సమీక్షించింది. నిజమైన కమ్యూనిస్టు స్ఫూర్తితో, (మునుపటి బీహార్‌లోని) గయ-హజారీబాగ్‌లో కామ్రేడ్ కెసి ప్రత్యక్ష నాయకత్వం కింద ప్రజాసైన్యం, విముక్తి ప్రాంతాల నిర్మాణానికి చెందిన వ్యూహాత్మక పథకంతో పని ప్రారంభమైంది. గత తప్పుల నుంచి నేర్చుకోవడం ద్వారా అక్కడి ఉద్యమాన్ని పురోగమింపజేయడానికి తీవ్రమైన ప్రయత్నాలు జరిగాయి. అనతికాలంలోనే సాయుధ వ్యవసాయ విప్లవ జ్వాలలు విస్తరించాయి. శత్రు నిర్బంధం కూడా తీవ్రతరమైంది. కొన్ని తీవ్రమైన నష్టాలు జరిగినప్పటికీ కామ్రేడ్ సుశీల్ రాయ్‌తో సహా సమర్థవంతమైన పార్టీ నాయకత్వం శత్రుదాడిని తిప్పికొట్టగలిగింది. వారు ఒక బలమైన కార్మికవర్గ పార్టీ, ప్రజాసైన్యం, విప్లవకర ఐక్యసంఘటన నిర్మాణానికి పునాదులు వేశారు. సాయుధ వ్యవసాయ విప్లవ క్రమంలో గణనీయమైన పురోగమనాలు సాధించారు.

కామ్రేడ్ కెసి 1982 జూలై 18న తీవ్రమైన అనారోగ్యంతో అకాల మృతి చెందగా, అదే సంవత్సరం కామ్రేడ్ సుశీల్ రాయ్ ఎంసిసి కార్యదర్శిగా బాధ్యతలను చేపట్టి ఆ సవాలును స్వీకరించారు. పార్టీని ఐక్యంగా నడిపిస్తూ, అభివృద్ధి చేస్తూ, పార్టీ పంథాకు దృఢంగా అంటిపెట్టుకొని ఉంటూ ఉద్యమాన్ని నిర్మించారు. 1989లో జరిగిన ఎంసిసి మొదటి కేంద్ర కాన్ఫరెన్స్‌లో పార్టీ కార్యదర్శిగా ఆయన ఎన్నికయ్యారు. ఆయన 1996 వరకూ పార్టీ కార్యదర్శిగా సమర్థవంతంగా పార్టీకి నేతృత్వం వహించారు. ఒక చిన్న గ్రూపుగా ఒక చిన్న ప్రాంతంలో మొదలై బలమైన పార్టీని, ఉద్యమాన్ని నిర్మించడంలో, ప్రత్యేకించి బీహార్-ఝార్ఖండ్, బెంగాల్‌లలో సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సైనిక, సాంస్కృతిక రంగాలలో ఆయన అందించిన తోడ్పాటు, సేవలు అమూల్యమైనవి. అంకితభావం, కార్మికవర్గ వ్యూహాత్మక నాయకత్వ సామర్థ్యం, పరిశ్రమ, మార్గదర్శకత్వం, పట్టుదల, నిస్వార్థ సేవల ద్వారా ఆయన తన కమిటీ, కింది స్థాయి కమిటీల, మొత్తం పార్టీ శ్రేణుల విశ్వాసాన్ని చూరగొన్నారు. చూపును దాదాపుగా కోల్పోవడం, అనారోగ్య కారణాల వల్ల ఆయన స్వచ్ఛందంగా పార్టీ కార్యదర్శి బాధ్యతల నుంచి తప్పుకునే ప్రతిపాదనను స్వయంగా ముందుకు తెచ్చారు. 1996లో జరిగిన రెండవ కేంద్ర కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రతిపాదనను పార్టీ ఆమోదించింది. అప్పటి నుంచి ఆయన పార్టీ సిసిఎంగా సిసిలో, పార్టీలో కీలకమైన భూమిక పోషిస్తూ కొనసాగారు. ప్రత్యేకించి సైద్ధాంతిక, రాజకీయ రంగాలలో, పార్టీలో అంతర్గతంగా రెండు పంథాల మధ్య పోరాటాలను విజయవంతంగా

నిర్వహించడంలో, ఉద్యమాన్ని సంశ్లేషించడంలో, అంతర్జాతీయ సంబంధాలను అభివృద్ధి చేయడంలో, సి.పి.ఐ. (ఎం–ఎల్) (పి.డబ్ల్యు.)తో, ఇతర నిజమైన మావోయిస్టు సంస్థలతో ఐక్యతను సాధించడంలో, మొదలైన వాటిలో ఆయన కీలక పాత్ర కొనసాగింది.

దేశంలోని నిజమైన కమ్యూనిస్టు విప్లవకారుల మధ్య ఐక్యతను సాధించడంలో కామ్రేడ్ సుశీల్ రాయ్ నిర్వహించిన భూమిక భారత కమ్యూనిస్టు ఉద్యమ పుటలలో ఎంతో ప్రత్యేకంగా పేర్కొనదగినది. పి.డబ్ల్యు.తో ఐక్యతా కృషి 1981లో కామ్రేడ్ కెసి ప్రత్యక్ష నాయకత్వంలోనే ప్రారంభమై, ఐక్యతకు బలమైన పునాది పడింది. ఇతర అంశాలతో పాటు, 2000 సంవత్సరంలో ఎంసిసి ఏకపక్షంగా కాల్పుల విరమణను ప్రకటించడంతో అంతిమంగా ఎంసిసి, పిడబ్ల్యుల మధ్య ఐక్యతా కృషి ఫలవంతం కావడం ఆరంభమైంది. అది ఒక మలుపు. ఈ నిర్ణయాన్ని తీసుకోవడంలో ఆయన పాత్ర కీలకమైంది. ఈ గొప్ప ఐక్యతను సాధించే క్రమం అంతటా ఆయన కీలకమైన పాత్ర పోషించారు. ఈ మొత్తం విలీన క్రమంలో ఎంసిసిఐకి చెందిన ఉన్నతస్థాయి ప్రాతినిధ్యంలో ఒక నాయకత్వ సభ్యునిగా ఆయన పాల్గొన్నారు.

విలీనానంతరం, మన పార్టీలో సీనియర్ కామ్రేడ్‌గా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కింది స్థాయిల వరకూ విలీన క్రమాన్ని పరిపూర్తి చేయడం కోసం, నూతన పరిస్థితులలో ఒక సమైక్య పార్టీగా పని చేసే విధంగా మొత్తం పార్టీని మలచడం కోసం ఆయన కృషి చేశారు. ఐక్యతా కాంగ్రెస్‌ను నిర్వహించేందుకు జరపవలసిన సన్నాహాలలో ఆయన భాగమయ్యారు. కొన్ని అంతర్జాతీయ బాధ్యతలు కూడా చూసేవారు.

విలీనానంతరం భారత విప్లవ ఏకైక నిర్దేశనా కేంద్రం కింద పార్టీ, పిఎల్‌జిఏ, ప్రజా పునాది అభివృద్ధి ఒక గుణాత్మకమైన మలుపును తీసుకున్నది. ప్రజాయుద్ధం పురోగమించింది. దీనితో అభివృద్ధినిరోధక భారత పాలకవర్గాలు, తమ సామ్రాజ్యవాద ప్రభువుల నిర్దేశత్వంతో నూతనంగా ఏర్పడిన సిపిఐ (మావోయిస్టు) నాయకత్వాన్ని అరెస్టు చేసేందుకు లేదా నిర్మూలించేందుకు సునిశితమైన పథకాలను రూపొందించాయి. ఆ క్రమంలోనే, కొద్దికాలానికే కామ్రేడ్ సుశీల్ రాయ్ 2005 మే 21న అరెస్టయ్యారు. ఆయనను ఇంటరాగేట్ చేసి, మానసిక చిత్రహింసలకు గురిచేశారు. అనేక తప్పుడు కేసులు మోపి జైల్లో బంధించారు. పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్‌లలోని జైళ్లలో ఆయన పట్ల అత్యంత అమానవీయ, దారుణ చర్యలకు ఒడిగట్టారు. వాస్తవానికి, జైలులో బంధించిబడిన ఈ మొత్తం కాలంలో ఆయనకు రెండు లేదా మూడు సార్లు జామీన్లు మంజూరు అయ్యాయి. కాని, జైలు గేట్ల ముందే ఆయనపై తప్పుడు కేసులు మోపి తిరిగి జైళ్లలో బంధించారు. దీని ఉద్దేశ్యం నాయకత్వాన్ని విప్లవానికి నేతృత్వం వహించకుండా, సేవ చేయకుండా నిరోధించేందుకు వారిని శాశ్వతంగా జైళ్లలో బంధించడమే. ఆయన వృద్ధాప్యాన్ని, తీవ్రమైన శారీరక సమస్యలను సైతం చూడ నిరాకరిస్తూ, ఎటువంటి సహాయం అందించకుండా ఒంటరి గదిలో బంధించారు. ఇది ఆయన ఆరోగ్యం వేగంగా దిగజారిపోవడానికి, ఆయని తొంటి ఎముక విరగడానికి సైతం దారితీసింది.

ఆయనను చాలా ఆలస్యంగా 2012 సెప్టెంబర్‌లో మాత్రమే, అదీ అనేక ప్రజాస్వామిక సంస్థలు పదే పదే తీవ్ర నిరసనలను తెలపడం వగైరా కృషి వల్ల ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు.

ఆయన మూత్రాశయ కాన్సర్‌కు గురయ్యారు. అప్పటికే ముత్రాశయం నుంచి ఒక ట్యూమర్‌ను డాక్టర్లు తొలగించారు. కాన్సర్ కోసం మరో ఆపరేషన్ నిర్వహించారు. ఆయనకు గుండె సమస్య (ఇస్కెమియా), ప్రోస్టేట్ కాన్సర్ ఉండేవి. ఒక మూత్రపిండం పూర్తిగా దెబ్బతినగా, మరొకటి పాడైంది. అయినప్పటికీ ఆయన చివరి ఊపిరి వరకూ వివిధ అనారోగ్యాలతో ఒక యోధునిలా పోరాడారు. అలా శారీరక ఆరోగ్యం వల్ల కన్నా, ఆయనలోని విప్లవ స్ఫూర్తి వల్ల ఆయన మరి కొంత కాలం బతకగలిగారు.

శారీరక బాధలు, వైకల్యం ఎదుర్కొన్న ఇటువంటి అత్యంత వేదనాభరితమైన కాలంలో ఒక క్షణం కూడా కామ్రేడ్ సుశీల్ రాయ్ గుండె నిబ్బరాన్ని లేదా స్ఫూర్తిని కోల్పోలేదు. ఆయన చాలా సాదాసీదా జీవితాన్ని గడిపారు. చివరి వరకూ ఆయన అవివాహితుడిగానే ఉండిపోయారు. నక్సల్బరి, సోనార్‌పూర్, కాంక్సా ఉద్యమాల తర్వాత, ఆ తదుపరి కూడా తీవ్రమైన రాజ్య నిర్బంధంలో ఉద్యమం ఎదుర్కొన్న ఆటుపోట్లన్నింటిలో ఆయన దృఢంగా నిలిచారు. కామ్రేడ్ సుశీల్ రాయ్ జీవితమంతా భారత కమ్యూనిస్టు ఉద్యమం ఎగుడు దిగుళ్ళు, మెలికలు, మలుపులు, కీర్తి–విజయాలతో విడిదీయరానంతగా పెనవేసుకొని పోయింది. ఆయన ఎన్నడూ తొణకలేదు. పార్టీ ఆయనపై ఎలాంటి బాధ్యతలు ఉంచినా వాటిని కొండలా నిలబడి పరిపూర్తి చేసేవారు. ఆయన ఎల్లప్పుడూ ఇతర ఉద్యమాల పట్ల, పార్టీల పట్ల సానుకూల దృక్పథంతో మొదలయ్యేవారు. విమర్శనాత్మక దృష్టితో వాటి నుంచి నేర్చుకోవడానికి, వాటిని అధ్యయనం చేయడానికి పూనుకునేవారు. ఆయన అధ్యయనం లోతైనది. కామ్రేడ్స్ పట్ల చాలా ఓపికగా వ్యవహరించేవారు. ఒక విప్లవకారుని జీవితంలో ఎదురయ్యే దాదాపు ప్రతి ఒక్క కష్టాన్ని ఆయన ఎదుర్కోవడమే కాక, ఒక నిజమైన కమ్యూనిస్టుగా వాటన్నింటినీ ఆయన హుందాగా అధిగమించారు. భారత విప్లవానికి, సి.పి.ఐ (మావోయిస్టు)కు చెందిన గొప్ప నాయకుడు కామ్రేడ్ సుశీల్ రాయ్ ఎల్లప్పుడూ ఎర్ర సూర్యునిలా మన మార్గాన్ని ప్రకాశవంతం చేస్తూనే ఉంటారు.

ఫిబ్రవరి 9న భారత విప్లవోద్యమంలో అత్యంత సీనియర్ నాయకుడు, 88 సంవత్సరాల కామ్రేడ్ ఎస్.ఏ. రవూఫ్ తీవ్ర అనారోగ్యంతో, వృద్ధాప్యంతో అమరులైనారు. 1950ల నుంచి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఊడలు దిగిన రివిజనిస్టు నాయకత్వంపై తిరుగుబాటు చేసి, నక్సల్బరీ వెల్లువను గట్టిగా సమర్థించి, పాత, కొత్త రివిజనిజాలతో సైద్ధాంతికంగా పోరాడి, నక్సల్బరీ మార్గమే ఏకైక మార్గమని చాటిచెబుతూ ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేస్తూ నాయకత్వాన్ని అందించారు. కామ్రేడ్ రవూఫ్ శ్రీకాకుళ పోరాటాన్ని ఎత్తిపట్టారు. సి.పి.ఐ. (ఎం–ఎల్)లో క్రియాశీల కార్యకర్త అయి పార్టీ పిలుపు నందుకొని వృత్తి విప్లవకారుడయ్యారు. ఆయన 1970లో సి.పి.ఐ. (ఎం–ఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యి ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమానికి నాయకత్వం వహించాడు.

1973లో అరెస్టయ్యారు. దేవులపల్లి, నాగిరెడ్డి, పుల్లారెడ్డిల మితవాద అవకాశవాద సిద్ధాంతాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక, రాజకీయ పోరాటాన్ని కొనసాగించిన ప్రముఖ కమ్యూనిస్టు విప్లవకారులలో ఆయన ఒకరు. కామ్రేడ్ రవూఫ్ ఏ పార్టీలో ఉన్నప్పటికీ తాను తప్పని భావించిన సైద్ధాంతిక–రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను సూటిగా వ్యక్తం చేయడానికి ఎన్నడూ వెనకాడలేదు. 1970లలో ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీతో సంబంధాలు తెంచుకొని ఏపి రీఆర్గనైజేషన్ కమిటీ, సి.పి.ఐ. (ఎం–ఎల్)ను ఏర్పరచారు. సి.పి.ఐ (ఎం–ఎల్) నక్సల్బరీ వ్యవస్థాపక కార్యదర్శిగా ఒక దశాబ్ద కాలం పాటు నాయకత్వాన్ని అందించారు. ఆయన నాయకత్వంలో నక్సల్బరీ పార్టీ రిమ్‌లో ప్రముఖ పాత్రను పోషించింది. ఉద్యమంలో వచ్చిన అనేక ఆటుపోట్లను, ప్రభుత్వ నిర్బంధాలను లెక్కచేయకుండా విప్లవం యెడల అచంచల విశ్వాసం, దృఢ నిశ్చయం, సంకల్పంతో కామ్రేడ్ రవూఫ్ చివరి ఊపిరి వరకూ ఒక గొప్ప విప్లవ నాయకుడిగా నిలిచారు. మావోయిస్టు విప్లవ పంథా చుట్టూ భారతదేశంలోని నిజమైన విప్లవకారుల ఐక్యత ఆయన ఆకాంక్షించిన విధంగానే ఇటీవల సి.పి.ఐ. (మావోయిస్టు), సి.పి.ఐ. (ఎం–ఎల్) నక్సల్బరీలు ఒకే పార్టీగా విలీనం కావడంతో సాకారమైంది. కామ్రేడ్ రవూఫ్ పీడిత ప్రజల విముక్తి కోసం ప్రదర్శించిన కమ్యూనిస్టు విలువలు – నక్సల్బరీ వెల్లువ ద్వారా, కామ్రేడ్ చారు మజుందార్ ద్వారా ముందుకు తేబడిన సైద్ధాంతిక–రాజకీయ పంథా పట్ల జీవితాంతం కనబరచిన అంకితభావం; రివిజనిజానికి, మితవాద అవకాశవాదానికి వ్యతిరేకంగా స్థిరంగా ఆయన సాగించిన పోరాటం; ప్రజలతో మమేకం కావడం పట్ల ఆయనలోని ఆతురత, కష్టపడి పనిచేయడం, సీదాసాదా జీవితం, తాను విభేదించిన ఇతర విప్లవకారుల అనుభవాల నుంచి నేర్చుకోవడం పట్ల ఆయనలోని ఆతురత వంటివి మనల్ని ఉత్తేజపరుస్తాయి. ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తూ, ఆయన ఆశయాన్ని ఎత్తిపడుతూ దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో ఆయన కన్నకలల్ని సాకారం చేసేందుకు మరోసారి పిడికిలి బిగిద్దాం.

ఈ కాలంలోనే మన ప్రియతమ సీనియర్ కామ్రేడ్ సునీతి కుమార్ ఘోష్ 96 సం॥ల వయస్సులో మే 11న అంతిమ శ్వాస విడిచారు. ఆయన చారిత్రాత్మక తెభాగా ఉద్యమంలో, భారత కమ్యూనిస్టు ఉద్యమంలో మలుపులుగా నిలిచిన పాత–కొత్త రివిజనిజాలకు వ్యతిరేకంగా అంతర్గత పోరాటాలలో పాల్గొన్నారు. నక్సల్బరీ సాయుధ రైతాంగ వెల్లువ పెల్లుబుకడంతో భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. సి.పి.ఐ. (ఎం–ఎల్) వ్యవస్థాపక కేంద్రకమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. దేశబ్రతి పత్రిక కంట్రిబ్యూటర్‌గా, లిబరేషన్ పత్రిక సంపాదకుడిగా ఆయన సమర్థవంతమైన పాత్ర నిర్వహించారు. నక్సల్బరీ తాత్కాలిక వెనకంజ తర్వాత పార్టీ, ఉద్యమ కార్యకలాపాల నుండి తప్పుకున్నప్పటికీ సి.పి.ఐ. (ఎం–ఎల్) (పి.డబ్ల్యు.), సి.పి.ఐ. (ఎం–ఎల్) పి.యు., ఎం.సి.సి.ఐ., తర్వాత సి.పి.ఐ. (మావోయిస్టు)తో పాటు ఇతర విప్లవ సంస్థల శ్రేయోభిలాషిగా, మిత్రుడుగా కొనసాగారు. మార్క్సిజం–లెనినిజం– మావోయిజాన్ని ఎత్తిపట్టారు. ఆయన నిరంతర అధ్యయనశీలి. ఆయన విప్లవ మేధావిగా, లోతైన, విస్తృతమైన అధ్యయనం ద్వారా మహత్తర నక్సల్బరీ

పోరాటం ముందుకు తెచ్చిన మౌలిక పంథాను సైద్ధాంతికంగా, రాజకీయంగా దృఢపర్చడానికి కృషి చేశారు. ఆయన చారిత్రాత్మక, విశ్లేషణాత్మక రచనలు అనేక దశాబ్దాల పాటు గొప్ప సంపదగా నిలిచిపోతాయి. కామ్రేడ్ సునీతి కుమార్ జీవితం 1940ల నుంచి భారత కమ్యూనిస్టు ఉద్యమంతోనూ ఆరంభమై, చారిత్రాత్మక నక్సల్బరీ వెల్లువతో నిర్ణయాత్మక మలుపు తీసుకొని, దాని మెలికలు మలుపులతో పెనవేసుకొని ఉంది. ఆయన జీవితాంతం రివిజనిజానికి వ్యతిరేకంగా సాగించిన పోరాటం మరువలేనిది. ఆయన తొలి సహచరులు అనేక మంది రెనగేడ్లుగా, విద్రోహులుగా, అవకాశవాదులుగా మారినప్పటికీ తన అంతిమ శ్వాస వరకూ ఆయన మౌలికంగా నక్సల్బరీ పంథాను ఎత్తిపట్టాడు. సిపిఐ (మావోయిస్టు) సదా ఆయన సేవలను మదిలో నిలుపుకుంటూ భారతదేశంలో ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడంలో వాటిని తప్పక వినియోగించుకుంటుంది.

ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమ నేత, విప్లవ మేధావి కామ్రేడ్ ఆకుల భూమయ్యను దోపిడి పాలకవర్గాలు కుట్రపూరితంగా ఒక రోడ్డు ప్రమాదం ముసుగులో గత సంవత్సరం డిసెంబర్‌లో హత్య చేయించాయి. విద్యార్థిగా 1969–70లలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ తొలి దశలో ఆయన పాల్గొన్నారు, తన స్వంత జిల్లా కరీంనగర్‌లో విద్యార్థులను సమరశీలంగా సంఘటితం చేశారు. ఎమర్జెన్సీలో జైల్లో రెండేళ్లు గడిపిన తర్వాత ఆయన ప్రజాస్వామిక ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణం కోసం, ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ సాధన కోసం సమర్థవంతంగా నాయకత్వాన్ని అందించారు. కామ్రేడ్ భూమయ్య అనేక ప్రజాస్వామిక సంస్థల ప్రముఖ నాయకుడు. ఏపిలో విప్లవకారులపై, ప్రజాస్వామికవాదులపై రాజ్య ఫాసిస్టు నిర్బంధం తారాస్థాయికి చేరుకున్నప్పటికీ ఉద్యమాలలో ఆయన ధైర్యంగా ముందుపీఠిన నిలబడ్డారు. ఆయన దేశవ్యాప్తంగా అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక క్యాంపెయిన్లతో సన్నిహితంగా పెనవేసుకొనిపోయి, అటువంటి వేదికల నుంచి ప్రజల డిమాండ్లను బలంగా వినిపించారు. ఆయనకు ఎంఎల్ఎం పట్ల లోతైన అవగాహన ఉండేది, తన సుదీర్ఘ విప్లవకర జీవితకాలంలో రచించిన అనేక రచనలలో అది ప్రతిబించింది. ఆయన సమాజంలోని పీడిత వర్గాల, ప్రజా సముదాయాల, సెక్షన్ల కోసం నిర్భయంగా పోరాడిన యోధుడు. ఆయన ప్రపంచంలో మనిషిని మనిషి దోచుకోలేని సమ సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై అహర్నిశలు కృషి చేశారు. దేశంలో బలమైన, విశాలమైన ప్రజా ఉద్యమాలను, ఐక్యసంఘటనను నిర్మించడం ద్వారానే తెలంగాణ జననేత కామ్రేడ్ భూమయ్యకు నిజమైన నివాళి అర్పించగలుగుతాం.

భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సీనియర్ కామ్రేడ్ కరదమ్ భట్ (62) ఫిబ్రవరి 2న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన సిఆర్‌సి, సి.పి.ఐ. (ఎం–ఎల్) గుజరాత్ రాష్ట్రకమిటీ కార్యదర్శిగా అనేక సంవత్సరాల పాటు నాయకత్వం వహించారు. ఆయన భోపాల్ గ్యాస్ పీడితులలో, కేరళలోని దళిత కార్మికులలో పనిచేశారు. గుజరాత్‌లో హిందూ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడారు. ఆ తర్వాత, సి.ఆర్.సి. దివాళాకోరు విధానాలను వ్యతిరేకిస్తూ మావోయిస్టు యూనిటీ సెంటర్, సి.పి.ఐ.

(ఎం-ఎల్)లో చేరారు. ఇది 1999లో సి.పి.ఐ. (ఎం-ఎల్) నక్సల్బరీతో విలీనమైంది. ఆయన విప్లవ సాంస్కృతిక కార్యకర్త కూడా. ఆయన క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలగినప్పటికీ ఆయన పార్టీకి సన్నిహిత సానుభూతిపరుడిగా కొనసాగారు. ఆయన అన్ని మావోయిస్టు శక్తుల ఐక్యతను కోరుకున్నారు. జీవితాంతం ఎంఎల్ఎం పట్ల కామ్రేడ్ కరదమ్ కనబరిచిన అంకితభావం మనల్ని ఉత్తేజపరుస్తుంది.

కామ్రేడ్ గజ్జెల సరోజన (అమర, షహీదా) మూడు దశాబ్దాలకు పైగా విప్లవోద్యమంలో నిస్వార్థంగా ప్రజలకు తన సేవలను అందించింది. ఆదిలాబాద్ జిల్లా విద్యార్థి ఉద్యమంలో, రైతాంగ విప్లవోద్యమంలో, ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ ప్రెస్‌లో, దండకారణ్యంలోని మాడ్‌లో క్రాంతికారీ జనతన సర్కార్ పాఠశాలల్లో టీచర్‌గా సేవలు అందించింది. ఆమె సింగరేణి కార్మిక కుటుంబంలో జన్మించింది. ఆమె తల్లి కూడా విప్లవోద్యమానికి మద్దతుగా ఉంటూ పిల్లలను ఉద్యమంలో పనిచేయమని ప్రోత్సహించింది. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా ఉద్యమంలో ప్రముఖ భూమిక పోషించిన తన అన్న కామ్రేడ్ గజ్జెల గంగారాం సైనిక శిక్షణా శిబిరంలో బాంబు ప్రమాదంలో అమరుడైనా, తన జీవన సహచరుడు, మన పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు, ప్రియతమ నేత కామ్రేడ్ శ్యాం (నల్లా ఆదిరెడ్డి) కొయ్యూరు బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్యకు గురైనా, చివరకు తనకు ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి సోకినా చెక్కుచెదరని దీక్షతో, మొక్కవోని ధైర్యంతో విప్లవంలో చివరి శ్వాస వరకూ తన వంతు కృషిని కొనసాగించింది. ఆమె ఒకసారి అరెస్టయి మూడు సంవత్సరాల పాటు జైలు జీవితాన్ని అనుభవించింది కానీ శత్రువుకు ఎన్నడూ తలవంచలేదు. విడుదలైన వెంటనే ఉద్యమంలో భాగమైంది. కామ్రేడ్ సరోజన కలం పట్టి తన అనుభవాలను, ప్రజా పోరాటాలను, అమరవీరుల జ్ఞాపకాలను అనేక పాటలు, కవితలు, స్మృతులు, చిన్న కథలు మొదలైన సాహితీ రూపాలలో రాసింది. ఆమె అమరత్వంతో అంకిత భావంతో పనిచేసే గొప్ప కమ్యూనిస్టు కార్యకర్తను పార్టీ కోల్పోయింది.

బడే చెల్మ ఎన్‌కౌంటర్‌లో ఖమ్మం (తెలంగాణ) డివిసిఎం కామ్రేడ్ నరేష్ అమరుడయ్యాడు. ఆయన వరంగల్ జిల్లాలో నిరుపేద కుటుంబంలో పుట్టి చిన్నతనం నుండే భూస్వామ్య దోపిడీ దౌర్జన్యాల పట్ల కసిని పెంచుకుని విప్లవోద్యమ రాజకీయాల్లోకి ఆకర్షితుడయ్యాడు. ఇంటర్ వరకూ చదివి విద్యార్థి, రైతాంగ ఉద్యమాలలో ప్రాథమిక సభ్యుడి నుండి జిల్లా నాయకుడి వరకూ అంచెలంచెలుగా ఎదిగాడు. నిప్పులు చెరిగే నిర్బంధం మధ్య తెలంగాణలో శత్రు దాడులను సాహసోపేతంగా తిప్పికొడుతూ 17 సం॥ల పాటు ప్రజా యుద్ధాన్ని పురోగమింపజేసేందుకు తీవ్రంగా కృషి చేశాడు. అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించాడు. తెలంగాణ విప్లవోద్యమ సెట్‌బ్యాక్‌ను అధిగమించేందుకు విశేష కృషి చేశాడు. శత్రువుపై దాడులలో సాహసంగా పాల్గొనేవాడు. తెలంగాణ ఉద్యమం తాత్కాలిక వెనుకంజ వేసిన నేపథ్యంలో చాలామంది గుండెలు జారి శత్రువు ముందు లొంగిపోగా, కామ్రేడ్ నరేష్ 'లొంగుబాట'ను వ్యతిరేకిస్తూ ప్రజా విముక్తికై అంతిమ శ్వాస వరకూ కృషి చేశాడు. కామ్రేడ్ నరేష్ వినయం, ప్రజల పట్ల అచంచల విశ్వాసం, సాదాసీదా జీవనశైలి విప్లవకారులకు అనుసరణీయం.

బేత్‌కఠి వద్ద శత్రువు కొనసాగించిన విప్లవ ప్రతీఘాతుక మోసపు యుద్ధంలో భాగంగా విషప్రయోగానికి గురై గోందియా (దండకారణ్యం) డివిసిఎం కామ్రేడ్ లాల్సూ నేలకొరిగాడు. ఆయన దక్షిణ బస్తర్ ముద్దుబిడ్డ. గోందియా డివిజన్‌లో ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న నాయకుడు. పార్టీలో సాధారణ సభ్యుని స్థాయి నుంచి ప్రారంభమై ఛత్తీస్‌గడ్‌లోని తన ప్రాంతాన్ని వదిలి మహారాష్ట్రలోని గోందియా డివిజన్‌కు వెళ్లి అక్కడ దాదాపు 16 సం॥ల పాటు విప్లవోద్యమంతో, ప్రజలతో పెనవేసుకొని పోయాడు. ఉద్యమంలో ప్రముఖ భూమికను పోషిస్తూ డివిజన్ స్థాయి నాయకునిగా, మంచి సైనిక కమాండర్‌గా అభివృద్ధి చెందాడు. డివిజన్ ఉద్యమం కఠిన పరిస్థితులలో సైతం చైతన్యయుతంగా ప్రతి పనిలోనూ ముందుండేవాడు. ఎటువంటి కీలకమైన పనిలో అయినా ఎంపిక చేసే సాహస యోధుల పేర్లలో తన పేరు తప్పనిసరిగా ఉండేది. శత్రు దాడులను తిప్పికొట్టడంలో ముందుండేవాడు. సాహసానికి ప్రతీక. గతంలో పశ్చిమ కనుమలకు వెళ్లి అక్కడ మన గెరిల్లా బలగాలకు సైనిక శిక్షణ అందించడంతో పాటు కొన్ని సంవత్సరాల పాటు అక్కడ పనిచేశాడు. కామ్రేడ్ లాల్సూ అమరత్వంతో ఎదుగుతున్న ఒక మంచి కమ్యూనిస్టు యోధుడిని ఉద్యమం కోల్పోయింది.

కోరాపుట్ జిల్లాలో మంగులువలస గ్రామం వద్ద ద్రోహం వల్ల శత్రువు చేతి చిక్కి తీవ్రమైన చిత్రహింసలకు తలవంచక కామ్రేడ్స్ మంగన్న (నరేందర్), మహేందర్ (దుంబ్రి)లు అమరత్వాన్ని చెందారు. కామ్రేడ్ మంగన్న ఖమ్మం జిల్లాలో పేద కోయ ఆదివాసీ కుటుంబం నుంచి ఉద్భవించిన విప్లవ కమ్యూనిస్టు. ఎమర్జెన్సీ కాలం నుంచే ఆయన విప్లవకార్యాచరణ ప్రారంభమైనా 1988 వరకూ చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలోని సి.పి.ఐ. (ఎం–ఎల్)లో ఉండి దాని మితవాద అవకాశవాద రాజకీయాలను అసహ్యించుకొని మునుపటి సి.పి.ఐ. (ఎం–ఎల్) పీపుల్స్‌వార్‌లో చేరాడు. 35 యేళ్లకు పైగా తన విప్లవ జీవితంలో తెలంగాణలో, ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో అనేక భాషలు, సంస్కృతులు ఉన్న ఆదివాసీలు, పీడిత ప్రజల మధ్య పనిచేసే క్రమంలో విప్లవ లక్ష్యం పట్ల ఆయన విశ్వాసం ఎన్నడూ చెక్కుచెదరలేదు. ప్రజల పట్ల అమిత ప్రేమకు, శత్రువు పట్ల వర్గకసికి ఆయన పెట్టింది పేరు. ఖమ్మం నుంచి కరీంనగర్ వరకూ, అటు తూర్పు కనుమల వరకూ ఆయన నాయకత్వంలో జరిగిన అనేక భూపోరాటాలలో రైతాంగం వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. శత్రువుపై దాడిలో ఆయన సాహసానికి కరకగూడెం రెయిడ్‌లో ఆయన నిర్వహించిన పాత్రే ఉదాహరణ. తన తప్పుల విషయంలో కల్మషం లేకుండా ముందుండి ఆత్మవిమర్శ చేసుకునే స్వభావం ఆయనది. అందువల్లనే ఆయన ఎక్కడ ఉన్నా కాడర్లలో, ప్రజలలో ప్రేమానురాగాలను పొందాడు. ఆయన పీడిత ప్రజల విముక్తికి విప్లవమే మార్గమని నమ్మి ప్రజాయుద్ధ జండాను అంతిమ శ్వాస వరకూ ఎత్తిపట్టాడు. ఆయన అమరత్వంతో ఒక గొప్ప కమ్యూనిస్టు యోధుడుని మనం కోల్పోయాం. ఆ వీరుని తలవంచి విప్లవాంజలి ఘటిద్దాం.

పేందోడవాయ ఎన్‌కౌంటర్‌లో గడ్చిరోలి జిల్లా కసన్‌సూర్ ఏరియా క్రాంతికారీ జనతన సర్కార్ అధ్యక్షురాలు కామ్రేడ్ దన్ని శత్రు బలగాలతో సాహసోపేతంగా పోరాడుతూ పార్టీ నాయకత్వాన్ని

రక్షించడం కోసం శత్రు మూకలను నిలువరిస్తూ నేలకొరిగింది. శత్రువు కూంబింగ్ నిర్వహిస్తూ తామున్న మకాంను చుట్టిముట్టి దాడి చేసినా, శత్రుదాడిలో కామ్రేడ్ సుధీర్ అమరుడైనా ఆ సమయంలో సెంట్రీలో ఉన్న కామ్రేడ్ దన్ని ఏమాత్రం చలించకుండా దృఢంగా నిలబడి నాయకత్వ రక్షణ కోసం అత్యంత సాహసోపేతంగా శత్రువుతో తెగించి పోరాడింది. ఆమె త్యాగం విప్లవకారులకు అందరికీ ఆదర్శనీయం.

ఏఓబిలోని మల్కన్‌గిరి జిల్లాలో ప్రజా సాయుధ ప్రతిఘటనకు, ఆర్‌పిసిల నిర్మాణానికి, ప్రజా ఉద్యమాలకు ఆలంబనగా ఉన్న ప్రజా మిలీషియాను దెబ్బతీసే లక్ష్యంతో శత్రువు కుట్రపూరితంగా శిలాకోటలో 13 మంది మిలీషియా కామ్రేడ్స్‌ను విచక్షణారహితంగా కాల్చిచంపాడు. ద్రోహులు ఇచ్చిన సమాచారంతో మిలీషియా మకాంను రాత్రికి రాత్రే జిల్లా ఎస్‌పి నాయకత్వంలో వందలాది పోలీసు బలగాలు చుట్టిముట్టి తెల్లవారు జామున టెంట్‌లో నిద్రిస్తున్న వారిపై విచ్చలవిడిగా కాల్పులు జరిపి ఊచకోత కోశాయి. ఈ ఘటన నుండి తప్పించుకొని గ్రామంలోకి పోయిన 10 సంవత్సరాల బాలిక గంగిని పోలీసులు పట్టుకొని పసిపిల్ల అని కూడా చూడకుండా బాయినెట్లతో అమానుషంగా పొడిచి చంపారు. శవాలను బంధువులకు ఇస్తే తమ కుట్ర బయటపడుతుందని వెరచిన పోలీసులే ఖననం చేశారు. ఈ వీర ప్రజా మిలీషియా కామ్రేడ్స్ రక్తం వృధా కాదని పార్టీ, పిఎల్‌జిఏ, ఆ ప్రాంత ప్రజలు శపథం చేశారు.

ఒక ప్రమాదంలో మనల్ని శాశ్వతంగా విడిచి వెళ్లిన కామ్రేడ్ శిరీష కోపర్‌డంగ్ (రాయగడ, ఒడిశా) చుట్టివేత దాడి (1998)లో అమరత్వం చెందిన కామ్రేడ్ కమలక్క ముద్దుల కూతురు. కామ్రేడ్ శిరీషకు కొంత సామాజిక పరిజ్ఞానం అబ్బుతున్న క్రమంలో తల్లి అమరత్వం ఆమెపై ప్రగాఢమైన ప్రభావం వేసింది. అమ్మ బాటలో తాను కూడా నడవాలని దృఢంగా నిర్ణయించుకుంది. అనతికాలంలోనే ఆమె పూర్తికాలం కార్యకర్తగా ఉద్యమంలో చేరింది. ఆనాటికి ఆమె తండ్రి పార్టీలో రాష్ట్రస్థాయి బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ తర్వాత ఆయనలో అన్యవర్గ ధోరణులు తీవ్రస్థాయికి చేరి శత్రువు ముందు సాగిలపడడమే కాక విప్లవ విద్రోహిగా మారాడు. ఆ తర్వాత తన జీవన సహచరుడు కూడా ఇదే విధంగా దిగజారి శత్రువు పంచన చేరాడు. ఈ పరిణామాలు లేత శిరీషను తీవ్రంగానే కలవరపరిచినప్పటికీ పార్టీ అందించిన సరైన గైడెన్స్‌ను శిరోధార్యంగా తీసుకొని తన తల్లి చూపిన ప్రజాయుద్ధ మార్గాన్ని దృఢంగా అట్టిపెట్టుకోవాలని గట్టిగా నిర్ణయించుకుంది. పార్టీ అప్పగించిన బాధ్యతలను నెరవేర్చుతూ ఏసి స్థాయి వరకూ అభివృద్ధి అయ్యింది. పార్టీ ప్రెస్ విభాగంలో ఒక మంచి కంప్యూటర్ ఆపరేటర్‌గా ఎదుగుతున్నది. ఆమె కలలు గన్న నూతన ప్రజాస్వామిక సమాజం కోసం తుది వరకూ పోరాడుదాం.

ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల తొలిరోజునే నల్లమల అడవుల్లో ముగ్గురు విప్లవకారులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య గావించి మరోసారి ఫాసిస్టు పాలనకు తెరతీసింది.

విప్లవోద్యమంలో త్యాగాలు అనివార్యమైనవే అయినప్పటికీ ఈ సంవత్సర కాలంలో జరిగిన కొన్ని నష్టాలు నివారించగలిగేవే. రహస్య పని విధానాన్ని, గెరిల్లా యుద్ధ సూత్రాలను అమలు చేయడంలో జరిగిన పొరపాట్ల వల్ల ఇలాంటి నష్టాలు జరుగుతున్నాయి. వీటిని అధిగమించడానికి పార్టీ, పిఎల్‌జిఏ పై నుంచి కింది వరకూ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

అడుగడుగునా శత్రు దాడులను తిప్పికొడుతూ పోరులో నేలకొరిగిన మన ప్రియతమ అమరవీరులు, త్యాగమూర్తులు ప్రదర్శించిన నిస్వార్థం, నిరాడంబరత్వం, నిజాయితీ, పట్టుదల, సహనం, సాహసం, నేర్పు, ప్రజల పట్ల అపారమైన ప్రేమ, శత్రువు పట్ల తీవ్రమైన కసి, విప్లవ ఆశయం పట్ల అంకితభావం, క్రమశిక్షణ, ఎటువంటి కష్టాల్ని అయినా ఎదుర్కొనే దృఢసంకల్పం, ఏటికి ఎదురీదే ధైర్యం మొదలైన కమ్యూనిస్టు విప్లవ విలువలు భారత నూతన ప్రజాస్వామిక విప్లవ పంథాని మరింత ప్రకాశవంతం చేస్తున్నాయి. మన అమరవీరుల త్యాగాలను ఎత్తిపడుతూ వాటి నుంచి నేర్చుకోవాలి. మన విప్లవ ఆచరణలో అన్వయించుకోవాలి.

**కామ్రేడ్స్,**

దేశంలో విప్లవోద్యమం పురోగమిస్తూ ఒక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఆవిర్భంచడాన్ని సహించలేని దోపిడి పాలకవర్గాలు దానిని సమూలంగా నిర్మూలించడం కోసం, తమ నూతన సరళీకృత ఆర్థిక విధానాలను అడ్డూఆపూ లేకుండా అమలు చేయడం కోసం సామ్రాజ్యవాదుల ప్రోద్బలంతో గత ఐదేళ్లుగా కొనసాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్ హంట్ ఈ సంవత్సర కాలంలో మరింత తీవ్రతరం చేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక పక్క గత రెండు-మూడు సంవత్సరాలలో మావోయిస్టు హింస గణనీయంగా తగ్గిపోయిందనీ, కొన్ని ప్రాంతాలలో నక్సలిజాన్ని పూర్తిగా లేకుండా చేశామనీ ప్రకటనలు చేస్తూనే, మరో పక్క ఇప్పటికీ 'దేశ అంతర్గత భద్రత'కు వామపక్ష తీవ్రవాదమే ఏకైక అతిపెద్ద ముప్పు అంటూ మన ఉద్యమ ప్రాంతాలలో పారామిలటరీ, కమాండో, ప్రత్యేక పోలీసు బలగాల మోహరింపును పెద్దయెత్తున పెంచుతున్నాయి. కార్పెట్ సెక్యూరిటీని మరింత పటిష్టం చేస్తున్నాయి. యుద్ధ ప్రాతిపదికను రోడ్లు, బ్రిడ్జిలు, కమ్యూనికేషన్స్ నిర్మాణంపై కేంద్రీకరిస్తున్నాయి. దేశంలోని తూర్పు, మధ్య, దక్షిణ-పశ్చిమ రాష్ట్రాలలోని లోతట్టు ప్రాంతాలలో ఎడతెరపి లేకుండా కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్లు, రాష్ట్రాల సరిహద్దులలో జాయింట్ ఆపరేషన్లు, కూంబింగ్ ఆపరేషన్లు మరింత తీవ్రతరం చేశాయి. 2013 డిసెంబర్ 26 నుంచి 2014 జనవరి 1 వరకు తొమ్మిది రాష్ట్రాలలో 40 వేల అదనపు అర్ధసైనిక బలగాలు, రాష్ట్ర పోలీసు బలగాలతో మొట్టమొదటి దేశవ్యాప్త ప్రత్యేక అణచివేత క్యాంపెయిన్‌ను వారం రోజుల పాటు నిర్వహించాయి. ఇలాంటి రెండవ అణచివేత క్యాంపెయిన్‌ను 2014 మార్చి 19 నుంచి 27 వరకు సుమారు ఒక లక్ష అర్ధసైనిక బలగాలు, ఆరు వేల కమాండో బలగాలు, 4 ఇజ్రాయిల్ ఏరోన్ గూఢచర్య విమానాలు, రాడర్లతో కూడిన అనేక మైన్‌ప్రూఫ్ వాహనాలు, 70 మంది పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్స్ (ఐజిపి) నేతృత్వంలో మావోయిస్టు ఉద్యమం క్రియాశీలంగా ఉన్న ఆరు రాష్ట్రాలలో నడిపాయి. ఈ విప్లవ ప్రతీఘాతక క్యాంపెయిన్ల

లక్ష్యం ఉద్యమాన్ని అణచివేయడం, ప్రజలలో తెల్ల బీభత్సాన్ని వ్యాపింపజేయడం. ప్రజాసంఘాల, మిలీషియా కార్యకర్తలను, సాధారణ ప్రజలను పెద్దయెత్తున అరెస్టులు చేస్తూ, అక్రమ కేసులు మోపి జైళ్లకు పంపుతున్నాయి. ప్రత్యేకించి, పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాన్ని నిర్మూలించేందుకు కేంద్రీకరిస్తూనే గ్రామస్థాయి నాయకత్వాన్ని దెబ్బతీసేందుకు బూటకపు ఎన్‌కౌంటర్లకు, విచ్చలవిడి కాల్పులకు పూనుకుంటున్నాయి. వైమానిక దాడులకు (హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా) రంగం సిద్ధం అవుతోంది. హెలిప్యాడ్లు, విమానాశ్రయాలు యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నాయి.

విప్లవోద్యమాన్ని అణచివేసే లక్ష్యంతో ఉద్యమ ప్రాంతాల అన్నింటా సుక్మా, బీజాపూర్, సరండా నమూనాలను దేశవ్యాప్తంగా విస్తరిస్తూ సంస్కరణలను తీవ్రతరం చేస్తున్నాయి. ప్రత్యేక అభివృద్ధి అథారిటీల ఆధ్వర్యంలో వీటిని అమలు చేస్తున్నాయి. మన ఉద్యమ ప్రాంతాలలో పథకం ప్రకారం ఎన్‌జిఓలను చొప్పించడం పెరుగుతున్నది. ఆర్‌ఎస్‌ఎస్ గ్రామస్థాయి వరకూ విస్తరిస్తూ విప్లవ ప్రతీఘాతకత్వాన్ని పెంచడంలో ముందుంటున్నది. జనజాగరణ్ మేళాలు, సివిక్ యాక్షన్ ప్రోగ్రాములను, పోలీసు ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్, కోవర్టు యంత్రాంగాన్ని విస్తృతం చేస్తున్నాయి. పోలీసు, అర్ధసైనిక, సైనిక బలగాలలోకి, ఇతర ప్రభుత్వోద్యోగాలలోకి భర్తీ చేసుకోవటం కోసం రోజ్‌గార్ మేళాలు నిర్వహిస్తున్నాయి. నిరుద్యోగ భృతి పేరుతో యువతను ఆకర్షించాలని ప్రయత్నిస్తున్నాయి. ఎల్.ఐ.సి. వ్యూహంలో మొత్తం ప్రభుత్వ యంత్రాంగం విప్లవ ప్రతీఘాతక భూమికను పోషించేలా పునర్వ్యవస్థీకరిస్తున్నాయి.

ప్రజాయుద్ధ మార్గంలో ప్రజలు సాధిస్తున్న విజయాలను వమ్ము చేసేందుకై దోపిడి పాలకవర్గాలు 'లొంగుబాటు విధానాన్ని' ఒక ప్రముఖ ఎత్తుగడగా ముందుకు తీసుకొని వచ్చాయి. పార్టీలో, పిఎల్‌జిఏలో పై స్థాయి నుంచి సాధారణ ప్రజల వరకూ విప్లవ మార్గం నుంచి వేరు చేసి దిగజార్చడానికి అత్యంత నీచమైన పద్ధతులకు ఒడిగడుతున్నాయి. లొంగుబాటు ద్వారా చేకూరే బానిసత్వాన్ని 'కుశహాల్ జిందగీ'గా అభివర్ణిస్తూ ప్రజలను పక్కదారి పట్టించేందుకు దోపిడి ప్రభుత్వ యంత్రాంగం మొత్తం రంగంలోకి దిగి గోబెల్స్ ప్రచార హోరును సృష్టిస్తోంది. విప్లవానికి వ్యతిరేకంగా ప్రతీఘాతక విప్లవాన్ని వ్యాపింపజేసి సమూలంగా విప్లవాన్ని నిర్మూలించడమే దీని లక్ష్యం. ఈ నేపథ్యంలో విప్లవ ప్రతీఘాతకుల లొంగుబాటు విధానాన్ని తిప్పికొడుతూ అమరవీరుల గొప్ప త్యాగాల సాంప్రదాయాన్ని కాపాడడం, దాన్ని ఎత్తిపట్టడం, అమరుల మార్గంలో ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడం నేడు మన ముందున్న ఒక ముఖ్యమైన కర్తవ్యం.

ఇటీవల లోక్‌సభ ఎన్నికల తర్వాత నూతనంగా అధికారంలోకి వచ్చిన మోడీ నాయకత్వంలోని బిజెపి–ఎన్‌డిఏ నూతన ప్రభుత్వం వెంటనే దేశంలో 'ఉగ్రవాదాన్ని', 'వేర్పాటు వాదాన్ని', ప్రత్యేకించి 'వామపక్ష తీవ్రవాదాన్ని' అరికడతామని ప్రకటించింది. ఇందుకోసం ఆపరేషన్ గ్రీన్ హంట్ మూడవ దశకు సన్నాహాలను పూర్తి చేసుకునేందుకు చర్యలు చేపట్టింది. ఉద్యమ ప్రాంతాలలో పనిచేసే పోలీసు బలగాల మనోబలాన్ని పెంచేందుకై ముందస్తు ప్రమోషన్లు, ఇతర సౌకర్యాలను ఇస్తామని

ప్రకటించింది. దేశంలో 'వికాస్'ను సాధించడానికి విదేశీ ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం కోసం 'శాంతియుత వాతావారణం' నెలకొల్పడం అవసరమని వక్కాణించింది. ఇందుకోసం విప్లవోద్యమ ప్రాంతాలలో నూతనంగా పదుల వేల సంఖ్యలో అదనపు అర్ధసైనిక బలగాలను దించాలని నిర్ణయించింది. అంటే ప్రజలకు తక్షణం అందించాల్సిన వాటిని కాకుండా వేలాది సాయుధ బలగాలను పంపిస్తున్నది ఈ ఎన్‌డిఏ ప్రభుత్వం. ఉద్యమిస్తున్న ప్రజలపై, వారి నాయకత్వంపై అది 'వికాస్' పేరుతో ఫాసిస్టు దాడులను మరింత ఉన్నత, విస్తృత స్థాయిలో తీవ్రతరం చేసేందుకు సమాయత్తమవుతోంది.

ఈ సంవత్సర కాలంలో దేశవ్యాప్తంగా విప్లవోద్యమాన్ని అణచివేయడానికి పాలకవర్గాలు కొనసాగించిన ఫాసిస్టు ఆపరేషన్ గ్రీన్ హంట్‌ని తిప్పికొడుతూ ఉద్యమాన్ని ముందుకు తీసుకొనిపోయే క్రమంలో మన ప్రియతమ కామ్రేడ్స్ తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించిన ఫలితంగా, మన యావత్తు పార్టీ, పిఎల్‌జిఏ, ప్రజా నిర్మాణాలు, లక్షలాది మంది పీడిత ప్రజలు కొనసాగించిన ప్రజాయుద్ధం ఫలితంగా మనం కింది విజయాలను సాధించాం :

దేశంలో విప్లవకారుల ఐక్యతను సాధించే కృషిలో మరొక మలుపుగా సి.పి.ఐ. (మావోయిస్టు), సి.పి.ఐ (ఎం–ఎల్) నక్సల్బరీలు ఒకే పార్టీగా విలీనం కావడం ఈ సంవత్సరం సాధించిన ముఖ్యమైన విజయం.

గత సంవత్సరంతో పోల్చితే తీవ్రమైన శత్రుదాడిలో నష్టాలను సాపేక్షికంగా తగ్గించుకొని ఉద్యమాన్ని కాపాడుకోగలిగాం. దండకారణ్యం, బీహార్–ఝార్ఖండ్, ఆంధ్ర–ఒడిశా బార్డర్, ఒడిశాలలో పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఏ బలగాలు ప్రజలను కదలించి ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్లను, అనేక సాయుధ చర్యలను విజయవంతంగా నిర్వహించాయి. బూటకపు ఎన్‌కౌంటర్లు, అక్రమ అరెస్టులు, చిత్రహింసలు, మహిళలపై అత్యాచారాలు, గ్రామాలపై దాడులు, ప్రజల ఆస్తుల విధ్వంసం, లూటీలకు వ్యతిరేకంగా ప్రజా ఆందోళనలు, ప్రజా సాయుధ ప్రతిఘటన కొనసాగాయి. ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను ఓడించే లక్ష్యంతో మన ఉద్యమ ప్రాంతాలన్నిటా పిఎల్‌జిఏ బలగాలు వీరోచితంగా శత్రువును ప్రతిఘటించాయి. వీలైనంత వరకూ శత్రువు బలహీనతలను పసిగడుతూ అనేక పెద్ద, మధ్యస్థాయి, చిన్న దాడులలో శత్రువుపై గట్టిదెబ్బలు తీస్తూ శత్రువు లక్ష్యాన్ని నెరవేరకుండా అడ్డుకుంటూ దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడానికి కృషి చేశాయి. లోక్‌సభ ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్ సందర్భంగా దండకారణ్యంలో కుటేపాల్, తహ్కవాడ, చింతగుప్ప, ఆశ, కామానూర్, ముర్మరి, బీహార్–ఝార్ఖండ్‌లో బర్నా మోడ్, గంతి, భీంబాంధ్, ఫరసాగావ్ ఘటనలలో పిఎల్‌జిఏ బలగాలు శత్రువును కంగు తినిపించాయి. ఇతర సందర్భాలలో దండకారణ్యంలో టేడుమ్, కోసల్‌నార్ (తూర్పు బస్తర్), బడే ఝులియా (గడ్చిరోలి), నూకన్‌పల్లి (పశ్చిమ బస్తర్), బోదిరాజు, బీహార్–ఝార్ఖండ్‌లో అమరుద్ (గయ), పథరా, చిండ్‌గఢ్ (ఔరంగాబాద్), రైల్వే పోలీసులపై దాడి (ముంగేర్), పీర్‌టాండ్ (గిరిడి), ఏఓబిలో రాల్లగడ్డ (కోరాపుట్), కర్నాటకలో ఫారెస్ట్ చెక్‌పోస్టుపై దాడి (చిక్‌మగళూర్),

ఒడిశాలో దేకున్‌పానీ (నువాపాడ) దాడులలో శత్రువును ఒక మేరకు దెబ్బతీశాయి.

పార్టీ పిలుపు మేరకు ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్ని దండకారణ్య ప్రజలు విజయవంతంగా బహిష్కరించారు. దండకారణ్యం, బీహార్–ఝార్ఖండ్, ఏఓబి, ఒడిశాలలో మన ఉద్యమం బలంగా ఉన్న ప్రాంతాలలోనూ, మైనింగ్‌కు వ్యతిరేకంగా, నిర్వాసిత సమస్యపై ఉద్యమాలు సాగుతున్న నియంగిరి, మాలీ–దేవమాలీ (ఒడిశా), విశాఖ (బాక్సైట్ వ్యతిరేక ఉద్యమం, ఆంధ్రప్రదేశ్) వంటి ప్రాంతాలన్నింటా ప్రజలు మెజారిటీగా లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించి తమ నిరసనను తెలియజేశారు. ప్రత్యామ్నాయ నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణానికి–విస్తరణకు నడుం బిగించారు. ఎన్నికల బహిష్కరణలో భాగంగా పిఎల్‌జిఏ బలగాలు క్యాంపెయిన్‌ల రూపంలోనే శత్రు బలగాలపై ఎత్తుగడల ఎదురుదాడి చర్యలు విజయవంతంగా నిర్వహించాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన సామ్రాజ్యవాద అనుకూల, దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాలను నెరవేర్చే విధానాలకు వ్యతిరేకంగా విశాల ప్రజారాశులను కదిలించేందుకు రహస్య, బహిరంగ రూపాలలో పార్టీ కృషి కొనసాగింది. భారీ డ్యాములు, గనులు, పరిశ్రమల వల్ల జరిగే నిర్వాసిత సమస్యకు, కాలుష్యానికి వ్యతిరేకంగానూ, ప్రజల దైనందిన, సీజనల్ (తునికాకు, వెదురు, అటవీ–వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు మొదలైనవి) సమస్యల మీద, భూస్వాములు, పెత్తందార్లకు వ్యతిరేకంగా వివిధ ఆర్థిక, రాజకీయ ప్రజా ఉద్యమాలు కొనసాగాయి. విప్లవ ప్రజా కమిటీ (ఆర్‌పిసి)ల నిర్మాణం–విస్తరణ కార్యక్రమం కొనసాగింది. విప్లవ భూసంస్కరణలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

మన పార్టీ 10వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని గత సంవత్సరం పార్టీని బోల్షివీకరించే క్యాంపెయిన్‌కు పిలుపు నిచ్చింది. ఇందులో భాగంగా పార్టీని సంఘటితం చేసే కృషి, తప్పులను సరిదిద్దుకునే కృషి కొనసాగుతున్నది. పార్టీలో, పిఎల్‌జిఏలో నూతన శక్తులను చేర్చుకునే కృషి, రాజకీయ–సైనిక శిక్షణ కొనసాగుతున్నది.

విప్లవోద్యమంపై శత్రువు సాగిస్తున్న మానసిక యుద్ధాన్ని తిప్పికొడుతూ అన్ని ప్రాంతాలలో విప్లవ ప్రచారం నిర్వహించాం.

ప్రజాయుద్ధాన్ని దేశంలోని కొన్ని నూతన ప్రాంతాలకు విస్తరించేందుకు పార్టీ కృషి చేసింది.

దేశవ్యాప్తంగా జైళ్లలో మగ్గుతున్న వేలాది రాజకీయ ఖైదీల విడుదల కోసం అనేక పోరాటాలు జరిగాయి. ప్రజల నుండి సహాయ నిధులు పోగుచేసి వారికి, వారి కుటుంబాలకు అందించారు. ఝార్ఖండ్ రాష్ట్రంలో వందలాది మంది రాజకీయ ఖైదీలు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలతో అనేక సెంట్రల్, జిల్లా జైళ్లు దద్దరిల్లాయి. జైళ్లలో మరో పోరాట రంగం క్రమక్రమంగా విస్తరిస్తున్నది.

**కామ్రేడ్స్,**

దేశీయ, అంతర్జాతీయ వస్తుగత పరిస్థితులు మునుపెన్నటికన్నా విప్లవానికి అనుకూలంగా

మారుతున్నాయి. 2008లో సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ ప్రపంచవ్యాపిత సంక్షోభంలోకి కూరుకుపోయిన తరువాత ప్రపంచ రాజకీయాలలో మార్పులు వేగంగా చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ప్రపంచంలో మౌలిక వైరుధ్యాలు పదునెక్కుతున్నాయి. సామ్రాజ్య వాదులకు – పీడిత జాతులకు, పీడిత ప్రజలకు మధ్య వైరుధ్యం రోజురోజుకు తీవ్రమవుతున్నది. నయావలస, అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశాలలో సామ్రాజ్యవాదులకు, వారి దళారీ/తొత్తు పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు పెంపొందుతున్నాయి. పెట్టుబడిదారీ దేశాలలో పెట్టుబడిదారీవర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గం పెద్దయెత్తున ఆందోళనలు చేపడుతున్నది. ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లలో అమెరికా నేతృత్వంలోని నాటో బలగాలకు, వారి తొత్తు ప్రభుత్వ బలగాలకు వ్యతిరేకంగా జాతి విముక్తి పోరాటం తీవ్రస్థాయికి చేరుకోగా, ఇరాక్‌లో అమెరికా తొత్తు ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతి విముక్తి శక్తులు బలం పుంజుకుంటూ దేశంలోని ఉత్తర ప్రాంతంలో తమ పట్టును పెంచుకుంటున్నాయి. లిబియాలో తిరుగుబాటు శక్తులు పుంజుకుంటున్నాయి. ఈజిప్టులో అంతర్యుద్ధ స్థితి కొనసాగుతున్నది. ఇజ్రాయిల్ ఫాసిస్టు దాడిని ప్రతిఘటిస్తూ పాలస్తీనా జాతి విముక్తి ఉద్యమం కొనసాగుతూనే ఉంది. సామ్రాజ్యవాదుల మధ్య తీవ్రతరమవుతున్న వైరుధ్యాలకు సిరియా, యుక్రెయిన్‌లు కేంద్రంగా మారాయి. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో చైనాకూ జపాన్, అమెరికా సామ్రాజ్యవాదులకూ మధ్య వైరుధ్యాలు మరింత తీవ్రతరమవుతున్నాయి.

ప్రపంచ ద్రవ్య, ఆర్థిక సంక్షోభాలు మన ఆర్థిక వ్యవస్థను ఒక కుదుపు కుదుపుతున్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా బడ్జెట్ లోటు పెరగడం, వృద్ధి రేటు దిగజారడం, కరెంటు అకౌంట్ ఖాతా లోటు పెరగడం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అధిక ధరలు, నిరుద్యోగం, అవినీతి వంటి సమస్యలు మన ఆర్థిక, రాజకీయ వ్యవస్థను ముంచెత్తుతున్నాయి. దేశ ప్రజల జీవన పరిస్థితులు దినదినం మరింత దుర్భరమవుతున్నాయి. దేశంలో మౌలిక వైరుధ్యాలు తీవ్రతరమవుతున్నాయి. పాలకవర్గాల మధ్య కుక్కల కొట్లాట తీవ్రతరమవుతున్నది. కార్మికవర్గం, రైతాంగం, పట్టణ మధ్యతరగతి, దళితులు, ఆదివాసీలు, మహిళలు, విద్యార్థులు, యువత మొదలైన అన్ని పీడిత వర్గాల, సెక్షన్ల ప్రజలు వివిధ సమస్యలపై నిరంతరం పోరాటాలలోకి కదులుతున్నారు. దేశవ్యాప్తంగా నిర్వాసిత సమస్యపై పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. కశ్మీర్, ఈశాన్య జాతి విముక్తి ఆకాంక్షలు వివిధ పోరాట రూపాల్లో వ్యక్తమవుతూనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వివిధ ప్రత్యేక రాష్ట్ర ఆందోళనలను పాజిటివ్‌గా ప్రభావితం చేసింది. బిజెపి 'వికాస్' నినాదంతో నూతనంగా పగ్గాలు చేపట్టిన కొన్ని రోజులలోనే తన అసలు ఎజెండాను బయటపెట్టుకున్నది. ఇది దేశంలో పెరగనున్న బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు దాడికి సంకేతం. ఈ దాడికి అన్ని పీడిత వర్గాలు, సెక్షన్లు, మత మైనారిటీలు, జాతులు తప్పక గురవుతాయి. దీనికి వ్యతిరేకంగా వీరంతా సమైక్యంగా పోరాడాల్సిన అవసరం మున్నెట్టికంటే ఎక్కువగా ముందుకు వచ్చింది. అందుకు వీరంతా సిద్ధం కావాలి. మన పార్టీ ఈ కర్తవ్య సాధనకు పూనుకోవాలి.

మరోవైపు ప్రపంచవ్యాప్తంగా విప్లవ, జాతి విముక్తి, ప్రజాస్వామిక శక్తులు క్రమంగా బలపడుతూ విస్తరిస్తున్నాయి. ప్రత్యేకించి భారత ప్రజాయుద్ధానికి మద్దతుగా అంతర్జాతీయ ఉద్యమం మరింతగా

విస్తరిస్తున్నది. ఇక్కడి ప్రజాయుద్ధంలో అభివృద్ధి ప్రపంచ సోషలిస్టు విప్లవానికి ఆలంబనగా నిలుస్తుందనే ప్రబలమైన ఆకాంక్ష వ్యక్తమవుతోంది.

**కామ్రేడ్స్!**

ఈ అద్భుతమైన విప్లవ, వస్తుగత పరిస్థితులలో మనం ఉద్యమ గడ్డుపరిస్థితిని అధిగమించే లక్ష్యంతో, అమరుల ఆశయసాధన కోసం ప్రస్తుత ఉద్యమ స్థాయికి అనుగుణంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మన పార్టీని, పిఎల్‌జిఏను, ప్రజా నిర్మాణాలను సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా, సైనికంగా, సాంస్కృతికంగా స్థాయిని పెంచి సంఘటితం చేసుకోవాల్సిన అవసరం మరింత పెరిగింది. ఇందుకోసం ఈ అమరవీరుల స్మారక వారోత్సవాల సందర్భంగా ఈ కింది కర్తవ్యాలను చేపట్టి వాటి సాఫల్యానికి దృఢసంకల్పంతో కృషి చేద్దాం :

పార్టీని బోల్షివీకరిద్దాం. మన పార్టీ 10వ వార్షికోత్సవాల ఆరంభంతో పార్టీని బోల్షివీకరించేందుకై చేపట్టిన క్యాంపెయిన్ ప్రారంభమై ఒక సంవత్సరం కావస్తున్నది. రానున్న సంవత్సర కాలంలో దీనిని మరింత విస్తృతం చేయాలి. బలహీనమైన శక్తులు పార్టీని వదిలిపోవడం అనేది ఇంకా కొనసాగుతూనే ఉన్న నేపథ్యంలో విప్లవ లక్ష్యసాధన కోసం, పీడిత ప్రజల ప్రయోజనాల కోసం, మహత్తరమైన మన పార్టీ సాధారణ రాజకీయ పంథాకు దృఢంగా అంటిపెట్టుకొని దానిని సృజనాత్మకంగా అమలు చేయాలి. లొంగుబాటు బానిసత్వానికి దారితీస్తుందనీ, విప్లవం విజయం సాధిస్తుందనే, పీడిత ప్రజలు విముక్తి సాధిస్తారనే చారిత్రక సత్యాన్ని పార్టీలో, పిఎల్‌జిఏలో, ప్రజా నిర్మాణాలలో, ప్రజలలో పెద్దయెత్తున ప్రచారం చేయాలి. పార్టీ బోల్షివీకరణలో భాగంగా రూపొందించుకున్న సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సైనిక, సాంస్కృతిక కార్యక్రమాన్ని అమలు చేయడంపై కేంద్రీకరించి పార్టీని సంఘటితం చేద్దాం.

ప్రజాపునాదిని పెంపొందిద్దాం. బలమైన ప్రజాపునాదిపై ఆధారపడి సాగే ప్రజాయుద్ధం అజేయమైనదనే మావోయిస్టు సూత్రాన్ని లోతుగా అర్థం చేసుకుంటూ ప్రజాపునాదిని పెంచుకునేందుకు కృషి చేద్దాం. ఆర్థిక సంక్షోభ భారంతో, రాజకీయ అణచివేతతో సతమతమవుతున్న ప్రజల దైనందిన, సీజనల్ సమస్యలతో సహా మౌలిక సమస్యలపై పోరాటాలను అభివృద్ధి చేద్దాం. వ్యవసాయ విప్లవ కార్యక్రమంలోకి రైతాంగాన్ని విస్తృతంగా కదిలిద్దాం. ఇప్పటికే దీర్ఘకాలంగా సాగుతున్న పోరాటాలను నిరంతరాయంగా, సమరశీలంగా కొనసాగేలా అభివృద్ధి చేద్దాం. గెరిల్లా యుద్ధంతో వాటిని సమన్వయిద్దాం. కేంద్రంలో బిజెపి అధికారంలోకి రావడం వల్ల పెరగనున్న బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు దాడికి వ్యతిరేకంగా విశాల ప్రజా రాశులను సమీకరిద్దాం, విశాల ప్రాతిపదికన ఐక్యసంఘటనను ఏర్పర్చుదాం.

'ఆపరేషన్ గ్రీన్ హంట్'ని ఓడించే లక్ష్యంతో ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం–విస్తృతం చేద్దాం. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో మరో

పెద్ద దాడి చేసేందుకై 'ఆపరేషన్ గ్రీన్ హంట్' మూడవ దశకు సన్నాహాలు పూర్తి చేసుకుంటోంది. విప్లవోద్యమంలోని అసమాన అభివృద్ధిని పరిగణనలోకి తీసుకుంటూ 'ఆపరేషన్ గ్రీన్ హంట్' ఓడించడం కోసం గెరిల్లా యుద్ధాన్ని, ప్రజా ప్రతిఘటనా పోరాటాలను తీవ్రతరం–విస్తృతం చేద్దాం. ప్రత్యామ్నాయ విప్లవ రాజకీయ అధికార అంగాలు–ఆర్.పి.సి.లను నిర్మిద్దాం. ఇప్పటికే నిర్మాణమైన వాటిని బలోపేతం చేస్తూ విస్తరిస్తూ వీటిని కేంద్రంగా చేసుకొని ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందిస్తూ, ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం.

శత్రువు కేంద్రీకరించిన బలగాలతో చేపడుతున్న కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్లను, చుట్టివేత–నిర్మూలనా ఆపరేషన్లను ఆత్మరక్షణ–దాడి ఎత్తుగడల ద్వారా తిప్పికొడదాం. గెరిల్లా బేసులలో, మన బలమైన ప్రాంతాలలో ఇలాంటి ఆపరేషన్లను విచ్ఛిన్నం చేయడానికి వెంటనే శత్రు బలగాలను అన్ని దిశల నుంచి వెంటాడి చికాకుపర్చి, నిలవరించడానికి చొరవతో పిఎల్‌జిఏకు చెందిన వికేంద్రీకరించిన సాయుధ యూనిట్లను, మిలీషియా యూనిట్లను మోహరించి ప్రజల మద్దతుతో గెరిల్లా యుద్ధతంత్రం, మైన్ యుద్ధతంత్రం ద్వారా ఎదుర్కొందాం. శత్రు బలగాలలోని విడి విడి యూనిట్ల బలహీనతలపై పిఎల్‌జిఏ బలగాలను కేంద్రీకరించి గట్టి దెబ్బతీద్దాం. పరిస్థితులకు అనుగుణంగా సమయానుకూలంగా సృజనాత్మకంగా పిఎల్‌జిఏ బలగాలను కేంద్రీకరణ–వికేంద్రీకరణ, స్థల మార్పిడులతో ఆత్మరక్షణ–దాడి ఎత్తుగడలను చొరవతో అమలు చేసి గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం–విస్తృతం చేద్దాం.

శత్రు మానసిక యుద్ధాన్ని సమర్థవంతంగా తిప్పికొడదాం. శత్రువు ఫాసిస్టు దాడిని తీవ్రతరం చేసే క్రమంలో అందులో అంతర్భాగంగా మానసిక యుద్ధాన్ని కూడా తీవ్రతరం చేస్తాడు. మనం సకాలంలో దీన్ని ఎదుర్కొనకపోతే విశాల ప్రజారాశులలో విప్లవ చైతన్యాన్ని స్థిరంగా నిలబెట్టడం, అభివృద్ధి చేయడం కాదు. మనం ఇందులో విఫలమయితే ప్రజలకు సకాలంలో వాస్తవాలు తెలియక ప్రజాయుద్ధంలో వారి భాగస్వామ్యం తగ్గిపోతుంది. కనుక, సకాలంలో సృజనాత్మకంగా వివిధ రూపాలలో విప్లవ రాజకీయ ప్రచారాన్ని కొనసాగిస్తూ శత్రు మానసిక యుద్ధాన్ని ఎదుర్కొందాం. ఇందులో ప్రజల సామూహిక భాగస్వామ్యాన్ని పెంపొందిద్దాం.

అమరవీరుల త్యాగాలతోనే గెరిల్లా యుద్ధంలో, ప్రజా ప్రతిఘటనలలో, ప్రజా ఉద్యమాలలో విజయాలను సాధించాం. ప్రజలతో మమేకం అవుతూ చివరి ఊపిరి వరకూ ప్రజల ప్రయోజనాల కోసం శత్రువుతో పోరాడుతూ వారు నెలకొల్పిన ఆదర్శాలు ప్రజాయుద్ధానికి ఆలంబనగా నిలుస్తున్నాయి. అమరవీరుల త్యాగాల బాటలోనే భారత పీడిత ప్రజలు తమ భవిష్యత్తును వీక్షిస్తున్నారు. మనం వారి ఆశయాలను, ఆదర్శాలను, త్యాగ సంప్రదాయాలను ఎత్తిపడుతూ ఏకమనస్కతతో, ఏకకార్యాచరణతో మన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సైనిక, సాంస్కృతిక కర్తవ్యాలను సాధించేందుకై దృఢసంకల్పంతో కృషి చేస్తామని శపథం చేద్దాం.

**కామ్రేడ్స్!**

అమరవీరుల స్మారక వారాన్ని దేశవ్యాప్తంగా మన ఉద్యమ ప్రాంతాలలో స్ఫూర్తిదాయకంగా జరుపుకుందాం. ఈ స్మారక వారం సందర్భంగా ప్రజల్ని పెద్దయెత్తున కదిలిద్దాం. అందుబాటులో ఉన్న అన్ని సాధనాలను వీలైనంత విస్తృతంగా ఉపయోగించుకుంటూ పార్టీ శ్రేణులలో, పిఎల్‌జిఏ బలగాలలో, గ్రామాలలో మన ప్రియతమ అమరవీరుల గొప్ప త్యాగాలను పెద్దయెత్తున ప్రచారం చేద్దాం. పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలు, వాల్ రైటింగ్, రోడ్ రైటింగ్‌ల ద్వారా, బుక్‌లెట్ల రూపంలో అమరవీరుల చరిత్రలను వెలువరించడం ద్వారా, వారి ఫోటోలను పెద్దయెత్తున ప్రదర్శించడం ద్వారా వారి ఆదర్శాలను ప్రజలలో చాటిచెబుదాం. గ్రామ, ఏరియా, జిల్లా/డివిజన్/జోన్ స్థాయిల్లో సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించి వాటిలో ప్రజలను పెద్దయెత్తున సమీకరించడం ద్వారా ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిద్దాం. అమరవీరుల త్యాగం, ధైర్య సాహసాలు, దృఢసంకల్పం తదితర ఆదర్శాలను స్మరించుకుంటూ, వాటిని అలవరుచుకుంటూ నూతన ప్రజాస్వామిక భారత నిర్మాణానికై వారి మార్గాన్ని అనుసరించేలా ప్రజల్ని ఉత్తేజపరుద్దాం. అమరుల బాటలో ముందుకు సాగాలని పిలుపు నిద్దాం. వారి బాటలో ముందుకు సాగుదాం. మన ప్రియతమ అమరవీరులకు మనమివ్వగలిగే నిజమైన శ్రద్ధాంజలి ఇదే.

విప్లవాభినందనలతో,

**కేంద్రకమిటీ,**

జూన్ 19, 2014

**సి.పి.ఐ. (మావోయిస్టు)**

“ప్రజల కోసం వేలాది అమరవీరులు వీరోచితంగా తమ ప్రాణాలు అర్పించారు. మనం వారి జెండాను సమున్నతంగా చేపట్టి, వారి రక్తంతో అరుణారుణమైన మార్గంలో కదంతొక్కుతూ ముందుకు పయనిద్దాం !”

- మావో (“మిశ్రమ ప్రభుత్వం గురించి”)

“పోరాటం అన్న తర్వాత త్యాగం ఉంటుంది. మరణం సర్వసాధారణ ఘటన. కానీ ప్రజల ప్రయోజనాలు, అసంఖ్యాక ప్రజల బాధలు మన హృదయమంతా పరుచుకొని ఉన్నాయి. అలాంటప్పుడు మనం ప్రజల కోసం మరణిస్తే అది గౌరవప్రదమైన మరణమవుతుంది.”

- మావో (“ప్రజలకు సేవ చేయండి”)

“ప్రజల ప్రయోజనాల కోసం లెక్కలేనంత మంది విప్లవకారులు తమ ప్రాణాలను బలి ఇచ్చారు. జీవించి ఉన్న మనకు వారు గుర్తుకు వచ్చినప్పుడు మన హృదయాలు దుఃఖంతో నిండిపోతాయి.”

- మావో (“మిశ్రమ ప్రభుత్వం గురించి”)